అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
గురువారం 19-12-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 350 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

రాష్ట్రపతి తిరిగి వెళ్లాక రాష్ట్రపతి నిలయం సందర్శనకు అనుమతి



• 'ఉద్యాన్ ఉత్సవ్' పేరుతో పిక్నిక్ స్పాట్ : భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రెటరీ శ్యామ్యూల్ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి ఏడాది లాగానే శీతాకాల విడిదికి హైదరాబాద్ వచ్చిన రాష్ట్రపతి.. తిరిగి వెళ్లిన అనంతరం రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించడానికి ప్రజలకు వీలు కల్పిస్తామని భారత వ్యవసాయ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రెటరీ శ్యామ్యూల్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో నిర్వహించిన సమావేశం లో కలెక్టర్ గౌతంతో కలిసి శ్యామ్యూల్ ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. ప్రతి ఏడాదీ రాష్ట్రపతి శీతాకాల విడిది ముగించుకుని వెళ్లిన అనంతరం కొన్నిరోజులు రాష్ట్రపతి నిలయాన్ని ప్రజలు సందర్శించేందుకు అనుమతి ఉంటుందని తెలిపారు. ఈ సారి ఈ సందర్శన కార్యక్రమానికి 'ఉద్యాన ఉత్సవ్' అనే పేరుతో మరింత ఆహ్లాదకర వాతావరణంతో పాటు స్టాల్స్, చిన్న చిన్న కుటీరాలను ఏర్పాటు చేయడమే కాక ఒక పిక్నిక్ స్పాట్‌గా తయారు చేస్తున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా అగ్రికల్చర్ అథారిటీ ఇనిస్టిట్యూట్, సాంస్కృతిక, టూరిజం శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రత్యేక భౌగోళిక వ్యవసాయం, సమీకరణ వ్యవసాయంపై అవగాహన కల్పించేలా కుటీరాలను, స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. నిర్దేశిత ప్రాంతాల్లో నిర్దేశిత పంటలు, వ్యర్థాలతో ఉపయోగాల తయారీ గురించి ప్రజలకు, విద్యార్థులకు తెలిసేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇండ్లల్లో నర్సరీ, గార్డెనింగ్ ఎలా చేసుకోవాలో తెలిపేలా చిన్న చిన్న మెళకువలతో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఉద్యాన ఉత్సవ్‌ను తిలకించేందుకు వసతి గృహాల విద్యార్థులను రాష్ట్రపతి నిలయానికి తీసుకువచ్చి ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించి ఒక తీపి గుర్తుగా ఉండిపోయేలా వారి జ్ఞాపకాల్లో నిలపాలన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా ప్రచారం చేయాలన్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన తాగునీరు, అంబులెన్స్, మొబైల్ టాయిలెట్లు, రవాణా, లైటింగ్ వంటి మౌలిక వసతులను సంబంధిత శాఖల అధికారులు ఏర్పాటు చేయాలని సూచించారు. సందర్శనకు వచ్చిన ప్రతి ఒక్కరూ మంచి అనుభవంతోపాటు మంచి అనుభూతితో తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అగ్రికల్చర్ సరవనన్ రాజ్, జాయింట్ సెక్రెటరీ ఉదయ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి వినోద్ కుమార్, డీఈఓ విజయ కుమారి, హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా కేసుల దర్యాప్తునకు ప్రత్యేకంగా సంస్థ



• డిమాండ్‌ను పరిశీలిస్తామన్న సుప్రీం

న్యూఢిల్లీ : మానవ అక్రమ రవాణా కేసులను పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, ప్రాసిక్యూట్ చేసేందుకు విడిగా ఒక సంస్థను ఏర్పాటు చేయాలన్న వాదనలను తీవ్రంగానే పరిగణనలోకి తీసుకుంటామని సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది. ఇటువంటి కేసుల్లోని బాధితుల భద్రత కోసం విడిగా, సమగ్రంగా ప్రొటోకాల్‌ను రూపొందిస్తామని పేర్కొంది. జస్టిస్ జెబి పార్దివాలా నేతృత్వంలోని బెంచ్ ముందు పిటిషనర్ ఎన్‌జీఓ ప్రజ్వల తరపు న్యాయవాది అపర్ణభట్ మాట్లాడుతూ, ఈ రవాణాకు పాల్పడే వ్యక్తులు చాలా తరచుగా పోలీసుల వల నుండి తప్పించుకుంటారని అన్నారు. సాధారణంగా నేరాలు జరిగే ప్రదేశాల్లో కొంతమంది అరెస్టవుతూ వుంటారని, వీరు కింది స్థాయి ఆపరేటర్లు లేదా బాధితులై వుంటారని, అంతేకానీ అసలు వ్యక్తులై వుండరని ఆమె వివరించారు. 2018-2022 మధ్య కాలంలో 10వేలకు పైగా అక్రమ రవాణా కేసులు నమోదు కాగా, కేవలం 1031 మంది మాత్రమే దోషులుగా నిర్ధారించబడ్డారని పేర్కొన్నారు. ఈ అక్రమ రవాణా కార్యకలాపాలకు అవసరమైన నిధులకు మూలాలు ఎక్కడున్నాయో తెలుసుకునే ప్రయత్నాలు జరగడం లేదని భట్ వివరించారు. ఇటువంటి సమస్యలను ఎదుర్కొనడానికి నేడు ఎలాంటి వ్యవస్థాగతమైన యంత్రాంగం లేదని తెలిపారు. 2016 సెప్టెంబరు కల్లా సంఘటిత నేరాల దర్యాప్తు సంస్థ (ఒసిఐఎ)ను ఏర్పాటు చేస్తామని కేంద్ర హోం శాఖ ఇచ్చిన హామీని సుప్రీం కోర్టు కూడా రికార్డు చేసిందని అపర్ణా భట్ గుర్తు చేశారు. దీనిపై అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భటి స్పందిస్తూ, కొత్తగా అమల్లోకి వచ్చిన క్రిమినల్ చట్టాలు ఈ ట్రాఫికింగ్ సమస్యను సమగ్రంగా ఎదుర్కొంటాయన్నారు. కొత్త సంస్థ ఏర్పాటుపై స్పందిస్తూ ఇప్పటికే వున్న ఎన్‌ఐఎ, కొత్త క్రిమినల్ చట్టాలు, అక్రమ రవాణా నిరోధకచట్టం ఇవన్నీ కలిసి ప్రతిపాదిత సంస్థ అవసరాలు తీరుస్తున్నాయన్నారు. దీనిపై తీర్పును బెంచ్ రిజర్వ్ చేసుకుంది.

పవిత్ర తోటల కోసం సమగ్ర విధానం రూపొందించాలి

దేశవ్యాప్తంగా పవిత్రమైన తోటల నిర్వహణ కోసం సమగ్ర విధానాన్ని రూపొందించాల్సిందిగా సుప్రీంకోర్టు బుధవారం కేంద్రాన్ని కోరింది. మతపరమైన, సాంస్కృతికపరమైన అవసరాల కోసం నాటే మొక్కలు, చెట్లతో ఇటువంటి తోటలను ఏర్పాటు చేస్తారు. వీటికి స్థానిక కమ్యూనిటీలు సాంప్రదాయంగా రక్షణ కల్పిస్తూ వుంటాయి. స్థానిక జీవ వైవిధ్యతను సంరక్షించడానికి కూడా ఇవి దోహదపడుతూ వుంటాయి. తమిళనాడు, కేరళ, కర్నాటక, మహారాష్ట్రల్లో సాధారణంగా ఇలాంటి చిన్న చిన్న తోటలు, అడవులు కనిపిస్తూ వుంటాయి. రాజస్థాన్‌లో ఇటువంటి తోటలు కనుమరుగైపోవడాన్ని ప్రస్తావిస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన సుప్రీం ప్రత్యేక బెంచ్ పై మేరకు సిఫార్సు చేసింది. వన్యప్రాణి సంరక్షణ, వాటి ఆవాసాల పరిరక్షణ, నిర్వహణ ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని కేంద్రం భావిస్తూ వుంటుంది. ఈ నేపథ్యంలో సమగ్ర విధానాన్ని రూపొందించాలని కేంద్రప్రభుత్వానికి కోర్టు సూచించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇటువంటి తోటలకు సంబంధించి దేశవ్యాప్తంగా సర్వే నిర్వహించేందుకు ఒక ప్రణాళికను రూపొందించాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖను కోరింది.

IN THE COURT OF THE HON'BLE XXII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, HYDERABAD
O.S. NO:. 955 of 2021

Between:
M/s. ICICI Bank Limited, Hyderabad ...Plaintiff
AND
S Job Karunakar
PL No. 15 and 16, Flat No. 501
TCR Towers, TRR Township
Meerpet, Saroor Nagar,
Rangareddy- 500097
Also at-
S Job Karunakar
H. No. 6 306, Plot No. 2 401
Portion Krishna Reddy Complex,
Meerpet, Balapur, Rangareddy-500097 ...Defendant

Whereas the Plaintiff has filed a suit for recovery of money, against you. And, the Hon'ble Court directed to issue of summons through paper publication upon you i.e. Defendant. It is hereby informed to you that the above matter is posted on 30.12.2024 at 10:30 A.M. without fail. As such you are called upon to appear on the said date and time and proceed as per Law. Otherwise, the matter will be decided on the base of available material treating you as ex-parte.

By the order of the Hon'ble Court.
Sd/-
M/s. Lex Brains
Advocates & Solicitors
Anil Vydya, A. Srinivas Netha
Flat No. 101, Annapurna Nilayam
MIG 426, KPHB Colony, Hyderabad
Mobile: 9989990571

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT AND SESSIONS JUDGE AT SANGAREDDY
OS No.186 of 2024

Between:
Smt. Gadam Anuradha and others .....Plaintiffs .
The MRO Patancheru and others ....Defendants

TO,
All Concerned

NOTICE

Please take notice that the Plaintiffs herein had filed the above suit against the defendants to declare the plaintiffs are the legal heirs of late Deshabatni Krishna Murthy who died on 26-05-2020 and Late Deshabatni Radhabai who died on 03-06-2023 to declare the plaintiffs as the legal heirs against the below schedule of properties. The case stands posted on 03-01-2025 for the appearance of person who is interested, in persons or by a pleader before the Hon'ble Prl. District and Sessions Judge at Sangareddy on the said date at 10.00 Am, if you fail to appear on the said date and time before the said court the case will be decided in your absence.

schedule of property -I

Plot No.198 of Block No. B in Gautami Nagar of Edula Nagulapalli admeasuring 400 Sq. yards forming part of Sy.No.135 Part situated at Edula Nagulapalli Village, Sangareddy Taluk, Medak District (Presently Sangareddy District) bounded by North: Plot No.201, South: 30' Ft wide Road., East: Plot No.197, West No: Plot No.199 Obtained vide Registration Vide Sale Deed No.715 of 1987 Registered at Dist. Registrar Medak under Sangareddy Municipality, at Sangareddy District.

SCHEDULE OF PROPERTY-II

Plot No.60 of Block No. C in Gautami Nagar of Edula Nagulapalli admeasuring 50 Sq. yards forming part of Sy.No.135 Part situated at Edula Nagulapalli Village, Sangareddy Taluk, Medak District (Presently Sangareddy District) bounded by North: Plot No.58 & 59, South: Plot No.61, East: 25' Ft wide Road., West No: Plot No.85 Obtained vide Registration Vide Sale Deed No.426 of 1987 Registered at Dist. Registrar Medak at Sangareddy, at Sangareddy District .

SCHEDULE OF PROPERTY-III

Plot No.61 of Block No. C in Gautami Nagar of Edula Nagulapalli admeasuring 50 Sq. yards forming part of Sy.No.135 Part situated at Edula Nagulapalli Village, Sangareddy Taluk, Medak District (Presently Sangareddy District) bounded by North: Plot No.60, South: Plot No.62, East: 30' Ft wide Road., West No: Plot No.84 Obtained vide Registration Vide Sale Deed No.725 of 1987 Registered at Dist. Registrar Medak at Sangareddy,

SCHEDULE OF PROPERTY-IV

Plot No.62 of Block No. C in Gautami Nagar of Edula Nagulapalli admeasuring 50 Sq. yards forming part of Sy.No.135 Part situated at Edula Nagulapalli Village, Sangareddy Taluk, Medak District (Presently Sangareddy District) bounded by North: Plot No.61, South: Plot No.63, East: 30' Ft wide Road., West No: Plot No.84 Obtained vide Registration Vide Sale Deed No.727 of 1987 Registered at Dist. Registrar Medak at Sangareddy,

SCHEDULE OF PROPERTY-V

Plot No.63 of Block No. C in Gautami Nagar of Edula Nagulapalli admeasuring 50 Sq. yards forming part of Sy.No.135 Part situated at Edula Nagulapalli Village, Sangareddy Taluk, Medak District (Presently Sangareddy District) bounded by North: Plot No.62, South: Plot No.65 & 64, East: 30' Ft wide Road., West No: Plot No.83 Obtained vide Registration Vide Sale Deed No.1326 of 1987 Registered at Dist. Registrar Medak at Sangareddy, at Sangareddy District

SCHEDULE OF PROPERTY-VI

Plot No.83 of Block No. C in Gautami Nagar of Edula Nagulapalli admeasuring 50 Sq. yards forming part of Sy.No.135 Part situated at Edula Nagulapalli Village, Sangareddy Taluk, Medak District (Presently Sangareddy District) bounded by North: 30' Ft wide Road & Plot No.84, South: Plot No.67 & 66, East: Plot No.63, West No: Plot No.82 Obtained vide Registration Vide Sale Deed No.1328 of 1987 Registered at Dist. Registrar Medak at Sangareddy, at Sangareddy District

SCHEDULE OF PROPERTY-VII

Plot No.84 of Block No. C in Gautami Nagar of Edula Nagulapalli admeasuring 50 Sq. yards forming part of Sy.No.135 Part situated at Edula Nagulapalli Village, Sangareddy Taluk, Medak District (Presently Sangareddy District) bounded by North: Plot No.85, , South: Plot No.83, East: Plot No.61 & 62, West No: 30' Ft wide Road; Obtained vide Registration Vide Sale Deed No.1967 of 1987 Registered at Dist. Registrar Medak at Sangareddy, at Sangareddy District

SCHEDULE OF PROPERTY-VIII

Plot No.85 of Block No. C in Gautami Nagar of Edula Nagulapalli admeasuring 50 Sq. yards forming part of Sy.No.135 Part situated at Edula Nagulapalli Village, Sangareddy Taluk, Medak District (Presently Sangareddy District) bounded by North: Plot No.56 & 57, South: 30' Ft wide Road, East: Plot No.60, West No: Plot No.86; Obtained vide Registration Vide Sale Deed No.1983 of 1987 Registered at Dist. Registrar Medak at Sangareddy, at Sangareddy District

SCHEDULE OF PROPERTY-IX

Plot No. B/916 in Hyderabad allwyn colony employees housing colony situated in S.No.336 of Kukatpally (V) within the Grampanchayat of Kukatpally R.R Dist (Presently Medchal-Malkajgiri District) Obtained vide Registration Vide Sale Deed No.4056 of 1988 Registered at Dist. Registrar Rangareddy, Bounded by
NORTH : PLOT NO.915
SOUTH : PLOT NO.917
EAST : PLOT NO.927,ROAD,
WEST NO : ROAD, PLOT NO.927

SCHEDULE OF PROPERTY-X

Farm site No.484, in sy.nos.206/min, 209/min, 195/uu, 196/ee, 195/u, 196/ee, 202/e and 204/e covered by An area of 200.0 sq.yds, equal;ent to sq.meters 167.2 situated in Srinidhi Paradise Park, Nemaragomula Village, Bibinagar Mandal, Nalgonda District, Regn. Sub-Dist. Bhongir Regn. Dist. Nalgonda, G.P Nemaragomula, M.P.P Bibinagar, Z.P.P Nalgonda. There is no platform in the schedule Farm site, obtained wide Reg-istration vide sale deed No. 3259 of 2003 Registered at Dist.Bhongir, bounded by
NORTH : SITE NO.485,
SOUTH : 50' WIDE ROAD
EAST : SITE NO.483,
WEST : 30' WIDE ROAD

SCHEDULE OF PROPERTY-XI

Plot No.III OF Block No.A and B in Gautami Nagar of Eula Nagulapalli admeasuring 400 sq.yds forming part of sy.No. 135 part situated at Vedula Nagulapalli Village , Sangareddy Taluk, Medak District (presently Sangareddy district) obtained wide Registration Vide Sale Deed No. 2241 of 1987 Registered at Dist. Registrar Medak at Sangareddy.
NORTH : PLOT NO.II
SOUTH : PLOT NO.IV
EAST : PLOT NO.VI
WEST : 40' FT WIDE ROAD

SCHEDULE OF PROPERTY-XII

Plot No.564 In Block No.B, admeasuring 200 Sq. Yard forming part of lanbd bearing Survey No.90; situated at Ameenpur Village, Patanchervu Mandal, Sangareddy District and bounded by East: Plot No.521, West : 40' Feet Road; North: Plot No.563 and South Plot No.565; vide Registration Vide Sale Deed No.796 of 1997 Registered at Dist. Registrar Medak at Sangareddy, at Sangareddy District

// By ORDER OF THE COURT //
Sd/- G.SRIKANTH - Advocate
Office: H.no 4-8-17/A, Mangeera Nagar Colony, Sangareddy Town
& District, Telangana-502001. Ph:9010118930

ఫారం నెం.ఐఎన్‌సి-26

(కంపెనీస్ (ఇన్‌కార్పొరేషన్) రూల్స్, 2014లోని రూల్ 30ను అనుసరించి)
కేంద్ర ప్రభుత్వం
రీజినల్ డైరెక్టర్, సౌత్‌ఈస్ట్ రీజియన్, హైదరాబాద్, తెలంగాణ వారి సమక్షంలో
కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (4) మరియు
కంపెనీస్ (ఇన్‌కార్పొరేషన్) రూల్స్, 2014లోని రూల్ 30 యొక్క సబ్-రూల్(5)
క్లాజు (ఎ) విషయంలో
మరియు

మెసర్స్ గోఅహెడ్ సాఫ్ట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్
(CIN: 72200TG2010PTC067139), కంపెనీల చట్టం, 1956 క్రింద ఇన్‌కార్పొరేట్ అయిన కంపెనీ దీని రిజిష్టర్డు ఆఫీసు: ప్లాట్ నెం.18, 19 &21, సర్వే నెం.64 (పార్ట్), మధాపూర్ గ్రామం, శేరిలింగంపల్లి, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్, తెలంగాణ-500081 వద్ద కలిగియున్న విషయంలో

........పిటిషనర్ కంపెనీ

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి **ప్రకటన** ఇవ్వడమేమనగా, తెలంగాణ రాష్ట్రం నుండి నేషనల్ క్యాపిటల్ టెర్రిటరీ (ఎన్‌సిటి) ఢిల్లీ కి కంపెనీ దీని రిజిష్టర్డు ఆఫీసును మార్చు ఉద్దేశ్యంతో సోమవారం, 25 నవంబర్, 2024న నిర్వహించబడిన అసాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆమోదించిన ప్రత్యేక తీర్మానపు నియమాలలో పిటిషనర్ కంపెనీ యొక్క మెమోరండం ఆఫ్ అసోసియేషన్‌లో క్లాజు-2 మార్పు నిర్ధారణ కోరుతూ కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 12 మరియు 13(4) క్రింద పిటిషన్‌ను రీజినల్ డైరెక్టర్, సౌత్‌ఈస్ట్ రీజియన్, తెలంగాణ వారి సమక్షంలో పిటిషనర్ కంపెనీ దాఖలుచేయుటకు ప్రతిపాదిస్తున్నది. ప్రతిపాదిత మెమోరండం ఆఫ్ అసోసియేషన్‌లో మార్పుకు సంబంధించి ప్రభావితం అయ్యే అవకాశంఉన్న ఎవరైనా వ్యక్తి, పిటిషన్‌ను వ్యతిరేకించుటకు ఆసక్తి స్వభావం మరియు కారణాలను ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 21 రోజుల్లోగా **రీజినల్ డైరెక్టర్, సౌత్‌ఈస్ట్ రీజియన్**, 3వ అంతస్తు, కార్పొరేట్ భవన్, బండ్లగూడ, నాగోల్, తట్టిఅన్నారం గ్రామం, హయత్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్-500068, తెలంగాణ వారికి తెలియజేయవచ్చును. అభ్యంతరాలు ఏవేని ఉంటే, ఒరిజినల్‌లో అఫిడవిట్ మద్దతు ద్వారా పై పేర్కొన్న పిటిషనర్ కంపెనీ యొక్క రిజిష్టర్డు ఆఫీసు వద్ద పిటిషనర్‌కు కాపీతో రీజినల్ డైరెక్టర్‌కు పంపవచ్చును.


మెసర్స్ గోఅహెడ్ సాఫ్ట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరపున
సం/-
వినోధ్‌కుమార్ క్రిష్ణమాచారి
డిఐఎన్: 07242335
తేది: 19 డిసెంబర్, 2024
ప్రదేశం: హైదరాబాద్

నీటిపారుదల శాఖ ఓఅండ్ఎం ఈఎన్సీగా విజయభాస్కర్‌రెడ్డి

• సర్కారు ఉత్తర్వులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర నీటిపారుదల శాఖ అపరేషన్, నిర్వహణ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా జి విజయభాస్కర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈమేరకు బుధవారం నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా ఉత్తర్వులు జారీచేశారు. అలాగే నాగర్‌కర్నూల్ చీఫ్ ఇంజినీర్‌గా అదనపు భాధ్యతలు నిర్వర్తిస్తారు.



ఇకపోతే క్వాలిటీ కంట్రోల్ ఈఎన్సీగా కూడా విజయభాస్కర్‌రెడ్డి బాధ్యతలు చేపడతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తొలిసారి జోన్ ఆరు నుంచి నీటిపారుదల శాఖ ఈఎన్సీని ఎంపిక చేయడం పట్ల హైదరాబాద్ ఇంజినీర్ల సంఘం హర్షం వ్యక్తం చేసింది.

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNI MONI FINANCIAL SERVICES LIMITED ద్వారా 23.12.2024 ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు వ్యగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంచ్‌పేరుతో పేర్కొన్నాం.

Auction Centre Address & Loan Nos: WARANGAL - MANDI BAZAR (WMB - Ground Floor, # 9-8-84, Opp Syndicate Bank, JPN Road, Mandi Bazar, Warangal - 506002, Contact No : 9949088312) 2098556, 2120631, 2121491, 2119177, 2122261, 2051165, 2117169, 2120152, 2121278, 2125026. WARANGAL (WAR - No.1-8-6-10/81, Ground Floor, Mayuri Complex, Main Road, Hanamkonda, Warangal - 506001, Contact No : 9849744903) 2120946, 2122200, 2122502, 2122258, 2117052, 2118038, 2118050, 2129249, 2138211, 2089155.

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

PITTI ENGINEERING LIMITED
Regd. Office: 6-3-648/401, IV Floor, Padmaja Landmark, Somajiguda, Hyderabad-500082, Website: www.pitti.in, Ph: 040-23312774, Email : shares@pitti.in, CIN: L29253TG1983PLC004141

షేర్ సర్టిఫికెట్ పోయినదని తెలియజేయు ప్రకటన

కంపెనీ యొక్క దిగువ షేర్‌సర్టిఫికేట్ పోయినది /పోయినదిగా రిపోర్టు చేయబడినది మరియు సదరు షేర్ సర్టిఫికేట్ యొక్క హోల్డర్ వాటి డూప్లికేట్ షేర్ సర్టిఫికేట్ జారీ కోసం కంపెనీ వారిని అభ్యర్థించారు. ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 15 రోజుల్లోపు కంపెనీ ద్వారా చెల్లుబాటగు అభ్యంతరం స్వీకరించనియెడల, దిగువ పేర్కొన్నవ్యక్తికి ధృవీకరణ పత్రాన్ని జారీచేయడానికి కంపెనీ ముందుకు సాగును. వాటి ధృవీకరణ పత్రం జారీ తరువాత ఒరిజినల్ షేర్ సర్టిఫికేట్లకు సంబంధించి కంపెనీ ద్వారా ఎలాంటి క్లెయింలు అనుమతించబడవు.

షేర్‌హోల్డర్ పేరు	ఫోలియో నెం.	సర్టిఫికేట్ నెం.	వరుస సంఖ్యలు	వాటాల సంఖ్య
రాజేష్ ఎస్ మోడి బలా ఆర్ మోడి	00100700	100700	141601- 141800	200

సదరు సర్టిఫికేట్‌కు సంబంధించి క్లెయిం/లు కలిగియున్న ఎవరైనా వ్యక్తి, రిజిష్టర్డు ఆఫీస్ వద్ద కంపెనీకి అన్ని మద్దతు పత్రాలతో అతని/ఆమె/వారి క్లెయిం దాఖలు చేయాలి. ఈ నోటీసు ప్రచురణ నుండి 15 రోజుల్లోపు చెల్లుబాటయ్యే మరియు చట్టబద్ధమైన క్లెయిం అందనియెడల, పై జాబితాలోనివ్యక్తికి అన్ని అవసరమైన ఫార్మాలిటీస్‌ను పూర్తిచేసిన తరువాత పోయిన షేర్ సర్టిఫికేట్‌కు బదులుగా ధృవీకరణ పత్రం జారీకి కంపెనీ ముందుకుసాగును మరియు ఏ ఇతర వ్యక్తుల నుండి ఏలాంటి తదుపరి క్లెయిం స్వీకరించబడదు.

For Pitti Engineering Limited
సం/-
మేరీ మోనికా బ్రాగంజా
కంపెనీ సెక్రటరీ & చీఫ్ కాంప్లియన్స్ ఆఫీసర్
(FCS: 5532)
ప్రదేశం: హైదరాబాద్
తేది: 18, డిసెంబర్, 2024

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNI MONI FINANCIAL SERVICES LIMITED ద్వారా 23.12.2024 ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు వ్యగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంచ్‌పేరుతో పేర్కొన్నాం.

Auction Centre Address & Loan Nos: SURYAPET (SPT - H No : 1-2-270/14, Mahatma Gandhi Road, Suryapet, Suryapet - 508213, Contact No : 7093055519) 2072089, 2118442, 2121512, 2119445, 2092062, 2122010, 2094853, 2122353, 2051543, 2066953, 2120239, 2116685, 2072211, 2119788, 2090053, 2094926, 2097019, 2122880, 2115546, 2115515, 2116249, 2118363, 2120591, 2118457, 2121092, 2122574, 2118556, 2120025, 2121246, 2121282, 2121485, 2125319, 2125504.

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

HDFC BANK
We understand your world

రిజిష్టర్డ్ కార్యాలయం: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపత్ మార్గ్, లోయర్ పారెల్(వెస్ట్), ముంబయి-400 013 మరియు దీని యొక్క ఒక్క కార్యాలయం : రిటైల్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ ఎట్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, మొదటి అంతస్తు, బి-వింగ్ టెక్నో క్యాంపస్, కంజూర్‌మార్గ్ (ఈస్ట్), ముంబయి-400042.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ వద్ద తాకట్టు పెట్టిన సెక్యూరిటీల విక్రయానికి సంబంధించిన సమాచారం మరియు బహిరంగ ప్రకటన

దిగువ పేర్కొన్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ ("ద బ్యాంక్") యొక్క రుణగ్రహీతలకు తెలియజేయునది ఏమనగా బ్యాంక్ వద్ద తనఖాపెట్టి రుణ స్వభావం/సెక్యూరిటీలపై ఓవర్‌డ్రాఫ్ట్‌ల రూపంలో రుణ సౌకర్యం పొందిన సెక్యూరిటీలకు సంబంధించి దిగువ విధంగా చూపబడినవి. లోన్ అగ్రిమెంట్ ప్రకారం బకాయి ఉన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతలు విఫలమైన కారణంగా, దిగువ పేర్కొన్న రుణ ఖాతా నెంబర్లు డెలింక్వెంట్ స్టేటస్‌గా మారాయి. దిగువ పేర్కొన్న రుణగ్రహీతలకు బ్యాంక్ నుండి అనేక నోటీసులు పంపడం జరిగింది, చివరిగా దిగువ చూపబడిన తేదీల్లో సేల్ నోటీసు పంపబడింది. దిగువ పేర్కొన్న రుణ ఖాతాలకు సంబంధించి బకాయి ఉన్న మొత్తాన్ని 7 రోజుల్లోపు తిరిగి చెల్లించాలి. ఒకవేళ నిర్దిష్ట గడువులోపు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించకపోయినట్టయితే బ్యాంక్ వారు ఇకపై ఏలాంటి నోటీసు జారీ చేయకుండా తనఖాపెట్టిన సెక్యూరిటీలను విక్రయించనున్నారు. ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా బ్యాంక్‌కు బకాయి ఉన్న మొత్తాలను తిరిగి చెల్లించడంలో రుణగ్రహీతలు పట్టించుకోలేదు మరియు విఫలమయ్యారు కాబట్టి లోన్ అగ్రిమెంట్ ప్రకారం రుణగ్రహీతలు బ్యాంక్ వద్ద తనఖాపెట్టిన సెక్యూరిటీలను తమకు ఉన్న హక్కులను సద్వినియోగం చేసుకొని **26, డిసెంబర్, 2024** లోపు బకాయిలను రాబట్టుకునే క్రమంలో విక్రయించనున్నారు/డిస్పోజ్ చేయనున్నారు. ఇండియన్ కాంట్రాక్ట్ యాక్ట్,1872లోని సెక్షన్ 176 ప్రకారం రుణగ్రహీతకు తెలియజేయునది ఏమనగా ఈ యొక్క సేల్ నోటీసును దీని యొక్క సమ్మతిగా భావించాల్సి వుంటుంది. రుణగ్రహీతలకు తెలియజేయునది ఏమనగా ఏ క్షణంలోనైనా బ్యాంక్ వారు తనఖాపెట్టిన సెక్యూరిటీల విలువ స్టాక్ మార్కెట్ అనుగుణంగా తగ్గినట్టయితే ఒక (1) క్యాలెండర్ రోజు లోపు సదరు సెక్యూరిటీలను ఎలాంటి నోటీసు ఇవ్వకుండా విక్రయించే అధికారం బ్యాంక్ వారికి ఉంటుందని తెలియజేయనైనది. తనఖాపెట్టిన సెక్యూరిటీలను విక్రయించిన తర్వాత కూడా బ్యాంక్‌కు రావాల్సిన బకాయి మొత్తం సరిపోకపోయినట్టయితే మిగతా మొత్తాన్ని రుణగ్రహీత/లు బ్యాంక్‌కు చెల్లించాల్సి ఉంటుంది.

క్ర సం.	రుణ ఖాతా నెంబర్	రుణగ్రహీత పేరు	16,డిసెంబర్,2024 నాటికి బకాయి ఉన్న మొత్తం (రూ.ల్లో)	సేల్ నోటీసు తేదీ
1	XXXX6706	ఏనుగందుల కవితా బాయ్	9,31,505.86	18-Dec-24
2	XXXX1176	పెండ్లి గోపి	5,80,019.84	18-Dec-24
3	XXXX9662	బొల్ల రామకృష్ణ ప్రసాద్	7,16,090.90	18-Dec-24
4	XXXX1723	మందాడి హరికృష్ణ	1,03,402.52	18-Dec-24
5	XXXX2142	ఎం.అరుణ	1,53,758.80	18-Dec-24
6	XXXX0995	మదాసు రోహిత్ రావు	1,225.74	18-Dec-24

తేది: 19-12-2024
ప్రదేశం: తెలంగాణ
సం/-
హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కాటేదాన్ ఎస్ఎంఇ బ్రాంచ్,
ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియా, కాటేదాన్, హైదరాబాద్-500077.
040-24361951, 040-24360649, Email: Sbi.05328@sbi.co.in

(రూల్ 8(1) ప్రకారం) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)

ఏదైతే, దిగువ పేర్కొన్న సంతకందారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని సెక్షన్ 13(12)తో పాటు చదవవగిన రూల్ 3 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని రుణగ్రహీత మెసర్స్ ట్రిడెంట్ అపెక్స్ ఐఎన్‌సి, దీన్ని రిప్రెజెంట్ చేస్తున్న యజమాని: **శ్రీ అంకిత్ కుమార్ తోవర్,** తండ్రి: శ్రీ అనిల్ కుమార్ తోవర్ మరియు హామీదారు: **శ్రీ నిఖిలేష్ కుమార్ తోవర్,** తండ్రి: శ్రీ అనిల్ కుమార్ తోవర్ బ్యాంక్ వారికి బకాయి ఉన్న మరియు నోటీసులో పేర్కొన్న విధంగా బకాయి ఉన్న **రూ.2,46,93,260.40/-** (రూపాయలు రెండు కోట్ల నలభై ఆరు లక్షల తొంభై మూడు వేల రెండు వందల అరవై మరియు నలభై పైసలు మాత్రమే) మరియు తేది:07-10-2024 నుంచి వడ్డీతో పాటుగా కలుపుకొని నోటీసు ముట్టిన తేదీ నుంచి 60 రోజుల్లోపు తిరిగి చెల్లించాలని డిమాండ్ చేస్తూ 07-10-2024 తేదీన డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

రుణగ్రహీత..వారి యొక్క బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు, ఇందుమూలంగా రుణగ్రహీతకు మరియు హామీదారుకు మరియు సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న అధీకృత అధికారి దిగువ పేర్కొన్న ఆస్తిని పైన సదరు చట్టంలోని సెక్షన్ 13(4) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని మరియు దీనితో పాటు చదవవగిన రూల్ 8 ప్రకారం **17,డిసెంబర్,2024** తేదీన తమ స్వాధీనంలోకి తీసుకోవడం జరిగింది.

ఇందుమూలంగా రుణగ్రహీతకు మరియు హామీదారుడికి ప్రత్యేకించి మరియు సమస్త ప్రజానీకానికి హెచ్చరించడమేమనగా సదరు ఆస్తికి సంబంధించి ఎలాంటి లావాదేవీలను నిర్వహించొద్దు. ఎలాంటి లావాదేవీలు నిర్వహించినా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క ఛార్జ్‌కు లోబడి ఉంటుందని 12-12-2024 నాటికి బకాయి ఉన్న **రూ.2,43,44,698.00/-** తేదీ:13-12-2024 నుంచి భవిష్య వడ్డీ, కాస్ట్స్, తదితరమైన వాటిని కలుపుకొని చెల్లించాల్సి ఉంటుందని తెలియజేయనైనది.

స్థిరాస్తికి సంబంధించిన వివరాలు :

1) ఆస్తికి సంబంధించి ఫ్లాట్ నెం.301, మూడో అంతస్తు, జిహెచ్ఎంసి నెం.8-3-293/82/ఎన్ఎల్/54/301), దీని యొక్క ప్లింత్ ఏరియా 2070చ.అ. దీనితో పాటుగా 25శాతం కచ్చితమైన కారు పార్కింగ్ విస్తీర్ణాలు 675చ.అ. యుడిఎస్ కేటాయించబడిన స్టిల్ట్‌లోని యజమానుల యొక్క వాటాలు/గ్రౌండ్ ఫ్లోర్ మరియు అన్ని రకాల కామన్ ఏరియా/సదుపాయలు/ఖాళీ స్థలాలు/బాల్కనీలు తదితరమైన వాటిని కలుపుకొని అవిభాజ్యమైన స్థలం యొక్క విస్తీర్ణంలో వాటా 75చ.గ. మొత్తం స్థలం విస్తీర్ణం 300చ.గ. ప్లాట్ నెం.54, ఇంటి నెం.8-2-293/82/ఎన్ఎల్/54, సర్వే నెం.125 మరియు 126 యొక్క భాగం, విసినిటీ ఎంఎల్ఎ-ఎపి కాలనీ లేఅవుట్, విజయ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ,యూసుఫ్‌గూడ గ్రామం, జూబ్లీహిల్స్, హైదరాబాద్, తెలంగాణ మరియు **హద్దులు:**
ఉత్తరం: లిఫ్టు,మెట్లు, కారిడార్ మరియు ఓపెన్ టుస్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **తూర్పు:** ఓపెన్ టు స్కై, **పడమర:** లిఫ్టు, మెట్లు, కారిడార్ మరియు ఓపెన్ టు స్కై

2) ఆస్తికి సంబంధించి ఫ్లాట్ నెం.401, నాలుగో అంతస్తు (జిహెచ్ఎంసి నెం.8-3-293/82/ఎన్ఎల్/54/401) దీని యొక్క ప్లింత్ ఏరియా 2070చ.అ. దీనితో పాటుగా 25శాతం కచ్చితమైన కారు పార్కింగ్ విస్తీర్ణాలు 675చ.అ. యుడిఎస్ కేటాయించబడిన స్టిల్ట్‌లోని యజమానుల యొక్క వాటాలు/గ్రౌండ్ ఫ్లోర్ మరియు అన్ని రకాల కామన్ ఏరియా/సదుపాయలు/ఖాళీ స్థలాలు/బాల్కనీలు తదితరమైన వాటిని కలుపుకొని అవిభాజ్యమైన స్థలం యొక్క విస్తీర్ణంలో వాటా 75చ.గ. మొత్తం స్థలం విస్తీర్ణం 300చ.గ. ప్లాట్ నెం.54, ఇంటి నెం.8-2-293/82/ఎన్ఎల్/54, సర్వే నెం.125 మరియు 126 యొక్క భాగం, విసినిటీ ఎంఎల్ఎ-ఎపి కాలనీ లేఅవుట్, విజయ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ,యూసుఫ్‌గూడ గ్రామం, జూబ్లీహిల్స్, హైదరాబాద్, తెలంగాణ మరియు **హద్దులు: ఉత్తరం:** లిఫ్టు,మెట్లు, కారిడార్ మరియు ఓపెన్ టుస్కై, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **తూర్పు:** ఓపెన్ టు స్కై, **పడమర:** లిఫ్టు, మెట్లు, కారిడార్ మరియు ఓపెన్ టు స్కై

తేది:17-12-2024, ప్రదేశం : హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

SOUTH INDIAN Bank
మంచిరేవుల బ్రాంచ్,
ప్లాట్ నెం.4, మంచిరేవుల గ్రామం,
రాజేంద్రనగర్ మండలం, హైదరాబాద్

బ్యాంక్ వద్ద తనఖాపెట్టిన బంగారం వేలం

ఇందుమూలంగా ద **సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న రుణగ్రహీత పొందిన గోల్డ్ లోన్‌కు సంబంధించి పొందిన బకాయిలను తిరిగి చెల్లించాలని కోరుతూ విక్రయానికి సంబంధించిన సేల్ నోటీసు(లు) పంపడం జరిగింది. రుణగ్రహీత బ్యాంక్ నుంచి పొందిన రుణాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు, ఇందుమూలంగా రుణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా దిగువ పేర్కొన్న సంతకందారు బంగారు ఆభరణాల యొక్క వేలాన్ని "ఎక్కడ ఎలా ఉందో అలాగే" & "ఎక్కడైతే ఎలా ఉందో అలాగే" & "రికోర్స్ విధానం లేకుండా" నిర్వహించనున్నారు. వేలాన్ని మంచిరేవుల బ్రాంచ్ వద్ద **తేది:19-12-2024, సా.గం.4-00** నుంచి సా.గం.5-00 వరకు నిర్వహించబడును.

రుణగ్రహీత పేరు	అకౌంట్ నెంబర్	బంగారం స్థూల బరువు
చర్ల అంజనేయులు	0690653000026628	19.90 గ్రాములు

దయచేసి పూర్తి సమాచారం కోసం **సౌత్ ఇండియన్ బ్యాంక్**, మంచిరేవుల బ్రాంచ్ వారిని **8770959543** నెంబర్‌పై సంప్రదించగలరు.
సం/- బ్రాంచ్ మేనేజర్, ద సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

తెలంగాణ ప్రభుత్వం
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్ & బి) కార్యాలయం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన

నిట్ షార్ట్ టెండర్ నోటీసు నెం. EE/R&B/MDCL/08/2024-25/ తేది : 17.12.2024

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ క్రింద అత్యవసర ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానిస్తున్నాం, ఒకటి (01) పని కొరకు, గౌరవనీయ భారత రాష్ట్రపతి హైదరాబాద్‌లోని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సందర్శన కొరకు (నిర్వహణ కొరకు) ఏర్పాట్లు సమకూర్చుట, మొత్తం ఇవి **రూ.2.09 లక్షలు**, క్రింద సంతకం చేసినవారిచే. బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభ తేది : 18.12.2024 @ సా.03.30 గం. నుంచి ముగింపు తేది : 20.12.2024 @ ఉ.10.30 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్రవేశం., అనగా www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం./- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్&బి)
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా.
DIPR R.O.No.8071-PP/CL/ADVT/1/2024-25, Dt:18.12.2024

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల వేలం UNI MONI FINANCIAL SERVICES LIMITED ద్వారా 23.12.2024 ఉదయం 10.00 గంటలకు దిగువ ఇవ్వబడిన సంబంధిత కేంద్రాలలో నిర్వహించబడుతుందని ప్రజలకు తెలియజేస్తున్నాం. వేలం వేయబోయే బంగారు ఆభరణాలు బకాయిలు చెల్లించడంలో విఫలమైన మా వివిధ కస్టమర్ల రుణఖాతాలకు చెందినవి., ఈ రుణ గ్రహీతలకు మా వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడ్డాయి. మా వివిధ కస్టమర్లు గడువు వ్యగిసిన ఋణం తిరిగి చెల్లించనందున వేలం వేయడం జరుగుతుంది. ఈ క్రింద వేలం వేయబడే బంగారు ఆభరణం బ్రాంచ్‌పేరుతో పేర్కొన్నాం.

Auction Centre Address & Loan Nos: HYDERABAD - CHARMINAR (HYF - NO. 23-2-665/3, 666, 667.OPP. ASRA HOSPITAL, SHAH-ALI-BANDA, CHARMINAR - 500002, Contact No:9949088317) 2067757, 2094653, 2069642. HYDERABAD - DILSUKHNAGAR (HYD - 3-9, 1St Floor, Sreeman Rama Towers, Chaitanyapuri, Dilsukh Nagar - 500036, Contact No : 9949088318) 2097582, 2117298, 2119666.

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

HINDUJA HOUSING FINANCE
హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీసు: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600015, తమిళనాడు, ఇండియా. రీజినల్ ఆఫీసు: హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వద్ద, 2వ అంతస్తు, టి19 టవర్స్, కర్బాల మైదాన్,రాణిగంజ్, సికింద్రాబాద్, హైదరాబాద్-తెలంగాణ-500003.
www.hindujahousingfinanace.com

అనుబంధం 4 **స్వాధీనతా ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్‌ఎఫ్‌ఎల్) యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించమని దిగువ పేర్కొన్న రుణగ్రహీత(లు)/హామీదారు(లు)కు కంపెనీ యొక్క అధీకృత అధికారిచే డిమాండ్ నోటీసులు జారీ చేయబడినవి. మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో రుణగ్రహీత విఫలం చెందినందున, ఇందుమూలంగా రుణగ్రహీత(లు)/హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సెక్యూర్డు ఇంట్రెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని రూల్ 8తో చదువగల చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని **స్వాధీనంలోకి** తీసుకోవడమైనది. చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నిబంధనలమేరకు తగిన సమయంలో సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు రుణగ్రహీత శ్రద్ధ వహించవలసిందిగా ఆహ్వానిస్తున్నాం. ప్రధానంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా, ఆస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏమి లావాదేవీలను జరుపదలచిన వారు హెచ్‌హెచ్‌ఎఫ్‌ఎల్ వారికి దిగువ పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీని చెల్లించుటకు లోబడి ఉంటుంది.

క్ర. సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/హామీదారు పేరు/లాన్	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	స్వాధీనతా తేది
1.	1. శైలజ కస్నం..... రుణగ్రహీత, 2) శ్రీ. సతీశ్‌కుమార్ కస్నం ..... సహ-రుణగ్రహీత :- ఇద్దరి నివాసం :- ఇంటి నెం: 3-12-121/ఎ, గణేశ్‌నగర్, రామంతాపూర్, హైదరాబాద్, తెలంగాణ 500013., **LAN: AP/HDB/LBNG/A000000258 & CO/CPC/CPOF/A000001091**	20/ 09/ 2024 & రూ.31,53,654/- (రూపాయలు ముప్పై ఒక్క లక్షల, యాభై మూడు వేల, ఆరు వందల యాభై నాలుగు మాత్రమే)	13/12/2024
	సెక్యూర్డు అసెట్ వివరణ (స్థిరాస్తి):- ఫ్లాట్ నెం.1 మొత్తం, (గ్రౌండ్ ఫ్లోర్‌లో, 1120 చదరపు అడుగుల సూపర్ బిల్ట్ అప్ ఏరియా కలిగియున్నది, కామన్ ఏరియాస్‌తో కలిపి, అవిభాజ్య భూమిలో వాటా 30.00 చ.గజాలతోపాటు, మొత్తం విస్తీర్ణం : 220 చ.గజాల నుంచి, "గోపతి అపార్ట్‌మెంట్స్"గా తెలిసిన కాంప్లెక్స్‌లో, నెం.2-3-64/హెచ్/బి1 ప్రాంగణంలో నిర్మించినది, తిరుమల నగర్ వద్ద ఉన్నది, అంబర్‌పేట, హైదరాబాద్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం, మరియు సరిహద్దులు ఈ విధంగా :- ఆస్తి యొక్క సరిహద్దులు:- ఉత్తరం: పొరుగువారి ఇల్లు, దక్షిణం: పొరుగువారి ఇల్లు, తూర్పు: 30' వెడల్పు రోడ్, పడమర: 20' వెడల్పు రోడ్., ఫ్లాట్ నెం.1 (గ్రౌండ్ ఫ్లోర్) యొక్క సరిహద్దులు:- ఉత్తరం: పొరుగువారి ఇల్లు, దక్షిణం: పొరుగువారి ఇల్లు, తూర్పు:పార్కింగ్ స్థలం, పడమర: బహిరంగ స్థలం.		
2.	1. శ్రీ. సాయికుమార్ సూరం .... రుణగ్రహీత, 2) శ్రీమతి. సూరం సంధ్య .... సహ-రుణగ్రహీత, ఇద్దరి నివాసం:- ఇ.నెం.24-143/6/10/1-1, విష్ణుపురి కాలనీ, మల్కాజ్‌గిరి, బాలాజీ స్టోర్ సమీపంలో, హైదరాబాద్ తెలంగాణ-500047. **LAN: AP/HDB/MBNR/A000000059 & CO/CPC/CPOF/A000000303**	18/ 09/ 2024 & రూ.10,21,159/- (రూపాయలు పది లక్షల, ఇరవై ఒక్క వేల, ఒక వంద యాభై తొమ్మిది మాత్రమే)	13/12/2024
	సెక్యూర్డు అసెట్ వివరణ (స్థిరాస్తి):- నెం. సి-1 కలిగిన రెసిడెన్షియల్ ఫ్లాట్ మొత్తం, "శ్రీ నిలయ అపార్ట్‌మెంట్స్" యొక్క రెండో అంతస్తులో, విస్తీర్ణం : 710 చ.అ.లు(కామన్ ఏరియాస్‌తో కలిపి), అవిభాజ్య భూమిలో వాటా 54.66 చ.గజాలు లేదా 45.69 చ.మీటర్లతోపాటు, మొత్తం భూమి 328 చ.గజాల నుంచి, మున్సిపల్ నెం. 24-6/15/బి (పాత నెం.24-6/15/బి1), పిటిఐ నెం.1170602561, ప్లాట్ నెం.31పై, సర్వే నెంబర్లు : 11,12,15,5,6,8/1,9/1,14 & 16 క్రింద, విష్ణుపురి వద్ద ఉన్నది, మల్కాజ్‌గిరి, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లిమిట్స్ పరిధిలో, మల్కాజ్‌గిరి మండలం మరియు సర్కిల్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మరియు సరిహద్దులు ఈ విధంగా:- ఉత్తరం: 30'-0 వెడల్పు రోడ్, దక్షిణం: పొరుగువారి ఫ్లాట్ నెం. సి-2, తూర్పు : పొరుగువారి ఆస్తి ఫ్లాట్ నెం.32, పడమర: 20'-0 వెడల్పు రోడ్.		
3.	1. శ్రీమతి.లక్ష్మీబాయి గౌటి ...... రుణగ్రహీత, 2) శ్రీ. బాబు గౌటి ...... సహ-రుణగ్రహీత, ఇద్దరి నివాసం :- ఇ.నెం. 2-104, గోకారం, మెయిన్ రోడ్, వలిగొండ మండలం, తెలంగాణ, ఇండియా-508252. **LAN: AP/HDB/LBNG/A000000462**	18/ 09/ 2024 & రూ.5,16,864/- (రూపాయలు ఐదు లక్షల, పదహారు వేల, ఎనిమిది వందల అరవై నాలుగు మాత్రమే)	16/12/2024
	సెక్యూర్డు అసెట్ వివరణ (స్థిరాస్తి):- గ్రామ పంచాయతీ నెం. 2-68 కలిగిన ఇల్లు మొత్తం,సర్వే నెం.586లో, ఆర్‌సిసి పైకప్పు, బిల్ట్ అప్ ఏరియా: 369.00 చ.అడుగులు, ఏరియా యొక్క మొత్తం విస్తీర్ణం: 41.00 చ.గజాలు, 34.276 చ.మీటర్లకు సమానం, రెసిడెన్షియల్ జోన్, గోకారం గ్రామ పంచాయతీ మరియు గ్రామం వద్ద ఉన్నది, వలిగొండ మండలం, యాదాద్రి భువనగిరి జిల్లా, తెలంగాణ, తెలంగాణ రిజి.ఉప-జిల్లా : రామన్నపేట, రిజి-జిల్లా : నల్గొండ, మరియు సరిహద్దులు:- ఉత్తరం: పబ్బు రమేశ్ యొక్క ఇల్లు, దక్షిణం : సి.సి. రోడ్, తూర్పు: పబ్బు రమేశ్ యొక్క ఇల్లు, పడమర: సి.సి. రోడ్.		

తేది: 19-12-2024, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, హిందుజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.



అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 19-12-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 350 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

డ్రంకెన్ డ్రైవ్‌తో అసెంబ్లీ హీట్

హరీశ్‌రావు, మంత్రి కోమటిరెడ్డి వాగ్వాదం

కాళేశ్వరంపై పదివేల కోట్లు దోచుకున్నవ్ : కోమటిరెడ్డి

తాగొచ్చి సభలో ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారు : హరీశ్‌రావు

ఇరువురి వ్యాఖ్యలను తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రకటన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శాసనసభలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఒకరిపై మరొకరు ప్రత్యారోపణలు చేసుకుంటూ సభను హీటెక్కించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వారిస్తున్నా తగ్గేదే లేదన్నట్టు కోమటిరెడ్డి మాట్లాడారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని వృథా చేయొద్దు అన్నా. హరీశ్‌రావు, కోమటిరెడ్డిలిద్దరూ మాటకు మాట అనుకుంటూ అనవసర చర్చకు దారితీశారు. అభ్యంతరకర వ్యాఖ్యలు చేసుకున్నారు. చివరకు వారిద్దరికీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సర్దిచెప్పారు. 'సభను సజావుగా సాగేలా చూడండి. ఇద్దరు సభ్యులు చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించారు. పలు రోడ్లను జాతీయ రహదారులుగా మార్చాలని సభలో సభ్యులు మదన్‌మోహన్‌రావు, పాల్వాయి హరీశ్‌బాబు, ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమాధానమిస్తూ పదేండ్ల కాలంలో తెలంగాణలో రోడ్ల విధ్వంసం జరిగిందన్నారు. కనీసం గుంతలను కూడా పూడ్చలేదని విమర్శించారు. ఉప్పల్-ఘట్‌కేసర్ రోడ్డు ఏడేండ్లుగా పూర్తిగాక ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పైసలు వచ్చే కాళేశ్వరం మీద తప్ప రోడ్లపై దృష్టిపెట్టిన పాపాన పోలేదని విమర్శించారు. అదే సమయంలో మాజీ సీఎం ఫాంహౌస్ చుట్టూ ఆరు ఎక్స్‌ప్రెస్ వేలను రూ.700 కోట్లతో వేశారని తెలిపారు. రామగుండం -హైదరాబాద్ రహదారిని ఎన్‌హెచ్‌కు ఇస్తామనీ, ఆరులైన్లకు విస్తరిస్తామని హామీనిచ్చారు. కల్వకుర్తి నుంచి శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తామని తెలిపారు. ప్రతి గ్రామం నుంచీ మండల కేంద్రాలకు రోడ్లు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు వేస్తామని మరోమారు చెప్పారు. తామేం చేయలేదన్నట్టు మంత్రి మాట్లాడటం తగదని హరీశ్‌రావు అనడంతో...99 శాతం పనులు అయిపోతే తమకు ఇప్పుడేం పని ఉండేది కాదని అన్నారు. హరీశ్‌రావుకు దబాయించడం మాత్రమే తెలుసని అన్నారు. హరీశ్‌రావు వారించేందుకు యత్నించగా...'నువ్వేం చేశావ్..కమీషన్లు తీసుకుని ...5లో

దేశం పరువు తీశారు



అదానీ, ప్రధానీ తీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఈ అవినీతిపై మీ వైఖరేంటి ? బీఆర్ఎస్‌కు సీఎం సూటి ప్రశ్న

అక్రమాలపై శాసనసభలో చర్చకు కాంగ్రెస్ సిద్ధమంటూ స్పష్టీకరణ

తన స్నేహితుడిని కాపాడుకునేందుకే మోడీ యత్నిస్తున్నారని విమర్శ

జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ ముట్టడిస్తామని హెచ్చరిక

అదానీ వ్యవహారంపై ఏఐసీసీ పిలుపు మేరకు రాజ్‌భవన్ ఎదుట ధర్నా

పాల్గొన్న సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అదానీ అవినీతిపై బీఆర్ఎస్ తన వైఖరి వెల్లడించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆ పార్టీ తన విధానం ప్రకటించకుండా కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకలతో పాటు మణిపూర్ అల్లర్ల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని బుధవారం చేపట్టింది. పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్లకార్డులు, జెండాలు పట్టుకుని కేంద్ర ప్రభుత్వానికి, అదానీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజ్‌భవన్‌కు దగ్గర్లో ర్యాలీని పోలీసులు నిలుపుదల చేయడంతో సీఎంతో పాటు మంత్రులు, ఇతర నేతలు అక్కడే రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పందంలో భాగంగానే అదానీ మీద నమోదైన కేసు గురించి స్పందించడం లేదని విమర్శించారు. "అరెస్టుల నుంచి తప్పించుకునేందుకు బీఆర్ఎస్, బీజేపీకి లొంగిపోయింది. అందుకే అదానీపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత మాట్లాడటం లేదు. పార్లమెంట్‌లో వారి విధానమేంటో చెప్పాలి. మోడీ, కేసీఆర్ వేర్వేరు కాదు. ఇద్దరూ నాణేనికి బొమ్మాబొరుసు. వారికి చిత్తశుద్ధి ఉంటే అదానీ అవినీతిపై జేపీసీకి డిమాండ్ చేయాలి. ఆ పార్టీ కోరితే శాసనసభలో చర్చకు అనుమతిస్తాం. జేపీసీ కోసం శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేద్దాం. బీఆర్ఎస్ ప్రజల వైపా? అదానీ వైపా? వెల్లడించాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రపంచ దేశాల ముందు ...15లో

ఫార్ములా-ఈ రేస్‌పై అసెంబ్లీలో చర్చించండి

సీఎం రేవంత్‌కు కేటీఆర్ లేఖ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంపై ప్రస్తుత శాసనసభ సమావేశాల్లోనే చర్చ పెట్టాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. 'ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో ప్రభుత్వం కొన్ని నెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీదా, ముఖ్యంగా నా మీదా అనేక నిరాధార ఆరోపణలు ...15లో

ఇక భూ భారతితో ప్రతి ఎకరాకూ భద్రత



అనుభవదారుని కాలం మళ్లీ చేర్చాం

ప్రతి గ్రామానికీ రెవెన్యూ అధికారి

ప్రతి రైతుకూ భూధార్ కోడ్

పార్ట్-బి భూముల సమస్యను పరిష్కరిస్తాం

సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పిస్తాం

అప్పిలేట్ ట్రిబ్యునళ్ల ఏర్పాటు

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

వివరాలు 5లో



అమిత్ షా క్షమాపణ చెప్పాలి

అంబేద్కర్‌పై కేంద్రహోంమంత్రి వ్యాఖ్యలతో దుమారం

దద్దరిల్లిన పార్లమెంట్..నిలదీసిన ప్రతిపక్షం

అంబేద్కర్ చిత్రపటాలతో ఆందోళన

ఆయనను మంత్రి పదవి నుంచి తొలగించాలి : ఖర్గే

అంబేద్కర్‌ను అవమానిస్తే దేశం సహించదు : రాహుల్ గాంధీ

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. ఆయన వ్యాఖ్యలపై పార్లమెంట్ దద్దరిల్లింది. 'జై భీమ్...జైజై భీమ్, అమిత్ షా క్షమాపణ చెప్పాలం'టూ ప్రతిపక్షాల నినాదాలతో హోరెత్తింది. అమిత్ షాను కేంద్ర హోం మంత్రి పదవి నుంచి తొలగించాలంటూ రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ ...15లో

పట్నం నరేందర్‌రెడ్డి సహా 24 మందికి బెయిల్

లగచర్ల కేసులో నాంపల్లి కోర్టు తీర్పు



నవతెలంగాణ-కొడంగల్/సుల్తాన్‌బజార్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన లగచర్ల రైతుల కేసులో నాంపల్లి స్పెషల్ కోర్టు నిందితులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సహా 23 మంది రైతులకు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పట్నం నరేందర్ రెడ్డితోపాటు మరో 23 మందికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఇప్పటికే వాదనలు విన్న నాంపల్లి కోర్టు తీర్పును రిజర్వ్ చేయగా బుధవారం వారికి షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. పట్నం నరేందర్‌రెడ్డితో పాటు కీలక నిందితులుగా ఉన్న సురేష్ సహా ఇతర నిందితులకు బెయిల్ మంజూరు కావడంతో వారు జైలు నుంచి విడుదల కానున్నారు. ఈ కేసులో అరెస్టై నిందితులుగా నెలరోజులుగా జైలులో ఉన్నారు. కోర్టు తీర్పు నేపథ్యంలో పట్నం నరేందర్ రెడ్డి చర్లపల్లి జైలు నుంచి గురువారం బయటికి రానున్నారు. పట్నం నరేందర్‌రెడ్డికి రూ. 50 వేల పూచీకత్తుపై, మిగతా వారికి రూ. 20 వేల పూచీకత్తుపై కోర్టు బెయిల్ మంజూరు చేసింది. నరేందర్‌రెడ్డికి రెండు షూరిటీలు, మిగితా వారికి ఒక షూరిటీ ఉండాలని కోర్టు తెలిపింది. అంతేకాకుండా 3 నెలల పాటు ప్రతి బుధవారం పట్నం నరేందర్ రెడ్డితోపాటు ఇతర నిందితులు విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది.

రైలు పట్టాలపై అన్నదాత

పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలంటూ రైల్‌రోకో



చండీగఢ్: కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ఇవ్వాలంటూ అన్నదాతలు రైలు పట్టాలపై బైటాయించారు. పంజాబ్‌లో రైతులు రైల్ రోకో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. చలో ఢిల్లీ ప్రయత్నం విఫలం కావడంతో.. ఆ రైతులు ఇప్పుడు రైళ్లను ఆపేశారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు రైళ్లను నిలిపివేశారు.

పంజాబ్‌లో ఆగిన రైళ్లు

రైతుల కోసం తలుపులు

తెరిచే ఉంటాయి : సుప్రీంకోర్టు

రాష్ట్రంలోని అనేక మార్గాల్లో మూడు గంటల పాటు రైల్ రోకో నిర్వహించారు. పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని రైతులు ఆందోళన చేపడుతున్న విషయం తెలిసిందే.సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం)తో పాటు కిసాన్ మజ్దూర్ మోర్చాలు రైల్ రోకోకు పిలుపునిచ్చాయి. రైల్వే ట్రాకులపై రైతులు బైటాయించినట్టు కిసాన్ మజ్దూర్ మోర్చా నేత సర్వాన్ సింగ్ పందేర్ తెలిపారు. ఢిల్లీ మార్చ్‌ను అడ్డుకోవడంతో ఫిబ్రవరి 13 నుంచి శంభూ, కన్నౌరి సరిహద్దుల మధ్య రైతులు ధర్నా చేపడుతున్న విషయం తెలిసిందే.

కన్నౌరు బోర్డర్ పాయింట్ వద్ద పంజాబీ రైతు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ ఆమరణ దీక్ష చేపడుతున్నారు. పంటలకు ...5లో

ముంబయి తీరంలో ఫెర్రీ ప్రమాదం

13మంది మృతి, ముగ్గురి పరిస్థితి విషమం



ముంబయి : ముంబయి తీరంలో బుధవారం జరిగిన ప్రమాదంలో 13మంది మరణించారు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా వుంది. ఇంజన్ ట్రయల్స్ నిర్వహిస్తున్న భారత నావికాదళానికి చెందిన స్పీడ్ బోట్ పట్టు తప్పి ప్రయాణికుల ఫెర్రీని ఢీ కొనడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో మరణించిన వారిలో నావికాదళ అధికారి ఒకరు, ఒరిజినల్ పరికరాల తయారీదారు కంపెనీకి చెందిన ఇద్దరు వున్నారని నేవీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రమాద సమయంలో ఫెర్రీలో 110 మంది ప్రయాణిస్తున్నారు. వీరిలో 94మందిని కాపాడారు. ప్రమాదం ...15లో

జమిలీ బిల్లుపై 31 మందితో జేపీసీ

21 మంది లోక్‌సభ..10 మంది రాజ్యసభ సభ్యులు



న్యూఢిల్లీ : 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' బిల్లును పరిశీలించడానికి 31 మంది సభ్యులతో జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో లోక్‌సభ నుంచి 21 మంది ఎంపీలున్నారు. అలాగే, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులున్నారు. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును దేశవ్యాప్తంగా లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఏకకాలంలో ఎన్నికలను నిర్వహించడానికి రాజ్యాంగం, సంబంధిత చట్టాలను సవరిస్తూ తీసుకొచ్చారు. లోక్‌సభకు ...7లో

అలా అని ఉండాల్సింది కాదు

అలహాబాద్ హైకోర్టు జడ్జి యాదవ్‌కు సుప్రీం కొలీజియం చురక



న్యూఢిల్లీ : 'ఇటీవల విశ్వహిందూ పరిషత్ సమావేశంలో మీరు అలా అని ఉండాల్సింది కాదు' అంటూ ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్‌కు చురక వేసింది. సుప్రీం కొలీజియం బుధవారం జస్టిస్ యాదవ్‌తో ...15లో

ఢిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖాలీద్‌కు తాత్కాలిక బెయిల్

నాలుగేండ్లకు పైగా ఉపా కేసులో కారాగారంలోనే



న్యూఢిల్లీ : తన బంధువు వివాహానికి హాజరయ్యేందుకు జేఎన్‌యూ విద్యార్థి ఉమర్ ఖాలీద్‌కు ఢిల్లీ కోర్టు బుధవారం ఏడు రోజుల తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. ఈశాన్య ఢిల్లీలో జరిగిన అల్లర్లలో ఉమర్ ప్రమేయం ఉన్నదంటూ ఆయనపై పోలీసులు కుట్ర కేసు నమోదు చేశారు. జనవరి 1వ తేదీన న్యూఢిల్లీలోని అబుల్ ఫజల్ ఎన్‌క్లేవ్‌లో మసీద్ ఇషాత్ ఇస్లాం వద్ద తన బంధువు వివాహం జరుగుతుందని, దానికి ముందు డిసెంబర్ 30, 31 తేదీల్లో హల్దీ, మెహందీ కార్యక్రమాలు ఉంటాయని, వాటికి అమెరికాలో ఉన్న తన సోదరి హాజరవుతున్నందున బంధువులతో పాటు ఆమెను కూడా ...15లో



బీజేపీతో దేశం ముక్కలు

రాజ్యాంగాన్ని బలహీన పరిచి విధ్వంసం చేసే కుట్ర

- ఒకే దేశం..ఒకే ఎన్నిక..అత్యంత ప్రమాదకరం • ప్రాంతీయ పార్టీల మనుగడకే ముప్పు
- రైతాంగ కౌన్సిల్ ద్వారా నల్లచట్టాలు తెచ్చే ప్రమాదం : సీపీఐ (ఎం) ఖమ్మం జిల్లా 22వ మహాసభల్లో.. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు
- రాష్ట్రంలో ప్రజాపాలనంటూనే నిర్బంధాలు • తిట్లపైనే అధికార, ప్రతిపక్షపార్టీల దృష్టి : రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం • భారీ ప్రదర్శనతో ఎరుపెక్కిన సత్తుపల్లి



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/సత్తుపల్లి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరిచి విధ్వంసాలను సృష్టించి దేశాన్ని ముక్కలు చేసే కుట్ర చేస్తోందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. కార్పొరేట్ శక్తుల కోసమే నాలుగు లేబర్ కోడ్‌లు, మూడు వ్యవసాయ నల్ల చట్టాలు తీసుకువచ్చిందని తెలిపారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ (మోరంపూడి పుల్లారావునగర్, కొండపల్లి దుర్గాదేవి ప్రాంగణం)లో బుధవారం సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా 22వ మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో రాఘవులు మాట్లాడారు. దేశ సమైక్యతకు బీజేపీ ముప్పులా పరిణమించిందని అన్నారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక విధానం అత్యంత ప్రమాదకరమని, దీనివల్ల ఏక పార్టీ పాలన వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రాష్ట్రాల్లో ఒకే పార్టీ.. అదీ బీజేపీ మాత్రమే ఉండేలా కుట్ర చేస్తుందని చెప్పారు. ఒకే ఎన్నిక విధానం వల్ల ప్రాంతీయ పార్టీల మనుగడకు ముప్పు ఏర్పడుతుందని హెచ్చరించారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో దేశ భవిష్యత్తుకు ప్రమాదం కలిగించే విధానాలను బీజేపీ తీసుకొస్తుందని అన్నారు. రాజ్యాంగాన్ని బలహీనపరిచి మతతత్వ, హిందుత్వ రాజ్యాంగాన్ని తీసుకురావాలనే ప్రయత్నం కొనసాగుతోందని తెలిపారు. ప్రజాస్వామిక, లౌకిక, సామాజిక, సమైక్య, సోషలిస్టు విధానాలపై దాడులు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతాంగ గిట్టుబాటు ధర చట్టానికి ముందుకు రాని బీజేపీ... రైతాంగ కౌన్సిల్ ద్వారా తిరిగి నల్ల చట్టాలు తెచ్చే ప్రయత్నం చేస్తోందని అన్నారు. జీఎస్టీ తరహాలో నల్ల చట్టాలు భారం కాబోతున్నాయని, దాంతో పంట ధర నిర్ణయం ...7లో

సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సమ్మెను విరమింపజేయాలి : తమ్మినేని

వివరాలు 7లో

సంపాదకీయం

విఘాతం



పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తూ, భారత సమాఖ్య స్ఫూర్తికి సమాధి కట్టే వివాదాస్పద జమిలి ఎన్నికల కోసం బీజేపీ ప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు ప్రతిపాదించింది. ఈ బిల్లులను ప్రవేశ పెట్టాలా? లేదా అన్న విషయమై ఓటింగ్ జరిగినప్పుడు మొత్తం 461 మంది సభలో ఉన్నారు. అందులో 269 మంది అధికార పక్షానికి అనుకూలంగా, 198 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. అప్పుడు సభలో ఉన్న వారి సంఖ్యాబలాన్ని బట్టి చూసినా 'ఒకే దేశం - ఒకే ఎన్నిక'ల బిల్లును ఆమోదింప చేసుకోవడానికి రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండొంతుల మంది సభ్యుల మద్దతు ఎన్డీయే సర్కారుకు లేదని స్పష్టమైంది. ప్రజెంటేషన్ దశలోనే తీవ్ర వ్యతిరేకత రావడంతో, ఈ బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపిస్తామని కేంద్ర ప్రభుత్వం సభకు హామీ ఇవ్వాల్సిన పరిస్థితి వచ్చింది.

> ఒకే దేశం-ఒకే ఎన్నికల ప్రతిపాదనను బేరీజు వేయడానికి మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికలోనే అనేక లోపాలున్నాయి. ఈ కమిటీ ఏడు దేశాలలో పరిస్థితిని అంచనా వేసినట్టు చెబుతున్నది. కానీ వాటిలో ఒక్క దేశం విస్తీర్ణం మన దేశంలోని ఏ రాష్ట్రం కన్నా పెద్దది కానే కాదు. పదిహేడు వందల పేజీలకు పైగా ఉన్న కోవింద్ కమిటీ నివేదికను ఆరు నెలల్లో తయారు చేశారనడం ఒట్టి 'జుమ్లా'.

జమిలి ఎన్నికల వల్ల వ్యయం భారీగా తగ్గి ప్రభుత్వ ఖజానాకు లబ్ది చేకూరుతుందనేది మోడీ సర్కార్ వాదన. కానీ అసలు కుట్ర వేరే ఉంది. వీరు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 'ఒంటెత్తు పోకడే'! 'ఒకే దేశం - ఒకే విధానం' అంటూ దేశాన్ని క్రమక్రమంగా కేంద్రీకృతం వైపు లాక్కెళ్లుతున్న సంగతి తెలిసిందే. భౌగోళికంగానూ, ప్రజల జీవన విధానంలోనూ అడుగడుగునా భిన్నత్వంతో తొణికిసలాడుతూ ఏకత్వాన్నిచాటే దేశం మనది. సంఘ్ పరివార్‌కు మొదటి నుంచి కంటగింపు కలిగిస్తున్నదీ ఇదే. అందుకనే దేశంలో ఈ భిన్నత్వ వైశిష్ట్యాన్ని దెబ్బతీసే కుట్రలు సాగుతున్నాయి. సువిశాల భూభాగంలో 140కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో ప్రతి విషయంలోనూ ఒకే విధానాన్ని అనుసరిస్తూ పోతే అది ప్రభుత్వ పాలనాధికారాలు కేంద్రీ కృతం కావడానికి దోహదం చేస్తుందే తప్ప, రాష్ట్రాల పురోగతికి కానీ, ప్రజల సంక్షేమానికి కానీ అది ఏ కోశానా తోడ్పడదు.

ప్రస్తుతం మనం అనుసరిస్తున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అధ్యక్ష తరహా పాలన దిశగా తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నట్టు స్పష్టం. మూడు నాలుగు రాష్ట్రాలలో కూడా ఒకే విడత ఎన్నికలు నిర్వహించడం ఎన్నికల కమిషన్‌కు తలకుమించిన భారం అయిపోతోంది. ఒకే రాష్ట్రంలో సైతం మూడునాలుగు విడతలుగా ఎన్నికలు నిర్వహించిన సందర్భాలు అనేకం. అలాంటిది దేశమంతా ఒకేసారి ఎన్నికలు ఎలా సాధ్యం? ఈ రాజ్యాంగ సవరణ బిల్లులు అంతిమంగా గట్టెక్కుతాయో లేదా అన్న విషయం పక్కన పెడితే.. బిల్లు ప్రతిపాదన దశలోనే ప్రతి పక్షాలు చాలా తీవ్రంగా ప్రతి ఘటించాయి. ఇండియా కూటమిలోని అన్ని పక్షాలు ముక్త కంఠంతో బిల్లు ప్రతి పాదనను అడ్డుకోవడానికి సర్వ శక్తులూ ఒడ్డాయి. ఒకే దేశం- ఒకే ఎన్నికల ప్రతిపాదనను బేరీజు వేయడానికి మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికలోనే అనేక లోపాలున్నాయి. ఈ కమిటీ ఏడు దేశాలలో పరిస్థితిని అంచనా వేసినట్టు చెబుతున్నది. కానీ వాటిలో ఒక్క దేశం విస్తీర్ణం మన దేశంలోని ఏ రాష్ట్రం కన్నా పెద్దది కానే కాదు. పదిహేడు వందల పేజీలకు పైగా ఉన్న కోవింద్ కమిటీ నివేది కను ఆరు నెలల్లో తయారు చేశారనడం ఒట్టి 'జుమ్లా'. ఎప్పుడో తయారు చేసి పెట్టుకున్న దస్త్రాలకు ఈ కమిటీతో ఆమోదముద్ర వేయించారని పిస్తోంది.

ఒకే భాష, ఒకే కట్టూబొట్టు, ఒకే తిండి, ఒకే విద్య... ఇలా దేశమంతా ఒకే విధానం ఉండాలని సంఘ్ పరివార్ పేరాశ. ఈ కోవలో జమిలి ఎన్నికలు కూడా రుద్దాలనే దాని ఉబలాటం. ప్రజల సంపదను లూటీ చేసి కార్పొరేట్ కంపెనీలు కుమ్మరిస్తున్న కోట్లాది రూపాయల సొమ్ముతో 'ఆపరేషన్ కమల్' చేపట్టి, రాష్ట్రాల ప్రభుత్వాలను కూల్చివేస్తూ ఇప్పటికే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాల్జేస్తోంది. ఇక దేశమంతటా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే అది పార్లమెంటరీ వ్యవస్థకు పెను విఘాతంగా మారుతుంది. సమాఖ్య స్ఫూర్తినే ప్రమాదంలోకి నెట్టేస్తుంది. జమిలి ఎన్నికలు జరపాలంటే దేశంలోని అన్ని శాసన సభలనూ ఒకేసారి రద్దు చేయాలి. లేదా కొన్ని శాసనసభలను ముందస్తు ఎన్నికలకు ఒప్పించాలి. మరికొన్నింటికి పదవీకాలం పొడి గించాలి. ఇంత కసరత్తు చేస్తే తప్ప 'జమిలి' సాధ్యపడదు.

భారతదేశం రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగం చాలా స్పష్టంగా నిర్దేశిస్తోంది. ఒకవేళ బీజేపీ కోరుకున్నట్టు జమిలి జరిగితే రాష్ట్రాల ఉనికికే ప్రమాదం వాటిల్లుతుంది. దేశవ్యాప్త ప్రచారాల్లో ప్రాంతాలవారీ సమస్యలు కొట్టుకుపోతాయి. ప్రాంతీయ పార్టీలు ఉనికి కోల్పోయి...కనుమరుగయ్యే ప్రమాదముంది. సరిహద్దు ఘర్షణలనో, మైనార్టీలనో బూచిగా చూపెట్టి ప్రజలను మతాల పరంగా, ప్రాంతాల పరంగా చీలికలు పేలికలు చేసి ప్రజా సమస్యలను తొక్కిపెట్టేస్తారు. మణిపూర్ మారణహోమం, అదానీ వ్యవహారం, రూపాయి అంతకంతకూ దిగజారిపోవడం, వడ్డీరేట్లు, ధరాఘాతం, రైతుల నిరసనలు, నిరుద్యోగం మరింతగా పెరగడం, వాటిని పరిష్కరించే చేవలేకనే బీజేపీ నేడు ఆడుతున్న నాటకాలివి. ఇవి దేశానికే కాదు, ప్రజలకు, ప్రజా ప్రయోజనాలకు అత్యంత ప్రమాదకరం.

వాళ్లకూ మనకూ మధ్య ఈ బౌన్సర్లెందుకు?



జలపాతాలు

పుస్తకాలు చిన్ని గుంతలు కావొచ్చు
పెద్ద చెరువులు కావొచ్చు
అందమైన సరస్సులు కావొచ్చు

పుస్తకాలు, ప్రవహించే
నదులు కావొచ్చు
గంభీరమైన
మహా సముద్రాలు కావొచ్చు

అపారమైన జలసంపదలాగా
విస్తారమైన
విషయ సంపద ఉండొచ్చు

కానీ, పనికిరాని
విషయ పరిజ్ఞానం లాగా
నీరంతా తాగడానికి పనికిరాదు

పొట్టుతీసి గింజలు ఏరుకున్నట్టు-
తొక్కతీసి పండు వొలిచినట్టు
మనిషి ప్రాణాన్ని నిలిపే
మనిషి మనిషిగా లేపే
విజ్ఞానపు జలం కోసం
సమాజపు బలం కోసం
తరం తర్వాత తరం, నిరంతరం
అన్వేషించుకుంటూనే ఉండాలి!

పుస్తకాల్లో దొరికే తడి, వేడి, ధార
పరుగు, ప్రవాహం, ఉత్తేజం, ఉద్వేగం
గుర్తించగలిగిన వారికే
అది హస్తగతమౌతుంది!

జలపాతాల నుండి,
విద్యుత్తును పుట్టించొచ్చునన్నది
తెలుసుకోవాలి.

(నేడు హైదరాబాద్ బుక్‌ఫెయిర్
ప్రారంభం సందర్భంగా)

- దేవరాజు మహారాజు



ఎస్. వినయ కుమార్
9989718311

పుష్ప-2 బెనిఫిట్ షో సందర్భంగా హైదరాబాదులోని సంధ్య థియేటర్‌లో ఒక మహిళ మృతి చెందారు. ఆమె కుమారుడు ఆస్పత్రిలో ఇంకా చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కొందరు థియేటర్ సిబ్బందిని, అల్లు అర్జున్‌ను అరెస్టు చేశారు. హైకోర్టు నుండి బెయిల్ తెచ్చుకొని అర్జున్ జైలు నుండి విడుదలయ్యాడు. అట్లే విఐపిలు, సెలబ్రిటీలు, విద్యా వ్యాపారులు సహా వ్యాపార దిగ్గజాలు తమ చుట్టూ ఎక్కువ సంఖ్యలో బౌన్సర్లను వెంట బెట్టుకొని బయల్దేరే సంప్రదాయం కొన్నేళ్లుగా మొదలైంది. నటుడు మోహన్‌బాబు కుటుంబ కలహాలలోనూ బౌన్సర్లు ఆరోపణలకు గురయ్యారు. కొద్ది దశాబ్దాల క్రితం ఈదుస్థితి లేదు.

బహుశా 1976లో కావచ్చు. నేను సైకిల్ మీద ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్సు ముందు నుండి బషీర్‌బాగ్ వైపు వెళ్తున్నాను. నాపక్క నుండి ఒక ఫియట్ కారు దూసుకెళ్లి అసెంబ్లీ స్పీకర్ వీరమాచినేని ఇంటి ముందు ఆగింది. అప్పట్లో ఆ రోడ్డు ఇప్పుడున్నంత విశాలంగా లేదు. అయినా రోడ్డుమీద కారు పార్క్ చేయడానికి ఇబ్బంది ఉండేది కాదు. ఎమ్మెల్యేల క్వార్టర్లన్నీ కాంపౌండ్ లోపల ఉండేవి. స్పీకర్ ఇంటి గేటు ఒక్కటే రోడ్డు మీదికి ఉండేది. ఆగిన కార్లోంచి తెల్లటిపంచె, తెల్లలాల్చీ ధరించిన ఒక వ్యక్తి దిగి విసావిసా నడుచుకుంటూ స్పీకర్ ఇంట్లోకి వెళ్లారు. ఆ వ్యక్తిని చూసి నేను సంతోషం పట్టలేకపోయాను. ఎందుకంటే ఆయన ఎవరో కాదు. ఆయన నా అభిమాన తెలుగు హీరో అక్కినేని నాగేశ్వరరావు. ఒక్కరే కారు నడుపుకొంటూ వచ్చారు.

ఆ తర్వాత మరోసారి ఆయన్ని అలాగే చూశాను. నేను పనిచేస్తున్న ఆస్పత్రిలో సాయంకాలం ఏడు గంటల తర్వాత ఆ రోజు కలెక్షన్‌ను క్యాష్‌బుక్‌తో సరిచూసుకుంటున్నాను. ఇంతలో కౌంటర్ డోర్ దగ్గర నుండి 'ఎక్సుక్యూజ్ మి. వేర్ ఈజ్ జి.ఎస్.రెడ్డి రూం' అంటూ మృదువుగా ఒక కంఠం వినబడింది. తలతిప్పి చూస్తే నాలుగడుగుల దూరంలో ఒంటరిగా ఏఎన్నార్. తెల్లటి ప్యాంట్ షర్టు, నడుముకు సన్నటి బెల్టుతో టక్ చేసుకొన్నారు. సంభ్రమాశ్చర్యాలతో దిగ్గున లేచి నిలబడ్డాను. టేబుల్‌పై ఉన్న క్యాష్‌ను గబాగబా టేబుల్ డ్రాలోకి తోసి తాళం వేశాను. ఐ విల్ షో యు సర్...అంటూ ఫస్ట్ ఫ్లోర్‌కు దారితీశాను. నా వెనక ఏఎన్నార్. ఎదురుబడిన స్టాఫ్, పేషెంట్లు, అటెండర్లు గోడకు అతుక్కుపోయి మర్యాదగా దారి ఇచ్చారు. ఇదే రూం సర్ అంటూ ఒక ఏసి రూంను చూపెట్టి నేను వచ్చేశాను. ఆ గదిలో ఏఎన్నార్ ఎంత సేపున్నారో, ఎప్పుడు వెళ్లిపోయారో తెలియలేదు. ఎంత గప్‌చిప్‌గా వచ్చారో అంతే గప్‌చుప్‌గా వెళ్లిపోయి ఉంటారు.

జి.ఎస్.రెడ్డి చాలాకాలం పాటు ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆయన పెద్ద కాంట్రాక్టరని విన్నాను. అప్పటికి జి.కె. రెడ్డి పేరు అంతగా తెలియదు. కనుక వారి బంధుత్వం గురించి తెలియదు. కాని ది హిందూ పత్రిక కరెస్పాండెంట్ జి.కె.రెడ్డికి ఆయన బంధువని తెలుసు. ఒకసారి జి.కె.రెడ్డి కూడా జి.ఎస్.రెడ్డిని పరామర్శించడానికి వచ్చారు. ఏఎన్నార్‌ను చూసి ఎంత సంతోషం కలిగిందో, జి.కె.రెడ్డిని చూసినా అంతే సంతోషం కలిగింది. ఆయన హిందూలో రాసిన వార్తలను చాలా కష్టపడి చదివేవాడిని, పూర్తిగా అర్థం చేసు కోవడానికి ప్రయత్నించే వాడిని. ఎడమ చేతిలో సిగరెట్ డబ్బా, లైటర్. కుడి చేతిలో సిగరెట్‌తో కన్పించాడు. చెయిన్ స్మోకర్ గదా. అప్పట్లో పొగతాగడం మీద ఇప్పటిలా ఆంక్షలు లేవు. వార్డుల్లో తప్ప ఆస్పత్రి కారిడార్‌లలో సీనియర్ డాక్టర్లు. రిచ్ అటెండర్లు కులాసాగా సిగరెట్లు తాగేవారు.

మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యుడు, వనపర్తి సంస్థానం మాజీ రాజు జె.రామేశ్వరరావు కూడా డాక్టర్లను కలవడానికి తరచూ ఆస్పత్రికి ఒంటరిగానే వచ్చేవాడు. క్యాష్ కౌంటర్‌కు వీపు పెట్టి డాక్టర్లతో వరండాలోనే కబుర్లు చెపుతుండేవాడు. ఆయన చేతిలో ఖరీదైన సిగరెట్ డబ్బా, లైటర్, ఎప్పుడూ ఉండాల్సిందే. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ జయసింహ కూడా ఒంటరిగానే వచ్చేవాడు. చాలా మంది ప్రముఖులు తమ వెంట ఏ పటాలం లేకుండా ఒంటరిగానే తమ కార్లు తామే నడుపుకొంటూ వచ్చేవారు. బౌన్సర్లు, బాడీగార్డులు అంటూ ఎలాంటి హడావిడి ఉండేది కాదు. కేంద్రంలో మంత్రిగా పనిచేసిన కోట్ల విజయభాస్కర రెడ్డి కూడా ఎలాంటి అలికిడి లేకుండా తనకు తెలిసిన ఓ పేషెంట్‌ను పరామర్శించి వెళ్లారు. ఈ విషయంలో మర్రి చెన్నారెడ్డి తీరువేరు. యూపీకో, పంజాబ్‌కో గవర్నర్‌గా ఉండగా ఆయన ఆస్పత్రికి వస్తున్నారని మఫ్టీ పోలీసులు వచ్చి కౌంటర్‌లో ఉన్న నాతో చెప్పారు. ఆయన్ని మర్యాదగా రిసీవ్ చేసుకోవడానికి పెద్దలెవరైనా గేట్ దగ్గర ఉండాలని దాని సారాంశం. మఫ్టీ పోలీసులు నాతో మాట్లాడుతుండగా అప్పటి నిజాం ఆర్థోపెడిక్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రంగారెడ్డి దూరం నుండి చూశారు. నా దగ్గర కొచ్చి ఏమిటంట? అని అడిగారు. నేను చెప్పాను. ఆయన మర్రి చెన్నారెడ్డికి ఎంబిబిఎస్‌లో సహాధ్యాయుడో, లేక సీనియరో తెలియదు గాని పొలిటీషియన్లను మనం పట్టించుకోనక్కర్లేదు. లైట్‌గా తీస్కో అన్నట్టు సైగచేశాడు. చెన్నారెడ్డి తన అనుచరుల పటాలంతో హడావిడిగా వచ్చారు, వెళ్లిపోయారు.



ఒకసారి ఎన్టీ రామారావు కూడా ఎవరినో పరామర్శించడానికి వచ్చారు. కౌంటర్లో ఉన్న నాకు ఆ విషయం ఎవరో చెవిన వేశారు. నేను కౌంటర్ లాక్ చేసి బయటికి వచ్చాను. ఆయన మెల్లిగా రాంపు దిగుతూ వచ్చారు. ఆయన చుట్టు ఎవరూ లేరు. పదడుగుల దూరంలో ఒకతను అప్పుడప్పుడూ వెనక్కి చూస్తూ దిగుతున్నాడు బహుశా డ్రైవరేమో. టెర్లిన్ హాఫ్ షర్టు టెరికాటన్ ప్యాంటులో సింపిల్‌గా ఉన్నారు. తనకు ఎదురు పడి నమస్కరించిన వారి ముఖాల్లోకి చిరునవ్వుతో చూస్తూ హుందాగా ర్యాంప్ దిగి వెళ్లిపోయారు. ఒంటి మీద నేటి హీరోల్లా రంగురంగుల పూలపూల దుస్తుల్లేవు. అప్పటికే టెర్లిన్ బట్ట ఉత్పత్తి ఆగిపోయింది. బహుశా ఎప్పుడో కుట్టించింది వేసుకొని ఉంటారు. అప్పట్లో అభిమాన సంఘాల మధ్య వైరం తీవ్రస్థాయిలో ఉండేది. కర్నూల్‌లో ఒక థియేటర్లో తన అభిమాన హీరోను ఏదో అన్నారని ఒక అభిమాని మరో వ్యక్తిని కత్తితో పొడిచాడు. అతను చనిపోయాడు.

నటీమణులు అంతే. ఒకరోజు సాయంకాలం జయప్రదను వెంటబెట్టుకొని అప్పటికి కాంట్రాక్టర్ అయిన టి.సుబ్బిరామిరెడ్డి కౌంటర్ దగ్గరికి వచ్చి 'కంటి డాక్టర్ వచ్చారా? ఈమెను చూపించాలి' అని అడిగారు. ఆయన వెనుక తెల్లగా మిలమిల మెరుస్తున్న ఒక మహిళ సాధారణ చీర,జాకెట్‌తో నిలబడి ఉంది. ఈమెను ఎక్కడో చాలా దగ్గరగా చూశాను. జ్ఞాపకం రావడం లేదే అని తికమక పడ్డాను. 'భూమికోసం'లో చెల్లి చంద్రమ్మ ను చూశాను, కాని వెంటనే గుర్తుకు రాలేదు. ఆమె బెరుకుచూపులు చూస్తున్నారు. ఒకసారి జయసుధ ఎవరినో పరామర్శించడానికి ఒక్కరే వచ్చారు. తనను చూసి దగ్గరికి వచ్చిన వారితో ఆస్పత్రి వరండాలో నిలబడి కులాసాగా మాట్లాడారు. అప్పటికే ఆమె చేసిన సినిమాలు బాగా నడిచి మహిళల్లో 'ఫేవరెట్' నటి అయ్యారు. అయినా సింపుల్ చీరలో వచ్చారు. బౌన్సర్లు, బాడీగార్డులు లేరు. స్వాతి కిరణం శతదినోత్సవానికి రాజ్ కపూర్ ముఖ్యఅతిథి. కమల్ హాసన్, చిరంజీవి, జయప్రద వంటి తారాగణమంతా హాజరయ్యారు. విలేకరిగా నేను కవరేజి కోసం వెళ్లాను. ఫంక్షన్ దేవి థియేటర్‌లో జరిగింది. ఫంక్షన్ అయ్యాక రాజ్‌కపూర్ నా ముందు నుండి మెట్లు దిగి వెళ్లిపోయారు. అంత పాపులర్ నటుడి చుట్టూ ఆ సినిమాకు సంబంధించిన ఇద్దరు, ముగ్గురే ఉన్నారు. బౌన్సర్లు లేరు బాడీగార్డులూ లేరు. పెద్ద కమోషన్ లేదు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఒక అసిస్టెంట్ డైరెక్టర్ పెండ్లికి సూపర్ స్టార్ కృష్ణ ఎలాంటి సెక్యురిటీ లేకుండా ఒక్కరే వచ్చారు. కలుపుకోలుగా మాట్లాడారు. సి.ఐ.టి.యు నాయకుడు వి. శ్రీహరి కుమార్తెతో అసిస్టెంట్ డైరెక్టర్‌కు జరిగిన దండల పెండ్లి అది.

> ఏఎన్నార్ మరణించినప్పుడు చూసిన ఒక సంఘటన నాకు విస్మయం కలిగించింది. నివాళులు అర్పించడానికి ఒక హీరో దాదాపు ఇరవై మంది బౌన్సర్స్‌తో వచ్చాడు. బౌన్సర్లు జడ్‌ప్లస్ కేటగిరి నాయకుడికి చేసేంత హడావిడి చేశారు. ఆ హీరో ఒక్క నిమిషం కూడా అక్కడ ఉండకుండా రోబోలా పుష్పగుచ్ఛం ఉంచి వెంటనే వెనుదిరిగి వెళ్లిపోయారు. సినీ ప్రముఖులు మాత్రమే ఉండే చోటుకి అంతపెద్ద సంఖ్యంలో బౌన్సర్లను వేసుకొని ఎందుకొచ్చినట్లు? సంతాపం ప్రకటించే చోట ఇలా షో పుటప్ చేయడేమిటి అన్పించింది. ఎంతమంది బౌన్సర్లను వెంటేసుకొని వస్తే అంత గొప్ప అనుకుంటున్నారేమో.


> ఒకసారి జయసుధ ఎవరినో పరామర్శించడానికి ఒక్కరే వచ్చారు. తనను చూసి దగ్గరికి వచ్చిన వారితో ఆస్పత్రి వరండాలో నిలబడి కులాసాగా మాట్లాడారు. అప్పటికే ఆమె చేసిన సినిమాలు బాగా నడిచి మహిళల్లో 'ఫేవరెట్' నటి అయ్యారు. అయినా సింపుల్ చీరలో వచ్చారు. బౌన్సర్లు, బాడీగార్డులు లేరు. స్వాతి కిరణం శతదినోత్సవానికి రాజ్ కపూర్ ముఖ్యఅతిథి. కమల్ హాసన్, చిరంజీవి, జయప్రద వంటి తారాగణమంతా హాజరయ్యారు. విలేకరిగా నేను కవరేజి కోసం వెళ్లాను. ఫంక్షన్ దేవి థియేటర్‌లో జరిగింది. ఫంక్షన్ అయ్యాక రాజ్‌కపూర్ నా ముందు నుండి మెట్లు దిగి వెళ్లిపోయారు. అంత పాపులర్ నటుడి చుట్టూ ఆ సినిమాకు సంబంధించిన ఇద్దరు, ముగ్గురే ఉన్నారు. బౌన్సర్లు లేరు బాడీగార్డులూ లేరు. పెద్ద కమోషన్ లేదు.

హైదరాబాదులో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం 1986లో జరిగింది. ఆ సందర్భంగా కొందరు పాపులర్ నటులను, దర్శకులను గమనించాను. ప్రజాశక్తి విలేకరిగా నేను ఆ ఫిల్మ్ ఫెస్టివల్‌ను కవర్ చేశాను. ఫెస్టివల్ సందర్భంగా ప్రెస్ కాన్ఫరెన్సులు, బ్రీఫింగ్‌లు ఇంటరాక్షన్లు జూబ్లీహాల్‌లోనూ ఒకనాటి విధాన పరిషత్ హాల్‌లోనూ జరిగేవి. రామకృష్ణ 70ఎంఎం ఆ చిత్రోత్సవానికి మెయిన్ థియేటర్ అయినా చాలామంది నటులు, దర్శకులు, చిత్రోత్సవం ఆర్గనైజర్లు జూబ్లీహాల్‌కు సినాప్సిస్‌లు కూడా అక్కడే ఇచ్చేవారు.

ఒకనాటి హిందీ హీరో అశోక్‌కుమార్ అక్కడ దాదాపు ప్రతిరోజూ కన్పించేవారు. ఆయనకు ఒక చేతిలో సిగరెట్ ప్యాకెట్ మరో చేతిలో స్టిక్ ఉండేది. వెంట ఎవరూ ఉండే వారు కాదు. పలుకరించిన వారితో సరదాగా మాట్లాడేవాడు. ఒక్కడే బయటికి వచ్చి వాహనం ఎక్కి తన హోటల్‌కో, సినిమా థియేటర్‌కో వెళ్లేవారు. ఆ సమయంలో ఒకరోజు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఒంటరిగా మెట్లు దిగి వస్తున్న ప్రఖ్యాత దర్శకుడు హృషికేశ్ ముఖర్జీని చూశాను. వెనకముందూ ఎవరూ లేరు. నేను చిరునవ్వుతోనే నమస్కారం పెట్టి ఆయన వెనకే మెట్లు దిగొచ్చాను. నా సహాయం ఏదైనా అవసరమైతుందేమో అనుకొన్నాను. ఆయన రోడ్డు మీదికి వచ్చి ఆటో ఆపి అందులో ఎక్కి వెళ్లారు.

కాగా ఏఎన్నార్ మరణించినప్పుడు చూసిన ఒక సంఘటన నాకు విస్మయం కలిగించింది. నివాళులు అర్పించడానికి ఒక హీరో దాదాపు ఇరవై మంది బౌన్సర్స్‌తో వచ్చాడు. బౌన్సర్లు జడ్‌ప్లస్ కేటగిరి నాయకుడికి చేసేంత హడావిడి చేశారు. ఆ హీరో ఒక్క నిమిషం కూడా అక్కడ ఉండకుండా రోబోలా పుష్పగుచ్ఛం ఉంచి వెంటనే వెనుదిరిగి వెళ్లిపోయారు. సినీ ప్రముఖులు మాత్రమే ఉండే చోటుకి అంతపెద్ద సంఖ్యంలో బౌన్సర్లను వేసుకొని ఎందుకొచ్చినట్లు? సంతాపం ప్రకటించే చోట ఇలా షో పుటప్ చేయడేమిటి అన్పించింది. ఎంతమంది బౌన్సర్లను వెంటేసుకొని వస్తే అంత గొప్ప అనుకుంటున్నారేమో. వ్యాపార వేత్త ఆదానీ కూడా అంతే. అదానీ వెంట ఇంగ్లీషు సినిమాల్లోని విలన్ల చుట్టూ ఉన్నట్లుగా నల్ల కళ్లద్దాలు పెట్టుకొన్న ఫుల్ సూట్ కమెండోలు కన్పిస్తారు. బ్యాంకులను ముంచి లండన్‌లో ఉంటున్న విజయ్‌మాల్యా చుట్టూ అలాగే ఉండేవారు. బౌన్సర్లు చుట్టూ ఉన్న వారిని దుర్మార్గంగా నెట్టే యడం సాధారణమైంది. పుష్ప-2 సినిమా ప్రదర్శన సందర్భంగా సంధ్య థియేటర్లో జరిగిందదే. చనిపోయిన మహిళ కుటుంబానికి రూ.25 లక్షలతో పాటు బాలుని చికిత్స ఖర్చులు తాను భరిస్తానని అల్లు అర్జున్ ప్రకటించారు. కోర్టు తీర్పు ఎలా ఉండబోయినా సెలబ్రి టీలు, బడా వ్యాపారుల చుట్టూ ఉండే బౌన్సర్లకు ఒక నియమావళి అంటూ రూపొందించడం అవసరం. బౌన్సర్లను నియమించుకొనే వారికి కూడా కొన్ని నిబంధనలు ఉండాలి.

అసద్ పతనం, సిరియా కల్లోలం



సిరియాలోకి తహ్రీర్ అల్ షామ్, ఇంకా ఇతర సాయుధ వర్గాలు వేగంగా చొచ్చుకుపోవడంతో బషర్ అల్ అసద్ ప్రభుత్వం కూలిపోవడానికి దారితీసింది. ఆ విధంగా పశ్చిమాసియాలోని ఆఖరి లౌకిక ప్రభుత్వాన్ని కూలగొట్టడంలో అమెరికా కృతకృత్యమైంది. ఆఫ్ఘనిస్థాన్‌లోనూ పశ్చిమాసియా ఉత్తర ఆఫ్రికా ప్రాంతంలోని ఇరాక్, లిబియాలలో ఇక ఇప్పుడు సిరియాలోనూ లౌకిక ప్రభుత్వాలను కూల్చడంలోనే గాక తీవ్ర మతశాఖా యుద్ధాలను రాజేయడానికి కూడా అమెరికా సైనిక జోక్యం కారణమైంది. అమెరికా, అలాగే దాని సహాయంతో చెలరేగిన భస్మాసుర తీవ్రవాద బృందాలు సృష్టించిన విధ్వంసకాండ ప్రతి చోటా శాంతి, సుస్థిరతలకు ముప్పుగా పరిణమిస్తున్నది.2011లో మొదలైన అంతర్యుద్ధం తర్వాత సిరియా మూడు ప్రాంతాలుగా విభజితమైంది. ఆ భూభాగంలో 65శాతం మాత్రమే అసద్ ప్రభుత్వ అదుపులో వుండింది. రష్యా ఇరాన్ దానికి సహాయం అందించాయి. ఆ విధంగానే ఆ ప్రభుత్వం భూభాగాన్ని అదుపులో వుంచుకుంటూ తీవ్రవాద బృందాల దాడులను తిప్పికొట్టగలిగింది.

అంతర్గత పరిస్థితులు

25 శాతం భూభాగంతో కూడిన రెండవ ప్రాంతం అమెరికా మద్దతుగల సిరియన్ డెమొక్రటిక్ ఫోర్సెస్ (ఎస్.డి.ఎఫ్) అదుపులో సాగింది. తక్కిన ప్రాంతం ప్రత్యేకించి వాయువ్య భాగాలు హయత్ తహ్రీర్ అల్ షామ్ (హెచ్.టి.ఎస్) ఆధీనంలో వుంటూ వచ్చింది. అల్ ఖైదా, అల్ నుస్రా ఫ్రంట్‌ల నుంచి పుట్టిందే ఈ సంస్థ. 2016లో ప్రత్యేక సంస్థగా ప్రకటించుకున్న హెచ్.టి.ఎస్ ప్రబలమైన మిలిటెంట్ గ్రూపుగా రూపుదాల్చింది. అమెరికా, రష్యా, టర్కీలు దాన్ని తీవ్రవాద సంస్థగా ప్రకటించినా అసద్‌ను వ్యతిరేకించే దేశాలు దానికి లోపాయికారిగా అండనిస్తూ వచ్చాయి. ఇడ్లిబ్ స్థావరంగా చేసుకున్న హెచ్.టి.ఎస్ గతేడాది కాలంగా ఆయా శక్తులను సమీకృతం చేసేందుకు చురుగ్గా పని చేస్తూ దాడికి దిగింది. టర్కీ మద్దతుగల సిరియన్ నేషనల్ ఆర్మీ (ఎస్.ఎన్.ఎ) అనే మరో తీవ్రవాద వర్గం కూడా అదే సమయంలో మరో వైపు నుంచి దాడి చేయడం ఈ దాడికి ఊపునిచ్చింది. సిరియా ప్రభుత్వానికి ప్రధాన మద్దతుదారులైన రష్యా ఇరాన్‌లు తమ తమ సరిహద్దు దేశాలలో సాగుతున్న సంఘర్షణలలో తలమునకలవుతున్నాయి. సిరియా ప్రభుత్వ రక్షణలో కీలక పాత్ర వహించే హిజ్బుల్లా ఇజ్రాయిల్ దురాక్రమణకు వ్యతిరేకంగా పోరాటంలో నిమగ్నమైంది. ఈ కారణాలన్నీ కూడా అప్పటికే సంక్షోభంలో వున్న సిరియా ప్రభుత్వ మద్దతు మరింత బలహీనపడటానికి దారితీశాయి.

అసద్ నిరంకుశ పాలన

అసద్ కూడా జనరంజకమైన అధ్యక్షుడేమీ కాదు. ఆయన ప్రారంభించిన నయా ఉదారవాద విధానాలు ప్రజలలో అసంతృప్తికి కారణమైనాయి. బల ప్రయోగంతో ఆ నిరసనలను అణచివేయడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. ప్రజాస్వామిక హక్కులన్నీ కోతకోస్తూ నిరంకుశ పాలనను రుద్దింది. అమెరికా మద్దతుగల సామ్రాజ్యవాద శక్తులు ఈ అసంతృప్తిని ఉపయోగించుకుని ప్రభుత్వాన్ని అస్థిరపరచేందుకు పూనుకున్నాయి. అల్‌ఖైదా, దాని స్థానిక సహచర సంస్థగా వున్న అల్ నుస్రా వంటి తీవ్రవాద సంస్థలను ప్రయోగించి అంతర్యుద్ధాన్ని రగిలించాయి. ఈ ప్రాంతంలో సామ్రాజ్యవాదానికి ప్రధాన దోస్తుగా వున్న ఇజ్రాయిల్ కూడా ఈ కల్లోల సృష్టిలో పాత్ర పోషించింది.ఈ అంతర్యుద్ధంలో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మరెంతో మంది గాయపడ్డారు. అరవై లక్షల మందికి పైగా సిరియన్లు శరణార్థులై దేశం వదలి పారిపోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఈ విధ్వంసం వల్ల కలిగిన నష్టం వందల కోట్లలో వుంటుంది. దశాబ్ది పైగా సాగిన ఈ అంతర్యుద్ధం ముగిసిన తర్వాత కూడా సిరియా ప్రభుత్వం ప్రజల బాధలు తీర్చలేకపోయింది.హిజ్బుల్లాకు ఆయుధ సరఫరాను అడ్డుకుని ముప్పు తగ్గించే పేరిట ఇజ్రాయిల్ గడచిన ఒక్క ఏడాదిలో సిరియా లోతట్టు భాగాలపై బాంబులు కురిపించింది. ఈ దాడులను ప్రతిఘటించడం లేదా తిప్పికొట్టడం కూడా సిరియా చేయలేక పోయింది. అన్ని వైపులా సంక్షోభాలలో చిక్కుకు పోయిన సిరియా సైనికులు ఎదురు దాడులకు కూడా సిద్ధం కాలేదు.తన నిరంకుశ స్వభావం కారణంగా సిరియా ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయింది. అదే దాని ప్రధాన బలహీనత అయ్యింది. ఈ కారణాల వల్లనే తీవ్రవాద వర్గాలు దాడి ప్రారంభించినపుడు సిరియా సాయుధ బలగాల్లో మిగిలినవేవైనా వున్నా కూడా ఎలాంటి ప్రతిఘటన చేయలేక తేలిగ్గా లొంగిపోయాయి. అధ్యక్షుడు అసద్ కూడా దేశం వదలి పారిపోయి రష్యాలో ఆశ్రయం పొందారు.

ఇజ్రాయిల్ దాడులు, టర్కీ వ్యూహాలు

అసద్ పతనం తర్వాత వెనువెంటనే ఇజ్రాయిల్ సిరియాపై సాయుధ దాడులు తీవ్రం చేసింది. డిసెంబరు10-11 తేదీల మధ్య 48 గంటలలో ఇజ్రాయిల్ 480కి పైగా వైమానిక దాడులు జరిపింది. ఇవి గత ఏడాది మొత్తం మీద చేసిన దాడులకన్నా ఎక్కువే. సిరియా ఆయుధాలు మందుగుండు తీవ్రవాదుల చేతుల్లో పడకుండా చూసేందుకే తాను దాడులు తీవ్రం చేసినట్టు ఇజ్రాయిల్ చెప్పుకుంటున్నది. తన ఆక్రమణలోని గోలన్‌హైట్స్ సమీపంలో సిరియాతో గల మధ్యంతర ప్రాంతాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించుకుంది. ఆ ప్రాంతాన్ని దాటి తమ సైన్యాలు సిరియా భూగాలలో ప్రవేశించాయని కూడా ఇజ్రాయిల్ అధికారికంగా ప్రకటించింది. ఇది మరోసారి ఐక్యరాజ్యసమితి తీర్మానాలను ఇజ్రాయిల్ పచ్చిగా ఉల్లంఘించడమే. సిరియాలో సాధ్యమైనంత ఎక్కువ భూభాగం ఆక్రమించి గ్రేటర్ ఇజ్రాయిల్ ఏర్పాటు చేయాలని కరుడుగట్టిన యూదు జాత్యహంకార మితవాద వర్గాలు ఊగిపోతున్నాయి.మరో వంకన టర్కీ కూడా తన నియంత్రణ ప్రాంతం పెంచుకోవాలనీ, ప్రాంతీయ పేరాశలను నెరవేర్చుకోవాలనీ ఉవ్విళ్లూరుతున్నది. కుర్దులపై దాడి చేసి వారి భూభాగాలు ఆక్రమించుకోవాలని ఎస్ఎన్ఎను పురికొల్పుతున్నది. స్వయం పాలక కుర్దిస్థాన్ కావాలంటూ కుర్దుల నుంచి వస్తున్న డిమాండువల్ల కలిగే ముప్పు లేకుండా చేసుకోవాలన్నది దాని కోర్కె. ఉత్తర సిరియాలో టర్కీ మద్దతుగల కుర్ద్ నాయకత్వంలోని దళాలు కేవలం మూడు రోజులలో రెండు వందల మందికి పైగా ప్రాణాలు తీసినట్టు మీడియా కథనాలు చెబుతున్నాయి.

పాక్షిక ఘర్షణలు తీవ్రం

సున్నీలు షియాలు, కుర్దులు, అలవైట్లు, డ్రూజ్‌లు, క్రైస్తవులు సిరియాలో జీవిస్తున్నారు. తమ ప్రయోజనాల కోసం పరస్పరం పోట్లాడుకునే తీవ్రవాద గ్రూపుల కారణంగా రానున్న రోజుల్లో పాక్షిక ఘర్షణలు తీవ్రమవడం తథ్యం. ఈ పరిస్థితి దిగజారి మరో అంతర్యుద్ధం మారేందుకు ఎంతైనా అవకాశముంది. అసద్ ప్రభుత్వ పతనం తర్వాత ఆశలు పెట్టుకున్న సిరియా ప్రజలకు అది హానికరమవుతుంది. మహ్మద్ అల్ బషీర్ ప్రధాన మంత్రిగా 2025 మార్చి వరకూ ఒక తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటును తీవ్రవాద బృందాలు ప్రకటించాయి. ప్రజలు ఐక్యంగా నిలవాలనీ తదనుగుణంగా తాను పాలన అంది స్తానని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. హెచ్‌టిఎస్ వంటి తీవ్రవాద బృందాల పాలనలోని దేశాలు, ప్రాంతాల అనుభవం రీత్యా అలాంటి వాగ్దానాలకు మనం ఏ మాత్రం నమ్మలేము.సిరియా భవిష్యత్తు ఎలా వుండాలనేది ఆ దేశ ప్రజలే నిర్ణయించుకోవాలి తప్ప ఎలాంటి బయటి శక్తుల ప్రభావం గానీ జోక్యం గానీ బెదిరింపులు గానీ వుండకూడదు. తమ మహాధిపత్య దురాశలను నెరవేర్చుకోవడానికి గాను సిరియాను ఒక రంగ స్థలంగా ఉపయోగించుకోవడానికి సామ్రాజ్యవాదానికి, యూదు జాత్యహంకారానికి అవకాశం ఇవ్వకూడదు.

> తన ఆక్రమణలోని గోలన్‌హైట్స్ సమీపంలో సిరియాతో గల మధ్యంతర ప్రాంతాన్ని ఇజ్రాయిల్ ఆక్రమించుకుంది. ఆ ప్రాంతాన్ని దాటి తమ సైన్యాలు సిరియా భూగాలలో ప్రవేశించాయని కూడా ఇజ్రాయిల్ అధికారికంగా ప్రకటించింది. ఇది మరోసారి ఐక్యరాజ్యసమితి తీర్మానాలను ఇజ్రాయిల్ పచ్చిగా ఉల్లంఘించడమే. సిరియాలో సాధ్యమైనంత ఎక్కువ భూభాగం ఆక్రమించి గ్రేటర్ ఇజ్రాయిల్ ఏర్పాటు చేయాలని కరుడుగట్టిన యూదు జాత్యహంకార మితవాద వర్గాలు ఊగిపోతున్నాయి. మరో వంకన టర్కీ కూడా తన నియంత్రణ ప్రాంతం పెంచుకోవాలనీ, ప్రాంతీయ పేరాశలను నెరవేర్చుకోవాలనీ ఉవ్విళ్లూరుతున్నది. కుర్దులపై దాడి చేసి వారి భూభాగాలు ఆక్రమించుకోవాలని ఎస్ఎన్ఎను పురికొల్పుతున్నది.

(డిసెంబరు 11 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

పుస్తకం భావితరాలకు ఆదర్శం

- హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి
- హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ యాకూబ్ షేక్, సెక్రెటరీ ఆర్. శ్రీనివాస్ (వాసు)
- నేడు బుక్ ఫెయిర్‌ను ప్రారంభించనున్న మంత్రులు



నవతెలంగాణ - ముషీరాబాద్

పుస్తక పఠనం భావితరాలకు ఆదర్శమని, తేజోమదనానికి నిదర్శనమని హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ యాకూబ్ షేక్, సెక్రెటరీ ఆర్. శ్రీనివాస్ (వాసు) అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రారంభమవుతున్న సందర్భంగా బుధవారం ఎన్టీఆర్ స్టేడియంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బుక్ ఫెయిర్ అధ్యక్షులు డాక్టర్ యాకూబ్ షేక్, సెక్రెటరీ ఆర్ శ్రీనివాస్ (వాసు), తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ.. 37 సంవత్సరాలుగా హైదరాబాద్ బుక్ ఫెయిర్ ద్వారా పుస్తకాలను విస్తృతంగా సమాజంలోకి తీసుకెళ్తూ తద్వారా అద్భుతమైన సమాజాన్ని నిర్మించడానికి ప్రయత్నం చేస్తున్నదన్నారు. పుస్తకాలను అచ్చు వేయడం, అమ్మడం అంటే మిగిలిన అన్ని రంగాల కంటే ఎక్కువగా సమాజ హితం కోరుకునేదని తెలిపారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనంపై మక్కువ పెంచుకోవాలని, పుస్తక జ్ఞానాన్ని అవలంబించుకోవాలన్నారు. బుక్ ఫెయిర్‌లో బాల సాహిత్యం నుంచి ఢిల్లీ సాహిత్యం వరకు ఎన్నో అద్భుతమైన పుస్తకాలు ఈ బుక్ ఫెయిర్‌లో పొందుపరచనున్నట్టు తెలిపారు. ఇటువంటి బృహత్తరమైన కార్యక్రమానికి అనేక మంది మేధావులు, రాష్ట్ర ప్రభుత్వం అండదండలు ఉన్నాయన్నారు.

ఆర్ శ్రీనివాస్ (వాసు) మాట్లాడుతూ.. ఈ బుక్ ఫెయిర్‌లో అన్ని రకాల చరిత్రలకు సంబంధించిన పుస్తకాలు లభిస్తాయని, అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. బుక్ ఫెయిర్ ఈ నెల 19 నుంచి 29వ తేదీ వరకు ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పుస్తక ప్రదర్శనను గురువారం సాయంత్రం 5.00 గంటలకు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ ప్రారంభిస్తారని చెప్పారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 210 మందికిపైగా ప్రచురణకర్తలు, డిస్ట్రిబ్యూటర్లు పుస్తకాలను ప్రదర్శించనున్నట్టు వివరించారు. బుక్ ఫెయిర్ ప్రాంగణానికి దాశరథి కృష్ణమాచార్య, సభా కార్యక్రమాల వేదికకు బోయి విజయభారతి, పుస్తకాల ఆవిష్కరణ వేదికకు తోపుడుబండి పేర్లతో నామకరణం చేశామని తెలిపారు. సుమారు 350 స్టాళ్లను ఏర్పాటు చేశామని, అందులో 171 తెలుగు స్టాల్స్, 135 ఇంగ్లీష్, 17 గవర్నమెంట్ స్టాల్స్ ఉన్నట్టు చెప్పారు. రచయితలు సొంత రచనలు, ప్రచురణలను పాఠకులకు పరిచయం చేసుకునేందుకు ప్రత్యేకంగా రైటర్స్ స్టాళ్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాం, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, విశ్రాంత ప్రొఫెసర్ ఆచార్య రమా మేల్కోటేతో సలహా కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తెలంగాణ రుచులతో ఫుడ్ స్టాళ్లనూ ఏర్పాటు చేస్తున్నామని, పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నామన్నారు. మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. ఈ పుస్తక పండుగకు సకలం సిద్ధంగా ఉందని, పుస్తక ప్రియులు, విద్యార్థులు, ప్రజలు బుక్ ఫెయిర్‌ను సందర్శించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి నారాయణ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బాల్ రెడ్డి, శోభన్ బాబు, జాయింట్ సెక్రెటరీ సూరి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇక భూభారతితో ప్రతి ఎకరాకూ భద్రత

- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భూ భారతి చట్టం-2024 ద్వారా రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ భద్రత కల్పించడమే లక్ష్యంగా బిల్లును ప్రవేశపెడుతున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. అనుభవదారుని కాలాన్ని పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. ప్రతి రైతుకూ భూధార్ కోడ్ కేటాయిస్తామని ప్రకటించారు. సాదాబైనామాల దరఖాస్తులను పరిశీలించి చట్టబద్ధత కల్పిస్తామన్నారు. పార్ట్-బి భూముల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతి రెవెన్యూ గ్రామానికీ ఒక అధికారిని నియమిస్తామని ప్రకటించారు. వేలాది పుస్తకాలు చదివిన మేధావి తెచ్చిన ధరణి పోర్టల్లో లక్షల సమస్యలు వచ్చాయని, వేలాది మంది రైతులు ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 10,900 గ్రామాల్లోని రెవెన్యూ వ్యవస్థను ఒక్క కలం పోటుతో కుప్పకూల్చారని విమర్శించారు. గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాల దాకా వెళ్లిందని చెప్పారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్టు ధరణి పరిస్థితి తయారైందని అన్నారు. గత పాలకులు తెచ్చిన ఈ లోప భూయిష్ట చట్టం వల్ల భూ యజమానికి తెలియ కుండానే చేతులు దాటి కాళ్ల కింద నేల కదిలిపోయిందని విమర్శించారు.

బుధవారం అసెంబ్లీలో భూభారతి బిల్లును సభ ముందు పెట్టారు. అందులోని కీలకాంశాలను వివరించారు. లోపభూయిష్టంగా ఆర్ఓఆర్ చట్టం-2020 ఉందనీ, దాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తున్నామని చెప్పారు. దాని ద్వారా బాధితులు తమ సమస్యలు చెప్పుకున్నా.. పరిష్కారం చేసే మార్గం లేకుండా పోయిందన్నారు. లోపాల కారణంగా నాలుగు నెలలుగా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని తెలిపారు. 18 లక్షలా 26వేల ఎకరాలు పార్ట్ బీలో ఉన్నాయని, ఏ కారణం చేత ఈ భూమిని పార్ట్-బీలో పెట్టారనేది తెలియడం లేదని అన్నారు. ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు. భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ చట్టాన్ని రూపొందించామని స్పష్టం చేశారు. కొత్త చట్టం రూపకల్పనకు 18 రాష్ట్రాల్లోని ఆర్వోఆర్ చట్టాలను కమిటీ అధ్యయనం చేసిందనీ, చట్టం ముసాయిదాను 45 రోజుల పాటు పబ్లిక్ డొమైన్‌లో పెట్టామని చెప్పారు. ఎక్కడా భేషజాలకు పోకుండా మేధావులు, రెవెన్యూ నిపుణులతో పాటు హరీశ్‌రావు, వినోద్‌కుమార్, పలు రాజకీయ పార్టీల నేతలు ఇచ్చిన మంచి సలహాలను కూడా స్వీకరించామన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద రంగారెడ్డి జిల్లా యాచారం మండలం, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో తిరుమలగిరి మండలాలను ఎంపిక చేసి విస్తృతస్థాయిలో చర్చలు జరిపామన్నారు. ధరణి పోర్టల్‌లోని ఏవైనా మంచి విషయాలుంటే తీసుకుంటామనీ, ఎలాంటి భేషజాలకు వెళ్లబోమన్నారు. ఇప్పటి వరకు 22,23 సార్లు డ్రాఫ్టులు మార్చి బిల్లును ప్రవేశపెడుతున్నామని తెలిపారు.

ప్రత్యేక కమిటీ 33 జిల్లాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరించిందని చెప్పారు. పాసు బుక్కుల్లో ఉన్న భూములకు, పొజిషన్‌లో ఉన్న భూములకు తేడా కనుక్కోవడానికి చట్టంలో నిబంధనలు రూపొందించా మన్నారు. గ్రామ కంఠం, ఆబాదీ భూములకు పరిష్కారాలు ఈ కొత్త చట్టంలో ఉన్నాయ న్నారు. పొజిషన్‌కు, పాసుబుక్కులో ఉన్న భూ విస్తీర్ణ వ్యత్యాసాలను సరిచేసేందుకు సర్వే నిర్వహిస్తామన్నారు. మ్యుటేషన్‌పై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవో ఆధ్వర్యంలో అప్పీలేట్ అథారిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వారసత్వ ఆస్తుల అభ్యంతరాలపై అప్పిలేట్ అథారిటీకి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. క్రాస్ చెక్ చేసి మ్యూటేషన్ చేసే అధికారం ఆర్డీవోకి కొత్త చట్టంలో కల్పిస్తుందన్నారు. సభ్యుల నుంచి మంచి సూచనలు వస్తే ఈ బిల్లులో చేర్చడానికి తమకు ఎలాంటి బేషజాలు లేవని స్పష్టం చేశారు. ఎమ్మార్వో రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు.

ఆర్డీఓ, కలెక్టర్ అప్పీల్ అథారిటీగా ఉంటారన్నారు. ఆ తర్వాత అప్పీల్ చేసుకోవడానికి ఒక ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ దేశంలో భూ సంస్కరణలు తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని గుర్తు చేశారు. సాదా బైనామాల కింద 9.24 లక్షల దరఖాస్తులొచ్చాయనీ, వాటికింద అభ్యంతరాలు ఏవైనా ఉంటే తెలుపుకునే అవకాశం చట్టంలో కల్పించామని వివరించారు. ప్రతి ఏడాదీ జమా బందీ కార్యక్రమం నిర్వహించేలా చట్టంలో పొందుపరిచామని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకునేలా భూభారతి చట్టాన్ని రూపొందించినట్టు మంత్రి చెప్పారు. ప్రభుత్వ ఆస్తుల్ని, రికార్డుల్ని ఉద్దేశపూర్వకంగా ఎవరైనా తారుమారు చేస్తే సీసీఎల్ఏ ద్వారా రివిజన్ చేసుకునే ఆప్షన్‌ను ప్రభుత్వం ఈ చట్టంలో పొందుపర్చిందన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఆస్తుల్ని, రికార్డుల్ని తారుమారు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకునేలా నిబంధనలు పొందుపర్చామని వివరిం చారు. భూభారతితో పట్టాదారులు, అనుభవదారులు అభద్రతా భావానికి గురి కావాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. రెవెన్యూ రికార్డులు టాంపరింగ్ జరుగకుండా కంప్యూటర్ రికార్డులతో పాటు నిర్ణీత కాల వ్యవధిలో మాన్యువల్ కాపీని కూడా రెవెన్యూ కార్యాలయంలో భద్రపరుస్తారని వివరించారు.

ఆధార్ కార్డులాగా ప్రతి రైతుకూ భూధార్ కార్డులను అందించనున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఒక్కో యజమానికి ఒక కోడ్ కేటాయిస్తామ న్నారు. దానిని స్కాన్ చేస్తే భూమికి సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. భూభారతి చట్టంలో భూధార్ అంశాన్ని చేర్చామని వివరించారు.

ప్రతి ఏటా జమాబందీ

గతంలో భూములకు సంబంధించి జమాబందీ నిర్వహించే వారని, ఇకపై ప్రతి ఏటా జమాబందీ నిర్వహించడం వల్ల రైతులకు తమ భూమి తమ స్వాధీనంలో ఉందనే నమ్మకం ఏర్పడుతుందని ఈవిషయాన్ని కూడా భూభారతి చట్టంలో చేర్చినట్టు మంత్రి పొంగులేటి చెప్పారు.

భూ భారతి ప్రత్యేకతలు

- ధరణిలో ఒక్కో సమస్యకు ఒక్కో మాడ్యూల్ ఉండేది. మొత్తం 33 మాడ్యూళ్లు ఉండేవి. ఏ మాడ్యూల్ ఏ సమస్యకు ఎంచుకోవాలో రైతులకు అర్థం అయ్యేది కాదు. ఇప్పుడు దాన్ని సులభతరం చేసేందుకు 33 మాడ్యూళ్లను 6కు కుదించడం జరిగింది.
- గతంలో మాన్యువల్ పహాణిలో 32 కాలాలుండేవి. వాటిని ధరణిలో ఒకే కాలంగా గత ప్రభుత్వం కుదించింది. ఇప్పుడు దాన్ని 11 కాలాలుగా రూపొందించారు.
- ధరణిలో భూ యజమానికి తమ భూమి రికార్డు వివరాలన్నీ కనిపించేవి కాదు. కొన్ని వివరాలను బహిర్గతం కాకుండా అప్పటి ప్రభుత్వ లాకర్లలో బంధించింది. ఇప్పుడు భూ-భారతి ఎవరైనా, ఎక్కడినుంచైనా తమ భూమి వివరాలను చూసుకునేలా డిస్‌ప్లే చేస్తుంది.
- ప్రభుత్వ భూములు అన్యాక్రాంతానికి గురికాకుండా ఎవరైనా ప్రభుత్వానికి తెలియజేయవచ్చు. ఆ భూములను రక్షించేందుకు చట్టం ప్రాధాన్యతనిస్తుంది.
- భూభారతిలో దరఖాస్తు చేసుకున్న భూ యజమానులకు దరఖాస్తు పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా వారి మొబైల్ నెంబర్‌కు అప్‌డేట్ సమాచారం చేరవేస్తుంది.

రాగిజావ మీద పడి విద్యార్థికి, వంట మనిషికి గాయాలు

సర్వేల్ గురుకుల పాఠశాలలో ఘటన





నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

అల్పాహారం కోసం వండిన రాగిజావను విద్యార్థులకు వడ్డించేందుకు తెస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడటంతో 8వ తరగతి విద్యార్థి శివరాత్రి సామేలు, వంట మనిషి ఇందిరకు గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాలలో జరిగింది. వివరాల్లోకెళ్తే.. సర్వేల్ గురుకుల పాఠశాలలో పెట్టిన మెనూ ప్రకారం నాలుగో వారంలో రాగి మాల్ట్ పెట్టాలి. వండిన రాగి జావను వంటగది నుంచి బయటకు తీసుకురావాలని డిప్యూటీ వార్డెన్ చెప్పారు. వంట గిన్నెను తీసుకొచ్చే క్రమంలో జారి పడటంతో విద్యార్థి శివరాత్రి సామేలు, వంట మనిషి ఇందిరకు గాయాలయ్యాయి. మరో ఇద్దరికి కూడా గాయాలైనట్టు సమాచారం.వారిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లకుండా ప్రిన్సిపల్ నిర్లక్ష్యం వహించారు. బాధితుల కుటుంబీకులే సామేలును హైదరాబాద్‌కు, వంట మనిషి ఇందిరను నల్లగొండకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. విద్యార్థి సామేలుకు తీవ్ర గాయాలవ్వడంతో నిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు చెప్పినట్టు తెలిసింది.

2026 నాటికి పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును 2026 డిసెంబర్ నాటికి పూర్తి చేయనున్నట్టు సాగునీటిశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 50 శాతం పనులనే పూర్తి చేసిందనీ, రూ.32 వేల కోట్లు ఖర్చు పెట్టగా, మరో రూ.33 వేల కోట్లు వెచ్చించాల్సి ఉందని తెలిపారు. బుధవారం శాసనమండలిలో బీఆర్ఎస్ సభ్యులు నవీన్ కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్దండపూర్ రిజర్వాయర్ వరకు ప్రాజెక్టు 18 ప్యాకేజీ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రధాన కాండ్యూట్ పనుల్లో నాలుగు దశల వరకు అప్రోచ్ ఛానళ్లు, బహిరంగ కాలువ, సొరంగాలు, పంప్‌హౌజ్‌లు, రిజర్వాయర్లు ఉంటాయన్నారు. ఒకటో దశ పంపింగ్ స్టేషన్ ఒకటో యూనిట్‌ను గతేడాది సెప్టెంబర్ 16న విజయవంతంగా ప్రారంభించారని తెలిపారు. 2, 3, 4వ దశ పంపింగ్ స్టేషన్లు దాదాపు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 12.30 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం న్యూఢిల్లీలోని సీడబ్ల్యూసీ, ఎంఓఇఎఫ్, సీసీ నుంచి అవసరమైన క్లియరెన్సులు, ఆమోదాలు ప్రాసెస్‌లో ఉన్నాయని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్లియరెన్సులు, ఆమోదాలపై శ్రద్ధ పెట్టలేదని తెలిపారు.

నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని ప్రారంభించి 5 రిజర్వాయర్లు పూర్తి చేశారని చెప్పారు. దాదాపు 90 శాతం పూర్తి చేసినా మిగిలిన 10 శాతం పూర్తి చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. భూములను ఎండబెడితే లాక్కోవచ్చనేదే వారి కుట్ర అని ఆరోపించారు. దీంతో ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఏ మాత్రం అవగాహన లేకుండా ఏది పడితే అది మాట్లాడొద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఈ ఏడాది సాగునీటికి రూ.22,500 కోట్లు కేటాయిస్తే అందులో రూ.4,500 కోట్లు ఈ ప్రాజెక్టుకు కేటాయించామంటే ఎంత ప్రాధాన్యతనిచ్చామో తెలుసుకోవాలని సూచించారు.

కొడంగల్-నారాయణ్‌పేట్ ప్రాజెక్టుకు సంబంధించిన ఉత్తర్వులు తెలంగాణ ఏర్పడక ముందే వచ్చాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ఎలక్షన్స్‌కు ముందు ఒక్క పంప్‌హౌజ్‌ను ప్రారంభించి ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేదని విమర్శించారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ జూరాల నుంచి ఎత్తిపోతల మొదట నారాయణపేటకు ఇవ్వాలనుకున్నా, దాన్ని శ్రీశైలంకు మార్చడంతో పడమటి భాగానికి ఇచ్చే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. బీఆర్ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఎందుకు ఆపలేదని ప్రశ్నించారు. అక్కడ పని చేసిన అధికారి ఆదిత్యదాస్‌నాథ్‌ను ఎలా సలహాదారుగా పెట్టుకున్నారని నిలదీశారు. అనుమతుల కోసం ఆగితే పాలమూరు ప్రాజెక్టు వచ్చేదా? నీళ్ల కోసం తెలంగాణ ప్రజల ఆకాంక్ష తీరేదా? అని ప్రశ్నించారు.

ఉత్తమ్ బదులిస్తూ, గతంలో కేంద్రం స్థాయిలో ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తే మాజీ సీఎం కేసీఆర్ వెళ్లకుండా నిర్లక్ష్యం చేయడమే ఆ ప్రాజెక్టు రావడానికి కారణమ ని తెలిపారు. నిర్లక్ష్యం, కుట్రే ఆ ప్రాజెక్టు రావడానికి కారణమన్నారు.

సీఎం , మంత్రి శ్రీధర్ బాబుపై ఎమ్మెల్సీ కవిత ప్రివిలేజ్ నోటీసులు

శాసన మండలి చైర్మెన్ సుఖేందర్ రెడ్డికి అందజేత



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు సంబంధించి సభకు తప్పుడు సమాచారం ఇచ్చారంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రివిలేజ్ నోటీసులు ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్సీలతో కలిసి శాసన మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఎమ్మెల్సీ కవిత నోటీసులను అందించారు. మంగళవారం శాసన మండలి ప్రశ్నోత్తరాల సమయంలో మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు సంబంధించి తాను అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున పరిశ్రమలు ,ఐటీ ,శాసన సభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమాధానమిస్తూ డీటెయిల్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)తయారు కాలేదనీ, ప్రపంచ బ్యాంకు నుంచి ఎలాంటి సాయాన్ని అభ్యర్థించలేదని చెప్పారని గుర్తు చేశారు. అయితే ప్రపంచ బ్యాంకు కు రాష్ట్రప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టు కోసం ఈ ఏడాది సెప్టెంబర్ 19న రూ.4,100 కోట్ల రూపాయల సాయాన్ని అభ్యర్థించిందనీ, ప్రాజెక్టుకు డీపీఆర్ ఉందని స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. కానీ సభలో మాత్రం ఈ విషయం చెప్ప కుండా మంత్రి దాచివేశారని వివరించారు. అంతేకాకుండా, ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని కలిసిన సందర్భంలోనూ సీఎం రేవంత్ రెడ్డి మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు రూ.14 వేల కోట్ల కేటాయించాలని కోరారని పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంక్‌కు ,కేంద్ర ప్రభుత్వానికి మూసీ ప్రాజెక్టు పై డీపీఆర్ గురించి ఓ రకంగా ,శాసన మండలికి మరో రకంగా చెప్పడం ద్వారా సీఎం రేవంత్ రెడ్డి ,మంత్రి శ్రీధర్‌బాబు శాసన మండలిని అవమానపరిచారని తెలిపారు. కాబట్టి శాసన మండలి నియమావళి 168 (ఏ)కింద వెంటనే సీఎం రేవంత్ రెడ్డి ,మంత్రి శ్రీధర్‌బాబుల పై సభా హక్కుల ఉల్లంఘన నోటీసుల కింద చర్చకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆమె శాసనమండలి మీడియా పాయింట్‌లో మాట్లాడారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్‌లు ఉన్నాయని ప్రపంచ బ్యాంకుకు రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనల పత్రాలున్నాయని చెప్పారు. తమ వద్ద నిర్దిష్టమైన ఆధారాలున్నాయనీ, సభలోనే చెప్పినట్టు ఆమె గుర్తుచేశారు. పదేండ్లలో బీఆర్ఎస్ రుణం కోసం ప్రపంచబ్యాంకును ఆశ్రయించలేదని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో పేద ప్రజల నుంచి భూములు లాక్కొని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టి రియల్ ఎస్టేట్ చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రపంచ బ్యాంకుకు పంపించిన పత్రాల్లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ ప్రాజెక్టు కోసమని ఉంటే, మంత్రి శ్రీధర్ బాబు మాత్రం మురుగునీటి శుద్ధికి సంబంధించి కోరామని తెలిపారన్నారు. రియల్ ఎస్టేట్, ల్యాండ్ పూలింగ్ చేసి పెద్ద పెద్ద భవంతులు కడుతామని ప్రతిపాదనల్లో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొన్నట్టు చెప్పారు. ప్రపంచ బ్యాంకుకు ప్రతిపాదనలు పంపిన తర్వాత అక్టోబరులో డీపీఆర్ తయారీకి కన్సార్టియంను ప్రభుత్వం నియమించిందని వెల్లడించారు. ఎందుకోసం అబద్దాలు చెబుతున్నారనీ, ఎవరి కోసం ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కవిత నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి, ప్రపంచ బ్యాంకుకు, అసెంబ్లీకి, పేద ప్రజలకు వేర్వేరు మాటలు చెబుతోందని విమర్శించారు.మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజల్లో భయానక పరిస్థితి నెలకొందని, 15 వేల ఇళ్లకు మార్కింగ్ చేయడం వల్ల తమ ఇళ్లను ఎప్పుడు కూల్చుతారో అన్న భయం వారిలో నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు పునరావాసం ఎక్కడ కల్పిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేయబోయే రియల్ ఎస్టేట్ లో నిర్వాసితులకు ఏం వస్తుందో ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికను వెల్లడించాలని సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌తో అసెంబ్లీ హీట్

(మొదటిపేజీ తరువాయి)

కూలిపోయే కాళేశ్వరం కట్టినవ్. బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోడ్లు వేయ చేతకాలేదు. ఆర్ఆర్‌ను 30 ఏండ్లకు అమ్ముకున్నారు' అంటూ మంత్రి వెంకటరెడ్డి కామెంట్ చేశారు. తన ఇన్నేండ్ల కాలంలో ఒక్క రూపాయి కూడా లంచం తీసుకోలేదన్నారు. మామ చాటు అల్లుడైన హరీశ్‌రావు కాళేశ్వరం మీద రూ.10 వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. తన గురించి ఆయన మాట్లాడేది ఏంది? అన్నారు. ప్రశ్న వరకే మంత్రి పరిమితం కావాలని స్పీకర్ సూచించారు.

సుద్దులు మాకే కాదు..అందరికీ చెప్పండి శ్రీధర్‌బాబు : హరీశ్‌రావు

మంత్రి శ్రీధర్‌బాబు అంగిపట్టి లాగుతున్నా...మరోమంత్రి శ్రీనివాస్‌రెడ్డి కూర్చోమని చెబుతున్నా వెంకటరెడ్డి మాత్రం తగ్గడం లేదని హరీశ్‌రావు చురకలు అంటించారు. ఇప్పుడే సభ్యులపై అనవసరమైన వ్యాఖ్యలు చేయొద్దని శ్రీధర్‌బాబు తమకు చెప్పారన్నారు. సుద్దులు తమకే కాదు..అందరికీ చెప్పాలని సూచించారు. మంత్రి వ్యాఖ్యల్ని రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తనపై కమీషన్ల ఆరోపణలు చేసిన కోమటిరెడ్డి తీసుకున్న కమీషన్ల చిట్టా ఇప్పుతానన్నారు. తనపై చేసిన ఆరోపణలపై చర్చించేందుకు సిద్ధమేనా? అని అడిగారు. అసెంబ్లీ బయట సభ్యులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేయించాలని సభాపతికి హరీశ్‌రావు సూచించారు. కొందరు సభ్యులు తాగొచ్చి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నట్టు ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

హరీశ్‌రావు సభాసాక్షిగా క్షమాపణ చెప్పాలి : మంత్రి పొంగులేటి

హరీశ్‌రావు సభ్యుల పట్ల చాలా బాధాకరమైన వ్యాఖ్యలు చేయడం సభ్యత కాదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడటం సరిగాదన్నారు. అభ్యంతరకర పదాలు వాడిన హరీశ్‌రావు సభాసాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో మాట్లాడేందుకు యత్నించిన కోమటిరెడ్డి వెంకటరెడ్డిని వారించి కూర్చోబెట్టారు.

ప్రజాస్వామ్యయుతం నడపండి : శ్రీధర్‌బాబు

శాసనసభ రూల్స్‌కు విరుద్ధంగా ఎవరు వెళ్లినా సరిగాదని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. అనవసర వ్యాఖ్యల్ని తప్పకుండా రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌కు సూచించారు. ప్రజాస్వామ్యయుత పద్ధతిలో సభను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.

మామ గుర్తొచ్చి మాట్లాడినట్టున్నాడు : విప్ బీర్ల అయిలయ్య

తమ మామ గుర్తొచ్చి ప్రతిపక్ష నాయకుడి గురించి హరీశ్‌రావు మాట్లాడినట్టున్నాడని విప్ బీర్ల అయిలయ్య ఎద్దేవా చేశారు. ఫామ్‌హౌస్‌లో తాగి పండుకునేవాళ్లు తమ ప్రభుత్వం గురించి మాట్లాడటం సరిగాదంటూ అగ్గికి ఆజ్యం పోశారు. తాగి హెలికాప్టర్ దిగే సమయంలో ఎవరు తూలిపడ్డారో ప్రజలకు తెలుసునని వ్యాఖ్యానించారు. అగ్గిపెట్టి హరీశ్‌రావు డ్రామాలాడారనీ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాత్రం తెలంగాణ కోసం తన మంత్రి పదవిని త్యాగం చేసిన వ్యక్తి అని అన్నారు.

హరీశ్‌రావు, అయిలయ్య వ్యాఖ్యలను తొలగిస్తున్నాం కోమటిరెడ్డి మాటల్ని పరిశీలించి తీసేస్తాం : స్పీకర్

సభ్యులు హుందాగా నడుచుకోవాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ సూచించారు. హరీశ్‌రావు, బీర్ల అయిలయ్య చేసిన వ్యాఖ్యలను తొలగిస్తున్నట్టు ప్రకటించారు. కోమటిరెడ్డి మాటల్ని పరిశీలించి అభ్యంతరకరమైన మాటల్ని తొలగిస్తామని హామీనిచ్చారు. ఇంతటితో దీన్ని ఆపేస్తున్నామన్నారు. సమయం లేదు కాబట్టి బిల్లులపై చర్చ మొదలవుతుందని ప్రకటించారు.

60 దాటితే ఉచిత వైద్యం

ఆయుష్మాన్ భారత్‌కు పోటీగా ఆమ్‌ఆద్మీ ఎన్నికల హామీ



న్యూఢిల్లీ : ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో విజయంపై దృష్టి సారించిన ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రజలపై హామీల జల్లులు కురిపిస్తోంది. అరవై సంవత్సరాల వయసు దాటిన సీనియర్ సిటిజన్లు అందరికీ ప్రభుత్వ, ప్రయివేటు ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యాన్ని అందిస్తామని ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బుధవారం ప్రకటించారు. ఈ కొత్త పథకానికి 'సంజీవని యోజన' అని పేరు పెట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎం-జేఏవై)కి పోటీగా ఆమ్‌ఆద్మీ ఈ పథకాన్ని ముందుకు తెచ్చింది.

'రామాయణంలో లక్ష్మణుడు అనారోగ్యానికి గురైనప్పుడు హనుమంతుడు సంజీవనిని తెచ్చి కాపాడాడు. ఇప్పుడు మీ కుమారుడు కేజ్రీవాల్ మీ కోసం సంజీవనిని తీసుకొచ్చాడు. ఈ పథకం కింద 60 సంవత్సరాలు దాటిన వారందరికీ ఉచిత వైద్యం. అది ప్రభుత్వ ఆస్పత్రి అయినా...ప్రైవేటు ఆస్పత్రి అయినా వైద్యం ఉచితమే. మేము తిరిగి అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని ప్రారంభిస్తాం' అని కేజ్రీవాల్ చెప్పారు. వైద్య ఖర్చులకు పరిమితి కానీ, గరిష్ట వయోపరిమితి కానీ ఉండవని తెలిపారు. ధనికుడైనా, పేద అయినా వైద్యం ఉచితమేనని అన్నారు. చికిత్సకు అయ్యే పూర్తి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని కేజ్రీవాల్ హామీ ఇచ్చారు.

నేను ఆటబొమ్మను కాను

- అజిత్ పవార్‌పై ఛగన్ కస్సుబుస్సు
- తన మాటకు పార్టీలో విలువే లేదని ఆవేదన

ముంబయి : మహారాష్ట్రలో ఏర్పడిన మహాయుతి 2.0 ప్రభుత్వంలో తనకు చోటు దక్కకపోవడంపై ఎన్సీపీ సీనియర్ నేత ఛగన్ భుజబల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'నన్ను క్యాబినెట్‌లోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి ఫడ్నవీస్ పట్టుపట్టారు. నాకు ఆ సమాచారం కూడా అందింది. బీజేపీలో దేవేంద్ర ఫడ్నవీస్, శివసేనలో ఏక్‌నాథ్ షిండే ఎలా నిర్ణయాలు తీసుకుంటారో ఎన్సీపీలో అజిత్ పవార్‌దే తుది నిర్ణయం' అంటూ అజిత్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆడుకోవడానికి, ఆడించడానికి తానేమీ ఆటబొమ్మను కానని స్పష్టం చేశారు.

పార్టీలో తన అభిప్రాయాలకు విలువ ఇవ్వకపోవడంపై ఛగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇతర పార్టీలలో ఉన్నప్పుడు నిర్ణయాలు తీసుకునే సమయంలో నేను నా అభిప్రాయాలు చెప్పే వాడిని. శివసేనలో ఉన్నా, కాంగ్రెస్‌లో ఉన్నా, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో ఉన్నా చెప్పాలనుకున్నది చెప్పే వాడిని' అని అన్నారు. అవిభక్త ఎన్సీపీలో ఛగన్ అత్యంత సీనియర్ నేత. ఎన్సీపీ చీలిక సమయంలో ఆయన అజిత్ పవార్ వైపు వచ్చారు. శరద్ పవార్ తన రాజకీయ గురువు అయినప్పటికీ అజిత్‌తోనే నడిచారు. ఛగన్‌ను ఎన్సీపీలోకి తీసుకొచ్చి మహారాష్ట్ర పార్టీ శాఖకు అధ్యక్షుడిని చేసింది శరద్ పవారే. ఛగన్ రెండుసార్లు మహారాష్ట్రకు ఉప ముఖ్యమంత్రి అయ్యారు. 'నిర్ణయం తీసుకునే ముందు పార్టీలో చర్చ జరిగేది. బీజేపీ జాబితాపై కూడా ఢిల్లీలో చర్చించే వారు. శరద్ పవార్ కూడా మమ్మల్ని సంప్రదించే వారు. కానీ ఇక్కడ ఏం జరుగుతుందో చివరి వరకూ ఎవరికీ తెలీదు. ఎన్సీపీని కేవలం ముగ్గురు నేతలు...అజిత్ పవార్, ప్రఫుల్ పటేల్, సునీల్ తత్కరే...మాత్రమే నడుపుతున్నారు. నిర్ణయాలలో మా ప్రమేయం ఏమీ ఉండదు. ఎన్నికల్లో టిక్కెట్లు ఇవ్వడం మొదలు మంత్రులు, శాఖల నిర్ణయం వరకూ మా మాటకు విలువే లేదు' అని ఛగన్ వాపోయారు

రైలు పట్టాలపై అన్నదాత

(మొదటిపేజీ తరువాయి)

ఎంఎస్పీ ఇవ్వాలని కేంద్రాన్ని రైతులు డిమాండ్ చేస్తున్నారు. 101 మంది రైతులు డిసెంబర్ 6,8,14వ తేదీల్లో ఢిల్లీలో ప్రవేశించేందుకు ప్రయత్నించారు. కానీ, ఆ ప్రయత్నాలను హర్యానా భద్రతా దళాలు అడ్డుకున్నాయి.పంటలకు ఎంఎస్పీతో పాటు రుణమాఫీ, పెన్షన్, విద్యుత్తు ధరల తగ్గింపు, పోలీసు కేసుల ఎత్తివేత లాంటి డిమాండ్లపై రైతులు పోరాడుతున్నారు.

రైతుల కోసం తలుపులు తెరిచే ఉంటాయి : సుప్రీంకోర్టు

ఎంఎస్పీ చట్టబద్ధమైన హామీ కోసం హర్యానా రైతుల నిరసనల నేపథ్యంలో పంజాబ్ ప్రభుత్వం అన్నదాతలతో పలుమార్లు చర్చించింది. అలాగే, పంజాబ్ ప్రభుత్వం రైతుల డిమాండ్ల సాధనకు అత్యున్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. అయితే ఆ కమిటీతో చర్చించేందుకు రైతులు తిరస్కరించారు. రైతుల ఆందోళనల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ విషయంపై తాజాగా స్పందించింది. బుధవారం రైతుల డిమాండ్లు, సూచనల కోసం కోర్టు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని స్పష్టం చేసింది. "రైతుల డిమాండ్ల సాధన కోసం నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్‌తో పలుమార్లు సమావేశాల్లో చర్చించాము. అయినప్పటికీ, రాష్ట్ర అత్యుతన్నత కమిటీతో చర్చించేందుకు రైతులు తిరస్కరించారు" అని పంజాబ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈనెల 17న కమిటీ.. రైతులతో చర్చించేందుకు ఆహ్వానించింది. అయినప్పటికీ, రైతులు ఆ కమిటీ అధికారులతో చర్చలకు రాలేదని పంజాబ్ ప్రభుత్వం తరఫు న్యాయవాది జనరల్ గుర్మీందర్ సింగ్ కోర్టుకు తెలిపారు. రైతులను ఒప్పించే ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ వారి ఫిర్యాదులను కోర్టుకు తీసుకురావడానికి బదులుగా వారిని నిర్బంధించకుండా అనుమతించాలని సింగ్ సిఫారసు చేశారు.

సింగ్ సూచనకు సూర్యకాంత్, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం స్పందించింది. "రైతులు నేరుగా లేదా వారి ప్రతినిధి ద్వారా ఏదైనా సూచన లేదా డిమాండ్‌కు కోర్టు తలుపులు ఎల్లప్పుడూ తెరిచి ఉంటాయని స్పష్టం చేస్తున్నాము" అని ఈ బెంచ్ తెలిపింది. ఈ సందర్భంగా నిరహార దీక్ష చేస్తున్న దల్లేవాల్ ఆరోగ్యాన్ని పరిశీలించాలనీ, ఆయనకు ఆలస్యం చేయకుండా వైద్య సహాయమందించాలని పంజాబ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. రైతు నేత దల్లేవాల్ గతంలో వైద్య సహాయాన్ని నిరాకరించారు. ఆయన ఆరోగ్యాన్ని 24 గంటలూ పర్యవేక్షించేందుకు పాటియాలాలోని రాజింద్ర ప్రభుత్వాత్రికి వైద్య నిపుణుల బృందాన్ని ప్రభుత్వం నియమించింది.

సీఎం వద్ద యాదాద్రి పాలకమండలి ఏర్పాటు ఫైలు

- మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

యాదాద్రి దేవాలయం పాలకమండలి ఏర్పాటుకు సంబంధించిన ఫైలు సీఎం వద్ద ఉన్నదని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. బుధవారం ధూప దీప నైవేద్యానికి సంబంధించి బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. అర్చకులు రూ.10 వేలతో బతుకుతారని బీఆర్ఎస్ సభ్యురాలు వాణిదేవి ప్రశ్నించగా, 2023లో పెంచినప్పుడే బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అడగాల్సిందని మంత్రి బదులిచ్చారు. దేవాలయాలకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నామని మంత్రి తెలిపారు.

కేంద్రం సవరణ చేయకే హుక్కా పార్లర్లు కొనసాగింపు :మంత్రి పొన్నం ప్రభాకర్



కేంద్రం సవరణ చేయకపోవడ, కోర్టు నుంచి అనుమతి తెచ్చుకుని నిర్వహకులు హుక్కా పార్లర్లు నడుపుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. పదేండ్లు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపకపోవడంతోనే అది గ్రామీణ స్థాయికి పాకిందని విమర్శించారు. బుధవారం శాసనమండలిలో పబ్‌లో మత్తుమందుల అక్రమ రవాణాపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఎవ్వరి బంధువులున్నా వదిలేది లేదనీ, డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుదుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

గ్యాస్ సబ్సిడీ అడ్వాన్స్‌గా ఇవ్వదానికే కేంద్రం అంగీకరించలేదు :మంత్రి ఉత్తమ్



రాష్ట్రంలో పేద ప్రజలకు రూ.500కే గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నందుకు ప్రభుత్వాన్ని పలువురు సభ్యులు అభినందించారు. అయితే ఆపై మొత్తాన్ని వినియోగదారులు చెల్లించిన తర్వాత ఖాతాల్లో వేయడం కాకుండా ముందుగానే కంపెనీలకు అడ్వాన్స్‌గా ఇస్తే బాగుంటుందని సూచించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, ఆయిల్, గ్యాస్ కంపెనీలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయనీ, ఇప్పటికే ఆ దిశగా కేంద్ర మంత్రిని హర్దీప్ సింగ్, అధికారులను కలిసినా అంగీకరించలేదని తెలిపారు.

సీఎం, మంత్రులుగా కలిశాం :డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



రాష్ట్ర ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి, ఆయా శాఖల మంత్రులుగా కేంద్ర మంత్రులను కలిసి నిధులు రాబడుతున్నామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. బుధవారం శాసనమండలిలో కేంద్రం నుంచి వివిధ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వానికి అందిన నిధులపై బీఆర్ఎస్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఈ ఏడాది జనవరి వివిధ పథకాలు, కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలు, ఇతరాల కోసం రూ.35,400 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. కావాలంటే పదేండ్లపాటు రూ.2,53,113 కోట్లు ప్రతిపాదనలు పెట్టి రూ.85,941 కోట్లు మాత్రమే తెచ్చారని తెలిపారు. దీంతో కవిత కాంగ్రెస్, బీజేపీ మధ్య స్నేహంతోనే తెచ్చారనీ, తాము వైరం పెట్టుకున్నామని వ్యాఖ్యానించారు. దీంతో భట్టి మంత్రులుగా కలిసి నిధులు తెస్తున్నామని స్పష్టం చేశారు. సమాఖ్య వ్యవస్థలో ఉన్నామని గుర్తుచేశారు.

50 ఏండ్ల నిధుల వివరాలివ్వాలని బీఆర్ఎస్ సభ్యులు రవీందర్ రావు కోరగా, వాటిని కూడా బయటపెడతామని స్పష్టం చేశారు.

కొత్త సంవత్సర వేడుకలపై ప్రత్యేక నిఘా పెట్టండి

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి.కమలాసన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కొత్త సంవత్సర వేడుకల్లో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్, డ్రగ్స్, గంజాయి వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి. కమలాసన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధికారులు, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో బుధవారం హైదరాబాద్‌లోని అబ్కారీ భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైళ్లు, ట్రావెల్ బస్సులను ముమ్మరంగా తనిఖీలు చేయాలని సూచించారు. కమర్షియల్ ఫంక్షన్ హాళ్లు, కన్వేన్స్ హాళ్లలో నిర్వహించే వేడుకలపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ నెల 20 నుంచి జనవరి మొదటి వారం వరకు ఉద్యోగులు సెలవులు పెట్టకుండా నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ క్రయవిక్రయాలు లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్లు ఖురేషి, కేఏబి శాస్త్రీ, డిప్యూటి కమిషనర్ పి. దశరథ్, అడిషనల్ ఎస్పీ భాస్కర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌ను అవమానించిన అమిత్ షా

- ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- నేడు దిష్టిబొమ్మల దహనం : కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను పార్లమెంటు సాక్షిగా అవమానించారనీ, ఆయన తన మనువాద ఆలోచనలను బయట పెట్టుకున్నారని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) పేర్కొన్నది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమిత్ షా అంబేద్కర్ పట్ల ఆర్ఎస్ఎస్, బీజేపీకి ఉన్న అవగాహనను వ్యక్తం చేశారని తెలిపారు. తద్వారా అట్టడుగు వర్గాల పట్ల వారి వైఖరిని చెప్పారని పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలకు నిరసనగా గురువారం అమిత్‌షా దిష్టిబొమ్మలు దహనం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

21న వికలాంగుల సాంస్కృతిక ఉత్సవాలు

- ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డిసెంబర్ 3న ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల రాష్ట్ర స్థాయి సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా గత పదేండ్లుగా ప్రతి ఏటా వికలాంగుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వికలాంగులైన కళాకారులను ప్రోత్సహించడంలో పాలకులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. వికలాంగులతో ఆటా పాట, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం మూలంగా వారిలో వైకల్యం శరీరానికే తప్ప ప్రతిభకు కాదనే విషయాన్ని కళాకారులు నిరూపిస్తున్నారని తెలిపారు. అవకాశాలు కల్పిస్తే వారు ఏదైనా సాధిస్తారని గుర్తు చేశారు. సకలాంగులైన కళాకారులకు ఇస్తున్న ప్రాధాన్యత వికలాంగులైన కళాకారుల కు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూచిపూడి, భరతనాట్యం, బతుకమ్మ, బోనాలు, మిమిక్రీ, డ్యాన్స్, జానపద గేయాలు, వీల్ చైర్ డ్యాన్స్, కోలాటం వంటి కళాప్రదర్శనలు ఉత్సవాల్లో ప్రదర్శించనున్నట్టు తెలిపారు. సాంస్కృతిక సారధిలో వికలాంగులకు సమాన అవకాశాలు కల్పించాలనీ, కళాకారులైన వికలాంగులకు సాంస్కృతిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాంస్కృతిక సారథి ఉద్యోగాల్లో వికలాంగులకు ఐదు శాతం ఉద్యోగాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- పని భారం తగ్గించాలని డిమాండ్ : తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి
- జగిత్యాలలో భారీ ర్యాలీ
- సిరిసిల్లలో ఆశాల బస్సు జాతాకు ఘనస్వాగతం



నవతెలంగాణ - సిరిసిల్ల/ జగిత్యాలటౌన్

ఫిబ్రవరిలో జరిగే బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో ఆశాలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15 నుంచి యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుజాతా బుధవారం సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లో కొనసాగింది. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద బస్సుజాతా బృందానికి పెద్ద ఎత్తున ఆశావర్కర్లు స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి గాంధీ చౌక్ మీదుగా పద్మశాలి కల్యాణ భవనం వరకు పెద్ద ఎత్తున బతుకమ్మ బోనాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పద్మశాలి కల్యాణ భవనంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు బదవేని మంజుల అధ్యక్షతన జరిగిన బహిరంగ సభ నిర్వహించారు. అక్కడి నుంచి మధ్యాహ్నం జగిత్యాల జిల్లా కేంద్రానికి యాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా జగిత్యాల కొత్త బస్టాండ్‌లోని అంబేద్కర్ చౌరస్తా నుంచి దేవిశ్రీ గార్డెన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి మమత అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల, జగిత్యాలలో జరిగిన సభల్లో తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ఎం పథకంలో భాగంగా 19 ఏండ్ల నుంచి రాష్ట్రంలో ఆశా వర్కర్లు పనిచేస్తున్నారని, కానీ ప్రభుత్వం ఆశాలకు చెల్లించేది పారితోషికం మాత్రమేనని అన్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకు పనిలో ఉండాలని, లేకపోతే పారితోషకాలు తగ్గించి రాస్తామని ఆశాలను అధికారులు బెదిరిస్తున్నారన్నారు. ఆశా వర్కర్ల పనికి ప్రతిఫలం లేనందున వారు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు తీవ్రమైన పని భారం పెరిగి అనేకమంది చనిపోతున్నారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆశా వర్కర్ల పనిని గుర్తించి పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.18వేలు వేతనం నిర్ణయించాలని, ఉద్యోగ భద్రతతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బస్సు జాతా బృంద సభ్యులు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నీలాదేవి, కోశాధికారి గంగమణి, ఉపాధ్యక్షులు ఆర్.సాధన, రాష్ట్ర సహాయ కార్యదర్శి సునీత, పద్మ, రాష్ట్ర నాయకులు బాలమణి, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, జిల్లా ఉపాధ్యక్షులు మూషం రమేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ సూరం పద్మ, యూనియన్ జిల్లా నాయకులు దివ్య, పద్మ, వనిత, రాధ, ప్రమిల, దేవిక, వనిత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్లకు న్యాయం జరిగేలా చూస్తాం





- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- విద్యార్హతను బట్టి కన్వర్షన్‌ను ఇవ్వాలి :తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ చైర్మెన్ ఈశ్వర్ రావు

నవతెలంగాణ - ముషీరాబాద్

రాష్ట్ర ప్రభుత్వంతో ప్రత్యేకంగా చర్చించి విద్యుత్ ఆర్టిజన్‌లకు న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. బుధవారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. ఆర్టిజన్స్ కన్వర్షన్ అయ్యే విధంగా కృషి చేస్తామన్నారు. విద్యార్హతను బట్టి కన్వర్షన్ అయ్యే విధంగా కార్మికుల తరపున మాట్లాడతామని తెలిపారు. కార్మికులంటే తనకు ఎనలేని ప్రేమని విద్యుత్ ఉద్యోగస్తులు అధిక శాతం తనకే ఓట్లు వేశారని తెలిపారు. కేవలం పాల్వంచ నియోజకవర్గం కుర్తి ప్రాంతంలో 24 వేల మెజారిటీ ఇచ్చారన్నారు. గత ప్రభుత్వం 19 మంది విద్యుత్ ఉద్యోగస్తులు ఏరియర్స్ అడిగినందుకు నిర్దాక్షిణ్యంగా 18 మందిని ట్రాన్స్‌ఫర్లు, డిస్‌మిస్‌లు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పది నెలలు కష్టపడి అందరినీ వెనక్కి తీసుకువచ్చా మని అన్నారు. గత ప్రభుత్వం యూనియన్ నాయకుల పట్ల బెదిరింపులకు పాల్పడుతూ హక్కులను ప్రశ్నించే వారిని డిస్మిస్ చేసిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంతో కార్మికుల సమస్యలపై ప్రత్యేకంగా చర్చిస్తామ న్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. జేఏసీ చైర్మెన్ ఈశ్వర్ రావు, కన్వీనర్ ఎంఏ వజీర్ మాట్లాడుతూ.. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ విద్యార్హత ను బట్టి ఇవ్వాలని, రెగ్యులర్ పోస్టుల్లోకి కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్స్ కన్వర్షన్ చేస్తే సంస్థపై ఆర్థిక భారం పడదన్నారు. 18 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని మాజీ సీఎం కేసీఆర్ ఉద్యమ సమయంలో హామీ ఇచ్చారని, కానీ ఆయన పదేండ్ల పాలనలో వారిని పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థలోని కార్మిక సంఘాలు కాంట్రాక్ట్ కార్మికులందరూ 2016లో ఉద్యమం చేయగా పర్మినెంట్ చేస్తానని చెప్పి 2017లో ట్రేడ్ యూనియన్ 12(3) ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్ 1947ప్రకారం అగ్రిమెంట్ చేసుకుని తమను విలీనం చేస్తూ ఆర్డర్ కాపీ ఇచ్చాయని తెలిపారు. ఈ విషయంలో కోర్టుకు వెళ్లగా 2018లో తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చారన్నారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసుకునే వెసులుబాటును విద్యుత్ సంస్థకు, రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తూ కోర్టు తీర్పు వచ్చిందన్నారు.

విద్యుత్ సంస్థలో 2367 మందిని పర్మినెంట్ చేశామని సీఎం అసెంబ్లీలో చెప్పారని, ఆ తర్వాత విద్యుత్ సంస్థ యాజమాన్యం పూర్తి స్థాయిలో పర్మినెంట్ చేయకుండా మొదటి ఆర్డర్‌ను రద్దు చేసి కొత్త ఫ్యాక్టరీ చట్టం 1946 స్టాండింగ్ ఆర్డర్ సర్వీస్ రూల్స్ తెర పైకి తీసుకొచ్చి పర్మినెంట్ చేయలేదన్నారు. విద్యుత్ సంస్థల లెక్కల ప్రకారం ఇప్పటికీ తాము ఔట్ సోర్సింగ్ కార్మికుల మేన ని, రిటైర్మెంట్ అయితే గ్రాట్యూటీ లేదని, రిటైర్డ్ అయిన క్షణం నుంచి ఉపాధి లేక కుటుంబ పోషణకు కూలీలు గా మారుతు న్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్రలో అధికారంలోకి రాగానే ఆర్టిజన్స్ కార్మికుల ను పూర్తిస్థాయి పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారని, కావున తమను రెగ్యులర్ పోస్టుల్లోకి కన్వర్షన్ ఇచ్చి పర్మినెంట్ చేయా లని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమి స్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో కో చైర్మెన్ శంకర్ నరేందర్, ఎల్లయ్య, కో కన్వీనర్లు నాగరాజు, అరవింద కుమార్, తిరుపతి, ఫైనాన్స్ సెక్రెటరీ సదానందం పాల్గొన్నారు.



కొత్త రెవెన్యూ చట్టంతోనే భూ సమస్యలకు పరిష్కారం

- డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఆర్వోఆర్ చట్టంతో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీసీఎల్ చీఫ్ కమిషనర్ నవీన్‌మిట్టల్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భూభారతి పేరుతో వచ్చిన చట్టంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. అసెంబ్లీలో కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని ప్రవేశ పెట్టి ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత చట్టంతో రైతులకు సేవ చేసే అధికారం కింది స్థాయి అధికారులకు లేకుండా పోయిందని వాపోయారు. ఏ చిన్న భూ సమస్య వచ్చిన హైదరాబాద్‌లోని సీసీఎల్ఏ కార్యాలయం వరకు రావాల్సిన పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుత చట్టంతో భూమి ఉన్న ప్రతి రైతుకూ పాస్ పుస్తకాలు వస్తాయని పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, ఫూల్‌సింగ్ చౌహాన్ తదితరులు ఉన్నారు.



యూపీపీఎస్సీని సందర్శించిన టీజీపీఎస్సీ చైర్మెన్

పరీక్షల నిర్వహణపై చైర్‌పర్సన్‌తో చర్చలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) చైర్మెన్ బుర్రా వెంకటేశం, ఆ కమిషన్‌కు చెందిన ఐదుగురు సభ్యులు న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీపీఎస్సీ)ను బుధవారం సందర్శించారు. పరీక్షల నిర్వహణ, ఇతర సమస్యలపై చైర్‌పర్సన్ ప్రీతి సూదన్, ఇతర సభ్యులతో వారు చర్చలు జరిపారు. ఫూల్‌ప్రూఫ్ పద్ధతిలో పరీక్షల నిర్వహణ, అనుసరిస్తున్న ఇతర పద్ధతులు, అవలంభించిన ప్రక్రియలు, రిక్రూట్‌మెంట్ నియమాలు, క్రమశిక్షణా కేసుల నిర్వహణలో పాటించాల్సిన విధానాలు, కమిషన్‌కు ఇచ్చిన ఆర్థిక స్వయంప్రతిపత్తి తదితర అంశాలను ఆమె వారికి వివరించారు.

పరీక్షల్లో సాంకేతికతను ఉపయోగించుకోవడం మొదలగు అంశాలను వెంకటేశం వారిని అడిగి తెలుసుకున్నారు. టీజీపీఎస్సీలో పరీక్షణ నిర్వహణను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు వారు యూపీపీఎస్సీని సందర్శించినట్టు సమాచారం.

40 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి

- వేతన సవరణ కమిషన్‌కు టీజీవో ప్రతిపాదనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగులకు 40 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని వేతన సవరణ కమిషన్‌కు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీవో) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు బుధవారం కమిషన్ చైర్మెన్ ఎన్.శివశంకర్‌ను కలిసి పలు ప్రతిపాదనలతో కూడిన వినతి పత్రం అందించారు. 2023 జులై 1నుంచి 2024 జనవరి 1 వరకు పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యాలను ప్రభుత్వం ప్రకటించాల్సి ఉందని తెలిపారు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే 18 నెలలు ఆలస్యమైనందున, కమిషన్ నివేదికను వెంటనే ప్రభుత్వానికి అందజేయాలని విజ్ఞప్తి చేశారు. కమిషన్‌ను కలిసిన వారిలో టీజీఓ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు బి.శ్యామ్, జగన్మోహన్‌రావు, పరమేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నిరసనల పేరుతో సభా సమయం వృథా

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

బీఆర్ఎస్ నాయకులు రోజుకో రీతిలో నిరసన పేరుతో విలువైన సభా సమయాన్ని వృథా చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. తమ ప్రభుత్వం చక్కటి పాలసీలు తెస్తుంటే, బీఆర్ఎస్ వాట్సాప్ యూనివర్సిటీ అబద్ధాలు ప్రచారం చేస్తోందన్నారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు చలో రాజ్ భవన్ చేపట్టామని, రోడ్డుపై బైటాయించి ప్రధాని, అదానీ ఒక్కటైనట్టు నినదించినట్టు చెప్పారు. మణిపూర్‌లో మానవీయ ఘటనలు జరుగుతున్నా ప్రధాని సోయి లేకుండా వ్యవహరిస్తు న్నారని విమర్శించారు. ప్రధాని, అదానీ అంశంలో బీజేపీ నాయకులు స్పందించాలి కానీ, హరీశ్‌రావుకు ఏం నొప్పి అని ప్రశ్నించారు. దీన్ని బట్టి బీజేపీ, బీఆర్ఎస్ భాయ్ భాయ్ అని స్పష్టం అవుతోందన్నారు. హరీశ్‌రావు వైఖరి బీజేపీకి బీ-టీమ్ అన్నట్టు కనిపిస్తున్నదని, అందువల్ల బీఆర్ఎస్‌ని బీజేపీలో విలీనం చేసుకోవాలని సూచించారు. తాము అదానీతో చట్ట వ్యతిరేక ఒప్పందాలు ఒక్కటీ చేసుకోలేదని చెప్పారు. దేశ సంపదను దోచుకుంటున్న అదానీపై జేపీసీ వేయడానికి తాము అసెంబ్లీలో తీర్మానం పెడతామని, మద్దతు ఇవ్వాలని కోరారు. పదేండ్ల కిందట 600వ స్థానంలో ఉన్న అదానీ మూడో స్థానానికి ఎలా ఎదిగారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలన్నారు.

బీఆర్ఎస్ డ్రామాలు ప్రజలు గమనిస్తున్నారు :ఎమ్మెల్యే మట్టా రాగమయి

బీఆర్ఎస్ నాయకుల హడావిడిని ప్రజలు గమనిస్తు న్నారని, అసెంబ్లీ సజావుగా సాగకుండా ప్రతి రోజూ డ్రామాలు చేస్తున్నారని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. గడిచిన పదేండ్లలో ఆటో కార్మికుల సమస్యలు పట్టించుకోలేని వాళ్లు.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంపై విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మహిళలకు ఈ పథ కం ద్వారా నెలకు రూ.5 వేల నుంచి 6వేల వరకు లబ్ధి చేకూరు తోందన్నారు. కాంగ్రెస్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆద రణ చూసి ఓర్వలేక ఇలాంటి పనులు చేస్తున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను త్వరలోనే ముఖ్యమంత్రి అమలు చేస్తారని చెప్పారు.



కేసీఆర్ అసెంబ్లీ చర్చల్లో పాల్గొనాలి :ఎమ్మెల్సీ బల్మూరి

ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొనాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నర్సింగ్‌రావు కోరారు. చట్ట సభలను, రాజ్యాంగాన్ని గౌరవించాలన్నారు. బావాబామ్మర్దులు బలహీన వర్గాల వారికి సంకెళ్లు వేసి వాళ్ల దొరల లెక్క వెనక వస్తున్నారని, రేపు సంకెళ్లు పడేది ముందే ప్రాక్టీస్ చేసినట్టు ఉందన్నారు. ఏ అంశం మాట్లాడినా ఆయనను లోపల వేస్తారని కేటీఆర్ అంటున్నారని, ప్రజా ప్రభుత్వంలో ప్రొసీజర్ ప్రకారం ఇన్వెస్టిగేషన్ ఉంటుందని చెప్పారు. దాని ప్రకారమే చర్యలు ఉంటాయన్నారు. అసెంబ్లీలో తాము ప్రతి అంశంపైనా చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. చేసిన తప్పులు అంగీకరించకపోవడం మరో తప్పు అని, మాట్లాడే ముందు పదేండ్ల కాలంలో మీరు ఏ విధంగా వ్యవహరించారో చర్చ పెట్టాలన్నారు.

నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలం

- ఆరేండ్ల బాలుడిలో వ్యాధి లక్షణాలు
- చెన్నై తరలింపు



నెల్లూరు : నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం వెంకటాపురంలో జికా వైరస్ కలకలం రేపింది. విషయం తెలుసుకున్న వైద్యాధికారులు ఆ ప్రాంతంలో పర్యటించారు. జికా వైరస్ అనుమానిత బాలుడిని మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరు నుంచి చెన్నయ్‌కు బుధవారం తరలించారు. రక్తనమూనాలు సేకరించి పూణేలోని ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ రిపోర్టు వచ్చే వరకు జికా వైరసా? కాదా? అనేది చెప్పలేమని డిఎం అండ్ హెచ్ఓ పెంచలయ్య తెలిపారు. ఈ గ్రామానికి చెందిన పలువురు జ్వరాలతో బాధపడుతున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం... వెంకటాపురం గ్రామానికి చెందిన బద్దల నాగరాజు, కల్యాణి దంపతుల ఆరు సంవత్సరాల కుమారుడు సుబ్బరాయుడు... దుత్తలూరు ప్రయివేట్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. ఆ బాలుడికి గతంలో అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుండేది. ఇటీవల పది రోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో, తల్లిదండ్రులు ఆ బాలుడిని నెల్లూరులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు వ్యాధి లక్షణాలను బట్టి జీకా వైరస్ సోకి ఉంటుందని అనుమానించారు. బాలుడిని మెరుగైన చికిత్స కోసం చెన్నైకు తరలించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని, మంచి వైద్యమందిస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గ్రామంలోని జ్వరపీడితులకు వైద్య బృందాలు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఈ సంఘటనతో ఆ గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనతో ఉన్నారు. మలేరియా విభాగం స్టేట్ డిప్యూటీ డైరెక్టర్ రామ్‌నాథ్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యుహెచ్ఓ) అధికారి మౌనిక, పలువురు వైద్యులు గ్రామంలో పర్యటించారు. వైద్య బృందం సహాయంతో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. గ్రామంలో దోమల లార్వా నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని మలేరియా డిప్యూటీ డైరెక్టర్ ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్లపై మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ప్రజలకు వైద్య సిబ్బంది సూచించారు. గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్, కృష్ణపురం వైద్యాధికారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబుజా సిమెంట్ పరిశ్రమలో ప్రమాదం

- ఆరుగురు కార్మికులకు తీవ్ర గాయాలు

అనంతపురం : అనంతపురం జిల్లాలోని అదానికి సంబంధించిన అంబుజా సిమెంట్ పరిశ్రమలో బుధవారం సాయంత్రం ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాడికి మండలం బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న పెన్నా సిమెంటు పరిశ్రమలను ఇటీవలే ఆదానికి సంబంధించి అంబూజా సిమెంట్స్ టేక్‌ఓవర్ చేసింది. ఈ పరిశ్రమలో మెయిటెన్స్ నిమిత్తం గత కొంతకాలంగా ఉత్పత్తిని నిలుపుదల చేశారు. బుధవారంనాడు పరిశ్రమలో తిరిగి ఉత్పత్తి ప్రారంభించే పనులు చేపట్టారు. ఈ క్రమంలో కోల్ ప్లాంట్‌లో పైనుంచి మండుతున్న ఇనుప రేకు కింద పని చేస్తున్న కార్మికులపై పడింది. ఈ ఘటనలో ఆరుగురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని తాడిపత్రి పట్టణంలోని లార్డ్స్ ఆస్పత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి తీవ్రంగా ఉండటంతో అనంతపురానికి మెరుగైన చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు.

కర్నాటక- ఆంధ్ర సరిహద్దులో ఘోర ప్రమాదం

- ఐదుగురు దుర్మరణం

పుంగనూరు : కర్నాటక రాష్ట్రం మూలబాగలు తాలూకా గుడిపల్లి పంచాయతీ సమీపం రాష్ట్ర సరిహద్దులో ఉన్న అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం కూరిజిల గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మరణించారు. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మృతులను చిత్తూరు జిల్లా గుడిపల్లి పంచాయతీ నాగేపల్లి గ్రామానికి చెందిన దంపతులు అప్పయ్య (45), గాయత్రి (40), కోనంగుంట గ్రామానికి చెందిన దంపతులు వెంకటరమణప్ప (43), అలివేలమ్మ (38), అదే గ్రామానికి చెందిన రాధప్ప (45)గా గుర్తించారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. పని నిమిత్తం వెంకటరమణప్ప, అలివేలమ్మ రాధప్ప ఒక వాహనంపై, అప్పయ్య, గాయత్రమ్మ మరో వాహనంపై కర్నాటక రాష్ట్రం ముల్‌బాగల్ వైపు వెళుతుండగా వడ్డిపల్లె నుంచి టమోటా బాక్సులతో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం అతివేగంతో రెండు బైకులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బీజేపీతో దేశం ముక్కలు

(మొదటిపేజీ తరువాయి)

రైతాంగం చేతుల్లో లేకుండా పోతుందని హెచ్చరించారు. పనికి ఆహార పథకాన్ని నిర్వీర్యం చేయాలనే కుట్ర సాగుతున్నదన్నారు. బడుగు, బలహీన వర్గాల హక్కులను హరించేందుకు ప్రయత్నిస్తోం దన్నారు. భారతీయులను మతాల ఆధారంగా విభజించే కుట్ర బీజేపీ చేస్తోందన్నారు. ఈ దేశంలో ఉండాలంటే హిందువు లేదా హిందువుకు విధేయుడై ఉండాలనే విధానాన్ని ముందుకు తీసుకొస్తోందని తెలిపారు. దేశభక్తి, దేశ సమైక్యతకు కేంద్ర ప్రభుత్వ విధానాల ద్వారా ముప్పు తలెత్తనున్నదని హెచ్చరించారు. ప్రార్థనా మందిరాల పరిరక్షణ చట్టాన్ని కాదని మసీదులను కూలగొట్టి దేవాలయాలను నిర్మించే సంస్కృతి ముందుకు వస్తోందని తెలిపారు. మైనార్టీ, దళితులపై కక్ష తీర్చుకునే పనికి పూనుకుంటోందన్నారు. యువతకు విద్యా, ఉద్యోగం, వృద్ధులకు పెన్షన్ హక్కులు ఉండాలని కోరారు. రాష్ట్రాలకు జాతీయ ఆదాయంలో 50 శాతం వాటా ఉండాలన్నారు.



తిట్లపైనే దృష్టి.. ప్రజా సమస్యలపై లేదు : తమ్మినేని వీరభద్రం

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ పరస్పరం తిట్టుకోవడం తప్ప ప్రజా సమస్యలపై దృష్టి సారించడం లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ప్రజాస్వామ్యం పేర ఏడో గ్యారంటీ ఇచ్చిన సీఎం నిర్బంధాలను యథాతథంగా కొనసాగిస్తున్నారని తెలిపారు. గత బీఆర్ఎస్ తరహాలోనే కాకుండా ఇప్పుడు కూడా మంత్రులు, ముఖ్యమంత్రి పర్యటన ఉన్నప్పుడు కమ్యూనిస్టు పార్టీల నేతలను అరెస్టు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. డైవర్షన్ పాలిటిక్స్‌తో సమస్యలను పక్కదోవ పట్టించే చర్యలు కొనసాగుతున్నాయి తప్ప.. పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. రైతు భరోసా పేరుతో ఎకరానికి రూ. 15,000 ఇస్తామన్న ప్రభుత్వం ఉన్న రూ.10 వేలను కూడా ఇవ్వటం మానేసిందన్నారు. ఫార్మా కంపెనీలు విడుదల చేసే విషాన్ని నియంత్రించకుండా మూసీ ప్రక్షాళన ఎలా సాధ్యమని ప్రశ్నించారు. రేవంత్‌ను కేసీఆర్, కేసీఆర్‌ను రేవంత్ లేకుండా చేస్తే అభ్యంతరం లేదు కానీ ప్రజా సమస్యలు నిర్లక్ష్యం చేస్తే జనం సహించబోరన్నారు. ఏడాది పాలనలో హామీలు అమలు చేయక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, వాగ్దానాలు చేసేటప్పుడు రాష్ట్రం రూ. 7 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్న విషయం తెలియదా అని సీఎంను ప్రశ్నించారు. తెలంగాణ తల్లి విగ్రహంపై చర్చించేందుకు ప్రతిపక్షాలను పిలిచి మాట్లాడిన సీఎంకు గ్రూప్-1, మూసీ, హైడ్రా వంటి కీలక అంశాలను ఎలా వదిలేస్తారని ప్రశ్నించారు. కమ్యూనిస్టుల బలం సీట్లలో లేదు గుండె ధైర్యంలో ఉందన్నారు. లగచర్లలో ఫార్మాసిటీ రద్దు సీపీఐ(ఎం) పర్యటన ద్వారా సాధించినట్టు తెలిపారు. పదవి నీడ లాంటిది.. మళ్లీ ఎర్రజెండాకు మంచి రోజులు రానున్నాయని, శ్రీలంక ఉదంతాన్ని వివరించారు. మాడు వారిన వృక్షాలు, ఆకురాల్చిన చెట్లు చిగుర్లు తొడిగిన మాదిరిగానే కమ్యూనిస్టులు మళ్లీ పుష్పిస్తారనే ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని సీపీఐ(ఎం) నాయకులు సాయిబాబు పిలుపునిచ్చారు.

సత్తుపల్లి అరుణవర్ణం

మహాసభల ప్రారంభానికి ముందు సత్తుపల్లి బస్టాండ్ సెంటర్ సమీపంలో ఉన్న రావి వీర వెంకయ్య భవనం పార్టీ డివిజన్ కార్యాలయం నుంచి నిర్వహించిన ప్రదర్శనతో సత్తుపల్లి అరుణ వర్ణ శోభితంగా మారింది. 600 మందికిపైగా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ఎరుపు రంగు దుస్తులతో నిర్వహించిన కవాతు ఆకట్టుకుంది. కోలాట నృత్యాలు, డప్పుల దరువుతో సాగిన ర్యాలీలో అగ్రభాగాన తమ్మినేని, రాఘవులు, సాయిబాబు, బి. వెంకట్, పాలడుగు భాస్కర్, నున్నా నాగేశ్వరరావు, సోమయ్య, బుగ్గవీటి సరళ తదితరులు నడిచారు. బస్టాండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ సిద్ధారం రోడ్‌లోనే లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్ వరకు సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన సీపీఐ(ఎం) జెండాను పార్టీ సత్తుపల్లి డివిజన్ మాజీ కార్యదర్శి తాత భాస్కరరావు ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల కాలంలో మృతి చెందిన అమరుల చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేశారు. అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు.

పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సహా తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం తదితర అమరులకు నివాళులర్పిస్తూ సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా.. ప్రతినిధులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు నాయుడు వెంకటేశ్వరరావు స్వాగతోపన్యాసం చేశారు. రాష్ట్ర పరిశీలకుల ప్రసంగాల అనంతరం నున్నా నాగేశ్వరరావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. సభలో పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, కార్యదర్శివర్గ సభ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు ఎం. సుబ్బారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వర్లు, మాచర్ల భారతి, రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్, పి.నాగరాజు, జిల్లా నాయకులు వై. విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, మోరంపూడి పాండురంగారావు, చింతలచెరువు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సమ్మెను విరమింపజేయాలి : తమ్మినేని

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి వారు చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'సమగ్ర శిక్ష ఉద్యోగులు, కేజీబీవీ ఉపాధ్యాయులు తమను రెగ్యులరైజేషన్ చేయాలనీ, మినిమం టైం స్కేల్ అమలు చేయాలనీ, కేర్ టేకర్లను నియమించాలనీ, హెల్త్ కార్డులు ఇవ్వాలనీ, రెగ్యులర్ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన విధంగా సెలవుల సౌకర్యం కల్పించాలనే డిమాండ్లపై గత వారం రోజులుగా సమ్మె చేస్తున్నారు' అని అన్నారు. సమ్మె చేస్తున్న సంఘాలతో తక్షణమే చర్చలు జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు సర్కారు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గురుకులాల పనివేళలు మార్చాలి

విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సౌకర్యవంతంగా ఉండేలా గురుకులాల పని వేళల్లో మార్పులు చేయాలని తమ్మినేని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వార్డెన్లను, కేర్ టేకర్లను నియమించాలనీ, ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఇతర పోస్టులకు ఎంపికైన వారికి వేతన రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ హయాంలో 25 వేల ఎకరాల భూమి అన్యాక్రాంతం

దీనిపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తాం

- ఆ భూములన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకుంటాం : పాత్రికేయులతో ఇష్టాగోష్టిలో డిప్యూటీ సీఎం భట్టి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత బీఆర్ఎస్ హయాంలో ధరణిలోని లోపాలు, లొసుగులను ఆధారం చేసుకుని రాష్ట్రంలో 25 వేల ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. బుధవారం అసెంబ్లీ లాబీల్లోని తన ఛాంబర్‌లో ఆయన పాత్రికేయులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఒక్క ఇబ్రహీంపట్నం ప్రాంతంలోనే పది వేల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. మిగిలిన 15 వేల ఎకరాలు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నాయని చెప్పారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు 2.50 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. రెవెన్యూ వనరులపై అధ్యయనం చేసి, అన్యాక్రాంతమైన భూములను గుర్తించిన క్రమంలో ఈ విషయం తేలిందన్నారు. ఈ తతంగంపై ప్రభుత్వం 'ఫోరెన్సిక్ ఆడిట్'ను నిర్వహించబోతోందని వెల్లడించారు. భూ భారతి చట్టం ద్వారా అన్యాక్రాంతమైన భూములన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకుంటామని భట్టి ఈ సందర్భంగా చెప్పారు. తెలంగాణ ప్రాంతంలో మొదటి నుంచి భూమి కేంద్రంగా పోరాటాలు, రాజకీయాలు కొనసాగాయని ఆయన వ్యాఖ్యానించారు. నక్సల్బరీతోపాటు కొండపల్లి సీతారామయ్య తదితరుల గురించి ప్రస్తావించారు.

'అసంఘటిత' కార్మికులకు సంక్షేమ చట్టం

వాహన డ్రైవర్లపై పెంచిన పెనాల్టీ రద్దు చేయాలి

- ఉబర్, ఓలా, రాపిడోలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే యాప్ తేవాలి : కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ నేతల వినతి



నవతెలంగాణ- న్యూఢిల్లీ బ్యూరో

అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ చట్టం చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) నేతలు డిమాండ్ చేశారు. వాహన డ్రైవర్లపై పెంచిన పెనాల్టీ రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరీని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ప్రతినిధి బృందం కలిసి, వినతి పత్రం అందజేసింది. రవాణా రంగ, కార్మికుల సమస్యలు గురించి చర్చించింది. ముఖ్యంగా, అసంఘటితరంగ రవాణా కార్మికులకు భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా సామాజిక సంక్షేమ చట్టం కావాలని డిమాండ్ చేశారు. దానికి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. వి.వి గిరి నేషనల్ లేబర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని మంత్రి తన కార్యదర్శికి చెప్పారు. అలానే డ్రైవర్లపై విపరీతంగా పెంచినటువంటి పెనాల్టీలు రద్దు చేయాలనీ, ఉబర్, ఓలా, రాపిడో లాంటి కంపెనీలకు ప్రత్యామ్నాయంగా ఒక యాప్‌ను కేంద్రమే తయారు చేయాలని కోరినట్టు చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో విద్యుత్ బస్సుల సమస్య బాగా ముందుకు వచ్చిందనీ, ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు, నిర్వహణ, ఆపరేషన్స్ ఆర్టీసీల ద్వారా మాత్రమే చేయించాలని కోరారు. ఈ విషయాలన్నిటి మీద వివరంగా చర్చించడానికి ఓ సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య, గౌరవ అధ్యక్షులు కెకె దివాకరన్, ఉపాధ్యక్షుడు సర్బత్ సింగ్ పునియా, కార్యదర్శులు రాజ్ కుమార్ ఝా, జిబన్ షా తదితరులు ఉన్నారు.

సీఎం ప్రకటనలకే దిక్కులేదు..

ఆయన చెప్పింది ఏ ఒక్కటీ అమలు కావట్లేదు : మీడియాతో ఇష్టాగోష్టిలో మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి చేసే ప్రకటనలకే దిక్కు లేకుండా పోయిందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఆయన చెప్పింది ఏ ఒక్కటీ అమలు కావటం లేదని విమర్శించారు. బుధవారం అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రంలోని 3.13 లక్షల మంది రైతులకు రూ.2,474 కోట్ల రుణమాఫీ చేస్తున్నామంటూ నవంబరు 30న సీఎం రేవంత్ చెప్పారని గుర్తు చేశారు. కానీ ఇంతవరకూ రైతుల ఖాతాల్లో ఆ డబ్బు జమ కాలేదని విమర్శించారు. ఆ చెక్కు కూడా బౌన్స్ అయినట్టేనని వ్యాఖ్యానించారు. స్వయం సహాయక సంఘాల ఖాతాల్లో డబ్బులేస్తామంటూ వరంగల్‌లో సీఎం చెప్పినా, ఇప్పటి వరకూ అది అమలు కాలేదన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఫిబ్రవరిలో ఇస్తామన్న పీఆర్సీ బకాయిల చెక్ (రూ.281 కోట్లు) కూడా వారి ఖాతాల్లో జమ కాలేదని విమర్శించారు. దీంతో ఆర్టీసీ సంస్థే మళ్లీ కార్మికుల ఖాతాల్లో డబ్బును జమ చేసిందని అన్నారు. మహిళలకు లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలను ఇస్తామన్న మాట పెద్ద బోగస్ అని తేలిపోయిందని దుయ్యబట్టారు. 2015లో తమ బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలను ఇచ్చిందనీ, ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు కూడా దాన్నే కొనసాగిస్తోందనీ, మిగతా వాటికి వడ్డీ కట్టాల్సిందేనని తెలిపారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలకు రేవంత్ సర్కార్ తులం బంగారం ఇవ్వలేదు, యువతులకు స్కూటీలు ఇవ్వలేదు, న్యూట్రీషన్ కిట్లూ లేదు, బతుకమ్మ చీరెలూ ఇవ్వలేదని వాపోయారు. మరోవైపు శాసనసభను ప్రభుత్వం రూల్స్ ప్రకారం నడపటం లేదని హరీశ్ విమర్శించారు. గతంలో భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు ఎలాంటి ప్లకార్డులు పట్టుకోలేదా? అని ప్రశ్నించారు. పార్లమెంటులో ప్రియాంకాగాంధీ రోజుకో బ్యాగు వేసుకోవచ్చు, రాహుల్‌గాంధీ రోజూ టీ షర్ట్ వేసుకుని రావచ్చు, మేం మాత్రం అలా చేస్తే తప్పా? అని నిలదీశారు.

జమిలీ బిల్లుపై 31 మందితో జేపీసీ

(మొదటిపేజీ తరువాయి)

చెందిన 21 మంది ఎంపీల జాబితాలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులున్నారు. కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్, కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా వంటి నాయకులున్నారు. టీడీపీ నుంచి గంటి హరీష్ బాలయోగి, జనసేన నుంచి వల్లభనేని బాలశౌరి కూడా కమిటీలో భాగస్వామ్యమయ్యారు.

లోక్‌సభలో 21 మంది సభ్యులలో 10 మంది బీజేపీకి చెందిన వారు, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలైన టీడీపీ జనసేన, శివసేన (శిండే), ఆర్ఎల్‌డీలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు, ఎన్సీపీ, టీఎంసీ, డీఎంకేకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు.

కమిటీ సభ్యులు

బీజేపీకి చెందిన పిపి చౌదరి, సిఎం రమేష్, బాన్సూరి స్వరాజ్, పురుషోత్తం రూపాలా, అనురాగ్ సింగ్ ఠాకూర్, విష్ణు దయాళ్ రామ్, భర్తహరి మహతాబ్, సంబిత్ పాత్ర, అనిల్ బలుని, విష్ణు దత్ శర్మ ఉన్నారు. జిఎం హరీష్ బాలయోగి (టీడీపీ), శ్రీకాంత్ ఏక్‌నాథ్ శిండే (శివసేన శిండే), చందన్ చౌహాన్ (ఆర్ఎల్‌డీ), వల్లభనేని బాలశౌరి (జనసేన) ఉన్నారు. కమిటీలో కాంగ్రెస్‌కు చెందిన ప్రియాంక గాంధీ వాద్రా, మనీష్ తివారీ, సుఖదేయో భగత్ ఉన్నారు. ధర్మేంద్ర యాదవ్ (ఎస్పీ), కళ్యాణ్ బెనర్జీ (టీఎంసీ), టిఎం సెల్వగణపతి (డీఎంకే), సుప్రియా సూలే (ఎన్సీపీ) ఉన్నారు.

కౌశిక్‌రెడ్డీ..మాట్లాడితే సస్పెండ్ చేస్తా

కేటీఆర్ కొత్త సభ్యులకు నేర్పుతున్నది ఇదేనా? : స్పీకర్ ప్రసాద్‌కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కౌశిక్‌రెడ్డీ...ఇంకో మాట మాట్లాడితే సస్పెండ్ చేస్తా అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హెచ్చరించారు. మాట్లాడనివ్వరా అంటూ కేటీఆర్ స్పీకర్‌ను వారించబోగా...వకాల్తా పుచ్చుకోవడం ఏంటి? అని ప్రశ్నించారు. కొత్త సభ్యులకు ఇదే నేర్పుతున్నారా? అని కేటీఆర్ ను అడిగారు. ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ సభ్యులు పదే పదే లేవడం, కామెంట్లు చేయడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'వకాల్తా పుచ్చుకోవడమేంటి? ఇది క్వశ్చన్ అవర్. సుదీర్ఘంగా మాట్లాడుతామంటే ఎలా? వేరే వారికి అవకాశం ఇవ్వొద్దా? రాజశేఖర్‌రెడ్డి మీ సభ్యులు కారా? సభా సమయాన్ని ఎందుకు వృథా చేస్తున్నారు? ఇది మీకు భావ్యంగా అనిపిస్తుందా? మీరు ఎంత వకల్తా పుచ్చుకున్నా..ఇష్టమొచ్చినట్టు అరిచినా మైకు ఇచ్చేది లేదు' అని కేటీఆర్‌కు స్పష్టం చేశారు. 'బెదిరిస్తున్నారా సార్' అని కౌశిక్‌రెడ్డి అనగా..ఇంకో మాట మాట్లాడితే సస్పెండ్ చేస్తా అని స్పీకర్ హెచ్చరించారు.

కమీషన్ల ప్రభుత్వం మీది..స్పీకర్‌ను బెదిరించడమేంటి?

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'వివేకానంద తన మాటల్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. మిషన్ కాకతీయలో కమీషన్లు.. కాళేశ్వరంలో కమీషన్లు.. గొర్లలో కమీషన్లు... బర్లలో కమీషన్లు.. చేపల్లో కమీషన్లు.. ఈ కార్ రేసులో కమీషన్లు.. ఇలా అన్నింటా కమీషన్లు తీసుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వం. కమీషన్ల ప్రభుత్వం మీది. కమీషన్ల పేరిట వేల కోట్ల రూపాయలు వెనకాల పోగేసుకున్నది మీరు' అని తీవ్రస్థాయిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. స్పీకర్‌ను బెదిరించేలా మాట్లాడటం ఏంటి అని ప్రశ్నించారు. 20 ఇయర్స్ ఇండస్ట్రీ అనేవాళ్లు ఇలా మాట్లాడుతారా? అని ప్రశ్నించారు. కొత్తగా సభకు వచ్చిన తమలాంటి సభ్యులకు సీనియర్లు ఆదర్శంగా ఉండాలని కోరారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరిగాదన్నారు. వివేకానంద తన మాటల్ని వెనక్కితీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కమీషన్లపై కస్సుబుస్సు

ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులపై మాటల యుద్ధం

ప్రభుత్వంపై బీఆర్ఎస్ సభ్యుడు కేపీ.వివేకానంద ఆరోపణలు

తిప్పికొట్టిన మంత్రులు సీతక్క, శ్రీధర్‌బాబు

గతం కంటే మెరుగ్గా అమలు చేస్తామంటూ వ్యాఖ్యలు

వివేకానంద, ఆదిశ్రీనివాస్ వ్యాఖ్యలు తొలగిస్తున్నట్టు ప్రకటించిన స్పీకర్





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్పుల పథకానికి సంబంధించి బుధవారం శాసనసభలో అధికార, ప్రధాన ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. అధికార పార్టీ నేతలు ఈ పథకంలో కమీషన్లు దండుకుంటున్నారంటూ బీఆర్ఎస్ సభ్యులు కేపీ. వివేకానంద చేసిన వ్యాఖ్యలు సభలో దుమారాన్ని రేపగా... మంత్రి సీతక్క ఆయన కామెంట్లపై తీవ్ర అసహనాన్ని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆ పథకం అమలుపై తమకు ఎవరూ హితోక్తులు చెప్పక్కర్లేదనీ, గతం కంటే మెరుగ్గా దాన్ని అమలు చేసి తీరుతామని ఆమె స్పష్టం చేశారు. అంతేతప్ప పథకాన్ని ఎత్తేస్తామన్న బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారం, ఆరోపణల్లో నిజం లేదంటూ కొట్టిపారేశారు. ప్రతీ అంశంపైనా బట్ట కాల్చి మీదేయాలనే ఆలోచనను మాను కోవాలంటూ సభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు... వివేకానందకు చురకలంటిం చారు. ఇదే సమయంలో బీఆర్ఎస్‌కు చెందిన పాడి కౌశిక్‌రెడ్డిపైనా ఆయన సెటైర్లు విసిరారు. మొత్తం మీద ఈ అంశం శాసనసభను ఒక ఊపు ఊపింది. ఇంకొక్క మాట మాట్లాడినా సభ నుంచి సస్పెండ్ చేస్తానంటూ కౌశిక్‌రెడ్డిని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హెచ్చరించారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్పుల మంజూరీలో కమీషన్ల దందా : కే.పీ.వివేకానంద

విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులు రూ.20 లక్షలు రావాలంటే..రూ.5 లక్షలు ముట్టజెప్పాల్సిందే అన్నట్టుగా పరిస్థితి తయారైందని బీఆర్ఎస్ సభ్యులు కే.పీ. వివేకానంద అన్నారు. కనీసం 10 శాతం కమీషన్ ముడితేగానీ వాటిని ఇవ్వడం లేదని ఆరోపించారు. బుధవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ సభ్యులు కే.పీ. వివేకానంద మాట్లాడుతూ.. తాము అడిగిన ప్రశ్నలకు మంత్రి సీతక్క సరైన సమాధానాలు ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులనే నమ్ముకుని విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఇంకా రెండు, మూడో విడతల స్కాలర్‌షిప్పులు ఎందుకు విడుదల చేయలేదని నిలదీశారు. 1.27 లక్షల కోట్ల రూపాయల్లో పేద విద్యార్థుల చదువుకు రూ.వంద కోట్లు విడుదల చేయలేరా? అని అడిగారు. వాటిని రూ.25 లక్షలకు పెంచుతా మన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. అసలు ఆ స్కీమ్ ఉంచుతారా? ఎత్తేస్తారా? అన్న సందేహాన్ని వ్యక్తపరిచారు. బరాబర్ 10 శాతం లంచం తీసుకుంటున్నారనీ, తన మాటల్ని ఉపసంహరించుకునే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. దీన్ని ప్రభుత్వం సరిదిద్దాలనీ, రాజకీయం చేయొద్దని సూచించారు. బీఆర్ఎస్ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..మల్కాజిగిరిలో బ్రహ్మణులు తమ పిల్లల ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులు ఎప్పుడొస్తాయని అడుగుతున్నారన్నారు. బీఆర్ఎస్ సభ్యులు అనిల్ జాదవ్ మాట్లాడుతూ..గిరిజన విద్యార్థులు స్కాలర్‌షిప్పులు అందక విదేశాల్లో తంటాలు పడుతున్నారని వాపోయారు. ఎంఐఎం సభ్యులు మాట్లాడుతూ..మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఇతరులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులు ఎప్పుడిస్తారనే దానిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. మంత్రి సీతక్క చెప్పిన సమాధానం సరిగా లేదన్నారు. రూ. 348 కోట్ల బ్యాలెన్స్ ఉందని చెప్పారు.

ఆటోకార్మికుల ఉపాధిని దెబ్బకొట్టిందే బీఆర్ఎస్ సర్కారుమార్చిలోగా రూ.104 కోట్ల ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులు క్లియర్ చేస్తాం : మంత్రి సీతక్క

రాష్ట్రంలో ఆటోకార్మికుల ఉపాధిని దెబ్బకొట్టిందే బీఆర్ఎస్ సర్కారు అనీ, ఇప్పుడు అదే పార్టీ సభ్యులు ఆటో డ్రైవర్ల డ్రెస్సులు వేసుకుని రావడం విడ్డూరంగా ఉందని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) విమర్శించారు. ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల ప్రశ్నలకు ఆమె సమాధానం చెప్పారు.

ఊబర్, ఓలా ఆటో సర్వీసులు, బైకు సర్వీసులను గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా కేటీఆర్ ప్రారంభించింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. వారే ఆటోడ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసి ఇప్పుడు ఏదో చేస్తున్నట్టు హడావిడి చేయడమేంటని ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే తప్పా? అని అడిగారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులను గత ప్రభుత్వం 244 కోట్లు పెండింగ్‌లో పెట్టిపోతే..పిల్లల చదువులు ఆగం కావొద్దని మేం రూ.140.42 కోట్లు రిలీజ్ చేశామని చెప్పారు.

మార్చి వరకు క్లియర్ చేసే అవకాశముందనీ, రూ.104 కోట్లను త్వరలోనే క్లియర్ చేస్తామని స్పష్టతనిచ్చారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులపై ఈ ఏడాదికి సంబంధించి 3488 దరఖాస్తులు వచ్చాయనీ, 1310 మందిని సెలెక్ట్ చేయాల్సి ఉందని చెప్పారు. డాక్యుమెంట్లు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నడుస్తున్నదనీ, డిసెంబర్ చివరి నాటికల్లా వాటిని ఫైనలైజ్ చేస్తామని హామీనిచ్చారు. ఓవర్సీస్ స్కాలర్ షిప్పు పథకాన్ని మరింత బలోపేతం చేస్తామని నొక్కి చెప్పారు. గతంలో మాదిరిగా విద్యార్థుల ఆత్మహత్యలు జరుగకుండా ప్రయత్నిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం 4,500 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను పెండింగ్‌లో పెట్టిందనీ, వాళ్లు అధికారంలో ఉన్నప్పుడు విడుదల చేయాలనే సోయి లేదా? అని ప్రశ్నించారు. వాళ్లు ఇవ్వలేదని..తాము ఇవ్వబోమని చెప్పట్లేదన్నారు.

వివేకానంద తన మాటల్ని ఉపసంహరించుకోవాలి : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

వివేకానంద తన వ్యాఖ్యల్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సూచించారు. ఆధారాలు లేకుండా అలా మాట్లాడటం తగదనీ, బట్టకాల్చి మీద వేసే ధోరణి సరికాదని హితవు పలికారు. వివేకానంద సీనియర్ సభ్యులనీ, ఆయన సభా నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు. 2014లో వారు రూపొందించిన సభానిబంధనలను వారే ఉల్లఘించడం ఏంటని ప్రశ్నించారు. ఆటోడ్రైవర్ల డ్రస్సులు వేసుకుని వచ్చి మరోమారు వారిని మోసం చేయాలని బీఆర్ఎస్ సభ్యులు చూస్తున్నారని విమర్శించారు. అధికార పక్షం వైపు ఉన్నప్పుడు ఒక వేషాలు..అటువైపు కూర్చున్నప్పుడు మరో రకమైన వేషాలు వేయడం సరిగాదన్నారు. ఆటో కార్మికుల ట్యాక్సీల భారాన్ని మోపిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని విమర్శించారు. పదేండ్లలో మీరు చేయలేదని.. పది నెలల్లో ఎలా సాధ్యమవుతుందని కే.పీ. వివేకానందను ప్రశ్నించారు. ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి అన్నీ ఇప్పుడే చేయాలంటే ఎలా? అని నిలదీశారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామని, ఆరు గ్యారెంటీలు, ప్రతి హామీని నెరవేరుస్తామని భరోసానిచ్చారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్పులను ఎక్కడా ఆపలేదని స్పష్టం చేశారు. ప్రతీ దానికి ఒక ప్రాసెస్ జరుగుతుందనీ, తొందరపడి ఇష్టమొచ్చినట్టు మాట్లాడటం తగదని హితవు పలికారు. కొత్త సభ్యుడు కౌశిక్‌రెడ్డి మాటిమాటికి లేచి అరవడం సరికాదని సూచించారు.

గురుకులాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాం

- మంత్రి సీతక్క
- దారుణ పరిస్థితులున్నాయి
- అసెంబ్లీలో అధికార, ప్రతిపక్షాల వాదోపవాదాలు
- మరిన్ని నిధులు కావాలంటూ సభ్యుల డిమాండ్
- పొన్నం, గంగుల మధ్య మాటల యుద్ధం





నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటయ్యాక గురుకులాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. విద్య గొప్ప ఆయుధమని, ప్రగతికి దారులు చూపిస్తుం దని అన్నారు. 16 సంవత్సరాల తరువాత సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు వచ్చాక గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లలో 40 శాతం డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచినట్టు చెప్పారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం కలిగిందని వివరించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్యార్థులందరికీ ఒకే విధంగా ఆహారం అందేలా ఆహార ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు శాసనసభలో మధ్యాహ్నం భోజన విరామం అనంతరం మంత్రి సీతక్క గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. తొలుత బీఆర్ఎస్ సభ్యులు గంగుల కమలాకర్ చర్చలో పాల్గొంటూ గురుకులాల్లో ప్రభుత్వం చెప్పినట్టుగా పరిస్థితులు అంతసాఫీగా లేవన్నారు. వరుసగా వెలుగుచూస్తున్న ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు, విద్యార్థుల మరణాలపై మంత్రి స్పందించకపోవడం సరికాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాలపట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాశీన వైఖరివల్ల దాదాపు రెండు లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఏడాది కాలంలో సుమారు 54 మంది విద్యార్థులు మతి చెందారని తెలిపారు.

అక్కడ మొబైల్ నెట్‌వర్క్ యమ స్పీడ్ గురూ !

● మొదటి స్థానంలో యూఏఈ ● తొలి మూడు స్థానాలూ గల్ఫ్‌వే ● టాప్ టెన్‌లో కనిపించని అమెరికా జపాన్, జర్మనీ ● 25వ స్థానంలో భారత్



న్యూఢిల్లీ : నేడు ప్రపంచంలో ఇంటర్నెట్ అనేది సామాన్యులకు అత్యంత ముఖ్యమైన అవసరాలలో ఒకటిగా నిలిచింది. ఇంటర్నెట్ సాయంతో ప్రజలు చౌకగా, సమర్థవంతంగా విద్య, ఆరోగ్య రక్షణ, ప్రజా భద్రత, ప్రభుత్వ సేవలను పొందవచ్చు. ఆన్‌లైన్ బోధన, దూరవిద్య పొందాలనుకునే వారికి అందుబాటు ధరలోనే ఇంటర్నెట్ ఆ సదుపాయాలను కల్పిస్తోంది. అయితే ప్రపంచంలో అత్యంత వేగంగా మొబైల్ నెట్‌వర్క్‌ను కలిగిన దేశం ఏదో మీకు తెలుసా?

నవంబర్ నెలకు సంబంధించి స్పీడ్‌టెస్ట్ గ్లోబల్ ఇండెక్స్ అందజేసిన సమాచారం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అత్యంత వేగంగా మొబైల్ నెట్‌వర్క్‌ను అందిస్తున్న మొదటి 10 దేశాల జాబితాలో అమెరికా, జపాన్, భారత్, జర్మనీ వంటి ప్రధాన దేశాలు లేకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

ఈ జాబితాలో ఐదు ఆసియా దేశాలకు చోటు దక్కింది. మొదటి మూడు స్థానాలూ గల్ఫ్ దేశాలవే. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 441.89 ఎంబీపీఎస్ (ఎంబీపీఎస్ అంటే సెకనుకు మెగాబిట్లు. మెగాబిట్ అనేది అతి చిన్న డేటా. డౌన్‌లోడ్ వేగాన్ని కొలవడానికి మెగాబిట్లు ఉపయోగపడతాయి. వీటి సంఖ్య ఎంత ఎక్కువగా ఉంటే ఇంటర్నెట్ (ట్రాఫిక్ అంత వేగంగా ఉంటుంది) స్పీడ్‌తో మొదటి స్థానంలో నిలవగా ఖతార్ 358.27 ఎంబీపీఎస్‌తో రెండో స్థానంలో, కువైట్ 263.59 ఎంబీపీఎస్‌తో మూడో స్థానంలోనూ ఉన్నాయి.

స్పీడ్‌టెస్ట్ గ్లోబల్ ఇండెక్స్ అందించిన ముఖ్యమైన సమాచారాన్ని పరిశీలిస్తే...యూరో పియన్ యూనియన్ దేశమైన బల్గేరియా 172.49 ఎంబీపీఎస్‌తో నాలుగో స్థానంలో నిలిచింది. 162.22 ఎంబీపీఎస్‌తో డెన్మార్క్ ఐదో స్థానంలో, 148.34 ఎంబీపీఎస్‌తో దక్షిణ కొరియా ఆరో స్థానంలో, 146.56 ఎంబీపీఎస్‌తో నెదర్లాండ్స్ ఏడో స్థానంలో, 145.74 ఎంబీపీఎస్‌తో నార్వే ఎనిమిదో స్థానంలో, 139.58 ఎంబీపీఎస్‌తో చైనా తొమ్మిదో స్థానంలో, 134.14 ఎంబీపీఎస్‌తో లక్సెంబర్గ్ పదో స్థానంలో నిలిచాయి. సింగపూర్ (127.75 ఎంబీపీఎస్), అమెరికా (124.61 ఎంబీపీఎస్), బహ్రెయిన్ (118.36 ఎంబీపీఎస్), ఫిన్లాండ్ (114.45 ఎంబీపీఎస్) తర్వాతి స్థానాలను ఆక్రమించాయి.

జపాన్ 51.95 ఎంబీపీఎస్ మొబైల్ ఇంటర్నెట్ స్పీడ్‌తో 59వ స్థానంలో నిలిచింది. 20.89 ఎంబీపీఎస్‌తో పాకిస్తాన్ 97వ స్థానంలో ఉంది. బంగ్లాదేశ్ 28.26 ఎంబీపీఎస్‌తో 88వ స్థానంలో నిలిచింది. కాగా మన దేశంలో మొబైల్ ఇంటర్నెట్ స్పీడ్ 100.78 ఎంబీపీఎస్. సూచికలో మన స్థానం 25. ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ విషయానికి వస్తే మన దేశం నేపాల్ కంటే వెనుకబడి ఉంది. ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ స్పీడ్ 63.55 ఎంబీపీఎస్‌తో భారత్ 91వ ర్యాంకులో ఉండగా 70.94 ఎంబీపీఎస్‌తో నేపాల్ 87వ స్థానంలో నిలిచింది.

స్థానిక సంస్థల్లో ఎస్సీలకు 20 శాతం రిజర్వేషన్ పెంచాలి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న ఎస్సీ కులాలకు జనాభా ప్రాతిపదికన 20 శాతం రిజర్వేషన్ పెంచాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, అదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని 86 మండలాల్లో 10 లక్షలకు పైగా ఎస్సీ జనాభా ఉందని అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పంచాయతీ రాజ్ చట్టంతో ఆయా జిల్లాల్లోని జడ్పీటీసీ, ఎంపిటిసీ, వార్డు సభ్యులకు రాజకీయ ప్రాధాన్యత లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన రెవెన్యూ చట్టంతో వారి సాగుభూములకు మ్యానువల్ పహానీల ద్వారా పంట రుణాలు పొందే అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వం వారి పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కోరారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలు ఇప్పించండి

● డిప్యూటీ సీఎం భట్టికి మెడికల్ కాలేజీల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిలు ఇప్పించాలని తెలంగాణ ప్రయివేట్ మెడికల్, నర్సింగ్ కళాశాలల యజమాన్యాల యూనియన్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో యూనియన్ సభ్యులు ఆయనను కలిసి వినతి పత్రం అందించారు. త్వరలోనే చెల్లింపుల ప్రక్రియను ప్రారంభిస్తామని భట్టి ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. చెల్లింపుల్లో పారదర్శకంగా వ్యవహరిస్తామనీ, పైరవీలకు తావులేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం బకాయిలను చెల్లించక పోవడంతో ప్రభుత్వంపై భారం పడిందని వివరించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ముందుకు పోతున్నదని గుర్తు చేశారు. భట్టిని కలిసిన వారిలో కళాశాలల యూనియన్ ప్రతినిధులు మోహన్ రెడ్డి, శ్రీనివాస్, డాక్టర్ సంధ్య, అపర్ణరెడ్డి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర పోలీసు శాఖకు మరో జాతీయ అవార్డు

● గువహతిలో స్వీకరించిన అధికారులు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర పోలీసు శాఖకు మరో జాతీయ అవార్డు లభించింది. రాష్ట్ర పోలీసు కంప్యూటర్ సర్వీసెస్ విభాగానికి కంప్యూటర్ స్టాండర్డైజేషన్-2024 జాతీయ అవార్డు అందింది. ఈ అవార్డును అసోంలోని గువహతిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ అందజేశారని రాష్ట్ర పోలీసు సాంకేతిక విభాగం అదనపు డీజీ వి.వి శ్రీనివాస్‌రావు తెలిపారు. ముఖ్యంగా, ఈ-పెట్టీ కేసుల పరిష్కారంలో అన్ని రాష్ట్రాల కంటే మెరుగైన ఫలితాలను సాధించినందుకు గానూ ఈ అవార్డును ప్రకటించారని ఆయన చెప్పారు. చిన్న నేరాలకు సంబంధించి రాష్ట్రంలో నమోదవుతున్న ఈ-పెట్టీ కేసుల కారణంగా కోర్టులలో పెండింగ్ కేసుల సంఖ్య కూడా తగ్గుతున్నదని తెలిపారు. ఈ అవార్డును రాష్ట్ర పోలీసు, కంప్యూటర్ సర్వీసెస్ తరఫున డీఎస్పీ కిరణ్ కుమారీ అందుకున్నారని డీజీ చెప్పారు. ఈ అవార్డు సాధనకు కృషి చేసిన పోలీసు కంప్యూటర్ సర్వీసెస్(పీసీఎస్) విభాగానికి చెందిన అధికారులు, సిబ్బందిని వి.వి శ్రీనివాస్‌రావు అభినందించారు.

లక్ష్మీభవానీకి మెరుగైన వైద్యమందించాలి : ఎమ్మెల్సీ తాతా మధు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎలుకలు కరిచి కాళ్ళు చచ్చుబడిపోయిన బీసీ గురుకుల విద్యార్థినికి మెరుగైన వైద్యమందించాలని బీఆర్ఎస్ సభ్యులు తాతా మధు కోరారు. బుధవారం శాసనమండలిలో ఈ మేరకు ప్రత్యేక ప్రస్తావన చేశారు. ఆమె తల్లి కూలి చేసుకుని బతుకుతున్నదనీ, ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కోరారు. ఇతర పాఠశాలల్లోనూ ఇలాంటివి జరగకుండా చూడాలన్నారు. కనీస వేతనాల జీవోను సవరించాలని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం కోరారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, జీవో 29తో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు అన్యాయం జరుగుతున్నందున, గతంలో ఉన్న జీవో 55ను వర్తింపజేయాలని కోరారు.

న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలి

● న్యాయ విద్యార్థుల ఉభయ సంఘాల సమావేశంలో వక్తలు



నవతెలంగాణ - ముషీరాబాద్

న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని న్యాయ విద్యార్థుల ఉభయ సంఘాల సమావేశంలో వక్తలు అన్నారు. అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఏఐఎల్‌యూ), భారత న్యాయ విద్యార్థుల సమాఖ్య (ఎల్ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 21న జరగనున్న రాష్ట్ర 2వ న్యాయ విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్థసారథి, ఎల్ఎస్ఎఫ్ఐ కన్వీనర్ హైదర్ అలీ మాట్లాడుతూ.. న్యాయ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాజ్యాంగం చాలా ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటోందని, రాజ్యాంగ విలువలను, లౌకికత్వాన్ని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రజలకు న్యాయం చేసే విధంగా, న్యాయవాద వృత్తికి వన్నె తేవాలని యువ న్యాయవాదులకు సూచించారు. ఈ నెల 21న 'పౌరసమాజం రాజ్యాంగం - న్యాయ విద్యార్థుల పాత్ర' అనే అంశంపై సుందరయ్య విజ్ఞానకేంద్రంలో న్యాయ విద్యార్థుల రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సదస్సులో ఐల్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది పీవీ సురేంద్రనాథ్ ప్రారంభ ఉపన్యాసం ఇస్తారని, ప్రధాన వక్తగా జాతీయ జ్యూడిషల్ అకాడమీ మాజీ డైరెక్టర్, మాజీ నేషనల్ లా స్కూల్ పూర్వ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మోహన్ గోపాల్ తదితరులు హాజరుకానున్నట్టు తెలిపారు.

దయనీయం

● రిటైర్ట్ హైకోర్టు జడ్జిలకు తక్కువ పెన్షన్‌పై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : కొంత మంది రిటైర్ట్ హైకోర్టు జడ్జీలు రూ. 10 వేలు నుంచి రూ 15 వేలు మధ్య పెన్షన్ పొందడం 'దయనీయం' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రిటైర్డ్ హైకోర్టు జడ్జీల పెన్షన్‌కు సంబంధించిన పిటీషన్లు జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌ల ధర్మాసనం ముందు విచారణ కోసం జాబితా అయ్యాయి. ధర్మాసనం ముందు వీటి గురించి అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి మాట్లాడుతూ జనవరిలో విచారించాలని అభ్యర్థించారు. ఈ అంశాన్ని పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తుందని తెలిపారు. దీనికి 'మా జోక్యాన్ని నివారించాలని ప్రభుత్వాన్ని ఒప్పించడం మంచిది' అని ధర్మాసనం తెలిపింది. ప్రతి విషయంలోనూ చట్టపరమైన విధానాన్నే కాదు, మానవీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని సూచించింది. అలాగే వ్యక్తిగత కేసులు మాదిరిగా ఈ పిటిషన్‌పై నిర్ణయం తీసుకోమని, హైకోర్టు జడ్జీలందరికీ వర్తించే విధంగా సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకుంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. జనవరి 8కి ఈ పిటిషన్ విచారణను వాయిదా వేసింది.కాగా, గతనెలలోనూ రూ. 15 వేలు మాత్రమే పెన్షన్ పొందుతున్న ఒక హైకోర్టు మాజీ జడ్జి వేసిన పిటిషన్‌ను ఈ ధర్మాసనం విచారించింది. జిల్లా కోర్టులో 13 ఏండ్ల పాటు పనిచేసి తరువాత అలహాబాద్ హైకోర్టు జడ్జిగా ప్రమోషన్ పొందారు. అయినా పెన్షన్‌ను లెక్కించేటప్పుడు తన న్యాయ సేవలను పరిగణనలోకి అధికారులు తీసుకోలేదని జడ్జి ఆరోపించారు. జిల్లా న్యాయవ్యవస్థ నుంచి ప్రమోషన్ పొందినా పెన్షనరీ ప్రయోజనాలను హైకోర్టు జడ్జిగా తీసుకున్న చివరి జీతం ఆధారంగా లెక్కించాలని సుప్రీంకోర్టు పేర్కొంది.

ఎఫ్‌టీఎల్‌లో ఉంటే కూల్చేస్తాం

● నివాసమున్న గృహాలను హైడ్రా కూల్చదు
● అనుమతులు ఇచ్చిన అధికారులు కూడా బాధ్యులే..
● భూ కబ్జాల వెనుక ఉన్న పాత్రదారులు, సూత్రదారులపై కఠిన చర్యలు :కమిషనర్ ఐజీ రంగనాథ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైడ్రా ఏర్పడక ముందు అనుమతిచ్చిన ఏ కట్టడాలనూ హైడ్రా కూల్చదని, అయితే ఎఫ్‌టీఎల్‌లో ఉంటే మాత్రం కూల్చేస్తామని హైడ్రా కమిషనర్ ఐజీ రంగనాథ్ స్పష్టం చేశారు. చెరువులు, పార్కులతోపాటు ప్రభుత్వ భూముల పరిరక్షణకు హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, ఇలాంటి సంస్థ దేశంలోనే మొట్ట మొదటిదని చెప్పారు. బుధవారం హైడ్రా ప్రధాన కార్యాయంలో ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలిక ప్రయోజనాలను, ప్రజల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని హైడ్రాను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అనుమతి లేకుండా కట్టిన నివాస గృహాలు ఈ ఏడాది జులై నాటికి సిద్ధమై, వాటిలో నివాసం ఉంటే కూల్చబోమన్నారు. అనుమతులు లేకుండా కట్టిన వాణిజ్య, వ్యాపార కట్టడాలను మాత్రం (ఉదాహరణకు ఎన్ కన్వెన్షన్) ఎప్పుడూ కట్టినా ఎఫ్‌టీఎల్‌లో ఉంటే కూల్చేస్తామన్నారు. గతంలో అనుమతులు ఇచ్చి, తరువాత రద్దు చేస్తే ఆ కట్టడాలు అక్రమ కట్టడాలే అవుతాయని, అవి నివాసాలు అయినా సరేనని, జులై తరువాత నిర్మాణం జరుగుతుంటే వాటిని అక్రమ కట్టడాలుగా పరిగణించి కూల్చుతామని చెప్పారు. అనుమతులు ఇచ్చిన అధికారులను కూడా బాధ్యులను చేస్తామన్నారు. కత్వా చెరువు, మల్లంపేటలో, అమీన్‌పూర్‌లో కూల్చివేతలు ఈ కేటగిరీలోకి వస్తాయని స్పష్టం చేశారు. పేదలను ముందు పెట్టి వెనుక నుంచి చక్రం తిప్పుతున్న ల్యాండ్ గ్రాబర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించామని, అలాంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామన్నారు. మల్లంపేట కొత్వాల్ చెరువు, అమీన్‌పూర్‌లో కూల్చివేసినవి అక్రమ కట్టడాలేనని చెప్పారు.

ఎఫ్‌టీఎల్ మార్కింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, కాలనీ సంక్షేమ సంఘాలు, ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు హైడ్రా ప్రాధాన్యత ఇస్తుందన్నారు. 12 చెరువుల్లో కూల్చివేతలు చేపట్టామని, చెరువుల పునరుద్ధరణకు ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే పనులు మొదలు పెడతామన్నారు. హైదరాబాద్‌లో చెరువుల ఎఫ్‌టీఎల్ మార్కింగ్ ప్రక్రియ ఇప్పటికే హైడ్రా మొదలు పెట్టిందని, ఈ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేస్తామన్నారు. వివిధ సందర్భాల్లో కోర్టులు ఇచ్చిన తీర్పులకు లోబడి హైడ్రా ముందుకు వెళ్తోందని తెలిపారు. ఐదు నెలల్లో చెరువు, పార్కులు ఇలా దాదాపు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. భావితరాల భవిష్యత్ బాగుండాలని, పర్యావరణ హితమైన, మెరుగైన ప్రజా జీవనం కోసం నగర ప్రజలు హైడ్రాకు సహకరిస్తున్నారన్నారు. హైడ్రాపై నమ్మకంతో ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని, ఇలా 5000కుపైగా ఫిర్యాదులను హైడ్రా పరిష్కరించిందని అన్నారు. త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, భూ కబ్జాల వెనుక ఉన్న పాత్రధారులు, సూత్రధారుల మీద చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భూభారతి బిల్లుపై ప్రతిపక్ష సభ్యుల అభ్యంతరం

● సభ్యులకు సమయం లేకుండా చర్చేంటి
● ప్రిపేర్ కావడానికి కనీసం ఒక్కరోజు సమయం ఇవ్వరా?
● స్పీకర్‌ను ప్రశ్నించిన బీఆర్ఎస్, ఎంఐఎం, బీజేపీ సభ్యులు
● మంత్రి బిల్లు చదివి వినిపిస్తారు.. చర్చ రేపు ఉంటుంది : మంత్రి శ్రీధర్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సభలో కనీసం సమయం ఇవ్వకుండా భూభారతి బిల్లు పెట్టి, వెంటనే చర్చ అనడం ఏంటని బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు, ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ, సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు, బీజేపీ సభ్యులు పాల్వాయి హరీశ్‌బాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. శాసనసభ నిబంధలను చదివి వినిపించారు. అర్ధరాత్రి 12 గంటలకు బీఏసీ ఎజెండా పెడితే సభ్యులు ఎప్పుడు ప్రిపేర్ కావాలి? అని ప్రశ్నించారు. బిల్లు పెట్టిన తర్వాత సభ్యులు ప్రిపేర్ కావడానికి కనీసం ఒక్కరోజైనా సమయం ఇవ్వడం శాసనసభ రూల్స్‌లో ఉందని ఎత్తిచూపారు. భూభారతి పెద్ద అంశం కాబట్టి సమయం ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. సభాపతి ఇలా వ్యవహరించడం పెద్ద తప్పిదం అని చెప్పారు. వెంటనే శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఇప్పుడు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి భూభారతి బిల్లులోని కీలక అంశాలను మాత్రమే వివరిస్తారని స్పష్టం చేశారు. ఆ బిల్లుపై గురువారం మధ్యాహ్నం 3 గంటలకు చర్చ ఉంటుందని చెప్పారు. అయినా, బీఏసీ ఎజెండా గురించి హరీశ్‌రావు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. స్పీకర్ అనుమతి తర్వాతనే చర్చ ఉంటుందనీ, ఎందుకు రాద్ధాంతం అని అన్నారు. 2014 నుంచి సభలో ఏం జరిగిందో..బిల్లులు ఎలా పాస్ అయ్యాయో అందరికీ తెలుసన్నారు. రాత్రికి రాత్రే బిల్లులు పాస్ చేయించు కోలేదా? అని ప్రశ్నించారు. ఇటువైపు ఉన్నప్పుడు ఒకలా..అటువైపు ఉన్నప్పుడు మరోలా మాట్లాడటం తగదని హితవు పలికారు.

వెనక్కి తగ్గని జేఎన్‌యూ విద్యార్థులు

● మోడీపై నిషేధిత బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శన ● యూనివర్సిటీ అడ్వైజరీనీ లెక్క చేయని వైనం



న్యూఢిల్లీ : ప్రధాని మోడీపై వచ్చిన నిషేధిత బీబీసీ డాక్యుమెంటరీని ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) విద్యార్థులు ప్రదర్శించా రు. డాక్యుమెంటరీని ప్రదర్శిస్తే తీవ్ర పరిణామాలుంటాయంటూ యూనివర్సిటీ యాజమాన్యం చేసిన అడ్వైజరీని కూడా విద్యార్థులు లెక్క చేయలేదు. యాజమాన్యం హెచ్చరికలను ధిక్కరించి మరీ తాము అనుకున్న పనిని జేఎన్‌యూ విద్యార్థులు చేశారు.

ఈ బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనను వామపక్ష అనుబంధ ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) నిర్వహించింది. తొలుత ఈ ప్రదర్శనను ఒక ప్రొజెక్టర్ ద్వారా చేయాలని ఏఐఎస్ఎఫ్ భావించింది. అయితే, భద్రతా సిబ్బంది ప్రొజెక్టర్‌ను డ్యామేజ్ చేసిందనీ, దీంతో ప్రొజెక్టర్ ద్వారా ప్రదర్శనను నిర్వహించలేకపోయామని నిర్వాహకులు చెప్పారు. దీంతో విద్యార్థులు ఆ డాక్యుమెంటరీని యూనివర్సిటీ గంగా దాబా వద్ద ప్రదర్శించారు. సెక్యూరిటీ సిబ్బంది నడుమ విద్యార్థులు డాక్యుమెంటరీని తిలకించారు.

డాక్యుమెంటరీని ప్రదర్శించకూడదనీ, ఇది క్యాంపస్‌లో మత సామరస్యాన్ని దెబ్బ తీయొచ్చని హెచ్చరిస్తూ సోమవారమే జేఎన్‌యూ యంత్రాంగం విద్యార్థులకు అడ్వైజరీని జారీ చేసింది. తమ ఆదేశాలను భేఖాతరు చేస్తే కఠిన క్రమశిక్షణా చర్యలుంటాయని యూనివర్సిటీ హెచ్చరించింది. అయితే, వర్సిటీ యంత్రాంగం తీరును ఏఐఎస్ఎఫ్ నాయకు లు తప్పుబడుతున్నారు. అసమ్మతిని అణచివేయటం, భావ ప్రకటనా స్వేచ్ఛను దెబ్బ తీస్తున్నారని యంత్రాంగం, భద్రతా సిబ్బందిపై వారు ఆరోపణలు చేశారు. "సైక్లోప్స్ (జేఎన్‌యూ భద్రతా సిబ్బంది) విద్యార్థుల, జేఎన్‌యూ ఎస్‌యూ జాయింట్ సెక్రెటరీ సాజిద్‌పై దాడి చేశారు. వారు ప్రొజెక్టర్‌ను ధ్వంసం చేసినా.. నిరసనలోనే విద్యార్థులు డాక్యుమెంటరీని వీక్షించారు. తమ హక్కులు, భావ ప్రకటనా స్వేచ్ఛను వదులుకోవటానికి వారు (విద్యార్థులు) నిరాకరించారు" అని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధి ఒకరు అన్నారు. వర్సిటీ జారీ చేసిన అడ్వైజరీని జేఎన్‌యూఎస్‌యూ ఒక ప్రకటనలో ఖండించింది. దీనిని విద్యార్థుల ప్రాథమిక హక్కులపై దాడిగా అభివర్ణించింది.


పేపర్ స్లిప్పులతో 92 మంది ఎంపీల ఓటు



న్యూఢిల్లీ : జమిలీ ఎన్నికలకు సంబంధించిన బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా 92 మంది ఎంపీలు పేపర్ స్లిప్పుల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. విశ్వసనీయ వర్గాలు ఈ విషయాన్ని తెలిపాయి. లోక్‌సభలో 129వ రాజ్యాంగ సవరణ బిల్లు 2024ను లోక్‌సభలో కేంద్రం ప్రవేశపెట్టిన విషయం తెలిసింది. అయితే, గతేడాది నుంచి పార్లమెంటు సమావేశాలు కొత్త భవనంలో జరుగుతున్న విషయం విదితమే. ఈ బిల్లు సందర్భంగా ఓటింగ్ కోసం పార్లమెంటు నూతన భవనంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టమ్‌ను తొలిసారిగా వినియోగించారు. మొత్తం 461 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 369 మంది ఓటు రికార్డింగ్ మెషీన్ ద్వారా ఎలాంటి లోపం లేకుండా ఓటు వేశారు. 92 మంది కరెక్షన్ స్లిప్పులను ఉపయోగించాల్సి వచ్చింది. మొత్తం 461 మందిలో 263 మంది బిల్లుకు అనుకూలంగా, 198 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ 92 మంది ఎంపీలలో 43 మంది అనుకూలంగా, 49 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు.

ఆ 20 మంది బీజేపీ ఎంపీలకు నోటీసులు?

● జమిలీ బిల్లుపై ఓటింగ్‌కు గైర్హాజరీ ఫలితం
● ఇందులో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, జ్యోతిరాదిత్య సింధియాలు కూడా..



న్యూఢిల్లీ : కేంద్రం లోక్‌సభలో వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లును ఎన్డీఏకు నేతృత్వం వహిస్తున్న బీజేపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఈ బిల్లును మంగళవారం ప్రవేశపెడుతున్న సందర్భంగా తమ పార్టీకి చెందిన అందరు ఎంపీలూ హాజరు కావాల్సిందిగా విప్‌ను సైతం జారీ చేసింది. అయినప్పటికీ, బీజేపీకి చెందిన 20 మంది ఎంపీలు సభకు రాలేదు. ఇందులో బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్ర మంత్రి అయిన నితిన్ గడ్కరీతో పాటు మరో కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కూడా ఉన్నారు. జమిలీ బిల్లుపై విప్ జారీ అయినా ఎంపీలు గైర్హాజరు కావటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తున్నది. ఈ విషయంలో బీజేపీ కూడా వారిపై సీరియస్‌గా ఉన్నదని సమాచారం. విప్ జారీ అయినా పార్టీ ఆదేశాలను ధిక్కరిస్తూ లోక్‌సభకు రానందుకు బీజేపీ వీరికి నోటీసులు జారీ చేసే అవకాశాలున్నాయని విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి.

ఈ బిల్లును ఇండియా బ్లాక్ ఇప్పటికే వ్యతిరేకించింది. సభలో తమ గళాన్ని ప్రతిపక్ష సభ్యులు గట్టిగా వినిపించారు. చివరకు బిల్లు జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి వెళ్లింది. అయితే, ఈ బిల్లు ఆమోదానికి మూడింటా రెండు వంతుల మెజారిటీ అవసరం ఉంటుంది. ఇందుకు బీజేపీకి, తన మిత్రపక్షాలతో పాటు ఎన్డీఏ లో లేని పార్టీల మద్దతు కూడా తప్పసరి అయింది. వైసీపీ, అకాలీదళ్ వంటి పార్టీలు ఇప్పటికే బిల్లుకు మద్దతు ఇచ్చాయి. మిగతా పార్టీల నుంచి కూడా బీజేపీ మద్దతును ఆశిస్తున్నది. ఒకపక్క, ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకతను తెలియజేస్తున్న ఈ తరుణంలో.. నితిన్ గడ్కరీ వంటి సీనియర్ నాయకులతో పాటు మొత్తం 20 మంది స్వంత పార్టీ నేతలే కీలకమైన బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంలో హాజరుకాకపోవటంపై తీవ్ర చర్చ నడుస్తున్నది.

పెనుగొండకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు

● మార్చి 8న ఢిల్లీలో పురస్కారాల ప్రదానం ● అభ్యుదయ రచనలు నా ఆరో ప్రాణం : లక్ష్మీనారాయణ



గుంటూరు : ప్రముఖ రచయిత పెనుకొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. దేశ వ్యాప్తంగా 21 భాషలకుగాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను సాహిత్య అకాడమీ బుధవారం ప్రకటించింది. వీటిలో ఎనిమిది కవితలు, మూడు నవలలు, రెండు లఘు కథలు, మూడు వ్యాస సంపుటికలు, మూడు సాహిత్య విమర్శ పుస్తకాలు ఉన్నాయి. నాటక, పరిశోధన అంశాలకు సంబంధించి ఒక్కొక్క పుస్తకం చొప్పున ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యాయి. ఈ వివరాలను కేంద్ర సాహిత్య అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు బుధవారం ప్రకటించింది. 'దీపిక' అభ్యుదయ వ్యాస సంపుటికిగానూ సాహితీ విమర్శ విభాగంలో లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం చెరువుకొమ్ముపాలేనికి చెందిన ఆయన గుంటూరులో ఉంటూ న్యాయవాదిగా పనిచేస్తున్నారు. 1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా ఉన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వర్తించారు. 2023లో జాతీయ అధ్యక్షునిగా ఎన్నికై ఆ పదవిని పొందిన తొలి తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు పొందారు. 1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. విజేతలకు వచ్చే ఏడాది మార్చి 8న ఢిల్లీలో పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డు కింద రూ.లక్ష నగదుతోపాటు శాలువాతో సత్కరిస్తారు. తెలుగు భాషకు సంబంధించి ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, సాహితీవేత్త కె.శ్రీనివాస్, జెఎస్.మూర్తి (విహారి) జ్యూరీలుగా వ్యవహరించారు. తెలుగు నుంచి మొత్తం 14 పుస్తకాలను జ్యూరీ సిఫార్సు చేసింది. లక్ష్మీనారాయణ బుధవారం సాయంత్రం మీడియాతో మాట్లాడుతూ అభ్యుదయ రచనలు తనకు ఆరో ప్రాణమని, తుదిశ్వాస వరకు ఈ రచనలు కొనసాగిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు పలువులు అభినందనలు తెలిపారు. గుంటూరు జిల్లా గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు ఒక ప్రకటనలో అభినందించారు. పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం తెలుగువారికి, పల్నాడు జిల్లాకు గర్వకారణమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలపై పోరాడుతాం



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆటో కార్మికుల పట్ల రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న వ్యతిరేక నిర్ణయాల వల్ల, తమ ఉపాధికి గండిపడుతుందని ఆటో డ్రైవర్లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ వారికి మద్దతు తెలిపారు. కూకట్‌పలిల్లిలోని ఆటో కార్మికులను ఎమ్మెల్యే కలిసి బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడు మీకు అండగా ఉంటుందన్నారు. ఆటో కార్మికుల సమస్యల పై కచ్చితంగా పోరాడుతామని వారికి హామీ ఇచ్చారు.

'క్వీన్స్ బ్యూటీ పార్లర్' ప్రారంభం



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధి బాలాజీనగర్ డివిజన్‌లో గల ఆంజనేయ నగర్‌లో ఎస్తేర్ రాణి విజయ్ నూతనంగా ఏర్పాటు చేసిన 'క్వీన్స్ బ్యూటీ పార్లర్' ను స్థానిక కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ అధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ గౌడ్, రవిసింగ్, భాస్కర్‌రావు, ఆశీర్వాదం, లలిత, జగదేవి, అన్నపూర్ణ, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన





నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, అలాగే మెట్రో క్యాష్ అన్ క్యారీ షాపింగ్ మాల్‌లో, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస రావు ఆధ్వర్యంలో..సైబర్ క్రైమ్‌పై కూకట్‌పల్లి పోలీసులు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా, సైబర్ నేరస్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులతో తమ వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, తమ మొబైల్‌లలో, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింక్స్ ఓపెన్ చేయొద్దని సూచించారు. ఆర్థిక నేరాలకు పాల్పడే వారు రోజుకో కొత్త ప్లాన్‌లతో మోసాలకు పాల్పడుతున్నారు. వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచిస్తూ.. ఒక వేల మీరు ఆర్థిక మోసానికి గురైనట్టుగా గుర్తిస్తే.. వెంటనే 1930 హెల్ప్ లైన్‌కు కాల్ చేయాలని పోలీసులు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో 500 మంది కలశాల విద్యార్థులు, మెట్రో క్యాష్ అన్ క్యారి ఉద్యోగులు, సైబర్ టీమ్‌తో, కూకట్‌పల్లి సీఐ ముత్తు, సబ్ ఇన్‌స్పెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు..

మేడ్చల్: మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ క్లబ్ ఆధ్వర్యంలో.. మెగా సైబర్ క్రైమ్ అవేర్నెస్ డ్రైవ్‌ను గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ పోలీస్, సైబరాబాద్ కమిషన్‌రేట్ సహకారంతో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.శ్రీలత మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని తెలి పారు. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని ఎంచుకొని వచ్చిన సైబర్ క్రైమ్ టీం అభినందించారు. సైబర్ క్రైమ్ వాలంటీర్ శశి మాట్లాడుతూ సైబర్ క్రైమ్ అంటే ఏమిటి వాటి నుంచి మనము, మన చుట్టుపక్కల ఉన్నవారు ఎలా రక్షించుకోవాలో తెలిపారు. మనం సోషల్ మీడియా అకౌంట్స్‌లో సెట్టింగ్స్‌ను ఎలా చేసుకుంటే రక్షణ పొందవచ్చు అని సూచించారు. డిజిటల్ అరెస్ట్ అనేది లేనేలేదని లేనిది ఉన్నట్లుగా సైబర్ మోసగాళ్లు చిత్రీకరిస్తున్నారని, మ్యూల్ అకౌంట్స్ ద్వారా డబ్బులు ఎలా వారి ఖాతాలో మళ్లిస్తారు. ఇలా మ్యూల్ అకౌంట్స్‌ను క్రియేట్ చేసి, సైబర్ నేర గాళ్లకు ఇవ్వడం కూడా శిక్షార్హులని తెలిపారు. మ్యూల్ అకౌంట్స్ ముఖ్యంగా రాజస్థాన్, ఢిల్లీ, ముంబై తదితర ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. డిజిటల్ అరెస్ట్ గురించి ఒక చిన్న వీడియోస్ సందేశాన్ని చూపించారు. ఏపికే ఫైల్ ఓపెన్ చేస్తే మీ డివైస్ (మొబైల్, డెస్క్ టాప్, లాప్టాప్) హ్యాక్ అయిపోయి మీ బ్యాంక్ అకౌంట్స్ మీ ఆధార్ డీటెయిల్స్ అన్ని హ్యాకర్ చేతికి వెళ్తాయని క్షుణ్ణంగా వివరించారు. ఎవరైనా సైబర్ క్రైమ్ బారిన పడితే 1930కు కాల్ చేయాలని సూచించారు. అలాగే www. cyber-crime.gov.in ద్వారా కావలసిన సహాయం పొందవచ్చును సూచించారు. కళాశాల సెక్రటరీ టివి రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె.శ్రీలత, ఇన్‌స్పెక్టర్ సుధీర్ కృష్ణ, వాలంటీర్ శశి, పిఆర్వో రవి, సుధాకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.ఏరాజేష్, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు..

దుండిగల్: మైసమ్మ గూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో.. సైబర్ క్రైమ్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పేట్ బషీర్ బాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్.విజయ్ , ఐ ఫోకస్ మిషన్ జాయింట్ సెక్రటరీ శ్రీనాథ్, సైబర్ వారియర్స్ హరీష్ రాజ్ కిరణ్ హాజరయ్యా రు. ఇందులో భాగంగా విజయ్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్‌ను వివరిస్తూ.. వాటిని నివారించడానికి తగు జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. తెలియని నంబర్ల నుంచి ఓటీపీలు వస్తే తెరవరా దన్నారు. అనవసరమైన అప్లికేషన్స్‌ను ఇన్స్టాల్ చేయొద్దని.. వాటి వల్ల అపరిచితుల చేతికి తమ డేటాను ఇచ్చిన వారవుతారని, అందుకు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బ్యాంకుల నుండి వచ్చే ఓటీపీ లు ఇతరులకు చెప్పరాదని శ్రీనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ జె.నర్సింహారెడ్డి, కార్యదర్శి జె త్రిశూల్ రెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి , డైరెక్టర్ డా.ఎ.మోహన్, ప్రిన్సిపాల్ డా.ఆర్. లోకనాథం,పలు విభాగాధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.



సెంట్రింగ్ కార్మికుడికి అండగా సీఐటీయూ

- సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్
- కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం సీఐటీయూ ఆధ్వర్యంలో అందజేత



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

విధి నిర్వహణలో నాలుగో అంతస్తుపై నుంచి కింద పడి తీవ్ర గాయాల పాలైన సెంట్రింగ్ కార్మికుడి కుటుంబానికి సీఐటీయూ అండగా ఉంటుందని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ భరోసా ఇచ్చారు. నియోజకవర్గ పరిధిలోని గాజులరామారం డివిజన్ శ్రీరామ్ నగర్‌కు చెందిన గైక్వాడ్ బాలాజీ భవన నిర్మాణ సెంట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో శ్రీనివాసనగర్ కాలనీలో నాలుగవ అంతస్తులో సెంట్రింగ్ చెక్క కొడుతూ ప్రమాదవశాత్తు కిందపడి రెండు కాళ్ల, వెన్నుపూస విరిగిపోయి తీవ్రగాయాల పాలయ్యాడు. ఇంటి యజమాని వెంకటరెడ్డి నిజాంపేట్‌లో ఒక ప్రయివేటు హాస్పటల్లో చేర్చి, వైద్యం ఖర్చులు చెల్లించి.. హాస్పటల్ నుండి వెళ్లిపోయాడు. వైద్య ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో హాస్పిటల్ యాజమాన్యం రోగిని వెంటనే తీసుకెళ్లాలని ఒత్తిడి తేవడంతో.. దిక్కుతోచని సెంట్రింగ్ కార్మికుడి కుటుంబసభ్యులు సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల నాయకులను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వారికి క్షుణ్ణంగా వివరించారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసిసీఐటీయూ నాయకులు హాస్పటల్‌కు చేరుకొని ఇంటి యజమానితో చర్చించి, రూ.5 లక్షలు కుటుంబ సభ్యులకు, హాస్పిటల్లో వైద్య ఖర్చులకి మూడు లక్షల రూపాయలు ఇప్పించారు. ఎంతో గొప్ప మనసుతో తమకు చేయూతనందించేందుకు అండగా నిలబడ్డ సిఐటీయు నాయకులకు రుణపడి ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ అసంఘటిత రంగంలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి కార్మిక చట్టాలు లేకపోవడం వల్ల ఇంటి యజమానుల, బిల్డర్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడ వలసి వస్తుందన్నారు. దాదాపు మన రాష్ట్రంలో 50 లక్షల మంది అసంఘటిత రంగంలో మేస్త్రీలు,పారకాళ్లు, సెంట్రింగ్, ఎలక్ట్రీషన్లు, ప్లంబర్లు కార్పెంటర్లుగా పనిచేస్తున్న కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక భద్రత కల్పించి ప్రభుత్వమే ఉచితంగా వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు పసుల అంజయ్య, జిల్లా నాయకులు ఐలాపురం రాజశేఖర్, శంకర్, చంద్రశేఖర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రతి ఒక్కరూ తమ ఇండ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ అన్నారు. బుధవారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఇంద్రహిల్స్, రాంకి పెరల్ మధ్యలో ఉన్న, నాలా వద్ద చెత్త పేరుకుపోయి దోమల సమస్య ఎక్కువగా ఉందన్నారు. చుట్టుప్రక్కల ఉన్న కాలనీ ప్రజలు సమస్యను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ సమస్యను స్వయంగా పరిశీలించారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చి, నాలా వద్ద ఉన్న చెత్తను వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కూడా తమవంతు బాధ్యత వహించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వారానికి ఒకసారైనా తనిఖీచేసుకుని మీ ఇంటి పరిసరాలలో ఉన్న నీటి నిల్వలను తొలగించాలని అన్నారు. చెత్తను వీధుల్లోనూ, కాలువలోను, చెరువుల్లోనూ వేయకుండా, తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'జేఎన్‌టీయూలో సమస్యలను పరిష్కరించాలి'



- ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డికి వినతి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్‌టీయూ విశ్వ విద్యాలయంలో సమస్యలను పరిష్కరించాలని బుధవారం జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో.. జేఎన్‌టీయూహెచ్ ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు రాహూల్ నాయక్ జేఎన్టీయూ హెచ్ ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైస్- ఛాన్సర్ ముందుగా వసతి గృహలకు వచ్చి విద్యార్థులతో కలిసి భోజనం చేయటాన్ని విద్యార్థి సమాజం స్వాగతిస్తుందన్నారు. విశ్వవిద్యాలయాల్లో చాలా రోజులుగా పెండింగ్లో ఉన్న డ్రయినేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. జేఎన్‌టీయూ హెచ్ మెట్రో స్టేషన్‌కు దగ్గరగా ఉండేలా విశ్వవిద్యాలయంలోకి ప్రవేశించే విధంగా ఒక రివాల్వింగ్ గేట్‌ను ఏర్పర్చాలన్నారు. జేఎన్‌టీయూహెచ్ ప్రధాన ద్వారం ఎదురుగా రోడ్డు దాటే సమయంలో యాక్సిడెంట్లు, అవుతున్నాయని, రోడ్డు దాటేందుకు వీలుగా, ట్రాఫిక్‌కి సైతం అంతరాయం కాకుండా.. ఒక ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలన్నారు. విశ్వవిద్యాలయంలో చాలా రోజులుగా దీనావస్థలోలో పని చేయకుండా ఉన్న వాటర్ ప్లాంట్‌ను మరమ్మతులు చేయించాలని, తద్వారా మంచి నీటి సమస్యను పరిష్కారం చేయవచ్చున్నారు . వసతి గృహలలోని గదులకు పెయింటింగ్ వేయించి నూతనీకరించాలన్నారు. సాధ్యమైనంత త్వరగా నూతన వసతి గృహలను పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. నూతన కోర్సులకు, నూతన కళాశాలలకు కావల్సిన భవనాలు నిర్మాణం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేయాలన్నారు. సరిపడా అధ్యాపకులను రిక్రూట్ చేసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయంలో బయట వ్యక్తులు జోక్యాన్ని తగ్గించి, అసాంఘిక కార్యకలాపాలకు చరమ గీతం పాడాలన్నారు. విశ్వవిద్యాలయంలో చదువుకునే ప్రశాంతమైన వాతావరణాన్ని నిర్మాణం చేయాలన్నారు. ఇట్టి విషయాలపై సైతం సానుకూలంగా వైస్ ఛాన్సలర్ స్పందించారు. డ్రయినేజీ సమస్యను జీహెచ్ఎంసీ అధికార యంత్రాంగం ద్వారా పరిష్కారం చేసేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. డిపార్ట్మెంట్ల వారీగా నివేదికలను తెప్పించుకొని విశ్వవిద్యాలయ అభివృద్ధికి సమస్యల పరిష్కారానికై ఆలోచనలను చేస్తున్నామని అన్నారు. విద్యార్థుల సమస్యలను తమ దృష్టికి తీసుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు అరవింద్ కుమార్, రోహిత్ రెడ్డి, దుర్గాప్రసాద్, ధనుంజయ్, హేమంత్, ఆనంద్, రిత్విక్, గౌతమ్ జవ్వాజి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీల సమస్యలు పరిష్కరించాలి



- లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన
- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మెప్మాల సమస్యలు పరిష్కరించాలనీ, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్ అన్నా రు. రాష్ట్ర పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ హరి తహారం, పట్టణ ప్రగతి, తడి చెత్త, పొడి చెత్త, స్వ చ్ఛ సర్వేక్షణ్, డబుల్ బెడ్ రూం సర్వే, అనాథ పిల్లల సర్వే, బతుకమ్మ చీరల పంపిణీ, బీఎల్ఓ డ్యూటీలు, మహిళలకు బ్యాంకు రుణాలు ఇప్పించడం, స్త్రీ నిధి పని, ఇలా అనేక రకాల పనులు ప్రభుత్వం మెప్మా ఆర్పీలతో చేయిస్తుంది కానీ, జీతం మాత్రం నెలకు రూ.6వేలు ఇచ్చి చేతులు దులుపుకోవడం చాలా దారుణ మన్నారు. రూ.6 వేలతో కుటుంబాన్ని ఎలా గడపాలని ప్రశ్నించా రు. ఈ రాష్ట్రంలో ఉన్న ప్రజాప్రతినిధుల కుటుంబం ఎవరైనా రూ.6వేలతో బతకగలరా..? అని ప్రశ్నించారు. వెంటనే ఆర్పీల సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరిం చారు. అనంతరం మెప్మా ఆర్పీల నూతన జిల్లా కమిటీ ఎన్నుకున్నారు.



ఆర్పీల నూతన జిల్లా కమిటీ ఇలా..

జిల్లా అధ్యక్షురాలుగా ఎన్. బాలమణి, కార్యదర్శిగా సీహెచ్. నంద, ఉపాధ్యక్షులుగా ఎం.లక్ష్మి, వి.కవిత, సహాయ కార్యదర్శులుగా వినోద, జ్యోతి, కోశాధికారిగా ఎన్.సునీతను ఎన్నుకున్నారు.

డిమాండ్లు ఇలా..

1. జీవో 60 ప్రకారం కనీస వేతనం రూ.26 వేలివ్వాలి.
2. ఆర్పీలందరికీ రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం కల్పించాలి
3. ఆర్పీలకు ప్రతినెలా రెగ్యులర్‌గా వేతనాలు ప్రభుత్వమే వారి వ్యక్తిగత ఖాతాల నుంచి చెల్లించాలి.
4. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన డ్రెస్ కోడ్ అమలు చేయాలి.
5. ఆర్పీలందరికీ గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు ఇవ్వాలి.
6. ఉద్యోగ భద్రత కల్పించాలి.
7. అధికారుల వేధింపులు అరికట్టాలి.

వాకిటి రామ్ రెడ్డి కవితకు ప్రథమ పురస్కారం



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ పరిధి రంగారెడ్డి నగర్‌కు చెందిన అభినవ కవి, మానస టూల్ టెక్ అధినేత, ఆత్మీయ భారతీ సాహిత్య సేవ సంస్థ అధ్యక్షులు వాకిటి రామ్ రెడ్డి వ్రాసిన "మరపురాని బంధం" కవిత ప్రథమ స్థానంలో నిలించింది. అరుణాక్షర కవిత తోరణాలు సంస్థ అంతర్జాలంలో నిర్వహించిన కవిత పోటిలో పాల్గొన్నారు. రుధిరం పంచుకొని మాతృగర్భము, రూపమైన జన్మ బంధల అనుబంధం,కవితతో ప్రథమ విజేతగా ఆయన నిలిచారు. ఈ సందర్భముగా సంస్థ అధ్యక్షురాలు అరుణ కోదాటికి ఆత్మీయ అతిథి కృష్ణక్కకి, సమీక్షకులు నాయకంటి నరసింహ్మారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భముగా స్పెషల్ గ్రేడ్ కలెక్టర్, ప్రముఖ కవి ఏనుగు నరసింహ్మా రెడ్డి శుభాకాంక్షలు తెలుపుతూ..సాహిత్య సామాజిక సేవలో వాకిటి రామ్ రెడ్డి మరింత గొప్పగా రాణించారని మరన్ని అవార్డులు అందుకోవాలని కొనియాడారు. ఈ సందర్భ ముగా సాహితీ వేత్తలు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు వాకిటిరామ్ రెడ్డికి అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు.

నాణ్యత పాటించకుంటే ఉపేక్షించేది లేదు





- కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించ కుంటే ఉపేక్షించేది లేదని రంగారెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ గౌడ్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించా రు.ఈ మేరకు బుధవారం డివిజన్ పరిధి లోని సౌభాగ్య నగర్‌లో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను, ఇందిరాగాంధీ నగర్‌లో జరుగుతున్న మంచినీటి పైప్ లైన్ పనులను, గిరినగర్‌లో ధ్వంసమైన రోడ్లను జలమం డలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా ప్రాంతా ల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా పనులు వేగవంతం గా పూర్తి చేయాలని సూచించారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన సహిసహించబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ వైన్స్‌ను తొలగించాలి



- నవయువక యూత్ అసోసియేషన్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ జనతా నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న. శ్రీ కృష్ణ వైన్స్‌ను తొలగించాలని, నవయువక యూత్ అసోసియేషన్ సభ్యులు, మరోసారి బాలానగర్ ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశా రు. గత నెలలోనే ఫిర్యాదు చేసినప్పటికీ, ఎక్సైజ్ అధికారులు మామూళ్లు మత్తులో మునిగి, నిర్వాహకులకు వంత పాడుతూ.. స్థానికుల ఇబ్బందులు పట్టించుకోవట్లేదని ఆరోపించారు. వైన్స్ పర్మిషన్ ఒక ఇంటి నెంబర్ మీద తీసుకొని, నిబంధనలు తుంగలో తొక్కి, దానికి ఆనుకుని ఉన్న నివాసయోగ్యమైన ఇంటిలో అదనంగా పర్మిట్ రూం నిర్వహిస్తున్నారని తెలిపారు. మందుబాబులు మద్యం సేవించి, స్థానికంగా ఉండే మహిళలను అసభ్యకరమైన పదజాలంతో దూషించడమే కాకుండా, నివాస స్థలాల వద్ద బహిరంగ మూత్రవిసర్జన చేస్తున్నారని ఆరోపించారు. దీని మీద ఎక్సైజ్ అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

గాగీల్లాపూర్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ చర్చి గాగిల్లాపూర్‌లోని సెంట్ ఇగ్నేటస్ చర్చిలో ఈ నెల 25వ తేదీన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో.. జరుగు క్రిస్టమస్ వేడుకలకు కమిటీ ఆహ్వానం మేరకు.. బుధవారం వారితో కలిసి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవలు పవిత్రంగా పూజించే క్రిస్మస్ పండుగ ఘనంగా నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఈ కార్యక్ర మంలో సీనియర్ నాయకులు సుధాకర్ రెడ్డి, రంజిత్ రెడ్డి, చర్చ కమిటీ సభ్యులు రాజారెడ్డి, స్లీవా రెడ్డి, అర్ల రెడ్డి, బాల్ రెడ్డి, ప్రశాంత్, ప్రణీత్, సతీష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఈసెట్ కన్వీనర్‌కు సత్కారం



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్ర ఈసెట్ కన్వీనర్‌గా నియమితులైన ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్. చంద్రశేఖర్‌ను బుధవారం పలువురు పూలగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్, తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, టీఎస్‌పీ జేఏసీ ఫౌండర్ వలిగొండ నరసింహ, రామరపు శ్రీనివాస్ మాదిగ, మంద రాజు మాదిగ, జనపాల మహేష్ మాదిగ, అజయ్ స్వామాట్, వంశీ, అభినవ్ మాదిగ, శ్యామ్ మాదిగ, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రైలు ఢీ కొట్టడంతో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. నాంపల్లి హైదరాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫతేనగర్ రైల్వే స్టేషన్ వద్ద రైలు ఢీ కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడని, మృతుని వయస్సు సుమారు 45 ఏండ్లు ఉంటాయాన్నారు. సమాచారం అందుకున్న అనంతరం ఘటన స్థలానికి చేరుకుని మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుని గురించి తెలిసిన వారు రైల్వే పోలీసుల 8712658580, 8712568484 లను సంప్రదించాలని పేర్కొన్నారు.



పదవీ విరమణ ఉద్యోగానికే సేవకు కాదు

- విశ్రాంత న్యాయమూర్తి మీనా కుమారి

నవతెలంగాణ-బంజారాహిల్స్

పదవీ విరమణ ఉద్యోగానికే కానీ సేవా కార్యక్రమాలకు కాదని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి మీనా కుమారి తెలిపారు. తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సంఘం వ్యవస్థాపకులు రాచకొండ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా అమె హాజరై మాట్లాడారు. వయసు రిత్యా పదవీ విరమణ ప్రతి ఒక్కరికి తప్పనిసరన్నారు. యుక్త వయసులో ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహించి పదవి విరమణ అనంతరం ఇంటికే పరిమితం కాకుండా వివిధ సేవా కార్యక్రమాతో ముందుకు సాగడం అభినందనీయమని తెలిపారు. అనంతరం తూంభీంసేన్ రావు, అనభేరి నవమోహన రావు, తుల ప్రభాకర్ రావులు మీనా కుమారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కటకం రాజేశ్వర్ రావు, సల్వాజీ జనార్ధన్ రావు, తుల జీవన్ రావు, జగదీశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి ఆటోలో వెళ్లిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఓయూ

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఆటోలో బుధవారం సికింద్రాబాద్ శాసన సభ్యులు తీగుల్ల పద్మారావు గౌడ్ ఆటోలో అసెంబ్లీకి వెళ్లారు. అయిన వెంట బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే బీఎల్ఆర్ ఆటోను నడుపుకుంటూ వెళ్లారు.



అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-బంజారాహిల్స్

బంజారాహిల్స్ డివిజన్ ప్రేమ్‌నగర్‌కి చెందిన లక్ష్మణ్ అనే యువకుడు పెయింటింగ్ పనులు చేసుకుంటూ కుటుంబంతో అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. గత నెల నుంచి అతను పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ.. బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. తదుపరి అంత్యక్రియలు చేయాడానికి అతని తల్లి, భార్య దగ్గర డబ్బులు లేకపోవడంతో రోధింస్తున్నారు. చివరి క్షణాల్లో కార్యక్రమం ఎలా చేయాలో తోచక స్థానికులకు వారి పరిస్థితిని తెలియజేశారు. అనంతరం ప్రేమనగర్ బస్తీ కమిటీ వారు బంజారాహిల్స్ రోడ్ నెంబర్. 12 /13 హిందూ స్మశాన వాటికల సేవా సంఘం అధ్యక్షుడు, సామాజిక సేవకుడు రవీందర్‌కు తెలపడంతో ఆతను ఆర్థిక సహాయంతో పాటు మృతుడు లక్ష్మణ్ అంత్యక్రియలను దగ్గరుండి పూర్తిచేశాడు. ప్రేమనగర్ బస్తీ కమిటీ నాయకులు కే.భగవాన్ దాస్, సుధీర్ కుమార్ మాట్లాడుతూ.. రవీందర్ చనిపోయిన నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించుకుంటూ వారికి సంప్రదాయ పద్ధతిలో ఉచితంగా అంత్యక్రియలు చేయడం చాలా గర్వించదగ్గ విషయమని, స్మశానా వాటికలను అభివృద్ధి చేసి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తున్నందుకు కమిటీ వారు ఆయన కోనియాడుతున్నమని పేర్కొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పనిచేయాలి

- ప్రతి క్లాస్‌లో 75 శాతం మంది విద్యార్థులకు చదవడం రావాలి
- కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, మండల అధికారులు 100 శాతం పాఠశాలలను సందర్శించాలి
- ప్రత్యేక పఠన ప్రణాళికను అమలు చేయాలి
- పాఠశాలల్లో విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించాలి
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లాలో విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా విద్యార్థులకు సరళమైన రీతిలో నాణ్యమైన విద్యా బోధన చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐఓఎస్, కాంప్లెక్స్ హెచ్ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి క్లాస్ రూమ్‌లో 75 శాతం మంది పిల్లలకు చదవడం రావాలని, చదవడం రాయడం అభ్యాస మెరుగుదల కోసం ప్రత్యేక పఠన ప్రణాళికను అమలు చేయాలని అన్నారు. క్లాస్ రూమ్ పరిశీలనకు వెళ్ళినప్పుడు నిర్మాణాత్మకమైన విశ్లేషణ చేయాలని, పరిశీలన స్నేహపూర్వకంగా ఉపాధ్యాయులతో ఉండాలని సూచించారు. తరగతిగది పరిశీలనకు వెళ్ళినప్పుడు ఎఫ్ఎల్ఎన్ సందర్శనాలపై దృష్టి సారించాలని, తరగతి గది పరిశీలన, యాప్‌లో వివరాలను నమోదు చేయాలి.అకాడమిక్ గైడెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించాలని, తక్కువ సందర్శ మండలాలను మెరుగుపరుచుకోవాలని అన్నారు. వర్క్ షీట్‌లను కచ్చితంగా పిల్లలతో చేయించాలని రివ్యూ చేసి కరెక్షన్లు చేయాలని, సోమవారంలోగా బ్యాక్ లైన్ టెస్ట్ చేయాలని తెలిపారు. కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు, మండల నోడల్ అధికారులు 100% పాఠశాలలను సందర్శించాలని వెల్లడించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై, పాఠశాలల్లో నల్ల కలెక్షన్, డ్యూయల్ డెస్క్, మధ్యాహ్న భోజనం సమీక్ష, పదవ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా కార్యచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి రోహిణి, ఉమాదేవి, డిప్యూటీ ఈఓలు, డిప్యూటీ ఐఓఎస్‌లు, కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓయూను సందర్శించిన డైరెక్టర్



నవతెలంగాణ-ఓయూ

ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ బెంగళూరు డివిజన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ ప్రదీప్ కుమార్ బుధవారం ఓయూను సందర్శించారు. ఓయూ వీసీ ప్రొ. కుమార్‌తో సమావేశమై పలు అకడమిక్ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రొ. కుమార్ మాట్లాడుతూ.. ఐసీసీఆర్‌తో కలిసి పనిచేయటంతో పాటు సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటామని అన్నారు. ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఓయూ ఆఫీస్ ఆఫ్ ది ఇంటర్నేషనల్ అఫైర్స్ డైరెక్టర్ ప్రొ. బి. విజయ, ఐసీసీఆర్ విద్యార్థుల సమస్యలు, ఉపకారవేతనాల పొందటంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఐసీసీఆర్ డైరెక్టర్ దృష్టికి తెచ్చారు. అంతకు ముందు ఓయూ పరిపాలనా భవనంలోని సెనెట్ హాల్‌లో వివిధ దేశాలకు చెందిన ఐసీసీఆర్ విద్యార్థులతో డైరెక్టర్ ప్రదీప్ కుమార్‌తో పాటు ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. జి. నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితెందర్ నాయక్ సమావేశమయ్యారు. ఆన్‌లైన్ అడ్మిషన్లు, ఓయూ వెబ్ పోర్టల్‌పై అవగాహన, అడ్మిషన్లకు నోటిఫికేషన్, ఐసీసీఆర్ విద్యార్థుల ఫిర్యాదులు, సహా పలు సవాళ్లు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. పలు సమస్యలను ఈ సందర్భంగా పరిష్కరించే ప్రయత్నం చేశారు. భారత ఆతిద్యాన్ని, ఇక్కడి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ విదేశీ విద్యార్థులకు సూచించారు. నాణ్యమైన పరిశోధనలపై దృష్టి సారించాలని, తమ స్నేహితుల చదువులు, పరిశోధనలకు ఓయూను ఎంపిక చేసుకునేలా ప్రోత్సాహించాలని ఓఎస్డీ కోరారు.

ఎడ్‌సెట్ కన్వీనర్‌గా.. ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ప్రొఫెసరే ఉండాలి

- తెలంగాణ బీఈడీ లెక్చరర్ అసోసియేషన్



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మంగళవారం సాయంత్రం ప్రకటించిన సెట్ కన్వీనర్లలో ఎడ్‌సెట్ కన్వీనర్ నియామకంలో ఫిజిక్స్ డిపార్ట్మెంట్‌కు చెందిన ప్రొఫెసర్ వెంకట్ రామ్ రెడ్డిని కన్వీనర్‌గా నియమించడంపై తెలంగాణ బీఈడీ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అబ్దుల్ ఫరీద్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా డాక్టర్ అబ్దుల్ ఫరీద్ మాట్లాడుతూ.. ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్‌లో ఉన్న ప్రొఫెసర్లకు ఇవ్వకుండా ఫిజిక్స్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ వెంకట్రాంరెడ్డికి ఇవ్వడం నిబంధనలకు విరుద్ధంగా ఉందన్నారు. లా సెట్, ఐసెట్, పిజిఈ సెట్ మొదలైన ఆయా సెట్లకు ఆయా డిపార్ట్మెంట్ లకు చెందిన ప్రొఫెసర్లను నియమించిన ఉన్నత విద్యా మండలి ఎడ్‌సెట్ కన్వీనర్‌గా మాత్రం ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ సంబంధించిన ప్రొఫెసర్ నియమించకుండా ఫిజిక్స్ డిపార్ట్మెంట్ చెందిన ప్రొఫెసర్‌ను నియమించడం విడ్డూరం అన్నారు. అన్ని యూనివర్సిటీలలో ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ఉన్నా ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ నియమించకుండా వేరే డిపార్ట్మెంట్ ప్రొఫెసర్లు నియమించడం తగదన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ విషయం మీద దృష్టి సారించి ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్‌లో బీఎడ్ కాలేజీల మీద, విద్య వ్యవస్థ మీద సంపూర్ణ అవగాహన ఉన్న ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్‌ను నియమించాలని అయిన డిమాండ్ చేశారు. లేదంటే న్యాయ పరంగా ఉద్యమిస్తానం అన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గం టీడీపీ సీనియర్ నాయకులు, రైల్ నిలయం అంబేద్కర్ నగర్ బస్తీ ఫౌండర్ అధ్యక్షులు, పార్టీ బీసీ సెల్ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్ అంజయ్య ముదిరాజ్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన గత కొన్ని నెలల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. సికింద్రాబాద్ విజయ హెల్త్ కేర్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అంజయ్య అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం మారేడుపల్లి హిందూ స్మశాన వాటికలో నిర్వహించనున్నట్టు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు సతీమణి అంబిక, కూతురు రాజేశ్వరి, ఇద్దరు కుమారులు శివకుమార్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్‌లు ఉన్నారు.

హమాలీ రేట్లను పెంచి.. బకాయిలను వెంటనే చెల్లించాలి



నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయాస్ హమాలీ యూనియన్లతో జరిగిన హమాలీ రేట్ల పెంపు అంగీకారం ఒప్పందం ప్రకారం హమాలీ రేట్లను పెంచి, బకాయి హమాలీ రేట్లను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. బుధవారం ఎర్రమంజిల్ సివిల్ సప్లయి కార్యాలయం వద్ద రాష్ట్రంలోని వివిధ గోడౌన్‌లలో పనిచేస్తున్న వందలాది హమాలీ కార్మికులతో కలిసి దిగ్బంధం చేశారు. పెద్ద ఎత్తున హమాలీ కార్మికులు పాల్గొని సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెద్ద ఎత్తున నినాదాలతో పాటు హమాలీ రేట్లను పెంచాలన్నారు. గత కొన్నేండ్లుగా ఏఐటీయూసీ సివిల్ సప్లయాస్ హమాలీ వర్కర్స్ యూనియన్ పోరాటాల ఫలితంగా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌తో జరిగిన ఒప్పందం ప్రకారం ప్రతి రెండేండ్లకు ఒకసారి జనవరి నెల నుంచి హమాలీ రేట్లు, హమాలీ కార్మికుల సంక్షేమ పథకాలను అమలు చేయాలని, ఉన్న జీవోను ప్రతి రెండేండ్లకు ఒకసారి అమలు చేయకుండా.. ఏడాది గడిచిపోతున్నా అధికారులకు కనీస స్పందన లేదని ఎస్.బాల్‌రాజ్ విమర్శించారు. సివిల్ సప్లయాస్ హమాలీలు తమ వీపులపై క్వింటాల్లకొలది నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తూ.. ప్రజా పంపిణీ పథకం సమగ్రంగా నిర్వహించేలా, రేషన్ వినియోగదారులకు ఏలాంటి ఇబ్బందులు రాకుండా పనిచేస్తున్న కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు చెల్లించకుండా శ్రమ దోపిడికి సివిల్ సప్లయాస్ కార్పొరేషన్ కారణమవుతుందని ఆయన వాపోయారు. ముట్టడిలో వందలాది మంది హమాలీ కార్మికులు పాల్గొని నినాదాలు చేస్తున్నా, కమీషనర్ ఇతర అధికారులు రాకుండా నిర్లక్ష్యం చేయటాన్ని నిరసిస్తూ.. హమాలీ కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ గేటును తొలగించి లోపలికి ప్రవేశించే ప్రయత్నం చేయటంతో సివిల్ సప్లయిస్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ హమాలీల వద్దకు వచ్చి మాట్లాడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో ఆవేశంతో ఉన్న హమాలీ కార్మికులు మరింత పెద్ద ఎత్తున నినాదాలు చేసి అధికారుల అలసత్వాన్ని నిలదీశారు. ముట్టడి చేస్తున్న హమాలీ కార్మికులకు కనీసం భరోసా ఇవ్వకుండా డైరెక్టర్ వెళ్ళిపోవటంతో హమాలీ కార్మికులు మరింత పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగించారని ఆయన తెలిపారు. తప్పని పరిస్థితిలో డైరెక్టర్ నాయకులను పిలిచి మెమోరాండాన్ని తీసుకొని 15 రోజుల లోపు జీవో విడుదల చేసి రావాల్సిన బకాయిలను ఇతర సౌకర్యాలను తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. డిసెంబర్ 31లోపు జీవో విడుదల చేసి బకాయిలను చెల్లించకుంటే జనవరి 1 నుంచి నిరవధిక సమ్మెకు వెలుతామని సమ్మె నోటీస్ ఇవ్వటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ ముట్టడి కార్యక్రమంలో సివిల్ సప్లయాస్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మునీశ్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వై.ఓమయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య, వివిధ గోడౌన్‌లలో పనిచేస్తున్న వందలాది హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

నేడు అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఓయూ

భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్‌పై అవమానకర రీతిలో పార్లమెంట్‌లో వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా హోంశాఖకి రాజీనామా చేయాలని, దేశ ప్రజలకి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఓయూ విద్యార్థులు డిమాండ్ చేశారు. అందుకు నేడు ఓయూలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం కార్యక్రమన్ని ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నారు. ప్రజాస్వామికవాదులు, విద్యార్థి సంఘాల నాయకులు రాజ్యాంగ పరిరక్షకులు హాజరు కాగలరని, ఓయూ ఐక్య విద్యార్థి, దళిత బహుజన విద్యార్థి సంఘాల నాయకులు వలిగొండ నరసింహ, జంగిలి దర్శన్, ప్రణయ్, సమీర్, వేదాంత్ మౌర్య ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ప్రధాన అర్చకులు ఆకస్మిక మరణం బాధాకరం

- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు మాడభూషిని రామాచార్యులు ఆకస్మిక మృతి బాధాకరమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గూడ ఐలయ్య గౌడ్ విచారం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం ప్రధానార్చకులు రామాచార్యులు మృతి చెందిన విషయం తెలుసుకొని కాంగ్రెస్ నాయకులతో కలిసి భౌతికకాయంపై పూలమాలలు వేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవిష్యత్తులో వారి కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

రాజ్‌భవన్‌ను ముట్టడికి తరలిన నాయకులు



బోరబండ కార్యకర్తలు


ర్యాలీలో మేయర్ డిప్యూటీ మేయర్


ర్యాలీలో అదం సంతోష్ కుమార్


ధర్నాలో సీఎన్ రెడ్డి


ధర్నాలో నవీన్ యాదవ్


నిరసనలో రోహిన్‌రెడ్డి


ఓయూలో బైక్ ర్యాలీ

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

టీపీసీసీ ఆధ్వర్యంలో ఛలో రాజ్‌భవన్ కార్యక్రమానికి బోరబండ నుంచి సుమారు 200 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బోరబండ కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా పసివుద్దీన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా వెళ్లారు. దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా గౌతమ్ అదానీ ఆర్థిక అవకతవకలు, మణిపూర్ అల్లర్లపై ప్రధాని మోదీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, ఏఐసీసీ పిలుపు మేరకు ఛలో రాజ్‌భవన్ కార్యక్రమం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోరబండ నుంచి పెద్ద ఎత్తున మోడీ డౌన్ డౌన్, మోడీకి హటావో దేశ్‌కి బచావో, మోడీ-ఆదాని భాయ్ భాయ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు వెళ్లారు. అక్కడినుంచి సీఎం రేవంత్ రెడ్డి గారితో భారీ ర్యాలీగా రాజ్‌భవన్ వరకు బయలుదేరారు.

తెలంగాణ పీసీసీ ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది యువకులు మోటార్ సైకిల్‌పై ర్యాలీగా రాజ్ భవన్‌కు వెళ్లారు. మోడీ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ భారీ నిరసన తెలిపారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డితో కలిసి భారీ ర్యాలీగా రాజ్‌భవన్‌ను ముట్టడించారు.

నవతెలంగాణ-ఓయూ

కాంగ్రెస్ ప్రభుత్వం బుధవారం రాజ్‌భవన్‌ను ముట్టడిచేసింది. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్ రెడ్డి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ యువజన నాయకులు పాల్గొన్నారు.

ఆదానిపై, మణిపూర్ ఘటనపై, మోడీ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నెక్లెస్ రోడ్ నుంచి రాజ్‌భవన్ వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన ర్యాలీలో అదం సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ నియోజకవర్గం సీతాఫల్మండి అంబేద్కర్ స్టాచ్యూ నుంచి వందలాది మందితో బైక్ ర్యాలీ ఏర్పాటు చేసి రేవంత్ రెడ్డి చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు.

ఏఐసీసీ పిలుపుమేరకు బుధవారం ఛలో రాజ్‌భవన్ కార్యక్రమన్ని ఓయూ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మేడ శ్రీను నిర్వహించారు. ఈ సందర్భంగా ఓయూ ఆర్ట్స్ కళాశాల నుంచి భారీగా బైక్ ర్యాలీతో రాజ్ భవన్‌కు ఎన్ఎస్‌యూఐ విద్యార్థులు తరలి వెళ్లారు. సాయి ఓంకార్ గౌడ్, మోహన్, సికింద్రాబాద్ కాలేజీ అధ్యక్షుడు, సురేష్, అభిరామ్, ఓంప్రకాశ్, సుమంత్, రగ్గుదీప్, రవి, చైతన్, వెంకట్, మల్లేష్, భార్గవ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఏఐసీసీ పిలుపు మేరకు ఛలో రాజ్ భవన్ కార్యక్రమం. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీ నేతృత్వంలో నిర్వహించారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఛలో రాజ్ భవన్‌కు బయలుదేరిన రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, డివిజన్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఛలో రాజ్‌భవన్ కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు డాక్టర్ సి.రోహిన్ రెడ్డి, కార్పొరేటర్లు వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్‌లు, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చలో రాజ్ భవన్ పిలుపు మేరకు ర్యాలీ..

- ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు ఎం. యుగంధర్ రెడ్డి

నవతెలంగాణ - బాలానగర్



ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ పిలుపు మేరకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఛలో రాజ్ భవన్ కార్యక్రమంలో కాంగ్రెస్ కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, మేడ్చల్ డిస్ట్రిక్ట్ ఫిషర్మన్ కమిటీ వైస్ చైర్మెన్ ఆకుల నరేందర్ తదితరులతో పాటు పార్టీ డివిజన్ అధ్యక్షులు, మహిళా డివిజన్ అధ్యక్షురాళ్లు, మహిళలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రోడ్లను కబ్జా చేస్తున్నారని కమిషనర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-దుండిగల్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధిలోగల రేణుక ఎల్లమ్మ కాలనీ సర్వే నెంబర్486, 485 లో 13 ఎకరాలకు సంబంధించిన లేఔట్ లోని 25 ఫీట్ల, రోడ్డు3 0 ఫీట్ల రోడ్డులను రైజ్ (హరిజోన్ (ప్రాజెక్ట్) వారి నిర్మాణంలో భాగంగా కబ్జా కు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ రేణుక ఎల్లమ్మ కాలనీవాసులు బుధవారం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కబ్జాను నియంత్రించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ 8 నెలల క్రితం సైతం అధికారుల దృష్టికి తీసుకువచ్చామని ఇప్పటివరకు చర్యలు చేపట్టడం లేదని ఇప్పటికైనా అక్రమ నిర్మాణంపై చర్యలుచేపట్టాలని కోరారు.

ఏసు క్రీస్తు జీవితం ఇతరుల పట్ల ప్రేమను పెంచుతుంది

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నవతెలంగాణ-బేగంపేట్



ఏసు క్రీస్తు జీవితం ఇతరుల కోసం ప్రేమను పెంచేలా ఎంతో ప్రేరేపిస్తుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. యునైటెడ్ క్రిస్టమస్ సెలబ్రేషన్స్ కమిటీ, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ సంయుక్త ఆధ్వర్యంలో 16వ గ్రేటర్ హైదరాబాద్ క్రిస్మస్ ఉత్సవాలు సికింద్రాబాద్ పేజీ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఏసు క్రీస్తు నాడు అందించిన సందేశం అందరిని ఏకం చేస్తుం దన్నారు. త్రిపుర రాష్ట్రంలో కులం, మతం లేకుండా అందరూ క్రిస్మస్‌ను జరుపుకోవడం తాను అక్కడ చూశానని అన్నారు. కార్డినల్ పూల ఆంథోనీ మాట్లాడుతూ ప్రపంచ మానవాళిని రక్షించడానికి ఏసు క్రీస్తు మానవుడి రూపంలో ఈ లోకానికి వచ్చాడని అన్నారు. శాంతికి ప్రతి రూపం ఏసు క్రీస్తు అని, ప్రపంచం మొత్తం శాంతి నెలకొనాలని ఆయన అన్నారు. తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ ప్రధాన కార్యదర్శి పాస్టర్ టీ భాస్కర్ మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినం అనేది శాంతికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూసీసీ కమిటీ చైర్ పర్సన్ రైటైర్డ్ ఐఏఎస్ అధికారిణి జీడీ అరుణ, ప్రధాన కార్యదర్శి స్టీవా గెలెలీ, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మెన్ దీపక్ జాన్ , సీఎస్ఐ డిప్యూటీ మాడరేటర్ రూబెన్ మార్క్, బిషప్ ఎంఏ డేనియల్, పాస్టర్ పురుషోత్తం తదితర ప్రముఖులతో పాటు అన్ని సంఘాలకు చెందిన బిషప్లు, పాస్టర్లు పాల్గొన్నారు. తెలుగు, ఇంగ్లీష్ టాబెర్నాకిల్స్ క్వయర్ మధురమైన పాటలను ఆలపించారు. బైబిల్ క్విజ్‌తో పాటు క్రీస్తు జననంకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి

- ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

తెలంగాణ విద్యా శాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్దతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుదవారం హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయ ఆవరణలో ధర్నా నిర్వహిస్తున్న సమగ్ర శిక్షా దీక్ష శిబిరానికి శ్రీకాంత్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్‌లి మాట్లాడుతూ.. ద్వితీయ శ్రేణి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. గత 2023 సంవత్సరంలో బీఆర్ఎస్ హయాంలో నాటి తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెగ్యులర్ చేస్తామని హామీని ఇప్పుడు విస్మరించడం శోచనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయిలో సిస్టం అనలిస్ట్, టెక్నికల్ పర్సన్స్, ఆపరేటర్లు, డేటా ఎంట్రీ, క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్, పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్స్, స్పెషల్ ఆఫీసర్స్, అటెండెర్స్, తదితర వివిధ విభాగాలలో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది పనిచేస్తున్నారన్నారు. వీరందరూ చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నా, ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అదే విధంగా సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత తో కూడిన పే స్కేల్ ఇవ్వాలని, ప్రభుత్వ మరియు విద్యా శాఖ నియామకాలలో స్థిరత్వాన్ని కల్పించాలనే డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన దీక్షలు చేస్తున్న ప్రభుత్వం అలసత్వం వహించడం సిగ్గు చేట న్నారు. విద్యా శాఖను గాడిలో పెట్టాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి అదే విద్య శాఖ ఉద్యోగుల పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘ అధ్యక్షుడు, కార్యదర్శి శ్రీనివాస్, ఇంద్రకంటి సరిత.నవనీత, శ్రీవాణి, రమ్య, షేక్ పాషా, సరస్వతి, మోహన్ లతో పాటు 100మంది వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



ఓఎంసీపై డీఈవో జట్టు విజయం

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా నిర్వహిస్తున్న 11వ బి.స్వామినాథన్ క్రికెట్ టోర్నమెంట్-2025 రెండవ రోజు బుధవారం గగన్ మహల్ మైదానంలో జరిగాయి. కోటి ఉస్మానియా మెడికల్ కాలేజ్ టీంతో జరిగిన మ్యాచ్‌లో జిల్లా విద్యాశాఖ జట్టు విజయం సాధించింది. డీఈవో క్రికెట్ జట్టు స్కోర్ 10 ఓవర్లలో 162 పరుగులు చేయగా..ఓఎంసీ జట్టు 10 ఓవర్లలో 152 పరుగులు చేసింది. టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) పూర్తి మద్దతుతో టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా 11వ స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. జిల్లా అధ్యక్షులు ఎస్.విక్రమ్ కుమార్, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ ఖలీద్ అహ్మద్, పబ్లిక్ సెక్రటరీ వైదిక్ శాస్త్ర, ఈసీ మెంబర్లు శ్రీధర్, ముఖీమ్ ఖురేషీతో పాటు కార్యవర్గం టీజీవోస్ జిల్లా అధ్యక్షులు ఎంబీ కృష్ణ యాదవ్ ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్, డీఈవో క్రికెట్ టీమ్ కెప్టెన్ కె.ఆర్.రాజ్‌కుమార్, ఎం.భాస్కర్, అఖిల్, అజరుల్లా ఖాన్, మోసిన్, మహమూద్ అలీ, అజర్, ఇంతియాజ్, ఇరాఫామీర్, ఫెర్రోస్, అంజి, విక్రమ్, ప్రకాష్, కరుణాకర్, యోగి, టీమ్ సభ్యులు బాబులూ, చంద్రశేఖర్ రెడ్డి, పద్మ, సంధ్యారాణి, వనజ, అనిల్, సమీ, పరమేష్, దామోదర్, పురుషోత్తం, శంకర్‌లకు వారు అభినందనలు తెలియజేశారు.



ఎన్నికల ప్రక్రియతోనే పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుల ఎన్నిక నిర్వహించాలి

- కులసంఘాల పెద్దల తీర్మానం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షుల ఎన్నిక ఎన్నికల ప్రక్రియతోనే నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర,జిల్లా,స్థానిక పెద్దలు తీర్మానం చేశారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శనగర్ కమిటీ హాల్ లో నియోజకవర్గం పద్మశాలి సంఘం అధ్యక్షులు ఏర్వ శంకరయ్య అధ్యక్షతన నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు, మాట్లాడుతూ వర్గవిభేదాలకు తావివ్వకుండా ప్రతి ఒక్క కులస్తుడు సంఘ అభివృద్ధికి, అభ్యున్నతికి పాటుపడాలని ఆ దిశగా ముందుకు సాగుదామని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు పెద్ది మల్లేశం,పెండ్యం లక్ష్మీ నరసయ్య,కాముని శ్రీనివాస్‌తో పాటు ప్రాంతాల కుల సంఘం నేతలు కంది శ్రీరాములు,పాలడుగు సత్యనారాయణ,ఎలిగేటి అమర్నాథ్,పోలా బద్రి, కొండ శ్రీకాంత్,నారా వెంకటేష్,వనమాల జనార్ధన్, రాష్ట్ర,జిల్లా నేతలు మేకల మల్లేష్,భోగ కోటేష్, సిద్ధిరాములు, నాగేందర్,లక్ష్మణ్,జి.మల్లేశం, యాదగిరి,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

- రెండో రోజు పలు జట్ల విజయం

నవతెలంగాణ-సిటీబ్యూరో



తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్.విక్రమ్ కుమార్ ఆధ్వర్యంలో 11వ బి.స్వామినాధమ్ క్రికెట్ టోర్నమెంట్-2025 రెండో రోజు బుధవారం క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌లకు ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) ముఖ్యఅతిథిగా గగన్ మహల్ మైదానికి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.బి.కృష్ణ యాదవ్, సెంట్రల్ యూనియన్ సభ్యులు బొల్లిగిద్ద శంకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్.రాజ్ కుమార్, సభ్యులు కుర్రాడి శ్రీనివాస్, ఖలీద్ అహ్మద్, వైదిక్ శాస్త్ర, ముకీమ్ ఖురేషి, జహంగీర్ పాషా, ముహమ్మద్ వహీద్, ముస్తఫా షరీఫ్, మాజీ కార్యదర్శి జి.ప్రభాకర్ పాల్గొన్నారు. రెండవ రోజు జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఐ.జీ.రిజిస్ట్రేషన్, హైదరాబాద్ యూత్ ఫోర్స్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సెంట్రల్ లైబ్రరీ, డీఈవో ఆఫీస్, ఎక్సైజ్ ప్రోహిబిషన్ జట్లు విజయం సాధించాయి.

రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో కంటి అద్దాలు పంపిణీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల చిలకలగూడ దూదిబావి పాఠశాలలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో ఈనెల ఒకటో తేదీన పుష్పగిరి కంటి ఆస్పత్రి, మా ఈఎన్‌టీ ఆస్పత్రి డాక్టర్లు సహకారంతో బస్తీ ప్రజలకు కంటి, చెవ్వు, గొంతు, ముక్కు పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించిన 144 మందికి బుధవారం ముఖ్యఅతిథిగా డాక్టర్ రాంప్రసాద్(డీజీఈ), గౌరవ అతిథులుగా రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షులు బాలకోటీ రెడ్డి, డైరెక్టర్ సర్వీస్ రాజా కృష్ణ, పుష్పగిరి కంటి ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ పుష్ప, గిరి కంటి ఆస్పత్రి క్యాంప్ ఇన్‌చార్జి అరుణ్ విచ్చేసి కంటి అద్దాలు పంపిణీ చేశారు. బస్తీ కమిటీ నాయకులు మల్లేష్, కుమార్, టీచర్లు ఆయేషా అంజూమ్, మల్లేశ్వరి, హసీనా బేగం, సాలెహ, షహీన సుల్తానా, శిరీష పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి బాలకోటి రెడ్డి మాట్లాడుతూ రోటరీ అంటే కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా సేవా చేసే సంస్థ అని తెలిపారు. బాలకోటి రెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామనీ, నోట్ బుక్స్ పంపిణీ చేశామన్నారు. రాజా కృష్ణ మాట్లాడుతూ తాము ఇచ్చే అద్దాలను సరిగా వాడుకోవాలన్నారు. బస్తీ నాయకులకు, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, పుష్ప గిరి ఆస్పత్రి వారికి పాఠశాల తల్లి దండ్రుల, ఉపాధ్యాయుల తరుపున ధన్యవాదములు తెలిపారు.

రైలులో బంగారు అభరణాలు, సెల్ ఫోన్లు చోరీ

నవతెలంగాణ-అంబర్‌పేట

ఒకే రైల్లోనే రెండు భోగిలలో ప్రయాణం చేస్తున్న ఇద్దరు ప్రయాణికుల బంగారు నగలు సెల్ ఫోన్ లను దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పిఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం మూసాపేటకు చెందిన దినేష్ కుమార్ జైన్ అహ్మదాబాద్ కాచిగూడ ఎక్స్ప్రెస్ రైలులో నగరానికి వస్తున్నాడు. అయితే అతని బ్యాగులో ఉన్న 11 గ్రాముల బంగారు నగలు దొంగలు తస్కరించారు. మరో సంఘటనలో నాచారం కు చెందిన శివాజీ అదే రైలులో నగరానికి వస్తుండగా బ్యాగులో ఉన్న 35 గ్రాముల బంగారు నగలు, రెండు సెల్ ఫోన్ లను దొంగలు తస్కరించారు. బుధవారం రాత్రి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఖాళీ స్థలాల సరిహద్దులను డిజిటలైజ్ చేసి జియో ఫెన్సింగ్ చేయాలి

- జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కాలనీ లేఅవుట్‌లలోని అన్ని పార్కులు, ఖాళీ స్థలాల సరిహద్దులను చీఫ్ సిటీ ప్లానర్, టౌన్ ప్లానింగ్ విభాగం సమన్వయంతో డిజిటలైజ్ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్లు, చీఫ్ సిటీ ప్లానర్ లతో కలిసి కమీషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలనీ లేఅవుట్‌లలోని అన్ని పార్కులు, ఖాళీ స్థలాల సరిహద్దులను డిజిటలైజ్ చేసి జియో ఫెన్సింగ్ చేయాలని తెలిపారు. ప్రతి ట్రీ పార్కులకు, ఖాళీ స్థలాలకు ప్రత్యేక ఐ.డి ఇవ్వాలని తెలిపారు. 2000 చదరపు గజాల కంటే ఎక్కువ ఖాళీ ప్రదేశాలను పార్కులుగా అభివృద్ధి చేయాలన్నారు. పార్క్ ప్రాంగణంలో అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు చేపట్టాలని, ఏదైనా ఉల్లంఘనలు గుర్తించబడితే తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని సర్కిల్ మేనేజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు / టెక్నికల్ అసిస్టెంట్ / హార్టికల్చర్ అసిస్టెంట్లు తమ పరిధిలోని పార్కులను కనీసం నెలకు ఒకసారి సందర్శించి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ లతో సమావేశాలు నిర్వహించి పార్క్ తనిఖీ నివేదిక ఫార్మాట్ ద్వారా ప్రతి నెలా 5వ తేదీలోపు అర్బన్ బయోడైవర్సిటీ అదనపు కమిషనర్ కు నివేదిక సమర్పించాలని తెలిపారు.

పార్క్ నిర్వహణ గురించి వాకర్స్/స్టేక్ హోల్డర్స్/ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల సభ్యుల నుండి అభిప్రాయాన్ని తెలుసుకొని, సందర్శకుల నుండి వచ్చిన ఈ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా కాంట్రాక్టర్‌లకు చెల్లింపులను విడుదల చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. పార్క్ ప్రాంగణంలో ప్లాస్టిక్‌ను నిరోధించడానికి ఒక ప్రతిపాదనను సమర్పించాలి, దానిని నియంత్రించే పద్దతులు చేపట్టాలన్నారు. ఇతర శాఖల ద్వారా చెట్ల నరికివేతను సకాలంలో తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు . అవసరమైన సాధనాలు, ఇన్‌పుట్‌లను ఉపయోగించి కత్తిరింపు పద్ధతిపై స్పష్టమైన సూచనలను జారీ చేయడానికి అనుబంధ లైన్ డిపార్ట్‌మెంట్‌లతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించాలని తెలిపారు.

సెక్యూరిటీ గార్డుల వారి సేవలను సమర్థవంతంగా వినియోగించు కోవలన్నారు. పార్కుల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా సెక్యూరిటీ వారు కృషి చేయాలన్నారు అర్బన్ బయోడైవర్సిటీ విభాగం టికెటింగ్, ధర, రాబడి మొదలైనవాటిని పటిష్టమైన పద్ధతులు అనుసరించాలన్నారు. రింగ్ ఫెన్సింగ్/ఫ్లో బ్యాక్ సిస్టమ్ కోసం మెకానిజం అభివృద్ధి కి చర్యలు తీసుకుని తద్వారా పార్క్ అభివృద్ధి నిర్వహణ కోసం ఆదాయాన్ని వినియోగించుకోవాలన్నారు . హరిత నిధి కింద వచ్చిన సొమ్మును పార్కుల్లో పచ్చదనం పెంపొందించేందుకు అటవీ శాఖకు బదులుగా జీహెచ్ఎంసీ వద్ద ఉంచవచ్చా లేదా అనేది దానిపై ఈ సమావేశంలో చర్చించారు. పావురాలను బహిరంగ ప్రదేశాల్లో తినిపించడం వల్ల పట్టణ ప్రాంతాల్లో జీవవైవిధ్యం ఇబ్బంది కారంగా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో , పశు వైద్య విభాగం సంప్రదించి బహిరంగ ప్రదేశాల్లో పావురాల దాణాను వేయకుండా మార్గాలను పరిశీలించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.. అడిషనల్ కమిషనర్ సుభద్ర దేవి, శ్రీనివాసరావు, సునంద రాణి, చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, విజిలెన్స్ విభాగం అదనపు పోలీసు సూపరింటెండెంట్ శ్రీనివాస్,, అదనపు కమిషనర్ ఎస్టేట్,సామ్రాట్ అశోక్ అదనపు కమిషనర్ లేక్స్ శివకుమార్ నాయుడు, జాయింట్ కమిషనర్ ఐటీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో బీఆర్ఎస్ నేతల అరెస్టు

నవతెలంగాణ-ఓయూ



ఓయూలో తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన కృతజ్ఞత సభ సందర్భంగా బీఆర్ఎస్ విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ అని ప్రశ్నించారు. ఓయూలో నిరుద్యోగ కృతజ్ఞత సభ ఎలా పెట్టారంటూ ప్రశ్నించారు. కేవలం సంవత్సర కాలంలో 6 వేల ఉద్యోగాలు ఇచ్చి ధాని కోసం నిరుద్యోగ సభ పెడుతున్నారా ? అని నిలదీశారు. నిరుద్యోగ సమాజానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని, సంవత్సరానికి 2 లక్షల ఉద్యోగాలు వేసే వరకు బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు జీడీ అనిల్ ,జంగయ్య ,బొల్లు నాగరాజ్ ,ప్రశాంత్, అశోక్ ,శ్రీనునాయక్, మిథున్ ,నాగేందర్ ,అవినాష్ ,సందీప్ ,సాయి. పాల్గొన్నారు.

కొనసాగుతున్న రాష్ట్ర పద్య నాటక పోటీలు

నవతెలంగాణ-కల్చరల్



భాషా సాంస్కృతిక శాఖ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ సౌజన్యం తో నాటక సామాజాల సమాఖ్య రుద్ర శివ సాంస్కృతిక సంఘం, వ్యాస కళా క్షేత సహకారంతో శివానీ ఆర్ట్స్ అసోసి యేషన్ నిర్వహణ లో రాష్ట్ర స్థాయి ఆహ్వాన పద్య నాటక పోటీలు తెలుగు విశ్వవిద్యాలయం లోని ఎన్ టీ ఆర్ కళా మందిరం లో ఆరంభమైనాయి. తొమ్మిది రోజుల పాటు జరిగే పోటీలలో బుధ వారం టి బి ఆర్ట్స్ క్రియేషన్స్ వారిచే పల్లేటి కు ల శేఖర్ రచించిన స్వామి అయ్యప్ప పౌరాణిక పద్య నాటకం ఇందిరా దేవి దర్శకత్వం లో ప్రదర్శించారు. పుచ్చ సాంబ శివ రెడ్డి చే శ్రీ కృష్ణ రాయబారం నాటక దృశ్యం కూడా ప్రదర్శించారు.సంస్థ నిర్వహకుడు పరమేశ్వర్ స్వాగతం పలికిన సభలో పి హరి ప్రసాద్, శివ మన్నారాయన,ముప్వ దేవనాథం కార్యక్రమాన్ని నిర్వహించారు .నాటక ప్రదర్శన కు తొలుత భగవత్ సత్సంగ్ వారిచే బాల బాలికలు గీతాలాపన పాదం డాన్స్ అకాడెమీ అర్చెన శిష్య బృందం చేఆకట్టుకుంది

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
గురువారం | డిసెంబర్ 19, 2024 | www.navatelangana.com

జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీలకు తూంకుంట విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-శామీర్‌పేట

ఇటీవల తాండూరు పట్టణంలో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి పాఠశాలల ఖో-ఖో అండర్- 17 బాలుర విభాగంలో జడ్పీహెచ్ఎస్ తూంకుంట పాఠశాల విద్యార్థులు కృపా శేఖర్ (9వ తరగతి). ఆదిత్య (8వ తరగతి) ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు గుర్రం సత్తిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి 24 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన తెలిపారు. జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత కుమారి, ఉపాధ్యాయ బృందం అభినందించారని చెప్పారు.

సీఐ సత్యనారాయణకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అద్దాని సత్యనారాయణ జన్మదినం సందర్భంగా బుధవారం కౌన్సిలర్ కౌడే మహేష్ వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తూ సామాన్యులకు సైతం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం 24గంటలు శ్రమిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో మరింతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. సీఐని కలిసిన వారిలో మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు లవంగు రాకేష్, మున్సిపల్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు గుండ శ్రీధర్, ఎస్సీసెల్ అధ్యక్షులు దండు శ్రీకాంత్, యువ నాయకులు కౌడే సాయినాథ్ తదితరులు ఉన్నారు.

విజబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణ



- మేడిపల్లి సీఐ ఆర్.గోవింద్ రెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

విజబుల్ పోలీసింగ్‌తోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని మేడిపల్లి సీఐ ఆర్.గోవింద్ రెడ్డి అన్నారు. బుధవారం మేడిపల్లి పీఎస్ పరిధి లోని వివిధ షాపింగ్ మాల్స్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కడ కూడా చట్టవ్యతిరేక సంఘటనలు జరగకుండా ఉండేందుకు అందరూ బాధ్యత తీసుకోవాలని అన్నారు. షాపింగ్ మాల్స్‌లో నిబంధనలు అతిక్రమించకుండా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. షాపింగ్ మాల్స్ సెల్లార్స్‌లో విధిగా వాహనాల పార్కింగ్ ఉండాలన్నారు. స్టోర్ రూంలు, జనరేటర్‌ల వాడకం చేయకూడదన్నారు. అలా ఎవరైనా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మేడిపల్లి ఎస్ఐ ఉదయ్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీ స్టాల్‌లో గంజాయి చాక్లెట్లు విక్రయం

- ఇద్దరిపై కేసు నమోదు




స్వాధీనం చేసుకున్న చాక్లెట్లు, పట్టుబడిన నిందితులు

నవతెలంగాణ - పోచారం

అన్నోజిగూడలోని ఓ టీస్టాల్‌లో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన ఘటన మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బీహార్‌కు చెందిన రామ్ నారాయణ్, కిషోర్ కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు టీ స్టాల్ ముసుగులో గంజాయి చాక్లెట్లదందా విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. వారి వద్ద 1 కేజీ కి పైగా గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకుని నిందితులను పోచారం పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

18వ రోజుకు చేరుకున్న రిలే నిరాహార దీక్ష



నవతెలంగాణ-ఘట్కేసర్

ఘట్కేసర్ మున్సిపాలిటీలో ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రిడ్జి పనులు పూర్తయ్యే వరకు చేస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారం నాటికి 18వ రోజుకు చేరింది. ఘట్కేసర్ ఉమ్మడి మండల టీ టీడీపీ కార్యవర్గ సభ్యులు వేముల సంజీవ గౌడ్, బొట్టు సూర్యనారాయణ, సామల జగన్మోహన్‌రెడ్డి, పాటి సురేందర్ రెడ్డి, తలతాటి మహేష్ బాబు దీక్షలో కూర్చున్నారు. వారికి టీటీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, మల్కాజిగిరి పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి అశోక్ గౌడ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బక్కని నరసింహులు మాట్లాడుతూ.. 13 ఏండ్లుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ సమస్య ఉందని తెలిపారు. ఈ సమస్యను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాగా దీక్ష శిబిరం నుంచే ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డితో మాట్లాడారు. త్వరలో ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులను సీఎం దగ్గరికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ కమిటీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, మాజీఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ సహకార సంఘం బ్యాంక్ చైర్మెన్ సారా శ్రీనివాస్ గౌడ్, సహకార బ్యాంక్ డైరెక్టర్ రేసు లక్ష్మారెడ్డి, సభ్యులు కమలాకర్, బచ్చు నగేష్ గుప్తా, విక్రం రెడ్డి, ఎండీ సిరాజ్, తదితరులున్నారు.

ఆటో డ్రైవర్లుకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలి



నవతెలంగాణ-కాప్రా

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం చేయాలని, వారికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. బుధవారం ఆటో డ్రైవర్లకు సంఘీభావంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు స్వయంగా ఆటో నడుపుతూ అసెంబ్లీకి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత చర్యలతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ చెప్పిన హామీని అమలు చేసిన వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

శ్మశాన వాటికలో పెండింగ్ పనులను పూర్తి చేస్తాం



- కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

నవతెలంగాణ - చర్లపల్లి

నాచారం రెడ్డి శ్మశాన వాటికలో రూ.10 లక్షలతో రోడ్లు వేశామని, మిగిలిన అభివృద్ధి పనులను తొందర్లోనే పూర్తి చేస్తామని కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అన్నారు. బుధవారం నాచారం రెడ్డి సంఘం సభ్యులు కార్పొరేటర్‌ను కలిసి శ్మశాన వాటికలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. శ్మశాన వాటికలో పది లక్షలతో రోడ్లు వేశామన్నారు. మౌలిక సదుపాయాలు కల్పిస్తూ త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులను చేస్తామని రెడ్డి సంఘం సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాచారం రెడ్డి సంఘం అధ్యక్షులు ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నమిలికొండ భూపాల్‌రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు పోగుల వెంకటరమణారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు రాగిరి మోహన్‌రెడ్డి, సలహాదారులు గజ్జల కృష్ణారెడ్డి, నడప శంకర్‌రెడ్డి, ఎర్రము హనుమంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు మల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు కీసర రామకృష్ణారెడ్డి, కార్యదర్శి ఇత్తేటి మధుసూదన్ రెడ్డి, పీసరి విష్ణువర్ధన్ రెడ్డి, నడప సందీప్ రెడ్డి, మెట్టు ఉదయ్ కిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టు రమేష్‌కు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శ




నవతెలంగాణ - చర్లపల్లి, కాప్రా

సోమవారం రాత్రి ఎన్ఎఫ్‌సీ కంపెనీ మెయిన్ గేట్ దగ్గర స్పీడ్ బ్రేకర్‌కు తలగి బలమైన గాయం కావడంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నమస్తే తెలంగాణ జర్నలిస్టు కడియాల రమేష్‌ను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. బుధవారం చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ ప్రతినిధులు ఎంపల్లి పద్మారెడ్డి, నేమురి మహేష్ గౌడ్, బీవీ నరసింహారెడ్డిలతో కలిసి నిమ్స్ ఆస్పత్రిలో రమేష్‌ను కలిసి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధితుడికి మెరుగైన చికిత్స అందించాలని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పను కోరారు.

కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రాజ్‌భవన్ ముట్టడి



నవతెలంగాణ-కాప్రా

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు అదానీ కుంభకోణంపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమంలో నాగరిగారి ప్రీతం పాల్గొన్నారు. ఆయనతో పాటు మేడ్చల్ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు పత్తి కుమార్ , మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ బాధితులకు న్యాయం చేయండి

- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి
- సీఎం రేవంత్‌రెడ్డికి వినతి



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వక్ఫ్ బోర్డు సి.ఈ.ఓ ఇటీవల వక్ఫ్ భూములల్లో రిజిస్ట్రేషన్‌లను నిలిపివేయాలని, వంద సర్వే నెంబర్‌లలో కూడిన నిషేధిత జాబితాను విడుదల చేసిన నేపథ్యంలో బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్కాజిగిరి ప్రజలు నిషేధిత జాబితాలో నుండి తమ కాలనీలు, బస్తీలకు చెందిన సర్వే నంబర్లను తొలగించాలని కోరారని తెలిపారు. ఎంతో కష్టపడి, పైసా, పైసా కూడబెట్టుకుని ఇండ్లు కట్టుకున్నామని, తమకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారని చెప్పారు. వక్ఫ్ బోర్డు ప్రకటించిన జాబితాలోని బస్తీల్లో సమావేశాలు ఏర్పాటు చేసి పేదల పక్షాన నిలబడతాన్నని అన్నారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో 382 ఎకరాల విస్తీర్ణంలో 100 సర్వే నెంబర్లను వక్ఫ్ బోర్డుకు చెందినదిగా ప్రకటించగా, దీనిలో 70 కాలనీలు, బస్తీలు, దాదాపు 30 ఏండ్ల క్రితమే ఏర్పడ్డాయన్నారు. 1,967 కుటుంబాలు, దాదాపు ఒక లక్ష జనాభా ఉన్నారని, ఇప్పుడు రిజిస్ట్రేషన్ల నిలిపివేస్తే పేద ప్రజల అవసరానికి ఆడపిల్లల పెళ్లిళ్ల సమయానికో, పై చదువుల కోసమో ఇండ్లను అమ్ముకోవాలన్నా, కొనుక్కోవాలన్నా, రిజిస్ట్రేషన్‌లు జరగకపోతే ప్రజలకు ఇబ్బందికరంగా మారుతుందని, పేద ప్రజలను దృష్టిలో పెట్టుకొని వక్ఫ్ బోర్డు ప్రకటించిన నిషేధిత జాబితాలో నుండి పేద ప్రజల ఇండ్లను తొలగించాలని, గౌతమ్ నగర్ డివిజన్ ప్రజల దాహార్తి తీర్చేందుకు 5 ఎంఎల్ రిజర్వాయర్‌ను నిర్మించాలని, మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోనే చెరువుల పరిరక్షణ, సుందరీకరణ కోరుతూ సీఎం ను కలిసి వినతి పత్రం అందజేశానని తెలిపారు.

లబ్దిదారులను పారదర్శకంగా గుర్తించండి

- తెలంగాణ హౌసింగ్ డైరెక్టర్ వీ.పి.గౌతమ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఇండ్ల నిర్మాణానికి నిజమైన లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా సర్వే చేసి మహిళలకు అందజేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ హౌసింగ్ డైరెక్టర్ వీ.పి.గౌతమ్ సూచించారు. బుధవారం నిజాంపేట మున్సిపాల్టీ మధురానగర్ కాలనీలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తాతో కలిసి వారు పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేసే విధానాన్ని పరిశీలించారు. గౌతమ్ స్వయంగా దరఖాస్తుదారుల ఇండ్లను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని గౌతమ్ సూచించారు. వారి వెంట నిజాంపేట మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ సాబేర్ అలీ, మున్సిపల్ మేనేజర్ పవన్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ రమేశ్, హౌసింగ్ డిప్యూటీ ఈఈ పి.భగవంతరావు, సర్వేయర్లు ఉన్నారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ విడుదల చేయడంలో జ్యాప్యమెందుకు

- అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



నవతెలంగాణ నేరేడ్ మెట్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, బ్రాహ్మణ విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు అందజేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తున్నదని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డ అన్నారు. వంద కోట్లు బడ్జెట్ కేటాయించినా కేవలం మొదటి విడతగా రూ.30 కోట్లు మాత్రమే విడుదల చేసి, రెండు, మూడో విడతలలో నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న అలసత్వాన్ని అసెంబ్లీలో ప్రస్తావించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బ్రాహ్మణ కుటుంబాలలోని యువకులు విదేశాలలో ఉన్నతమైన ఉద్యోగాలు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం నుండి వచ్చే ఆర్థిక సహాయం (స్కాలర్షిప్) అందుతుందన్న నమ్మకంతో విదేశాలకు వెళ్లి గోస పడుతున్నారని వాపోయారు. అర్చక వృత్తిని ఉపాధిగా చేసుకున్న పేద బ్రాహ్మణుల పిల్లలు ప్రభుత్వ స్కాలర్షిప్‌లను నమ్మి కొని విదేశాలకు వెళ్లి అక్కడ సరైన ఉద్యోగాలు లభించక, తిరిగి స్వదేశానికి రాలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం అలసత్వాన్ని విడిచి ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేసి సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి
- ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌కు వినతి పత్రం అందజేత



నవతెలంగాణ - చర్లపల్లి

పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌కు మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. బుధవారం జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ పరిధిలోని మల్లాపూర్, కెఎల్ రెడ్డి నగర్, ఎస్వీ నగర్, బ్రహ్మపురి కాలనీ, వెంకటరమణ కాలనీ, గ్రీన్ హిల్స్ కాలనీ, గోకుల్‌నగర్ కాలనీల్లో సీసీ రోడ్ల కొరకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దత్తాత్రేయ నగర్, మై ఫ్లవర్ పార్క్, కెఎల్ రెడ్డి నగర్, జనప్రియ టౌన్షిప్ కాలనీ పార్కుల్లో ఓపెన్ జిమ్ కొరకు నిధులను మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందజేసినట్టు కార్పొరేటర్ తెలిపారు.

అంగన్వాడీ టీచర్‌కు సన్మానం



నవతెలంగాణ - చర్లపల్లి

మల్లాపూర్ లింగమయ్య నగర్ కాలనీ అంగన్వాడీ టీచర్ సీహెచ్ విజయ 52 ఏండ్లు పనిచేసి పదవీ విరమణ పొందారు. బుధవారం మల్లాపూర్ అంబేద్కర్ భవన్‌లో మల్లాపూర్ సెక్టర్ అంగన్వాడీ టీచర్లు ఆధ్వర్యంలో సీహెచ్ విజయ టీచర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ స్వాతి, మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, సూపర్వైజర్ భాగ్యలక్ష్మి, పోకల నిర్మల, నిర్మలరెడ్డి, మల్లాపూర్ సెక్టర్ అంగన్వాడి టీచర్లు, ఆయాలు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూల్‌కు రూ.9లక్షల సీఎస్ఆర్ నిధులు అందజేత



నవతెలంగాణ- మేడ్చల్

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని అడ్వంట కంపెనీ గ్లోబల్ సీడ్ ప్రొడక్షన్ ప్లానర్ జి.వెంకటరఘురాం, సీఎస్ఆర్ మేనేజర్ రనిత అన్నారు. బుధవారం మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలోని ప్రైమరి స్కూల్‌లో రూ.9లక్షల సీఎస్ఆర్ నిధులతో ఫ్లోరింగ్ టైల్స్ పనులను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ కంపెనీ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. లాభాలే లక్ష్యంగా పనిచేస్తున్న నేటి కాలంలో వచ్చిన లాభాలలో కొంత సేవా కార్యక్రమాలు చేయాలనే సంకల్పంతో ముందుకు వచ్చిన అడ్వంట సీడ్ కంపెనీ యజమాన్యాన్ని మాజీ ఎంపీపీ వీర్లపల్లి రజిత రాజమల్లారెడ్డి, మాజీ సర్పంచ్ గీతా భాగ్యరెడ్డిలు అభినందించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తున్న సీడ్ కంపెనీ యాజమాన్యం, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రొక్యూర్ మెంట్ మేనేజర్ పరమేష్,సేఫ్టీ లీడ్ లాగ సతీష్, సప్లై చైన్ ప్లానర్ శశి శేఖర్, పర్చస్ ఎగ్జిక్యూటివ్, సోమ్ నాథ్, నాయకులు భాగ్యరెడ్డి, రామోదర్ రెడ్డి,గౌస్, పి.శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానస్పద స్థితిలో మహిళ మృతి



నవతెలంగాణ - జవహర్ నగర్

అనుమానస్పద స్థితిలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నేపాల్‌కు చెందిన ప్రకాష్ విశ్వకర్మ (20), దుర్గా (18) ఇద్దరు ప్రేమించుకుని ఆరు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకొని యాప్రాల్ శ్రీదేవి నగర్‌లో నివాసముంటున్నారు. ప్రకాష్ వాచ్‌మెన్‌గా, దుర్గ ఇండ్లలో పని చేస్తూ ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం దుర్గ ఇంట్లో భోజనం చేసి పడుకొని ఉండగా ప్రకాష్ వచ్చి నిద్ర లేపగా ఎంతకీ నిద్రలేవకపోవడంతో వెంటనే 108కి ఫోన్ చేశాడు.108 సిబ్బంది పరీక్షించి స్పృహ లేదని, దగ్గరలోని హాస్పిటల్‌కు తీసుకెళ్ళగా డాక్టర్లు పరీక్షించి దుర్గ చనిపోయిందని నిర్ధారించారు. ప్రకాష్ తండ్రి, పూణే లో ఉంటున్న దుర్గా తండ్రి డంబర్ విశ్వకర్మకు ఫోన్ చేసి తెలపడంతో వెంటనే బయలుదేరి వచ్చాడు. తన కూతురు మరణంపై అనుమానం ఉందని బుధవారం జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

లోకేష్ కంపెనీ ఎదుట కార్మికుల ఆందోళన



- ఎలాంటి నోటీసులివ్వకుండా విధుల నుండి తొలగింపు
- వీధినపడ్డ 450మంది కార్మికులు

నవ తెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధి రావల్‌కోల్ గ్రామంలోని లోకేష్ కంపెనీ యజమాన్యం పరిశ్రమలో పని చేసే 450మంది కార్మికులను తొలగించడంతో వారు బుధవారం కంపెనీ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. లోకేష్ మిషన్ కంపెనీలో తయారయ్యే ఇంజన్లు, ఇతర ముడి సరుకుల టను ఉక్రెయిన్‌కు ఎగుమతి చేస్తుంది. అయితే అక్కడ యుద్ధం వల్ల నెలకొన్న పరిస్థితుల వల్ల కంపెనీ నుండి ముడి సరుకులను పంపడం వీలుకాకపోవడంతో కార్మికులను తొలగించింది. దాదాపు 20 ఏండ్ల నుండి వీరు ఈ కంపెనీని నమ్ముకొని భార్య, పిల్లలను పోషించుకుంటున్నారు. అయితే ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా విధుల నుండి తొలగించడంతో కార్మికులు వీధిన పడ్డారు. కాగా కంపెనీ యాజమాన్యం స్పందించి ఉక్రెయిన్, రష్యాల మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల కార్మికులను తొలగించడం జరిగిందని, యుద్ధం ఆగిపోగానే కార్మికులందర్నీ తీసుకుంటామంటూ హామీ ఇచ్చే ప్రయత్నం చేశారు. కార్మికులు కొంత శాంతించి నెల రోజుల వేతనం అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు కంపెనీ యాజమాన్యం వారం రోజుల జీతభత్యాలు ఇస్తామని అనడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. చివరకు పోలీసులు చేరుకొని కార్మికులను శాంతింపజేశారు.

వ్యాపార రంగంలో రాణించాలి



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ - చర్లపల్లి

వ్యాపార రంగంలో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలో నూతనంగా ఏర్పాటు చేసిన యారో డ్రైవ్ ఇన్ మోర్‌ను డా. ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించి, వ్యాపార రంగంలో రాణించాలని, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమశేఖర్ రెడ్డి, సాయిజెన్ శేఖర్, రాహుల్, తిలక్ యాదవ్, వివేక్ యాదవ్, సందీప్, రవి తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నరేష్



నవతెలంగాణ-మేడ్చల్

బీఆర్ అంబేద్కర్‌పై పార్లమెం ట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని సీపీఐ(ఎం) మేడ్చల్ మండల కార్యదర్శి మందాపురం నరేష్ లోక్‌సభ స్పీకర్‌ను డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో ప్రతిపక్ష పార్టీల సభ్యులు రాజ్యాంగం వర్ధిల్లాలి, అంబేద్కర్ జై అనే నినాదాలు చేస్తుంటే హూం మంత్రి అమిత్ షా నేడు అంబేద్కర్, అంబేద్కర్ అనడం ఫ్యాషన్ అయ్యిందని, ఆయనను తలిస్తే ఏమీ రాదని, దేవుడిని తలిస్తే స్వర్గానికి పోతారని వివాదస్పద వ్యాఖ్యలు చేయడం దారుణం అన్నారు. తక్షణమే అమిత్ షా దేశ పౌరులందరికీ క్షమాపణలు చెప్పాలని అన్నారు. బీజేపీ తన నిజ స్వరూపాన్ని అమిత్ షా వ్యాఖ్యల ద్వారా బయట పెట్టిందని విమర్శించారు. ఇప్పటికైనా అనగారిన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలందరూ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని నేటికీ గౌరవించలేదన్నారు. వారు మనుధర్మ శాస్త్రం అవలంభిస్తున్నారని ఆరోపించారు. కుల సంఘాలు నాయకులు బీజేపీ ఎంగిలి మెతుకులకు ఆశపడి ఆ వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. అంబేద్కర్‌ను ప్రపంచ వ్యాప్తంగా గౌరవిస్తుంటే మనదేశం లో అవమానిస్తున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అంబేద్కర్‌ను అవమానిస్తున్న పార్టీలకు పుట్టగతులు లేకుండా చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు.

నిప్పంటుకుని మహిళ మృతి

నవతెలంగాణ-శామిర్‌పేట

నిద్రిస్తున్న సమయంలో చీరకు నిప్పంటుకుని ఓ మహిళ మృతి చెందిన ఘటన శామిర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామిర్ పేట మండలం పొన్నాల గ్రామానికి చెందిన ఉదరి భాగ్య (40) కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇంట్లో కరెంట్ లేకపోవడంతో క్యాండిల్ వెలిగించి పడుకున్నాక బుధవారం తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో ప్రమాదవశాత్తు క్యాండిల్ నిప్పు బెడ్ షీటుకు అంటుకుని చీరకు అంటుకోవడంతో మృతి చెందారు. మృతురాలికి ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. కాగా కొడుకు 15ఏండ్ల క్రితం చెరువులో పడి మృతి చెందగా కూతురు ప్రేమ వివాహం చేసుకుంది. భర్త కూలి పనుల కోసం 15 రోజులు కరీంనగర్ వెళ్ళాడు. మృతురాలికి మద్యం సేవించే అలవాటుంది. ఇంట్లోని వేరే గదిలో భాగ్య మరిది అతడి భార్యా ఉంటారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శామిర్ పేట ఎస్‌హెచ్‌ఓ శ్రీనాథ్ తెలిపారు.

కాలనీలోని సమస్యలను పరిష్కరించాలి



- కార్పొరేటర్ శ్రవణ్‌కు షిరిడీ సాయి కాలనీవాసుల వినతి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి డివిజన్ షిరిడీ సాయి నగర్‌లో సీసీ రోడ్డు, డ్రయినేజీ, పెండింగ్ డ్రయినేజీ లైన్ వేయించాలని, పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్‌ను షిరిడీ సాయి కాలనీ వాసులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రంను అందజేశారు. కార్పొరేటర్ వెంటనే స్పందించి ఏఈ నవీన్‌ను పిలిపించి ప్రతిపాదన సిద్ధం చెయ్యాలని సూచించారు. సాధ్యం అయినంత త్వరలో రోడ్డు వేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ నవీన్, కాలనీ సభ్యులు అజయ్ జోషి, అచ్యుత్ కుమార్, మురళీగౌడ్, బాబు, బాలకృష్ణ, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద అమ్మాయి పెండ్లికి ఉప్పల శ్రీనివాస చేయూత



నవతెలంగాణ -నాగోల్

నిరుపేద వైశ్య అమ్మాయి పెళ్లికి ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేయూత ఇచ్చినట్టు ఉప్పల ఫౌండేషన్ చైర్మెన్ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస గుప్త తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని నాగోల్ లో ఉప్పల శ్రీనివాస్ గుప్త క్యాంపు కార్యాలయంలో చింతల్‌కి చెందిన పద్మ - లక్ష్మణ్ రావు తమ కుమార్తె లక్ష్మి అనూష వివాహానికి సహాయ సహకారాలు అందించాలని కోరుతూ శ్రీనివాస గుప్తను మర్యాదపూర్వకంగా కలిశారు. స్పందించిన శ్రీనివాస గుప్తా వారి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకుని వెంటనే ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళసూత్రం, మెట్టెలు, చీర, గాజులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలకతీతంగా తమ వద్దకు వచ్చిన పేద ఆడపిల్లల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక మందికి మంగళసూత్రం, మెట్టెలు, చీర, గాజులను అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విప్లవ్ రెడ్డి, రాజు, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర స్పోక్స్ పర్సన్‌గా సంతోష్ కుమార్



నవతెలంగాణ - చంపాపేట్

ప్రముఖ న్యాయవాది, వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గుంజి సంతోష్ కుమార్‌ను టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర స్పోక్స్ పర్సన్‌గా నియమిస్తూ బుధవారం లీగల్ సెల్ రాష్ట్ర చైర్మెన్ పొన్నం అశోక్ గౌడ్ తెలంగాణ హైకోర్టులో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పొన్నం అశోక్ గౌడ్ మాట్లాడుతూ.. గుంజి సంతోష్ కుమార్ విద్యార్థి దశ నుండే ఉద్యమాలు చేసేవారని గుర్తు చేశారు. న్యాయవాద సంఘాల్లో చురుగ్గా పాల్గొంటూ.. వడ్డెర జాతి అభ్యున్నతికి బాటలు వేస్తున్న తరుణంలో సంతోష్ కుమార్‌ను లీగల్ సెల్ స్పోక్స్ పర్సన్‌గా నియమించినట్టు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో వీఆర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మిశెట్టి శివకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల ఉపేంద్ర తదితరులు ఉన్నారు.

నిధులు ఇవ్వడం లేదని ధర్నా



నవతెలంగాణ- ఎల్బీనగర్

జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ పరిధిలో అభివృద్ధికి జీహెచ్ఎంసీ నిధులు ఇవ్వడం లేదని, అందుకే అభివృద్ధి కుంటుపడుతుందని బీజేపీ కార్పొరేటర్లు బుధవారం జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఎదుట ధర్నా నిర్వహించారు. కమిషనర్‌ను దాదాపు గంటసేపు తన చాంబర్‌కి వెళ్లకుండా అడ్డుకున్నారు. తర్వాత కమిషనర్ చాలా ఓపికగా కార్పొరేటర్ల సమస్యలను విన్నారు. అనంతరం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి మాట్లాడుతూ..ఎల్బీనగర్ జోనల్ నుండి జీహెచ్ఎంసీ ఆఫీస్‌కు ప్రతినెల వివిధ పన్నుల రూపంలో ఆస్తి పన్నుతో కలుపుకొని 50 కోట్ల రూపాయలు చెల్లిస్తున్నామని తెలిపారు. కనీసం అందులో 50% నిధులు కూడా తిరిగి ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధికి ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ దగ్గర వసూలు చేసిన ఆస్తి పన్నును ఓల్డ్ సిటీలో ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు తమ కార్యాలయంలో ఉండడం లేదని, సర్కిల్ కార్యాలయంలో అధికారులు ఎవరూ సక్రమంగా నిధులు నిర్వహించడం లేదని మండిపడ్డారు.

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మన్సూరాబాద్ డివిజన్‌లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం తగిన నిధులు ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. పార్కుల్లో, క్రీడా ప్రాంగణంలో నిర్మాణాలు చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, రంగా నరసింహా గుప్తా, పవన్ కుమార్, శ్రీవాణి, లచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ అడ్డా మీదున్న సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ హైదరాబాద్ సౌత్ కమిటీ డిమాండ్



నవతెలంగాణ-చంపాపేట్

దబీర్‌పురా లేబర్ అడ్డా మీదనున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ కమిటీ డిమాండ్ చేసింది. హైదరాబాద్ జిల్లా యాకుత్‌పురా నియోజకవర్గం దబీర్‌పురా లేబర్ అడ్డా మీద బుధవారం సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి శ్రావణ్ కుమార్, అధ్యక్షురాలు మీనా అడ్డా పైన గల సమస్యల మీద సర్వే చేసి.. అడ్డ మీద ఉన్న కార్మికులకు సభ్యత్వాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ కుమార్ మాట్లాడుతూ సభ్యులుగా చేరిన వారికి సీఐటీయూ అన్ని విధాల ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఉత్తర భారతదేశంలోని జార్ఖండ్, పశ్చిమ బెంగాలు, బీహార్, ఉత్తరప్రదేశ్, తదితర ప్రాంతాల నుండి పనులు వెతుక్కుంటూ వచ్చిన వారిని వలస కార్మికులుగా గుర్తించాలన్నారు. అడ్డా మీద కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. అడ్డాపైన అప్పుడప్పుడు హెల్త్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సౌత్ సీఐటీయూ నాయకులు, భవన నిర్మాణ రంగం జిల్లా కార్యదర్శి కె జంగయ్య, ఆటోరంగం జిల్లా కార్యదర్శి ఎల్ కోటయ్య, సీఐటీయూ నాయకులు ఎస్ కిషన్, మైనారిటీ సీఐటీయూ నాయకులు అబ్దుల్ సత్తార్, మలక్‌పేట్ యాకుత్పురా జోను నాయకులు కార్యదర్శి ఎం బాలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

'రిసోర్ట్స్ పర్సన్‌కు రూ.18వేలు ఇవ్వాలి'





నవతెలంగాణ-బడంగ్‌పేట్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్ (ఆర్.పి)లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని ఆర్పీల రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అరుణ, బాలాపూర్ మండల సీఐటీయూ కన్వీనర్ వి.శేఖర్ యాదవ్‌లు కోరారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రిసోర్స్ పర్సన్ రాష్ట్ర పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తర్వాత ఆర్పీ జిల్లా అధ్యక్షులు మంజుల, కార్యదర్శి అరుణ, సీఐటీయూ నాయ కులు వి. శేఖర్ యాదవ్‌లు అధికా రులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ఆర్పీలకు జీవో 60 నెంబర్ ప్రకారం కనీస వేతనం రూ.18,500 అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ ఇన్సూరెన్స్ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ లను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అనిత, మమత, కల్పన, సరిత, సరోజ పాల్గొన్నారు.

'కుల, మతాలకతీతం క్రీడా మైదానం'



నవతెలంగాణ- నాగోల్

కుల, మతాలకు అతీతంగా అందరూ కలిసి ఆడే చోటు క్రీడా మైదానం ఒక్కటేనని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఉప్పల్‌లోని ఎలైట్ గ్రేడ్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌లో నిర్వహించిన పోటీలను బుధవారం శ్రీనివాస్ గుప్త ప్రారంభించి మాట్లాడారు. సీఎం కప్-2024ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించి.. సమాజానికి, తల్లీదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కుల, మతాలకు అతీతంగా అందరూ కలిసే చోటు క్రీడా మైదానం ఒక్కటేనని, యువత చెడు వ్యసనాల జోలికి పోకుండా క్రీడలవైపు దృష్టి సారించి మెడల్స్ సాధించాలని కోరారు. అవసరమైన సహకారాన్ని ప్రజా ప్రభుత్వం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ పోటీల్లో అండర్ 15 మరియు 19 విభాగాల నుండి 100 మంది క్రీడాకారులు క్రీడల్లో పాల్గొన్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ ఓ మేడ్చల్ మల్కాజిగిరి గోపాల్, బ్యాడ్మింటన్ కోశాధికారి హర్ష యాదవ్, ఎలైట్ గేమర్స్ గ్యారేజ్ మేనేజ్మెంట్ కోచ్ వికాంత్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ - హయత్‌నగర్

రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ సుధీర్ బాబు బుధవారం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ పనిచేసే రిసెప్షనిస్ట్ వాణిని ఫిర్యాదు దారులకు చేసే పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డ్‌లను పరిశీలించారు. ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం పొందేలా చూడాలని కోరారు. ఆయన వెంట ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ ఉన్నారు.



నవతెలంగాణ -ఎల్బీనగర్

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఛలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించినారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుంచి రాజ్ భవన్ వరకు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ ఇంచార్జ్‌లు, పీసీసీ నాయకులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

అదానీ వ్యవహారం, మణిపూర్ అంశాలపై కేంద్రం స్పందించాలంటూ ఏఐసీసీ ఇచ్చిన పిలుపుమేరకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం నుండి నిర్వహించిన చలో రాజ్ భవన్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క, మంత్రులు ఎమ్మెల్యేలు, ఎంఎల్సీలతో పాటు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

రాచకొండ సీపీ

నూతన సంవత్సర వేడుకల్లో పోలీసుల సూచనలు పాటించాలి



నవతెలంగాణ-హయత్‌నగర్

రానున్న నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల సూచనలు ప్రతి ఒక్కరూ పాటించాలని రాచకొండ కమిషనర్ డాక్టర్ సుధీర్ బాబు అన్నారు. రాచకొండ పరిధిలోని పబ్‌లు, బార్లు, రెస్టారెంట్స్, ఫామ్ హౌస్‌లు, వైన్ షాపులు, ఈవెంట్ ఆర్గనైజేషన్ నిర్వాహకులతో ఎల్బీనగర్‌లోని ఓ గార్డెన్లో బుధవారం సీపీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు సరఫరా చేసే ప్రాంతాలను పర్యవేక్షించాలని, వేడుకలు జరిగే చోట అన్ని రకాల మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని నిరోధించాలన్నారు. మాదకద్రవ్యాల సరఫరాకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించడంతో పాటు మాదకద్రవ్యాల ముప్పును అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నేర నివారణ పాయింట్‌గా ఉపయోగపడే స్నిఫర్ డాగ్‌లను ముఖ్యమైన ఈవెంట్‌లలో మోహరించాలని చెప్పారు. ఈవెంట్‌లో స్నిఫర్ డాగ్‌లు ఉంటాయని పార్టీలకు హాజరయ్యే వారికి తెలిస్తే.. వారు మాదకద్రవ్యాలు లేదా నిషేధిత పదార్థాలను తీసుకురాకుండా ఉంటారన్నారు. నైట్ సూపర్‌వైజింగ్ ఆఫీసర్ (NSO), జోనల్, డివిజనల్ నైట్ రౌండ్ ఆఫీసర్లు 31 నైట్, జనవరి1న మధ్య రాత్రి విధులలో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్, భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర, మహేశ్వరం డీసీపీ సునీత, ట్రాఫిక్ డీసీపీ 2 శ్రీనివాసులు, ట్రాఫిక్ డీసీపీ 1 మల్లా రెడ్డి, రోడ్ సేఫ్టీ డీసీపీ మనోహర్, డీసీపీ ఎస్ఓటీ 2 మురళీధర్, అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, కృష్ణయ్య ఏసీపీలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈవెంట్ నిర్వాహకులు/ఈవెంట్ మేనేజర్లకు సూచనలు..

- ఈవెంట్‌కు తప్పనిసరిగా పోలీసుల నుండి అనుమతి పొందాలి.
- ప్రైవేట్ స్థలంలో నిర్వహించబడే టికెటింగ్, నాన్‌టికెటింగ్ యొక్క అన్ని ఈవెంట్ నిర్వాహకులు కనీసం (12) రోజుల ముందు తప్పనిసరిగా పోలీసుల అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి.
- తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ (ప్రమాణాలు) ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్ట్, 2013 ప్రకారం మొత్తం ఈవెంట్, పార్కింగ్ స్థలాలతో సహా ప్రాంగణాలు తప్పనిసరిగా సీసీటీవీ నిఘాలో ఉండాలి, తదుపరి విశ్లేషణ కోసం బ్యాకప్ సిద్ధంగా ఉంచాలి.
- ప్రేక్షకుల సంఖ్య ఆధారంగా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి, ట్రాఫిక్ పోలీసు సూచనలకు అనుగుణంగా సిబ్బందిని సిద్ధంగా ఉంచుకోవాలి.
- వాహనాల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు తప్పనిసరిగా వేరుగా ఉండాలి. ఎక్సైజ్ చట్టం ప్రకారం మైనర్లకు మద్యం అందించకూడదు.
- అవుట్‌డోర్ సౌండ్ సిస్టమ్ (పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, లౌడ్ స్పీకర్, డీజే సిస్టమ్, డీజే సౌండ్ మిక్సర్, సౌండ్ యాంప్లిఫైయర్, ఇతర హై సౌండ్ జనరేటింగ్ ఎక్విప్‌మెంట్‌తో సహా) సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం తప్పనిసరిగా రాత్రి 10:00 గంటలకు నిలిపివేయాలి.
- నిర్వాహకులు పాస్‌లు/టికెట్లు/కూపన్‌లు సామర్థ్యానికి మించి మంజూరు చేయరాదు, ఇది శాంతిభద్రతల సమస్యకు దారితీయవచ్చు.
- డ్రగ్స్ లేదా నార్కోటిక్స్ ఇతర నిషేధిత మత్తు పదార్థాల ఉపయోగం లేకుండా నిర్వాహకులు ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలి.
- ఈవెంట్ ముగిసిన తర్వాత ముందు జాగ్రత్త చర్యగా మత్తులో ఉన్న కస్టమర్లకు డ్రైవర్లు, క్యాబ్‌లను అందించడానికి మేనేజ్‌మెంట్ ఏర్పాట్లు చేయాలి.

నిర్వాహకులు ఏర్పాటు చేయాల్సిన నియమ నిబంధనల బోర్డులు

- మద్యం సేవించి వాహనం నడపడం ఎంవీ చట్టంలోని సెక్షన్ 185 ప్రకారం నేరం.
- ఆల్కహాల్ పరిమితి రక్తంలో 30 mg/100 ml కంటే తక్కువ మాత్రమే అనుమతించబడింది.
- మద్యం తాగి వాహనం నడపడం వలన కేసు నమోదు చేయబడుతుంది.
- వాహనంలోని ప్రతి ఒక్కరూ మద్యం సేవించి ఉంటే వాహనం సీజ్ చేయబడుతుంది.
- మద్యం తాగి వాహనం నడిపితే జరిమానా రూ.10,000లేదా 6 నెలల జైలు శిక్ష.
- డ్రైవింగ్ లైసెన్స్ 3 నెలలు, అంతకంటే ఎక్కువ లేదా శాశ్వతంగా రద్దు చేయబడుతుంది. మైనర్లు డ్రైవింగ్ చేయకుండా తల్లిదండ్రులు బాధ్యత వహించాలి.
- వాహనాలను ఓవర్ స్పీడ్‌లో నడపడం, ప్రమాదకరమైన డ్రైవింగ్, బహిరంగ ప్రదేశాల్లో రేసింగ్ చేయడం వంటివి కూడా M.Vలోని సెక్షన్ 183,184 ప్రకారం శిక్షార్హం.

ప్రొఫెషనల్ బ్యూటీ ఇండియా ఎక్స్‌పో



నవతెలంగాణ-సిటీబ్యూరో

హేర్ కేర్ బ్రాండ్ బ్యూటీ గారేజ్ ప్రొఫెషనల్ ఈ నెల 17, 18 తేదీల్లో హైటెక్స్‌లో నిర్వహించిన ప్రొఫెషనల్ బ్యూటీ ఇండియా ఎక్స్‌పోలో సందర్శకులను ఆకర్షించింది. ఈ రెండు రోజుల కార్యక్రమంలో అందం, సలోన్ రంగాల్లో అత్యాధునిక ఆవిష్కరణలను ప్రదర్శిస్తూ ప్రముఖ పారిశ్రామిక వేత్తలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా బ్యూటీ గారేజ్ ప్రొఫెషనల్ కో-ఫౌండర్, సీఈఓ మహేష్ రవారియా మాట్లాడుతూ "హైదరాబాద్ ఎక్స్‌పోలో మాకు లభించిన అత్యద్భుత స్పందన నాణ్యత, ఆవిష్కరణ శక్తిపై మా నమ్మకాన్ని మరింత బలపరిచింది. ఆధునిక పరిశోధన, అభివృద్ధి ద్వారా హేర్ కేర్ రంగాన్ని విప్లవీకరించడమే మా లక్ష్యం. సలోన్ ప్రొఫెషనల్స్, కస్టమర్లకు ఆధునిక హేర్ కేర్ అవసరాలను తీర్చే సమర్థవంతమైన పరిష్కారాలను అందించడంలో మేం పాటుపడుతున్నాం. అంతేకకుండా 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్తున్నాం" అని తెలిపారు.

'అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులు'



నవతెలంగాణ-హయత్ నగర్

2024-2025 విద్యా సంవత్సరానికి జంతు శాస్త్రంలో అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ బాబు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత పీజీ సబ్జెక్టుల్లో 55% మార్కులు ఉండాలని చెప్పారు. NET/SET/Ph.D గల అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులు ఈనెల 21తేదీ లోపు తగిన ధ్రువపత్రాలతో హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆఫీసు నందు సమర్పించాలని సూచించారు.

ఉచిత కుట్టు మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానం


చైర్మెన్ యూసఫ్ ఖాద్రి



నవతెలంగాణ- బడంగ్‌పేట్


మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇందిరమ్మ మహిళా శక్తి పథకం కింద మైనార్టీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు అందిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం మైనార్టీ సెల్ చైర్మెన్ యూసుఫ్ ఖాద్రి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31 వరకు మైనార్టీ ముస్లిం, సిక్కులు, భుద్దిస్ట్, జైన్స్, పార్శి కులాలకు చెందిన వారు ఆన్లైన్‌లో tgob- mms.cgg.gov.in ద్వారా దరఖాస్తులు చేసుకొని, అప్లికేషను హార్డ్ కాపీ జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో అందజేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి మహిళల ఆర్థికాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి నాయకుల పరామర్శ



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 31వ డివిజన్ బాలాజీ నగర్‌లో ఇటీవల విద్యుద్ఘాతం జరిగి ముదిగొండ లక్ష్మి ఇల్లు దగ్ధం అయింది. ఈ విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తర్వాత ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని బాధిత కుటుంబానికి మేయర్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈఈ నర్సింహా రాజు, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్లగూడెం సంతోష శ్రీనివాస్ రెడ్డి, నాయకులు గట్టు బాలక్రిష్ణ, కొండ శ్రవణ్ కుమార్ యాదవ్, దురెడ్డి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాజీ నగర్‌లో నివాసం ఉంటున్న ముదిగొండ రాములు కూతురు లక్ష్మీల ఇల్లు ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురైంది. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జి అందెల శ్రీరాముల యాదవ్ బుధవారం ఘటన స్థలానికి చేరుకొని దగ్ధమైన ఇల్లును సందర్శించారు. అనంతరం బాధిత లక్ష్మీని పరామర్శించి మనోధైర్యాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షులు చెరుకుపల్లి వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు, బడంగ్ పేట్ గ్రామ మాజీ సర్పంచ్ నడికుడ యాదగిరి, బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు శ్రావణ్ కుమార్ యాదవ్, రాజ్ కుమార్, సతీష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మేయర్



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్‌లో ఉన్న శ్రీ విద్యా టౌన్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బుధవారం స్థానిక కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, గంగుల ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సమరసింహా రెడ్డి, లక్కిశెట్టి మనోహర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అదే విధంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్‌లోని అరవింద్ నగర్ కాలనీలో డ్రైనేజీ నిర్మాణ పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బుధవారం స్థానిక కార్పొరేటర్ రామిడి కవిత రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, గుర్రం లక్ష్మారెడ్డి, జెల్లా రమేష్ గౌడ్, వెంకటేష్ గౌడ్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 23వ డివిజన్‌లోని వైష్ణవి కాలనీలో చేపట్టిన కమ్యూనిటీ హల్ నిర్మాణ పనులను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బుధవారం స్థానిక కార్పొరేటర్ రాళ్ళగూడం సంతోష్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు గట్టు బాలక్రిష్ణ, బొల్లపల్లి కుమార్ కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



'ఎరువుల గోదాం నిర్మాణానికి శంకుస్థాపన'



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

వ్యవసాయ రైతులకు అనువుగా ఎరువులు సరఫరా చేయడానికి బాట సింగారం సహకార సంఘం ఆధ్వర్యంలో నూతన ఎరువుల గోదాం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు చేగూరి భరత్ కుమార్ మాట్లాడుతూ రైతు సంక్షేమ అభివృద్ధిలో భాగంగా రైతులకు సకాలంలో ఎరువులు పంపిణీ చేయడానికి సహచర డైరెక్టర్లతో కలిసి నూతన గోదాం నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. దీంతో రైతులు ఎరువులు, మందులు సహకార సంఘం కార్యాలయం ప్రాంగణంలో పొందవచ్చు అని చెప్పారు. రైతులందరూ సదా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు నార్లకొండ మల్లమ్మ, డైరెక్టర్స్ మొగుళ్ళ యాది రెడ్డి, పగిళ్ల బాల్ రెడ్డి, గంటా శ్రీనివాస్ రెడ్డి, ఇటికల మహేందర్ రెడ్డి, కొత్తపల్లి జైపాల్ రెడ్డి, మేకల రాములు యాదవ్, చింతల లక్ష్మమ్మ కందాడి మహిపాల్ రెడ్డి, మేనేజర్ జక్కుల ఐలేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు న్యాయం చేయాలి : సీఐటీయూ నాయకులు



నవతెలంగాణ-ఎల్బీనగర్

వనస్థలిపురం రైతు బజారు ముందు ఉన్న చిరు వ్యాపారస్తులకు న్యాయం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. వనస్థలిపురం రైతు బజార్ ముందు ఉన్న చిరువ్యాపారుల తోపుడు బండ్లను జీహెచ్ఎంసీ అధికారులు, పోలీస్ అధికారులు కలిసి బుధవారం తొలగించారు. వనస్థలిపురం రైతు బజారు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సీఐటీయూ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షత చిరు వ్యాపారస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చంద్రమోహన్ మాట్లాడుతూ ఎంతో మంది చిరు వ్యాపారస్తులు తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారికి ప్రత్యామ్నాయ న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి, జిల్లా నాయకులు ఈ. నరసింహ, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహా కృష్ణయ్య, భారతమ్మ మహేష్, వరలక్ష్మి, ధనరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ అభివృద్ధి కోసం కృషి : జయశ్రీ రాజు



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

పెద్ద అంబర్‌పేట మున్సిపల్ సంక్షేమ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ పండుగల జయ శ్రీరాజు అన్నారు. బుధవారం పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ, కుంట్లూర్ 24వ వార్డులో రూ.37 లక్షల నిధులతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు కౌన్సిలర్ కందాడ అనుపమ సుప్రసేనారెడ్డితో కలిసి చైర్ పర్సన్ పండుగుల జయశ్రీ రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కందాడ అనుపమ సుప్రసేనారెడ్డి మాట్లాడుతూ పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ 24వ వార్డును దశల వారీగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రవీందర్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ సంపూర్ణ, 1వ వార్డు కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్, నాయకులు జోర్క శ్రీరాములు, విజయశేఖర్ రెడ్డి, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
గురువారం డిసెంబర్ 19, 2024 www.navatelangana.com

చలో రాజ్ భవన్‌కు..

నవతెలంగాణ-ధూల్‌పేట్

దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా గౌతమ్ అదానీ ఆర్థిక అవకతవకలు మణిపూర్‌లో అల్లర్లపై ప్రధాని మోడీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో చేపట్టిన చలో రాజ్ భవన్ ఈ కార్యక్రమంలో గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాప్రవెని, ముంద్రాయి శ్రీనివాస్ తదితరులు..



'టీజీఎస్పీడీసీఎల్'లో క్రిస్మస్ వేడుకలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో పాస్టర్ జోసెఫ్ ఎడ్వర్డ్ ఇన్‌చార్జ్ డైరెక్టర్లు సాయి బాబా, సుధా మాధురి, చీఫ్ ఇంజినీర్లు రంగనాథ్ రాయ్, నరసింహ స్వామి, శివాజీ, బాలస్వామి, భాస్కర్, సీజీఆర్ఎఫ్ మెంబర్స్ లలిత, కె.శోభా రాణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఇంజన్ బౌలి శ్రీ చైతన్య స్కూల్‌లో
ఫీజుల గోల్‌మాల్..

- 200 మంది విద్యార్థుల నుంచి రూ.60లక్షలు ఫీజులు స్వాహా..
- రిసిప్ట్ ఇవ్వకుండానే పేరెంట్స్ వద్ద వసూళ్లు
- ఆడిట్‌తో వెలుగులోకి..
- 6 మాసాలు గడిచినా చెల్లించని యాజమాన్యం..
- ఆందోళనలో తల్లిదండ్రులు..



నవతెలంగాణ-ధూల్‌పేట్

రాష్ట్రంలోనే పేరు గాంచిన కార్పొరేట్ స్కూల్‌లు, ఆటు కళాశాలలు.. ఫీజులు చెల్లించక పోతే ఇంటికే.. పాతబస్తీ బండ్లగూడ మండల పరిధిలోని ఫలక్ నుమా, ఇంజన్ బౌలిలోని శ్రీ చైతన్య స్కూల్‌లో 200 మంది విద్యార్థుల ఫీజులకు రిసిఫ్ట్ ఇవ్వకుండా సుమారు రూ. 60లక్షలు బురిడీ గొట్టారు..

ప్రస్తుతం ఉన్న దినాల్లో తమ పిల్లలను కార్పొరేట్ స్కూల్‌లో చదివించాలని, మంచి విద్యానందించాలని తల్లిదండ్రుల తాపత్రయం. వారి దగ్గర స్తోమత లేకపోయిన కాయకష్టం చేసి, ఫీజులు కట్టి చదివిస్తున్నారు ఈ రోజుల్లో... అదే అదునుగా చేసుకుని కార్పొరేట్ స్కూల్స్ పుట్ట గొడుగుల విధి విధుల్లో చోరబడ్డాయి. ఫీజులు చెల్లించకపోతే బయటకు.. లేదంటే పరీక్షలు (ఎగ్జామ్స్) రాయనియ్యారు. విద్యార్థులతో అందినకాడికి దండుకునే స్కూల్‌లు. చెల్లించిన డబ్బులకు రిసిఫ్ట్ ఇవ్వడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

సుమారు రూ.60లక్షలు..

స్కూల్ ఫీజు చెల్లించాలని విద్యార్థుల తల్లిదండ్రులతో రిసిప్ట్ ఇవ్వకుండానే సాంకేతిక లోపం ఉందని ఫీజులు వసూలు చేశారు. 200 మంది విద్యార్థులతో సుమారు రూ. 60లక్షలు వసూలు చేసి స్వాహా చేశారు. కట్టిన ఫీజ్ రిసిప్ట్ ఇవ్వకుండా కాలయాపన చేశారు. 6 మాసాలు గడిచిన నేటికీ యాజమాన్యం రేపు, మాపు ఇస్తాం అంటూ స్కూల్ చుట్టూ తిప్పుతున్నారని వాపోతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

ఆడిట్‌తో వెలుగులోకి..

అన్ని స్కూల్‌లో కంటే ఫలక్ నుమా, ఇంజన్ బౌలిలోని శ్రీ చైతన్య స్కూల్ బ్రాంచ్ నుండి ఫీజు కలెక్షన్ తక్కువ రావడంతో యాజమాన్యం అనుమానంతో ఆడిట్ చేసింది. దీంతో విద్యార్థుల ఫీజులు చెల్లించాలని తల్లిదండ్రులను అడగడంతో బట్ట బయలైంది. అయినప్పటికీ వాటిని సమకుర్చకపోవడం విశేషం. ఇలాంటి కార్పొరేట్ విద్యాలయలో ఇలాంటి స్కాంలు జరుగుతున్న కూడా యాజమాన్యం పట్టించుకోవడం లేదు.. అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంటనే బాధితులకు యాజమాన్యం భరోసా కల్పించాలని కోరుతున్నారు.

బండ్లగూడ మండల డిప్యూటీ ఈఓ (ఆదిత్య వర్ధన్ రాజు) వివరణ

'అలాంటిది మా దృష్టికి రాలేదు. మా దృష్టి వస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.'

'భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

- రాష్ట్ర లేబర్ కమిషనర్ ఆర్.చంద్రశేఖర్‌కు వినతి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చెట్టుకింది శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర లేబర్ కమిషనర్ ఆర్. చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని లేబర్ అడ్డాల దగ్గర మంచినీరు, టాయిలెట్లు, ఐదు రూపాయల భోజన వసతి వంటి సౌకర్యాలు కల్పించాలని, అలాగే కార్మికులతో పాటు కార్మికుడి కుటుంబం మీ సేవలో తంబు వేయాలనే నిబంధనలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద సహజ మరణాలకు బీమా సౌకర్యం, వివాహ, ప్రసూతి సహాయం కింద ఆర్థిక సాయం అందించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు బీమా కంపెనీలకు ఇవ్వొద్దన్నారు. సంక్షేమ బోర్డు ద్వారానే అందించాలని, వెల్ఫేర్ బోర్డు నుండి దారి మళ్లించిన నిధులను తిరిగి బోర్డులో జమ చేయాలని కోరారు. కార్మికుల కుటుంబాలకు పెన్షన్ సౌకర్యం కల్పించి, అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని, కార్మికుల హక్కులు పరిరక్షించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు కాశయ్య, నాయకులు లింగస్వామి, నాగరాజు, రవి, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు గర్హనీయం'

హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ లో కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఇటీవల రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పై బీజేపీ కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని యూత్ కాంగ్రెస్ ఖైరతాబాద్ డిస్ట్రిక్ ప్రధాన కార్యదర్శి అనీష్ కుమార్, యూత్ కాంగ్రెస్ హిమాయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు అఖిల్ హైమద్, ఉపాధ్యక్షులు అభిషేక్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్ అన్నారు. అంబేద్కర్ పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బుధవారం హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ లో కేంద్ర మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లా డుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయాలను నీరుగార్చే ఉద్దేశంతో భారత రాజ్యాంగాన్ని బీజేపీ కేంద్ర ప్రభుత్వం కించపరుస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాకీ హుస్సేన్, హసన్ ఖాదీర్, జ్ఞానేశ్వర్, సర్వరాజ్, ప్రియారాజ్, సంజీవరెడ్డి, రమేష్, నదీమ్, ఆలీ, జె.ఆర్. సందీప్, శేఖర్, జగదీష్, భాష, మోసిన్ తదితరులున్నారు.

కార్మిక సమస్యలపై పరిష్కారానికి కృషి చేస్తా



- వీఎస్‌టీ కంపెనీ కార్మిక యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-ముషీరాబాద్

కనీస వేతనాలు అమలు, కార్మిక సమస్యలపై పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని వీఎస్‌టీ కంపెనీ కార్మిక యూనియన్ ప్రస్తుత అధ్యక్షుడు వి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష పదవి పోటీలో భాగంగా నాయిని నర్సింహారెడ్డి (ఎన్ఎన్ఆర్) గ్రూప్ తరఫున ప్రస్తుత అధ్యక్షుడు వి.శ్రీనివాస్ రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేసేందుకు సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లారు. ముషీరాబాద్ నియోజకవర్గం బాగ్‌లింగంపల్లి యూనియన్ కార్యాలయం నుంచి సాయిబాబా దేవాలయం, నాగమయ్యకుంట కట్టమైసమ్మ దేవాలయాల్లో శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్ పత్రాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు అందుబాటులో ఉంటూ కనీస వేతనాలు అమలు చేయడంలో కార్మిక సమస్యలపై పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఎన్ఎన్ఆర్ గ్రూపు తరపున 6వ సారి వీఎస్టీ కంపెనీలో యూనియన్ అధ్యక్ష పోటీలో పాల్గొనడం జరుగుతుందన్నారు. 5 సార్లు తాను అధ్యక్షుడిగా గెలవడం జరిగిందన్నారు. ఈ కంపెనీ కార్మికుల జీతభత్యాల గురించి, మంచి అగ్రిమెంట్లు, వేతన ఒప్పందాలతో పాటు బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పెండింగ్ ప్రమోషన్లను, ఇంక్రిమెంట్లను వచ్చే జూన్, జూలైలో అమలు చేస్తామన్నారు. అనంతరం ర్యాలీగా తరలివెళ్లి సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్‌ను దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ బేరర్స్ ప్రధాన కార్యదర్శి ఐలీ ప్రభాకర్, బాబి, రవి యాదవ్, శంకర్, మధుసూదన్, సత్యనారాయణ, రాములు, లతీక్, శ్రీనివాసులు, రవీందర్ రెడ్డి, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తున్న ప్రభుత్వం



- తెలంగాణ సహకార సంఘాల చైర్మెన్ తిప్పిరెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రంలో సహకార సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందని తెలంగాణ సహకార సంఘాల చైర్మెన్ తిప్పిరెడ్డి మోహన్ రెడ్డి తెలిపారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సహకార యూనియన్ లిమిటెడ్ మహాజన సదస్సు సమావేశం ఆ సంస్థ ఎండీ అన్నపూర్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాటాడుతూ తెలంగాణ సహకార యూనియన్ రాష్ట్ర విభజన ఆనంతరం 2016 ఫిబ్రవరి 22న ఏర్పడిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సహకార యూనియన్‌లలో 816 సభ్యులు ఉన్నారని తెలిపారు. గడచిన జూలై 11వ తేదీన ఈ యూనియన్‌కు ప్రభుత్వ పదవికి చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా మహాజన సభ నిర్వహించడం తనకు అదృష్టంగా వచ్చిందన్నారు. సహకార ఉద్యమం బలోపేతం చేయడానికి సుక్షితులైన సహకార సంఘాల ఉద్యోగుల అవసరం సంస్థకు ఎంతో ఉందన్నారు. సహకార సంఘాల సభ్యులు, పాలకవర్గంపై అవగాహన అత్యంత అవసరమన్నారు. రాష్ట్ర సహకార యూనియన్ ద్వారా సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్, లీడర్ షిప్ ప్రోగ్రామ్ పటిష్ఠవంతంగా చేయడానికి కృషి చేస్తామన్నారు. గత సంవత్సరం జరిగిన 63 శిక్షణా కార్యక్రమాల ద్వారా 1738 సభ్యులు శిక్షణ పొందారని తెలిపారు. 168 మంది విద్యా శిక్షణ కార్యక్రమం ద్వారా 19,188 సభ్యులకు సహకార విద్యను అందించడం జరిగిందన్నారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 204 శిక్షణ కార్యక్రమాల ద్వారా 15,344 సభ్యులకు శిక్షణ కల్పించడం జరిగిందన్నారు. సహకార యూనియన్ ల అభివృద్ధికి గ్రాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి సహకార యూనియన్ల పటిష్టతకు సంబంధించిన ప్రణాళికను రూపొందిస్తామన్నారు. ఈ మహాసభలో నేషనల్ బ్యాంకు ఫెడరేషన్ చైర్మెన్ కె.రవీందర్‌రావు, మార్క్ ఫెడ్ చైర్మెన్ గంగారెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మెన్ జె.రాఘవరెడ్డి, నల్గొండ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మెన్ కె.శ్రీనివాస్జి, మెదక్ కో-ఆపరేటివ్ బ్యాంకు చైర్మెన్ దేవేందర్‌రెడ్డి, ఆదిలాబాద్ చైర్మెన్ భోజిరెడ్డి, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడుకు ప్రముఖ పారిశ్రామికవేత్తలు ఆనంద్ కుమార్, శ్రీమాన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ అనూప్ చక్రవర్తిలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామ్మోహన్ నాయుడు అత్యంత పిన్న వయస్సులో కేంద్ర క్యాబినెట్ మంత్రిగా దేశ వైమానిక రంగాన్ని మరింత అభివృద్ధిలోకి తీసుకెళ్లేందుకు పాటు పడుతున్నారని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. యువతలో అత్యంత పాపులారిటీ ఉన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి రోగులకు వారి సంరక్షకులకు, పేదలకు అన్నదానం చేయడం జరిగిందని ఆనంద్ కుమార్, అనుప్ చక్రవర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత ప్రణాంతకమైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారికి చేయూతనందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్, శ్రావణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీలను బీజేపీ ఆర్థికంగా, సామాజికంగా కుంగ తీస్తున్నది

- ఆవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్



నవతెలంగాణ-ధూల్‌పేట్

బీజేపీ మైనారిటీలను ఆర్థికంగా, సామాజికంగా కుంగ తీస్తుందని ఆవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్ అన్నారు. ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో మైనారిటీ రైట్స్ డే సందర్భంగా ఆవాజ్ ఆఫీస్‌లో సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం మైనారిటీలపై ఈ 11ఏండ్ల కాలంలో లెక్కకు మించిన దాడులు చేస్తుందన్నారు. ఏదో ఒక ఇష్యు చేసి మైనార్టీలను ముఖ్యంగా ముస్లింలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. వక్ఫ్ ల్యాండ్ ఇష్యుపై ముస్లింలను దెబ్బతీయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దేశవ్యాప్తంగా ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని వ్యతిరేకిస్తున్న, ఆందోళన చేస్తున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. తీవ్రంగా ముస్లింలను నష్టానికి అన్యాయానికి గురి చేస్తున్నారు. ఇలాంటి బిల్లుని ఉపసంహరించుకోవాలని ఆవాజ్ నగర కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. కొత్తగా 5వేల మందికి కుట్టు మిషన్లు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కేవలం ఐదు వేల మిషన్లు మాత్రమే ఇస్తామనడం అన్యాయమన్నారు. నగరంలో లక్షల మంది మైనారిటీ ముస్లింలు జీవన ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికీ సొంత ఇల్లు లేని పేదలు లక్షల్లో ఉన్నారని, సొంతంగా ఏ వ్యాపారం చేయలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. కుట్టు మిషన్లు ఇవ్వడంతో ఆర్థికంగా ఎదగడానికి కుటుంబాన్ని పోషించడానికి సరిపోదని, అర్హులైన పేదలను గుర్తించి డైరెక్ట్‌గా ఐదు లక్షలు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇచ్చినట్లయితే ఏదో ఒక వ్యాపారం చేసుకుని ఆర్థికంగా బలబడతారనే విషయం ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గులాం నసీర్, షేక్ యాకూబ్, మహబూబ్ అలీ, హఫీస్ ఇఫ్తేఖార్, మహమ్మద్ ఫహీం తదితరులు పాల్గొన్నారు.

'నన్ను మానసికంగా వేధిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకోవాలి'

- బాధితురాలు దాసరి రమ్య



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

తన భర్త తీసుకున్న డబ్బుల విషయంలో తనను మానసికంగా వేధిస్తున్న పోలీసులపై చర్యలు తీసుకుని, తనకు న్యాయం చేయాలని బాధితురాలు దాసరి రమ్య రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి, డీజీపీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సికింద్రాబాద్‌కు చెందిన కల్యాణ్ తో తాను ప్రేమ వివాహం చేసుకున్నానని, తమకు ముగ్గురు సంతానం కలిగారని తెలి పారు. ఆ తర్వాత తమ మధ్య వచ్చిన మనస్పర్థలతో కోర్టు నుంచి విడాకులు తీసుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో వారాసీగూడకు చెందిన నంబూరి విజయ్ వంశీతో తాను నవంబర్-2021 ద్వితీయ వివాహం చేసుకున్నట్లు తెలి పారు. రైల్వే ఉద్యోగం చేస్తున్న విజయ్ తన పిల్లలను చూసుకుంటానని నమ్మించాడని తెలిపారు. వివాహ సమ యంలో ఆయనకు రూ.10 లక్షలు, 40 తులాల బంగారం కట్నం కింద ఇవ్వడం జరిగిందన్నారు. వివాహం తర్వాత 3 నెలలు మాత్రమే తనతో మంచిగా ఉన్నాడని, అదనపు కట్నం కోసం మద్యం సేవించి నిత్యం తనను మానసికంగా వేధింపులకు గురి చేశారని వాపోయింది. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న డబ్బులు, బంగారం తీసుకుని తనను వదిలి వేసి వెళ్లాడని తెలిపారు. తనకు తెలియకుండానే కొంత మందికి వివిధ రంగాలలో ఉద్యో గాలు ఇప్పిస్తానని చెప్పి వారి వద్ద డబ్బులు తీసుకున్నాడని, ఆయన వెళ్లిపోయిన తర్వాత తెలిసిందన్నారు. డబ్బులు తీసుకుని తమకు ఉద్యోగాలు కల్పించలేదనే అభియోగంపై నంబూరి విజయ్ వంశీపై బాధితులు నవంబర్ 28న చిలకలగూడ, ఈనెల 3న చైతన్యపురి పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారని తెలిపారు. అతనిపై చర్యలు తీసుకోకుండా ఈ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేకున్నా రెండు పీఎస్‌లకు సంబంధించిన పోలీసులు మానసికంగా తనను వేధింపులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని వేడుకుంది. లేనిపక్షంలో తనకు ఆత్మహత్య శరణ్యమని రమ్య కన్నీటి పర్యంతమయ్యారు.


సెపక్ తక్రకు ఒలింపిక్ అసోసియేషన్‌తో అఫిలియేషన్ కల్పించండి

- కేంద్రమంత్రికి సెపక్ తక్ర స్టేట్ ప్రెసిడెంట్ పెరిక సురేష్



నవతెలంగాణ-అంబర్‌పేట

సెపక్ తక్ర క్రీడకు ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్ అఫిలియేషన్ ఇవ్వా లని సెకప్ తక్ర అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ సురేష్ కేంద్ర హెూం శాఖ సహా యమంత్రి బండి సంజయ్‌ని కోరారు. ఈ మేరకు పెరిక సురేష్ ఆధ్వర్యంలో ఎస్‌టీఎఫ్ఐ ప్రతినిధులు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిసి వినతి పత్రం అందించారు. సురేష్ మాట్లాడుతూ క్రీడల్లో యువతను ప్రోత్స హించడంలో మోడీ ఆధ్వర్యంలో ఎన్డీఏ ప్రభుత్వం ముందుం దని తెలిపారు. యువతకు క్రీడలపట్ల ఆసక్తిని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ క్రీడ ను ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్‌తో అఫిలియేషన్ ఇవ్వడంతో మరింత ప్రోత్సహం కల్పించిన వారవుతారని కేంద్ర మంత్రిని కోరారు. సెపక్ తక్రాను భారత ఒలింపిక్ సంఘంతో అఫిలియేషన్ ఇచ్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని మంత్రి బండి వారికి హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రిని కలిసిన వారి లో ఇంటర్నేషనల్ సెపక్ తక్ర ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ఆర్.ప్రేమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



టీఎన్జీవో హైదరాబాద్ డిస్టిక్ 11వ యానివర్సరీ స్పోర్ట్స్ మీట్-2025 స్వామినాథన్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ టీజీవోస్ హైదరాబాద్ జిల్లా జట్టు వర్సెస్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ జట్టు మధ్య క్రికెట్ మ్యాచ్ ప్రారం భించిన టీజీ వోస్ సెంట్రల్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు టీజీవోస్‌చేతుల మీద మ్యాచ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ.సత్యనారాయణ, జనరల్ సెక్రెటరీ. బి శ్యామ్, అసోసియేట్ ప్రెసిడెంట్ జిల్లా అధ్యక్షులు ఎం.వికృష్ణ యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి, రామారావు, పి.శ్రీనివాస్ తదితరులున్నారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



నవతెలంగాణ-మెహిదీపట్నం

మెహిదీపట్నం గుడిమల్కాపూర్ వార్డు ఆఫీస్ దగ్గర కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని పని భద్రత కల్పించాలని సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ డేట్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి సి. మల్లేష్, నాయకులు కిరణ్, వెంకటేష్, శ్రీకాంత్, శ్రీనివాస్, నాయకురాలు నరసమ్మ, మంగమ్మ, అన్నజా తదితరులున్నారు.

'సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి'

తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరిని విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి జి.ఝాన్సీ సౌజన్య, కోశాధికారి దుర్గం శ్రీనివాస్ డిమాండ్ చేశారు.నిరవధిక సమ్మె 9వ రోజులో భాగంగా బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కేల్ ఇవ్వాలని కోరారు. సుమారు 18 ఏండ్ల నుండి 19600 మందికి పైగా ఉద్యోగులు పాఠశాల విద్య మెరుగు కోసం కృషి చేస్తున్నామన్నారు. తమ ఆర్థిక స్థితి గతులను దృష్టిలో ఉంచుకొని సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రతి ఉద్యోగికి జీవిత భీమా రూ.10 లక్షలు, ఆరోగ్య భీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలని, ఉద్యోగులకు పదవి విరమణ చేస్తున్న వారికి, చేసిన వారికి బెనిఫిట్స్ కింది రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ విద్యాశాఖ నియమకాలలో వెయిటేజ్ కల్పించాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికి రీ-ఎంగేజ్ విధానాన్ని తీసేయాలని డిమాండ్ చేశారు.

వరంగల్‌లో 2023 ఆగష్టు, సెప్టెంబర్‌లలో దాదాపు 25 రోజుల సమ్మె చేసిన క్రమంలో అప్పటి టీపీసీసీ అధ్యక్షులు ఎ.రేవంత్ రెడ్డి తమ ధర్నా పాయింట్ వద్దకు వచ్చి సమ్మెకు మద్దతు ఇస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో సచివాలయానికి పిలిచి డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, అసోసియేట్ ప్రెసిడెంట్ సురేందర్, సహదేవ్, కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు జానకీ, చందు, కనుకుల రమేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు సరిత, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలి

బీజేపీ రాష్ట్ర నాయకులు యెండల లక్ష్మీ నారాయణ, గౌతమ్ రావు, చింతల రామచంద్రారెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా మనం పని చేయాలని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు సూచించారు. అనంతరం బీజేపీ నగర కార్యాలయంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డా. ఎన్. గౌతమ్ రావు అధ్యక్షతన జిల్లా వర్క్ షాప్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ రావు మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ జిల్లాలోని ప్రతి బూత్ లో పార్టీ బలమైన శక్తిగా అవతరించాలని ఆయన కోరారు. సిద్ధాంతాల ఆధారంగా బీజేపీ పని చేస్తున్నందుకే దేశ ప్రజలు ఇవాళ బీజేపీని ఆశీర్వదిస్తున్నారని గౌతమ్ రావు స్పష్టం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఎన్నికల రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ ఇచ్చిన గడువులోపే బూత్ కమిటీలను పూర్తి చెయ్యాలని ఆయన వ్యాఖ్యానించారు. జిల్లాలో అత్యధిక సంఖ్యలో క్రియాశీల సభ్యులు అవతరించాలని ఆయన అన్నారు. క్రింది స్థాయిలో బీజేపీ బలంగా ఉన్నప్పుడే రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలలో సత్తా చాటుతామని యెండల లక్ష్మీ నారాయణ వివరించారు. అదేవిధంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో 2014వ సంవత్సరంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో విప్లవాత్మకమైన మార్పులు సంభవించాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా రిటర్నింగ్ అధికారి జె. శ్రీకాంత్, అట్లూరి రామకృష్ణ, లాయక్ అలీ,తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలతో దోస్తీ కడితేనే...

చిన్నప్పుడు కాలికి కాగితం ముక్కకానీ, పుస్తకం గానీ తగిలితే తీసి కళ్ళకి అద్దుకోవటం అందరికీ గుర్తుండే వుంటుంది. అదిగో అప్పటి నుండి మరేం మాధ్యమాలూ తెలియని మనకు పుస్తకంతో స్నేహం, అనుబంధం ఏర్పడింది. సమాజంలో ఎన్నిరకాల మనుషులు వుంటారో, వాళ్ళతో ఎలా నడుచుకోవాలో, మనల్ని మనం ఏవిధంగా గట్టిపరచుకోవాలో, సామాజిక, కుటుంబిక సమస్యల్ని ఎలా ఎదుర్కోవాలో, ఆదర్శాలూ, ఆశయాలూ, ఆశలూ అన్నింటినీ పుస్తకాలు చదివే అర్థం చేసుకున్నాం. ఒక వ్యక్తి చదివే పుస్తకాలను బట్టి వారి వ్యక్తిత్వాన్ని అంచనా కట్టొచ్చునంటారు. మా తరంలో స్కూల్‌లో గ్రంథాలయం, అవి చదవడానికి వారానికి ఒక పీరియడ్ ఉండేది. ఇప్పుడు కూడా అన్ని పాఠశాలల్లో పుస్తకాలు చదవటం, వాటిపై చర్చలను ఏర్పాటు చేయాల్సిన అవసరం వుంది. ఈ నాటి పాఠశాలలో విద్యార్థులను ర్యాంకులవెనుక పరిగెత్తించే సంస్కృతే తప్ప జీవితం విలువను తెలుసుకొనే దిశగా లేవు. ఈరోజు నుండి జరగబోయే పుస్తక ప్రదర్శనకు పిల్లల్ని తీసుకువచ్చి కనీసం తల్లిదండ్రులైనా తమ పిల్లలకి చిన్నప్పటి నుండి మంచి బొమ్మల కథల పుస్తకాలతో నేస్తం కట్టిస్తే తర్వాత్తర్వాత సాహిత్య పుస్తకాలు చదవటానికి అలవాటు పడతారు. పుస్తకాలను మించిన స్నేహితులు ఉండరు. పుస్తకాలతో దోస్తీ కట్టినవారికే సాహిత్యరుచి తెలుస్తుంది.

◆ శీలా సుభద్రాదేవి

పుస్తక మహోత్సవం



మంచి పుస్తకం వేలాది మంది స్నేహితులతో సమానం అంటారు. అందుకే పుస్తకం ఎంతో మంది కలలకు ఆధారం. ఒంటరితనంలో తోడు. పుస్తకం చదవడం వల్ల ఎన్నో గొప్ప విషయాలు నేర్చుకోవచ్చు. పుస్తకాన్ని చదవడం వల్ల జ్ఞానాన్ని పొందడమే కాదు, మానసిక ఒత్తిడి సైతం తగ్గుతుంది. మహానుభావుల విజయగాథలు, ఆత్మకథలు, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయి. పుస్తక పఠనం ద్వారా ఎంతో మంది ఉన్నత శిఖరాలు అధిరోహించారు. అందుకే విజ్ఞానాన్ని అందించే భాండాగారం పుస్తకం. సమానత్వ సాధనకై ఏండ్లుగా పోరాడుతున్న మహిళా లోకానికి ఓ ఆయుధం పుస్తకం. ఇటువంటి గొప్ప పుస్తకాలన్నీ ఓ చోటకు చేరి హైదరాబాద్ నేషనల్ బుక్ ఫెయిర్ రూపంలో మనల్ని ఆహ్వానిస్తున్నాయి. ఈ సందర్భంగా పుస్తకం, పుస్తక ప్రదదర్శనలపై రచయిత్రుల మనోగతలు ఏమిటో తెలుసుకుందాం...



పాఠకులకు, రచయితలకు వారధి



బుక్ ఫెయిర్ వస్తుందంటేనే మనసు ఉప్పొంగిపోతుంది. ఒకే అభిరుచి గల వారంతా ఒకేచోట గుమిగూడటమే పెద్ద ఆకర్షణగా ఉంటుంది. రచయితలు, పాఠకులు, బుక్ స్టాల్ నిర్వాహకులు... ఆ సందడి చెప్పనలవి కానిది. దీనికి తోడు ప్రతిరోజూ ఎన్నో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ సందర్శకుల అభిరుచికి మరింత ఉత్సాహాన్ని అందిస్తారు నిర్వాహకులు. నచ్చిన పుస్తకం కొనుగోలు చేయాలంటే వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎన్నో షాపులను సందర్శించాల్సి ఉంటుంది. ఆ ఇబ్బంది లేకుండా ఒకే ప్రాంగణంలో మనకు తెలిసిన, తెలియని పుస్తకాలు అందుబాటులో ఉంచటం గొప్ప విషయం. పుస్తక ప్రియులకు ఇంతకన్నా సంతోషదాయకమైన మరో అంశం ఏముంటుంది? ఒక దశలో పాఠకులు తగ్గిపోయారని నిరాశ చెందారు పరిశీలకులు. కొన్నేళ్ళుగా పాఠకుల సంఖ్యను పెంచడంలో బుక్ ఫెయిర్ విజయవంతమైన పాత్ర పోషించిం దనడంలో సందేహం లేదు. ఈ మధ్య కాలంలో అంచనాలకు మించి సందర్శకులు వస్తున్నారు. పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు. ఇది ఆశాజనక పరిణామం. పుస్తకం పది కాలాలపాటు వర్ధిల్లాలి.

పోయినేడాది ఏర్పాట్లలో కొన్ని లోటుపాట్లు జరిగాయి. ఈసారి సాహితీ, చర్చా కార్యక్రమాలలో మహిళలకూ అవకాశం కల్పించాలని కోరుకుంటున్నాను. పరిశుభ్రతను పాటించని వారికి ఫుడ్ స్టాల్స్ ఇవ్వకూడదు. ప్రతి కొద్ది దూరానికి తాగునీటిని అందుబాటులో ఉంచాలి. టాయ్ లెట్స్ సంఖ్యను పెంచడంతోపాటు ఆ విశాల ప్రాంగణంలో రెండు వైపులా విభజించి ఏర్పాటు చేయాలి. అంతేకాదు. కొనుగోలు చేసిన పుస్తకాలు మోసుకొని వెళ్ళడం పెద్ద టాస్క్‌లా ఉంది. అందుకోసం చిన్న ట్రాలీలు ఏర్పాటు చేస్తే సందర్శకులు ఆ బాధ నుంచి విముక్తులవుతారు. ఈ సూచనలను బుక్ ఫెయిర్ నిర్వాహకులు దృష్టిపెడతారని ఆశిస్తున్నాను.

◆ నస్రీన్ ఖాన్

పుస్తకాల బతుకమ్మ



క్షరము కాని అక్షరము మనకు ఎన్నో విషయా లను నేర్పిస్తుంది. అక్షర జ్ఞానం వల్ల వివేచన కలిగి సొంత నిర్ణయాలు తీసుకోగలుగుతాం. ఏ విషయం గురించి అయినా సమర్థవంతంగా ఆలోచించగలిగే నైపుణ్యం ఒక మంచి పుస్తకం ద్వారా కలుగుతుంది. అలాంటి అద్భుతమైన పుస్తకాల పండుగ వచ్చేసింది. 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ మొదలైంది. దాదాపు 320 స్టాళ్లతో 210 మందికి పైగా ప్రచురణకర్తల, పంపిణీదారులతో అనేక రకాల సాంస్కృతిక కార్యక్రమాలతో, సాహితి చర్చలతో అలరారబోతోంది.

'లోకో భిన్న రుచిః' అన్న నానుడికి అనుగుణంగా సాహిత్యం, కథ, కవిత, విమర్శ, పరిశోధనా గ్రంథాలు, విప్లవం, చరిత్ర, ఆధ్యాత్మికం, ఆటలు, కళలు, సంస్కృతి, బాల సాహిత్యం ఇలా ఒక టేమిటి అడిగినవారికి అడిగినవి అందిస్తూ విభిన్న పుస్తక సముదాయాలతో దర్శనమిస్తోంది. ఇష్టమైన పుస్తకాలను, అలభ్యమవుతున్న పుస్తకాలను ఇక్కడ మనం పొందవచ్చు. పుస్తక ప్రియులకు, కవులకు, రచయితలకు, కళాకారులకు ఇది ఒక అక్షర విందు. ఇక్కడ మనం ముందు తరాల వారి రచనలతో పాటు యువ రచయితల పుస్తకాలను చూడవచ్చు. సమాజం పట్ల నేటితరం భావాలను అర్థం చేసుకోవచ్చు. మన అభిమాన రచయితలను కలవచ్చు. ప్రతి సంవత్సరం ఎన్నో వేల కొత్త పుస్తకాలు పుట్టుకొచ్చే ఈ ప్రాంగణంలో కిలకిలలాడే అక్షరాల ఆహ్వానంతో పాటు, కళకళలాడే సంతోషాల పలకరింపులు షరా మామూలే!

పుస్తకాలు చదవడం వల్ల మానసిక పరివర్తన కలుగుతుంది. అవి మనలోని ఊహాశక్తిని మేలుకొలుపుతాయి. మనో నేత్రానికి వెలుగునిస్తాయి. ప్రశ్నించటం, తిరగబడటం, సంఘటితం కావడం వంటి వాటితో పాటు మానవీయ విలువలను మనలో పెంపొందిస్తాయి. పుస్తకం ఒక నమ్మకమైన మిత్రుడు. పుస్తక పఠనం వల్ల తనను తాను అద్దంలో చూసుకున్నట్లుగా మనలోని మనిషిని మనం దర్శించగలుగుతాం.

డిజిటల్ కల్చర్ వల్ల తమలోని శక్తి యుక్తుల్ని తెలుసుకోలేకపోతున్న నేటి యువతరానికి పుస్తకాలు మార్గదర్శనమవుతాయి. ఈ పుస్తకోత్సవానికి తల్లిదండ్రులు తమ పిల్లలను కూడా తీసుకు వెళ్ళటం చాలా అవసరం. తాము పుస్తకాలు కొనడంతో పాటు పిల్లలకు నచ్చిన పుస్తకాలు కొనియివ్వాలి. పుస్తకాల గురించి ఆసక్తి చూపుతున్న వారిని చూసి పిల్లలు కూడా స్ఫూర్తిని పొందుతారు. పుస్తక పఠనం వారికి ఉన్నత జీవన విధానాన్ని, సరికొత్త దిశను అందిస్తుంది. మనిషిని మనిషిగా మార్చగలిగేది పుస్తకం. మరి అలాంటి విలువైన పుస్తకాలను కొని మీరు చదవటంతో పాటు పెళ్లిళ్లలో, ఇతర ఫంక్షన్లలో బంధువులకు.. సభలు, సమావేశాలలో పుస్తక ప్రియులకు కానుకగా ఇస్తే ఎంతో బాగుంటుంది కదా! మరెందుకు ఆలస్యం. పుస్తకాల జాతరకు వచ్చి ఆనందంగా నచ్చిన పుస్తకాలు తీసుకు వెళ్ళండి. పుస్తకం మాత్రమే మనిషికి మనిషికి మధ్య నిజమైన కరచాలనం.

◆ విశ్వైక

కుటుంబ ఉత్సవం



అక్షర జ్ఞానం కలిగిన వారిలో పుస్తకాన్ని ఇష్టపడని వారు చాలా అరుదు. ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ కోసం లక్షలమంది ఎదురుచూస్తూ ఉన్నట్టే ఈ పుస్తక ప్రదర్శనల కోసం ఎందరో పాఠకులు, కవులు, రచయితలు, పబ్లిషర్స్, విద్యార్థులు ఎదురుచూస్తూ ఉంటారు. ఇంతమంది ఒకే చోట కలవగలిగే చోటు కూడా ఈ పుస్తక ప్రదర్శన మాత్రమే.. 'ఇప్పుడు పుస్తకాలను ఎవరు చదువుతున్నారు' అనే అపవాదును అధిగమిస్తూ ఈ పుస్తక ప్రదర్శనలు అద్భుతంగా నడపవచ్చును. ఈ మధ్యకాలంలో యువకవులు, విద్యార్థులు రచనా వ్యాసాంగంలోకి దూసుకొస్తున్నారు. అందుకు వారిని అభినందించాల్సిందే.. అయితే సాంద్రత లేని రచనలను మొహమాటానికి మెచ్చుకొని వారిని తప్పు దోవ పట్టించకుండా ఉండవలసిన బాధ్యత విజ్ఞులది. ఆ అవకాశం ఈ పుస్తక ప్రదర్శనలో కలగించాలి. వంద కంటే ఎక్కువ పుస్తకాలను ఈ బుక్ ఫెయిర్‌లో ఆవిష్కరించ బోతున్నారు. అందుకు నిర్వాహకులు అందరికీ అవకాశం కల్పిస్తూ.. ముఖ్యంగా మహిళలకు, బాలలకు ప్రత్యేక వసతులు కలిగిస్తూ అందరినీ ఆకట్టుకోవాలని కోరుకుంటున్నాను. పుస్తకం ఒక చెట్టు వంటిది, చెట్టు అమ్మ వంటిది. పుస్తకాల్లో ఉండేవి కూడా మన జీవితాలే. భాష ఏదైనా ఈ ప్రపంచంలో మన జీవితాలకు అద్దం పట్టేది పుస్తకాలు మాత్రమే. అందుకోసమే పుస్తక పఠనాన్ని ప్రోత్సహించాలి. పుస్తకాలను రాసి అచ్చు వేసే వాళ్ళకి అమ్ముడయ్యే మార్కెటింగ్ ఈ పుస్తక ప్రదర్శన జరపాలి. అమ్మడం అంటే ఒక వ్యాపారం అది మా బాధ్యత కాదు అనడం సరికాదు. ఎంతో కష్టపడి రాసిన రచనలను, పుస్తక రూపంలో అచ్చు వేసిన ప్రచురణ కర్తలు నష్టపోయి, పుస్తక ప్రచురణకు వెనుకంజ వేసినప్పుడు పుస్తకాలే ఉండవు. అప్పుడు ఇటువంటి ప్రదర్శనలే ఉండవు. అలా అని ఇబ్బడి ముబ్బడిగా ప్రదర్శనలు, ప్రచురణలు చేయమని కాదు. మంచి పుస్తకాలను ఆదరించే పాఠకులు ఎప్పటికీ ఉంటారు. సెల్ ఫోన్ చూస్తూ పుస్తకాలను మరిచారని ఒక అపవాదు కూడా ఉంది. ఇటువంటి రూమర్స్ తప్పు అని నిరూపిస్తూ ప్రతి ఏడాది వేలమంది పుస్తక ప్రియులు, వందల కొద్దీ కవులు, రచయితలు ఈ పుస్తక ప్రదర్శనలో పాల్గొంటున్నారు. రచయిత పాఠకులు ముఖాముఖి కలుసుకుని ఒక కుటుంబ ఉత్సవంలో పాల్గొన్నట్టు అందరూ ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకుంటూ పుస్తకాల చర్చ కొనసాగించాలని ఆశిస్తున్నాను. మహిళల కోసం ప్రత్యేకంగా ఒక రోజున కేటాయించి ఆ రోజంతా మహిళలకు సంబంధించిన రచనలను పుస్తకాలను చర్చించాలని కోరుతున్నాను.

◆ జ్వలిత

ఎస్.కె.సలీమా

దేశం పరువు తీశారు

(మొదటిపేజీ తరువాయి)

అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏండ్లు కష్టపడి అనేక జాతీయ సంస్థలను సృష్టిస్తే వాటిని మోడీ తన మిత్రులకు కారు చౌకగా కట్టబెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిందని అమెరికా అత్యున్నత దర్యాప్తు సంస్థ ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) ఫారెన్ కరెప్షన్ యాక్ట్ ప్రకారం అదానీ సంస్థలపై కేసు నమోదు చేసినా ఇప్పటి వరకు కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. "భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకుపోయాయి. అక్రమ వ్యాపారాల కోసం ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నాయి. అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయి. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్‌బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. దేశం పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలి. దీనిపై విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలి. అదానీ అవినీతిపై చర్చకు, జేపీసీ వేసేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. అలా చేస్తే అదానీ జైలుకి వెళ్లాల్సి వస్తుంది. ఆయన్ను కాపాడేందుకు ప్రధాని మోడీ యత్నిస్తున్నారు. అదానీకి అమెరికా జైలా? తీహార్ జైలా? అనేది మోడీ నిర్ణయించాలి. ఈ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తాం" అని సీఎం రేవంత్ హెచ్చరించారు. "సడక్‌సే సంసద్ తక్ గాంధీనే హమ్‌కో లడ్‌నే సిఖాయా" మేం గాంధీ వారసులం. అదానీ అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకునే వరకు పోరాడుతామని సీఎం ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గత కొంతకాలంగా అల్లర్లతో అట్టుడికిపోతున్న మణిపూర్‌ను ప్రధాని సందర్శించి శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలా అని ఉండాల్సింది కాదు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశమైంది. సుమారు 30 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో ఏం జరిగిందనేది తెలియనప్పటికీ యాదవ్ వ్యాఖ్యలపై కొలీజియం అసంతృప్తి వ్యక్తం చేసిందని సమాచారం. కాగా విద్వేష ప్రసంగం చేసి మతపరమైన అసమ్మతిని ప్రేరేపించినందుకు జస్టిస్ యాదవ్‌ను అభిశంసించాలంటూ ప్రతిపక్ష సభ్యులు ఇచ్చిన నోటీసుపై రాజ్యసభ చైర్మెన్ తీసుకోబోయే నిర్ణయం పైనే ఇప్పుడు అందరి దృష్టీ కేంద్రీకృతమై ఉంది.

ఈ నెల 8న అలహాబాద్ హైకోర్టు ఆవరణలో వీహెచ్‌పీ లీగల్ సెల్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించిన జస్టిస్ యాదవ్ ముస్లింలను లక్ష్యంగా చేసుకొని విషం చిమ్మారు. దీనిపై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఖన్నాకు సీపీఐ (ఎం) నేత, మాజీ ఎంపీ బృందా కరత్ లేఖ రాస్తూ 'న్యాయ వ్యవస్థకు చెందిన సభ్యుడు మైనారిటీలకు వ్యతిరేకంగా, మెజారిటీవాదానికి అనుకూలంగా పక్షపాతంతో, బహిరంగంగా అభిప్రాయాన్ని వ్యక్తం చేసినప్పుడు ఏ కక్షిదారుడు కూడా న్యాయాన్ని ఆశించలేడు' అని మండిపడ్డారు. కాగా జస్టిస్ యాదవ్‌కు వ్యతిరేకంగా ఇచ్చిన అభిశంసన నోటీసును ఎగువసభ చైర్మన్ అనుమతించవచ్చు. లేదా తిరస్కరించవచ్చు.

ముంబయి తీరంలో ఫెర్రీ ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

జరిగినప్పటి వీడియో ఒకటి బయటికి వచ్చింది. అంతకుముందు ఫెర్రీ మునిగిపోతోందని మాత్రమే వార్తలు వచ్చాయి. కారణం తెలియరాలేదు. గేట్ వే ఆఫ్ ఇండియా నుండి ఎలిఫెంటా ఐల్యాండ్ వరకు ఈ స్పీడ్ బోటు వెళుతోంది. లైఫ్ జాకెట్లు వేసుకున్న వారినందరినీ కాపాడి వేరే బోటులోకి పంపించడం వీడియోలో కనిపిస్తోంది. మరోవైపు ఫెర్రీ నెమ్మదిగా నీళ్ళలోకి ఒరిగిపోవడం కూడా కనిపిస్తోంది.

సహాయక చర్యల్లో భారత నావికాదళం, కోస్ట్ గార్డ్ దళాలు పాల్గొన్నాయి. 11 నేవీ బోట్లు, మెరైన్ పోలీసులకుచెందిన మూడు బోట్లు, కోస్ట్ గార్డ్ దళాలకు చెందిన మరో బోటు రంగంలోకి దిగాయని రక్షణ అధికారి తెలిపారు. సహాయక చర్యల్లో నాలుగు హెలికాప్టర్లు పాల్గొనగా, ఆ ప్రాంతంలోని జాలర్లు, జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ వర్కర్లు, పోలీసులు కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

మీరు పన్నులేస్తే మేమూ వేస్తాం

భారత్‌కు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్ : తమ దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై భారత్ సహా పలు దేశాలు అధిక పన్నులు వేస్తున్నాయని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. తాము కూడా ఆ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై అలాగే ఎక్కువ పన్నులు వసూలు చేస్తామని ఆయన హెచ్చరిక ధోరణిలో చెప్పారు. ఇతర దేశాలు అమెరికా ఉత్పత్తులపై పన్నులు విధిస్తే తామూ అలాగే స్పందిస్తామని ఆయన విలేకరులతో అన్నారు. 'వారు మా మీద పన్నులు వేస్తే అంతే మొత్తంలో మేమూ వారిపై పన్నులు విధిస్తాం. మేము పన్నులు వేస్తే వారూ వేస్తారు. అన్ని సందర్భాలలోనూ వారు మాపై పన్నులు వేస్తున్నారు. మేమేమో వారిపై వేయడం లేదు' అని ట్రంప్ వ్యాఖ్యానించినట్లు పీటీఐ వార్తా సంస్థ తెలిపింది.చైనాతో వాణిజ్య ఒప్పందంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే ఆయన భారత్, బ్రెజిల్ దేశాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. కొన్ని అమెరికా వస్తువులపై ఈ రెండు దేశాలతో పాటు మరికొన్ని దేశాలు కూడా అధిక పన్నులు వసూలు చేస్తున్నాయని ట్రంప్ చెప్పారు. అమెరికా వస్తువులపై భారత్ వంద శాతం పన్ను వేస్తే అమెరికా కూడా ప్రతిగా అంతే వసూలు చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. 'భారత్ మాపై వంద శాతం పన్ను వేస్తే మేము ఏమీ వేయకూడదా? మీకు తెలుసు. వారు మాకు ఓ సైకిల్ పంపితే మేము కూడా సైకిల్ పంపుతాం' అని అన్నారు.

'వారు 100, 200 పన్ను వేస్తున్నారు. భారత్ ఎక్కువ వసూలు చేస్తోంది. బ్రెజిల్ కూడా అధిక పన్నులు వసూలు చేస్తోంది. మాపై ఎక్కువ పన్ను వేయాలని వారు అనుకుంటే సరే. కానీ మేము కూడా వారి నుండి అలాగే వసూలు చేస్తాం' అని మార్-ఏ-లాగోలో జరిగిన విలేకరుల సమావేశంలో ట్రంప్ తెలిపారు. ట్రంప్ క్యాబినెట్‌లో వాణిజ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టబోయే హోవర్డ్ లట్నిక్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నూతన ప్రభుత్వ వాణిజ్య విధానంలో 'పరస్పరం' అనే మాటకు అధిక ప్రాధాన్యం ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. 'మీరు మమ్మల్ని ఎలా చూస్తున్నారు? మేము మిమ్మల్ని ఎలా చూడాలి? అనేదే ముఖ్యం' అని ఆయన అన్నారు. కాగా తాము భారత్-అమెరికా సంబంధాలను పటిష్ట స్థితిలో ఉంచామని బైడెన్ ప్రభుత్వం తెలిపింది. డొనాల్డ్ ట్రంప్ హయాంలో కూడా అది కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

అమిత్ షా క్షమాపణ చెప్పాలి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. అంబేద్కర్‌ను అవమానిస్తే దేశం సహించదని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు.బుధవారం పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష పార్టీలు అంబేద్కర్ చిత్రపటాలతో ఆందోళన చేపట్టాయి. పార్లమెంట్ మకరద్వారం వద్ద నిరసనను నిర్వహించాయి. 'జై భీమ్, అమిత్ షా క్షమాపణ చెప్పాలి' అంటూ నినాదాల హోరెత్తించాయి. కాంగ్రెస్, డీఎంకే, ఎన్సీపీ(ఎస్పీ), సీపీఐ(ఎం), ఆర్జేడీ, ఎస్పీ, ఆప్, జేఎంఎం, ఐయూఎంఎల్, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ), సీపీఐ, ఆర్ఎస్‌పీ తదితర పార్టీల నేతలు ఆందోళనలో పాల్గొన్నారు. రాజ్యసభ, లోక్‌సభ ప్రతిపక్షనేతలు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీలు, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, టిఆర్ బాలు (డీఎంకె), జాన్ బ్రిట్టాస్, వి. శివదాసన్ (సీపీఐ(ఎం)), సంజయ్ సింగ్ (ఆప్), మనోజ్ కుమార్ ఝా (ఆర్జేడీ), మహువా మాంఝీ (జేఎంఎం) తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ... రాజ్యసభలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత, దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు అంబేద్కర్ అనీ, ఆయన రూపొందించిన రాజ్యాంగాన్ని అవమానించడాన్ని దేశం సహించదని రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రియాంక గాంధీ మాట్లాడుతూ.. అంబేద్కర్ పేరు ప్రస్తావించడాన్ని ఎంతో గౌరవంగా భావిస్తారనీ, ఆయన కోట్లాది మంది దళితులు, అణగారిన వర్గాల ప్రజల ఆత్మగౌరవాలకు ప్రతీక అని అన్నారు.

అట్టుడికిన ఉభయ సభలు

అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు నిర్వహించిన ఆందోళనతో పార్లమెంట్ ఉభయ సభలు అట్టుడికాయి. లోక్‌సభ ప్రారంభమైన రెండు నిమిషాలకే వాయిదా పడింది. మధ్యాహ్నం రెండు గంటలకు తిరిగి ప్రారంభమైన సభలో కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభను వెంటనే నేటికి వాయిదా వేశారు. మరోవైపు, రాజ్యసభలో కూడా ఇదే తంతు నడిచింది. ప్రతిపక్షాల ఆందోళనతో ఎటువంటి కార్యకలాపాలూ జరగకుండానే రాజ్యసభ నేటికి వాయిదా పడింది. మరోవైపు, అమిత్ షాపై టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులిచ్చారు.

అమిత్ షా దేశానికి క్షమాపణ చెప్పాలి : ఖర్గే

అమిత్ షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ చేశారు. వారికి రాజ్యాంగంపై నమ్మకం లేదనీ, వారు మనుస్మృతి గురించి మాట్లాడుతుంటారని విమర్శించారు. అమిత్ షాకు మద్దతుగా ప్రధాని మోడీ ఆరు పోస్టులు పెట్టారనీ, అందులో అంత అవసరం ఏమున్నదని ప్రశ్నించారు. ఎవరైనా అంబేద్కర్ గురించి తప్పుగా మాట్లాడితే, అలాంటి వ్యక్తిని క్యాబినెట్ నుంచి తొలగించాలనీ, కానీ వారిద్దరు స్నేహితులు కనుక ఒకరి పాపాలకు మరొకరు మద్దతిస్తున్నారని అన్నారు. అమిత్ షా దేశానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి వ్యాఖ్యలను తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రులు ఎం.కె స్టాలిన్, మమతా బెనర్జీలు, బీఎస్పీ అధినేత్రి మాయావతి ఖండించారు.

నోటి దూల

కేంద్రమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో ఇటు ప్రతిపక్షాలు, అటు దేశ ప్రజానీకం నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. నోటి దూల ఇంతటి రగడ తెస్తుందనుకోలేదని తేరుకున్న అమిత్‌షా ..ఇపుడు మీడియా ముందుకు వచ్చారు. తాను అలా అనలేదంటూ బుకాయించే ప్రయత్నం చేయటం గమనార్హం.

అంబేద్కర్ అనటం ఫ్యాషన్ అయిపోయింది

దుమారానికి దారి తీసిన అమిత్ షా వ్యాఖ్యలివే



రాజ్యసభలో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నాయి. ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాయి. రాజ్యసభలో చర్చ సందర్భంగా కాంగ్రెస్‌ను టార్గెట్ చేస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. రాజ్యసభలో అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన ఒక వీడియోను కాంగ్రెస్ సీనియర్ నాయకులు జైరాం రమేశ్ ఇప్పటికే 'ఎక్స్'లో షేర్ చేశారు. "అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అని అనటం ఒక ఫ్యాషన్ అయిపోయింది. ఇన్ని సార్లు వారు(ప్రతిపక్షాన్ని ఉద్దేశిస్తూ) దేవుడి పేరుని తీసుకొని ఉంటే వారికి స్వర్గంలో స్థానం దక్కేది" అంటూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అందులో ఉన్నాయి.

స్థానిక విద్యార్థులకు మెడికల్ పీజీ సీట్లు దక్కేలా చర్యలు : మంత్రి దామోదర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైకోర్టు తీర్పును క్షుణ్ణంగా పరిశీలించి, స్థానిక విద్యార్థులకు పీజీ సీట్లు దక్కేలా చర్యలు తీసుకుంటామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. ఈ మేరకు మెడికల్ పీజీ సీట్ల అడ్మిషన్లకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బుధవారం మంత్రి ట్వీట్ చేశారు. తెలంగాణలోని మెడికల్ కాలేజీల్లో 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటాలో చదివిన నాన్ లోకల్ విద్యార్థులను, పీజీ అడ్మిషన్లలో లోకల్ కోటాకు అనర్హులను చేసి, తెలంగాణ విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా జీవో 148, 149 తీసుకొచ్చినట్టు తెలిపారు. ఈ మార్పు తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయడానికే తప్ప, వారికి నష్టం చేసేందుకు కాదని పేర్కొన్నారు. స్థానికేతరులకు అవకాశం ఇవ్వాలని కోర్టు చెప్పడాన్ని కూడా కొంతమంది వక్రీకరిస్తున్నారని విమర్శించారు. ఈ తీర్పుతో తెలంగాణ విద్యార్థులకు న్యాయం జరిగింది అన్నట్టుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. వారు చేస్తున్న తప్పుడు ప్రచారం, గోబెల్స్ కూడా సిగ్గుపడేలా ఉందని ఎద్దేవా చేశారు. అలాంటి గోబెల్స్ ప్రచారాన్ని నమ్మొద్దని తెలంగాణ విద్యార్థులకు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖాలీద్‌కు తాత్కాలిక బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

కలుసుకునేందుకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని ఉమర్ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన న్యాయమూర్తి ఈ నెల 28వ తేదీ ఉదయం నుంచి జనవరి 3వ తేదీ సాయంత్రం వరకూ బెయిల్ మంజూరు చేశారు. ఇరవై వేల రూపాయల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించి బెయిల్ పొందవచ్చునని ఆదేశించారు.2020 ఫిబ్రవరి 23, 25 తేదీల మధ్య ఈశాన్య ఢిల్లీలో అల్లర్లకు పాల్పడేందుకు ఉమర్ తదితరులు పథకం ప్రకారం కుట్ర పన్నారని పోలీసులు ఆరోపించారు. ఐపీసీ, ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజ్ టూ పబ్లిక్ ప్రాపర్టీ చట్టం, ఆయుధ చట్టం, ఉపా కింద కేసు నమోదు చేశారు. 2020 సెప్టెంబర్ 13న ఆయనను అరెస్ట్ చేశారు.

'ఫార్ములా ఈ-రేస్'పై అసెంబ్లీలో చర్చించండి

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్నది. దీనిపై ఈ వారం మీ ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయి. ఈ అంశం మీద నాలుగు గోడల మధ్య చర్చ కన్నా రాష్ట్ర శాసనసభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలేంటో అందరికీ తెలుస్తాయి. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకున్నది. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల లబ్ధి చేకూరిందని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసింది. 2024లో మరో దఫా రేస్ జరగాల్సి ఉండగా మీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని ఏకపక్షంగా రద్దు చేసింది. అప్పటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగింది అనే అపోహలు సృష్టించే ప్రయత్నం మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది. ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగింది. రేస్ నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయని ఇదివరకే నేను వివరంగా చెప్పాను. అయినా మీ ప్రభుత్వం మాత్రం దుష్ప్రచారం మానడం లేదు. రాష్ట్ర ప్రజలకు నిజాలేమిటో తెలుసుకునే హక్కు ఉన్నది' అని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. కనుక ఈ అంశంపై శాసనసభలో చర్చ పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దీంతో నిజానిజాలు నిగ్గుతేలుతాయని తెలిపారు.

ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే..

హామీలను అమలు చేయాలి :
ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు ఆటోలో వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గడిచిన ఏడాది కాలంలో 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఖాకీ చొక్కాలు వేసుకుని ఆటోల్లో ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా 8 లక్షల మంది ఆటో డ్రైవర్లకు ఎన్నో హామీలు ఇచ్చిందని, అందులో ఒక్కటీ అమలుకు నోచుకోలేదని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల జాబితాను గత అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసినా ఆ కుటుంబాలను ఆదుకోవడంలో విఫలమైందన్నారు. ఇప్పటికైనా వారిని ఆదుకోవాలని కోరారు. ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లను వాడుకుని, ఆ తర్వాత హామీలన్నింటినీ మర్చిపోయారన్నారు. ఆటో డ్రైవర్లకు రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని వెంటనే ప్రకటించాలని, ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దని, వారికి బీఆర్ఎస్ అండగా ఉండి పోరాడుతుందని అన్నారు.

విద్యారంగంలో పర్యవేక్షక వ్యవస్థను

బలోపేతం చేయాలి

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యారంగంలో పర్యవేక్షక వ్యవస్థను బలోపేతం చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. బుధవారం శాసనమండలిలో ఈ మేరకు ఆయన ప్రత్యేక ప్రస్తావన చేశారు. రాష్ట్రంలో 2016 అక్టోబర్ నెలలో కొత్త జిల్లాలు ఏర్పడ్డాక ఆ జిల్లాలకు కలెక్టర్లు, ఎస్పీలు ఇతర అధికారులు వచ్చినా, ఇప్పటికీ జిల్లా విద్యా శాఖాధికారులను నియమించలేదని తెలిపారు. విద్యపై చర్చ జరిగినప్పుడల్లా విద్య ప్రభుత్వరంగంలో ఉండాలని అందరూ కోరుకుంటున్నారని చెప్పారు. అయితే ఆ మేరకు పర్యవేక్షణ వ్యవస్థకు అవసరమైన జిల్లా విద్యాశాఖాధికారులు, కొత్త మండలాలకు మండల విద్యాధికారులు పూర్తి స్థాయిలో రాలేదని తెలిపారు. మండలాల పరిమాణంలో గమనిస్తే కొన్ని మండలాలు మరీ చిన్నగా ఉన్నాయి. ఉదాహరణకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో పాఠశాలలు సంఖ్య తక్కువ. ప్రభుత్వ ప్రయివేటు విద్యార్థులు వెయ్యిలోపే ఉంటారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలో ఒక లక్షా 11 వేల మంది విద్యార్థులున్నారు. మండల విద్యాధికారి వ్యవస్థను కూడా పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య ఆధారంగా మార్చుకోవాల్సి ఉంది. ఉన్నత పాఠశాలలకు డిప్యూటీ ఈవోల సంఖ్యను కూడా మార్చుకోవాల్సి ఉంది. ఇంటర్మీడియట్ విద్యకు డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఆఫీసర్ పోస్టులను మంజూరు చేసుకోవాల్సి ఉంది. ఇంతకాలం నిర్లక్ష్యానికి గురైన విద్యారంగం బలోపేతానికి డియస్సీలో 10 వేల పోస్టులుపైగా, పదోన్నతులు 20 వేలపైన ఇవ్వడం, పాఠశాలల నిర్వహణకు గ్రాంట్లు ఇవ్వడం వంటి కొన్ని విషయాలు కనిపిస్తున్నాయి. వీటితో పాటు పర్యవేక్షక వ్యవస్థను కూడా పూర్తి చేయాలనీ, డైట్, బీఈడీ కాలేజీల్లో ఉన్న పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని .... అని అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు.

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని అలుగుబెల్లి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శాసనమండలి చైర్మెన్ ద్వారా సీఎం రేవంత్ రెడ్డికి పిటిషన్ సమర్పించారు. ఆశ్రమ పాఠశాలల్లోని పండిట్, పిఇటి పోస్టులను స్కూల్ అసిస్టెంటు పోస్టులుగా అప్‌గ్రేడు చేయాలని కోరారు. ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సీఆర్టీలకు మినిమం టైం స్కేలు వర్తింపజేయాలనీ, హెల్త్ కార్డులు, మెటర్నిటీ లీవు మంజూరు చేయాలన్నారు. కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయ, స్కూలు అసిస్టెంటు పోస్టులను మంజూరు చేయాలనీ, గిరిజన సంక్షేమ పాఠశాలల పర్యవేక్షణకు ప్రాథమిక పాఠశాలల పర్యవేక్షణ పోస్టులు, హైస్కూల్స్ పర్యవేక్షణ పోస్టులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మాయకు సెలవు

- అంతర్జాతీయ క్రికెట్‌కు అశ్విన్ వీడ్కోలు
- గబ్బాలో మాయగాడి అనూహ్య నిర్ణయం

బంతితో మాయ చేయగలడు. అదే బంతితో బుల్లెట్ల వంటి బంతులను సంధించగలడు. బ్యాట్‌తో ధనాధన్ ఇన్నింగ్స్‌లు ఆడగలడు. నాయకుడిగా జట్టును ముందుండి నడిపించగలడు. గాయంతో ఆటకు దూరమైతే.. యూట్యూబ్ చానల్‌లో ఆకట్టుకునే వ్యాఖ్యాతగా మారగలడు.. అతడే భారత దిగ్గజ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్. 38 ఏండ్ల అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు.



నవతెలంగాణ-బ్రిస్బేన్ : భారత స్టార్ ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో పోటీపడుతున్న భారత జట్టులో అశ్విన్ సభ్యుడు. తొలి మూడు టెస్టుల్లో ఓ మ్యాచ్‌లో అశ్విన్ ఆడాడు. భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టు బుధవారం ముగియగా.. కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చిన రవిచంద్రన్ అశ్విన్ తన వీడ్కోలు నిర్ణయాన్ని ప్రకటించాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు తక్షణ వీడ్కోలుతో ఆస్ట్రేలియాతో చివరి రెండు టెస్టుల్లో అశ్విన్ అందుబాటులో ఉండటం లేదు. గురువారమే ఆస్ట్రేలియా నుంచి స్వదేశానికి తిరిగి రానున్నాడు. వీడ్కోలు టెస్టు గౌరవం ఆఫర్ చేసినా.. అశ్విన్ తక్షణమే వీడ్కోలు తీసుకుంటున్నట్టు తన నిర్ణయాన్ని వెల్లడించాడు.

ఇదే ఆఖరు రోజు : 'నా అంతర్జాతీయ స్థాయి క్రికెట్‌లో భారత క్రికెటర్‌గా ఇదే ఆఖరు రోజు. నాలో మరింత క్రికెట్ మిగిలే ఉందని నా భావన. ఆ క్రికెట్‌ను క్లబ్ స్థాయి క్రికెట్‌లో ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తాను. కానీ జాతీయ జట్టు తరఫున ఇదే నా చివరి రోజు. భారత జట్టులో ఎన్నో మధురస్మృతులు ఉన్నాయి. నా సహచర క్రికెటర్లకు, బీసీసీఐకి నా ధన్యవాదాలు. ఈ ప్రయాణంలో భాగమైన అందరు కోచ్‌లు.. రోహిత్, కోహ్లి, రహానె, పుజారలకు సైతం కృతజ్ఞతలు. ఇది ఎంతో భావోద్వేగ నిర్ణయం. ఇప్పుడు మీడియా ప్రశ్నలకు సమాధానం ఇచ్చే స్థితిలో ఉన్నానని నేను అనుకోవటం లేదు. కేవలం వీడ్కోలు ప్రకటన కోసమే మీడియా ముందుకొచ్చాను. మీడియా ప్రశ్నలకు మరో సమయంలో సమాధానాలు ఇస్తాను. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్), తమిళనాడు ప్రీమియర్ లీగ్ (టీఎన్‌పీఎల్)తో క్రికెట్‌తో అనుబంధం కొనసాగిస్తాను' అని అశ్విన్ వెల్లడించాడు.

చాంపియన్ ఆటగాడు : 38 ఏండ్ల రవిచంద్రన్ అశ్విన్ 2010 హరారె వన్డేలో శ్రీలంకపై అరంగేట్రం చేశాడు. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాపై చెన్నై వన్డేలో చివరగా ఆడాడు. 2011 ఢిల్లీ టెస్టులో వెస్టిండీస్‌పై ఐదు రోజుల ఆటలో అరంగేట్రం చేసిన అశ్విన్.. అడిలైడ్‌లో 2024 టెస్టులో చివరి మ్యాచ్ ఆడేశాడు. టీ20 ఫార్మాట్‌లో 2010న జింబాబ్వేపై అరంగేట్రం చేసి.. 2022 అడిలైడ్‌లో చివరి టీ20 ఆడాడు. భారత్‌కు 106 టెస్టుల్లో ప్రాతినిధ్యం వహించిన అశ్విన్ 24 సగటుతో 537 వికెట్లు పడగొట్టాడు. 25 సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడు. భారత్ తరఫున అనిల్ కుంబ్లే (619) తర్వాత టెస్టుల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా అశ్విన్ కొనసాగుతున్నాడు. ఓవరాల్‌గా టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు కూల్చిన స్పిన్నర్లలో టాప్-4లో నిలిచాడు. 116 వన్డేల్లో 156 వికెట్లు పడగొట్టిన అశ్విన్.. 65 టీ20ల్లో 72 వికెట్లు తీసుకున్నాడు. బ్యాట్‌తోనూ అశ్విన్ సత్తా చాటాడు. టెస్టుల్లో ఆరు సెంచరీలు, 14 అర్థ సెంచరీలతో 3503 పరుగులు చేశాడు. వన్డేల్లో ఓ అర్థ సెంచరీతో 707 పరుగులు, టీ20ల్లో 184 పరుగులు సాధించాడు.

వరుణుడిదే పైచేయి!

- వర్షంతో ఐదో రోజు సాగని ఆట
- ఉత్కంఠభరిత గబ్బా టెస్టు డ్రా

బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ 2024

ఉత్కంఠ రేపిన భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టులో వరుణుడిదే పైచేయిగా మారింది. గబ్బాలో తొలి రోజు, ఆఖరు రోజు వర్షంతో ఆట సాగలేదు. దీంతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ మూడో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌ను 89/7 వద్ద డిక్లరేషన్ ప్రకటించి.. భారత్‌కు 275 పరుగుల ఊరించే లక్ష్యాన్ని నిర్దేశించింది. ఛేదనలో భారత్ 8/0తో ఉండగా వెలుతురు లేమి, ఆపై భారీ వర్షంతో ఆట సాగలేదు. భారత్, ఆస్ట్రేలియా బాక్సింగ్ డే టెస్టు మెల్‌బోర్న్‌లో 26 నుంచి ఆరంభం కానుంది.



నవతెలంగాణ-బ్రిస్బేన్

భారత్, ఆస్ట్రేలియా మూడో టెస్టు డ్రాగా ముగిసింది. ఆఖరు రోజు ఆటలో ఫలితం కోసం ఇరు జట్లు సవాల్ ఎదుర్కొనేందుకు సిద్ధపడ్డాయి. రెండో ఇన్నింగ్స్‌ను ఆస్ట్రేలియా 89/7 వద్ద డిక్లరేషన్ ప్రకటించింది. పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా (3/18), మహ్మద్ సిరాజ్ (2/36), ఆకాశ్ దీప్ (2/28) నిప్పులు చెరిగారు. 275 పరుగుల ఛేదనలో భారత్ 2.1 ఓవర్లలో 8/0తో నిలిచింది. యశస్వి జైస్వాల్ (4 నాటౌట్, 6 బంతుల్లో), కెఎల్ రాహుల్ (4 నాటౌట్, 7 బంతుల్లో) అజేయంగా నిలిచారు. భారత రెండో ఇన్నింగ్స్ ఆరంభం కాగానే వెలుతురు లేమితో మ్యాచ్ నిలిచిపోగా.. ఆ తర్వాత ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. దీంతో మూడో టెస్టు డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో ధనాధన్ సెంచరీతో చెలరేగిన ఆసీస్ బ్యాటర్ ట్రావిశ్ హెడ్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత్, ఆస్ట్రేలియాలు 1-1తో సమవుజ్జీలుగా కొనసాగుతున్నాయి. భారత్, ఆస్ట్రేలియా నాల్గో టెస్టు 26 నుంచి మెల్‌బోర్న్‌లో ఆరంభం కానుంది.

పేసర్ల దూకుడు

భారత పేస్ త్రయం చెలరేగింది. తొలి ఇన్నింగ్స్‌లో జశ్‌ప్రీత్ బుమ్రా ఒక్కడే ఆరు వికెట్లతో పోరాటం చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్ సైతం జత కలిశారు. ఆస్ట్రేలియా సైతం వేగంగా పరుగులు చేయాలనే ప్రణాళికతో బ్యాటింగ్‌కు వచ్చింది. మిచెల్ మార్ష్, ట్రావిశ్ హెడ్‌ను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపించింది. కానీ ఆసీస్ టాప్ ఆర్డర్‌ను భారత పేసర్లు బోల్తా కొట్టించారు. నాథన్ మెక్‌స్వీనీ (4), ఉస్మాన్ ఖవాజా (8), మార్నస్ లబుషేన్ (1), మిచెల్ మార్ష్ (2)లను బుమ్రా, ఆకాశ్ దీప్‌లు సాగనంపారు. ట్రావిశ్ హెడ్ (17, 19 బంతుల్లో 2 ఫోర్లు) రెండు బౌండరీలతో మెరిశాడు. స్టీవ్ స్మిత్ (4) త్వరగా అవుటవగా.. అలెక్స్ కేరీ (20 నాటౌట్, 20 బంతుల్లో 2 ఫోర్లు), పాట్ కమిన్స్ (22, 10 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) వేగంగా పరుగులు పిండుకున్నారు. 18 ఓవర్లలో 4.94 రన్‌రేట్‌తో ఆసీస్ 89 పరుగులు చేసింది. ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్‌ను ప్రకటించిన ఆసీస్ భారత్‌కు 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

260 ఆలౌట్

ఆకాశ్ దీప్ (31, 44 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), జశ్‌ప్రీత్ బుమ్రా (10 నాటౌట్, 38 బంతుల్లో 1 సిక్స్) ఆఖరు వికెట్‌కు విలువైన భాగస్వామ్యం నమోదు చేశారు. ఓవర్‌నైట్ స్కోరు ఎనిమిది పరుగులు జోడించిన భారత్.. 260 పరుగులకు కుప్పకూలింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 185 పరుగుల ఆధిక్యం దక్కించుకుంది. ఆస్ట్రేలియా బౌలర్లలో పాట్ కమిన్స్ (4/81), మిచెల్ స్టార్క్ (3/83) రాణించారు. ట్రావిశ్ హెడ్, నాథన్ లయాన్‌లు సైతం చెరో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. ఛేదనలో భారత్ 2.1 ఓవర్లలో మెరుగ్గా కనిపించింది. యశస్వి జైస్వాల్ (4 నాటౌట్), కెఎల్ రాహుల్ (4 నాటౌట్) నాలుగేసి పరుగులు సాధించారు. భారత్ 8/0తో ఉండగా వెలుతురు లేమితో ఆట ఆగిపోయింది. ఆ తర్వాత ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు.



స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 445/10

భారత్ తొలి ఇన్నింగ్స్ : 260/10

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : నాథన్ మెక్‌స్వీనీ (సి) పంత్ (బి) ఆకాశ్ దీప్ 4, ఉస్మాన్ ఖవాజా (బి) బుమ్రా 8, మార్నస్ లబుషేన్ (సి) పంత్ (బి) బుమ్రా 1, మిచెల్ మార్ష్ (సి) పంత్ (బి) ఆకాశ్ దీప్ 2, ట్రావిశ్ హెడ్ (సి) పంత్ (బి) సిరాజ్ 17, స్టీవ్ స్మిత్ (సి) పంత్ (బి) సిరాజ్ 4, అలెక్స్ కేరీ నాటౌట్ 20, పాట్ కమిన్స్ (సి) రాహుల్ (బి) బుమ్రా 22, మిచెల్ స్టార్క్ నాటౌట్ 2, ఎక్స్‌ట్రాలు : 9,

మొత్తం : (18 ఓవర్లలో 7 వికెట్లకు) 89 డిక్లేర్డ్.

వికెట్ల పతనం : 1-11, 2-16, 3-16, 4-28, 5-33, 6-60, 7-85.

బౌలింగ్ : జశ్‌ప్రీత్ బుమ్రా 6-1-18-3, మహ్మద్ సిరాజ్ 7-0-36-2, ఆకాశ్ దీప్ 5-1-28-2.

భారత్ రెండో ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ నాటౌట్ 4, కెఎల్ రాహుల్ నాటౌట్ 4, ఎక్స్‌ట్రాలు : 0, **మొత్తం : (2.1 ఓవర్లలో) 8.**

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 1.1-0-4-0, పాట్ కమిన్స్ 1-0-4-0.



అందర్నీ మెప్పించే 'బచ్చలమల్లి'

హీరో అల్లరి నరేష్ నటించిన రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చల మల్లి'. సుబ్బు మంగాదేవి దర్శకుడు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈనెల 20న క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ సంయుక్త ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దర్శకులు మారుతి, త్రినాథ్ రావు నక్కిన, వశిష్ట, విజయ్ కనకమేడల, యదు వంశీ, కార్తిక్ వర్మ దండు, బలగం వేణు అతిథులు పాల్గొన్న ఈ ప్రీరిలీజ్ చాలా గ్రాండ్‌గా జరిగింది.

హీరో అల్లరి నరేష్ మాట్లాడుతూ,'దర్శకుడు సుబ్బు కథ చెప్పగానే నాకు చాలా నచ్చింది. నా కోసం తను వెయిట్ చేశాడు. ఈ సంవత్సరం 'బచ్చల మల్లి' సక్సెస్‌తో ఎండ్ చేయాలని కోరుకుంటున్నాను. నిర్మాత రాజేష్‌తో జర్నీ కొనసాగాలని కోరుకుంటున్నాను. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాని నిర్మించారు. సుబ్బు ఏదైతే చెప్పాడో అది తీశాడు. ఈనెల 20న మీ ముందుకు వస్తుంది. ఈ సినిమాని హిట్ చేస్తారా, బ్లాక్ బస్టర్ చేస్తారా, కల్ట్ చేస్తారా అనేది ప్రేక్షకుల చేతుల్లో ఉంది. ఒక్కటి మాత్రం చెబుతున్నాను. ఈ క్రిస్మస్ మనదే' అని అన్నారు.

'బచ్చలమల్లి క్యారెక్టర్‌ని కేవలం నరేష్ మాత్రమే చేయగలరు. అది ఈనెల 20న విట్నెస్ చేయబోతున్నాం. ఒక మంచి సక్సెస్ కోసమే మేం ఇద్దరం కలిసామని అనిపించింది. ఈనెల 20 తేదీన ఆ సక్సెస్‌ని మనం చూడబోతున్నాం' అని డైరెక్టర్ సుబ్బు మంగాదేవి చెప్పారు. హీరోయిన్ అమృత అయ్యర్ మాట్లాడుతూ,'మా టీమ్ అందరికీ ఈ సినిమా చాలా స్పెషల్. ఇందులో చేసిన కావేరి క్యారెక్టర్‌ని మీరందరూ చాలా ప్రేమిస్తారు' అని అన్నారు. 'బచ్చలమల్లి నేను చాలా ప్రేమించి చేసిన సినిమా. ఈ సినిమా రిలీజ్ కోసం నేను ఒక ప్రేక్షకుడిలా ఎదురు చూస్తున్నాను. సుబ్బు చెప్పిన కథకు ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యాను. నరేష్‌కి కూడా సింగిల్ సిట్టింగ్‌లో ఈ కథ నచ్చింది' అని నిర్మాత రాజేష్ దండా చెప్పారు.

పెట్టుబడిదారీ వ్యవస్థపై పోరాటం



చింతపల్లి రామారావు

విజయ్ సేతుపతి, వెట్రిమారన్ కలయికలో రూపొందిన 'విడుదల -1' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు ఆ చిత్రానికి సీక్వెల్‌గా ఇదే కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'విడుదల-2'. ఈనెల 20న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. నిర్మాత, శ్రీ వేదాక్షర మూవీస్ అధినేత చింతపల్లి రామారావు ఈ చిత్ర తెలుగు హక్కులను దక్కించుకున్నారు. ఈ చిత్రాన్ని తెలుగులో భారీ స్థాయిలో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- పరిపాలకుల అహంకారానికి అణచివేయబడిన సామాన్యుల నుంచి ఉద్భవించిన ఒక అసామాన్యుడి వీర విప్లవ గాథే 'విడుదల-2'. ఈ కథ మన నేటివిటీకి సరిపోతుంది అని ఈ సినిమా తెలుగు హక్కులను దక్కించుకున్నాను. యదార్థ సంఘటనల ఆధారంగా తీసిన చిత్రమిది. అణగారిన వర్గాల నుంచి ఉద్భవించిన ఓ విప్లవ కెరటం అందరిని పెట్టుబడిదారీ వ్యవస్థ నుంచి ఎలా బయటపడేలా చేశారు అనేది ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లోని సమస్యలు, ఇక్కడ జరిగిన సంఘటనలు ఆధారంగా తీసిన చిత్రమిది. ఇది తమిళ దర్శకుడు తీసిన తెలుగు వారి కథ.
- నటుడిగా విజయ్‌సేతుపతి గురించి ఎంత చెప్పిన తక్కువే. ఈ చిత్రంలో పెరుమాళ్‌కు పాత్రకు ఆయన నూటికి నూరు శాతం సరిపోయాడు. నక్సలైట్ పాత్రలో ఆయన నటన, పాత్రలోని ఎమోషన్ పండించిన విధానం అద్భుతం. ఈ చిత్రం ఆయనకు మరింత మంచి పేరు తీసుకొస్తుంది. ప్రజా సంక్షేమం కోసం కోరిన వ్యక్తి తమ వాళ్లను, కుటుంబాన్ని కూడా వదిలి ఎలాంటి త్యాగాలు చేశాడు? అనేది ఎంతో ఎమోషనల్‌గా ఉంటుంది.
- ఈ చిత్రానికి ఇళయరాజా నేపథ్య సంగీతం ప్రాణంగా నిలుస్తుంది. పీటర్ హెయిన్స్ ఇప్పటి వరకు ఇండియన్ స్క్రీన్‌పై చూడని పోరాటాలు సమాకూర్చాడు. మంజు వారియర్ సహజ నటనఈ చిత్రానికి ప్లస్ అవుతుంది. విజయ్, మంజు వారియర్ మధ్య ఎమోషన్స్ సీన్స్ అద్భుతంగా ఉంటాయి. ఆ సన్నివేశాలు అందర్ని కంటతడి పెట్టిస్తాయి. 'శ్రీ శ్రీ రాజావారు' చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. త్వరలోనే 'డ్రీమ్‌గర్ల్' అనే ప్రాజెక్ట్‌ను ప్రారంభించబోతున్నాం. ఇది కాక మరో రెండు సినిమాలు సెట్స్ మీదకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నాయి.

నవచిత్రం

ప్రభుత్వానికి, పరిశ్రమకి వారధిగా ఉంటా : దిల్‌రాజు



తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా వి.వెంకట రమణ రెడ్డి (దిల్ రాజు) బుధవారం ఉదయం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మాసబ్ ట్యాంక్‌లోని టీఎఫ్‌డీసీ కార్యాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమానికి హాజరై దిల్ రాజ్‌ను అభినందించారు. తెలంగాణాలో ఫిలిం ఇండస్ట్రీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఇండస్ట్రీకి చెందిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వడంలో దిల్ రాజు సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి అన్నారు.

దిల్‌రాజు మాట్లాడుతూ, 'టీఎఫ్‌డీసీకి పూర్వ వైభవం తీసుకురావాలి. అందుకు అందరి సహకారం ఎంతో అవసరం ఉంది. తెలంగాణ సంస్కృతిని ఆధారంగా చేసుకుని సినిమాలు వచ్చేలా చూడాలి. ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా మరెంతో అభివృద్ధి చెందాలి. టీఎఫ్‌డీసీ చైర్మన్‌గా నాపై ఎంతో బాధ్యత ఉంది. ప్రభుత్వానికి, చిత్ర పరిశ్రమకు వారధిగా పనిచేస్తా. పరిశ్రమలోని అన్ని విభాగాల్లోని సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తా' అని తెలిపారు.

పక్కా యాక్షన్ థ్రిల్లర్



కిచ్చా సుదీప్

కిచ్చా సుదీప్ కథానాయకుడిగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ ఫిల్మ్ 'మ్యాక్స్'.
వరలక్ష్మీ శరత్ కుమార్, సునీల్ కీలక పాత్రల్లో నటించారు. వీ క్రియేషన్స్, కిచ్చా క్రియేషన్స్ సంస్థలపై కలైపులి ఎస్ థాను
ఈ చిత్రాన్ని నిర్మించారు. విజయ్ కార్తికేయ దర్శకత్వం వహించారు. ఈనెల 27న ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్ మెంట్ ద్వారా తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కానుంది. యాక్షన్ థ్రిల్లర్ సినిమాగా తెరకెక్కిన ఇందులో అర్జున్ మహాక్షయ్ అనే పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా కిచ్చా సుదీప్ కనిపించనున్నారు. ఆల్రెడీ విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలు పెంచింది. తెలుగులో సుదీప్ అభిమానులు, ప్రేక్షకులు సినిమా కోసం వెయిట్ చేస్తున్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది. సంయుక్త హార్నడ్, సుకృతి వాగల్, అనిరుధ్ భట్ తదితరులు నటించిన ఈచిత్రానికి సినిమాటోగ్రఫీ - శేఖర్ చంద్ర, ఎడిటింగ్ - ఎస్ఆర్ గణేష్ బాబు, డైలాగ్స్ - అశ్లేషా, లిరిక్స్ - గోసాల రాంబాబు, మ్యూజిక్ - అజనీష్ లోకనాథ్.

ఎవ్వరూ ఊహించలేరు



రైటర్ మోహన్

వెన్నెల కిషోర్ టైటిల్ రోల్ పోషిస్తున్న క్రైమ్ థ్రిల్లర్ 'శ్రీకాకుళం షెర్లాక్ హెూమ్స్'. రైటర్ మోహన్ రచన, దర్శకత్వం వహించారు.

అనన్య నాగళ్ల, సీయా గౌతమ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రాన్ని లాస్యారెడ్డి సమర్పణలో శ్రీ గణపతి సినిమాస్ బ్యానర్‌పై వెన్నపూస రమణారెడ్డి నిర్మించారు. 'క, పొలిమేర 2, కమిటీ కుర్రోళ్లు' చిత్రాలతో విజయాలు అందుకున్న వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 25న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ రైటర్ మోహన్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- ఇది ఏడుగురికి సంబంధించిన కథ. వెన్నెల కిషోర్‌ది డిటెక్టివ్ రోల్. ప్రతి పాత్ర కథలో చాలా కీలకంగా ఉంటుంది. ఇందులో డిటెక్టివ్ రోల్ కొంచెం హ్యూమర్‌తో ఉంటుంది. ఆ పాత్రకు వెన్నెల కిషోర్ పర్ఫెక్ట్‌గా ఫిట్ అయ్యారు. ఆయన ఉత్తరాంధ్ర యాసని ఒక ఛాలెంజ్ తీసుకొని కష్టపడి నేర్చుకొని, సినిమా చేశారు. కథలో క్రైమ్, కామెడీ, ఎమోషన్, థ్రిల్, లవ్ అన్నీ బ్యాలెన్స్‌గా ఉంటాయి.
- 1991లో జరిగే కథ. టీజర్‌లో చెప్పినట్లు రాజీవ్ గాంధీ వైజాగ్ పర్యటన ముగించుకొని అదే రోజు శ్రీపెరంబుదూర్ వెళ్లి అక్కడ చనిపోయారు. ఒక పెద్ద ఇన్సిడెంట్ జరిగినప్పుడు చిన్న సంఘటనలని ఎవరూ పట్టించుకోరు. అదే రోజు ఇంకొన్ని సంఘటనలు జరిగాయి. వీటి మధ్య ఉన్న సంబంధం ఏమిటనేది షెర్లాక్ హెూమ్స్ అనే ఫిక్షనల్ క్యారెక్టర్‌తో చాలా ఆసక్తికర స్క్రీన్ ప్లేతో చేశాం. ఈ కథని ఎవరూ ఊహించలేరు.
- తెలుగులో డిటెక్టీవ్ సినిమా అనగానే చిరంజీవి 'చంటబ్బాయ్' గుర్తుకు వస్తుంది. షెర్లాక్ హెూమ్స్ అనేది హాలీవుడ్ ఫిక్షనల్ క్యారెక్టర్. అది కొందరికి పరిచయం లేకపోవచ్చు. అందుకే అందరికీ కనెక్ట్ అయ్యే విధంగా వంశీ నందిపాటి సూచన మేరకు ఆ ట్యాగ్‌ని పెట్టడం జరిగింది. అందులోనూ 'తాలూకా' అనేది ఇప్పుడు ట్రెండింగ్ (నవ్వుతూ). వంశీ నందిపాటికి ఈ సినిమా చాలా నచ్చింది. ముఖ్యంగా సెకండ్ హాఫ్‌లో చాలా థ్రిల్ అయ్యారు. ఆయన సినిమా రిలీజ్ చేయడం చాలా అనందంగా ఉంది. ఆయన ఇచ్చిన సూచనలు, సలహాలతో సినిమా నెక్స్ట్ లెవల్‌కి వెళ్ళింది.

ఘనంగా బుల్లితెర అవార్డుల వేడుక

వీబీ ఎంటర్టైన్మెంట్స్ తరఫున 2023-2024 సంవత్సరాలకు గాను బుల్లి తెర అవార్డులను విష్ణు బొప్పన ప్రదానం చేశారు. హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన ఈ వేడుకలో సినీ రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. ఈ ఈవెంట్‌కి సమర్పకులు, వర్చ్యుసా లైఫ్ స్పేసెస్ వైగండ్ల వెంకటేశ్వర్లు , వీవీకే హెూసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ విజయ్ కుమార్, ఐశ్వర్య సిల్క్స్ లక్ష్మి, అడ్వకేట్ నాగేశ్వరరావు పూజారితోపాటు దర్శకులు ఎస్.వి. కృష్ణారెడ్డి, నిర్మాతలు కె.అచ్చిరెడ్డి, అంబికా కృష్ణ, జేడీ లక్ష్మి నారాయణ, హీరో పూరి ఆకాష్, హీరోయిన్ అర్చన తదితరులు పాల్గొన్నారు.

ఈ ఈవెంట్‌లో సీనియర్ నటి శ్రీలక్ష్మికి జీవన సాఫల్య పురస్కారం అందించారు. అలాగే టీవీ ఆర్టిస్ట్‌కి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌కి, యూట్యూబర్స్‌కి కూడా అవార్డులను ప్రదానం చేశారు. అంతే కాకుండా పది మంది పేద కళాకారులకి ఆర్థిక సాయం కూడా అందించారు.

శ్రీలక్ష్మి మాట్లాడుతూ, 'వీబీ ఎంటర్టైన్మెంట్స్ వారికి నా ధన్యవాదాలు. నన్ను గుర్తించి, నాకు ఈ అవార్డుని అందించారు. ఈ సందర్భంగా మా గురువు జంధ్యాలకి థ్యాంక్స్ చెప్పుకోవాలి. అలాగే నేను పని చేసిన డైరెక్టర్స్, నిర్మాతలు, నటీనటులందరికీ, నా మీద ఎప్పటికప్పుడు విశేష ఆదరణ చూపిస్తున్న ప్రేక్షకులందరికీ నా కృతజ్ఞతలు' అని తెలిపారు.



Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఎస్బీఐ నూతన ఎండీగా రామ మోహన్ రావు నియామకం



హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) నూతన మేనేజింగ్ డైరెక్టర్‌గా రామ మోహన్ రావు అమర నియమితులయ్యారు. దీంతో మరో తెలుగు వ్యక్తికి కీలక పదవీ దక్కినట్లయ్యింది. తెలుగు వ్యక్తి అయినా సీఎస్ శెట్టి ప్రస్తుతం ఎస్బీఐ ఛైర్మెన్‌గా ఉన్నారు. రామ మోహన్ నియామకానికి కేంద్ర విత్త సేవల శాఖ ప్రతిపాదన చేయగా.. ప్రభుత్వ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్ (ఏసీసీ) ఆమోదం తెలిపింది. ఈ హోదాలో రామ మోహన్ రావు మూడేండ్ల పాటు కొనసా గనున్నారు. ఆయనకు బ్యాంకింగ్‌లో 29 ఏండ్ల అనుభవం ఉంది. 1991లో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా చేరారు. ఎండీగా నియామకానికి ముందు ఆయన ఎస్బీఐ భోపాల్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్‌గా పని చేశారు. అదే విధంగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్ కార్యకలాపాలను చూశారు. ముఖ్యంగా రుణాలు, రిస్కు, అంతర్జాతీయ బ్యాంకింగ్‌లో విశేష అనుభవం కలిగి ఉన్నారు. సింగపూర్, అమెరికాలోనూ పని చేసిన అనుభవం ఉంది. ఎస్బీఐ చికాగో శాఖ సీఈఓ, ఎస్బీఐ కాలిఫోర్నియా ప్రెసిడెంట్‌గా పని చేశారు. 2028 ఫిబ్రవరి 29న పదవీ విరమణ పొందనున్న ఆయన పనితీరు ఆధారంగా పదవీకాలాన్ని పొడిగించే అవకాశం ఉంది.

మూడో రోజూ నేల చూపులు

- సెన్సెక్స్ మరో 500 పాయింట్ల పతనం

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లోనూ నేల చూపులు చూశాయి. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లపై ప్రకటన చేయనున్నట్లు నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహారించారు. ఈ దఫా వడ్డీ రేట్లను తగ్గించనుందన్న అంచనాల్లో బుధవారం భారత మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ఈ అంచనాలతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహారించుకుంటున్నారు. మదుపరులు లాభాల స్వీకరణకు దిగుతుండడంతో మార్కెట్లన్నీ కుదేలవుతున్నాయి. దీంతో బీఎస్ఈ సెన్సెక్స్ 502 పాయింట్లు లేదా 0.62 శాతం కోల్పోయి 80,182కు పడిపోయింది. ఇంట్రాడేలో 80,868–80,050 మధ్య కదలాడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 137 పాయింట్లు లేదా 0.56 శాతం నష్టంతో 24,198 వద్ద ముగిసింది. దాదాపు 1,379 షేర్లు లాభపడగ.. మరో 2,456 షేర్లు పతనం కాగా.. మరో 92 షేర్లు యథాతథంగా నమోదయ్యాయి. ఆటో, ఎనర్జీ, పీఎస్‌యూ బ్యాంక్, మెటల్, మీడియా, రియాల్టీ 0.5 శాతం నుంచి 2 శాతం వరకు నష్టపోయాయి.

విఐ 4జి అత్యుత్తమ సేవలు

- నెట్‌వర్క్ అప్‌గ్రేడ్‌కు రూ.4,122 కోట్ల పెట్టుబడులు



నవ తెలంగాణ - హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో వొడాఫోన్ ఐడియా (విఐ) 4జి అత్యుత్తమ నెట్‌వర్క్ సేవలను అందిస్తుందని క్లస్టర్ బిజినెస్ హెడ్ (తెలంగాణ,ఏపీ, కర్నాటక) ఆనంద్ దానీ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 4జి విభాగంలో డౌన్‌లోడ్ స్పీడ్, వీడియో ఎక్స్‌పీరియన్స్, లైవ్ వీడియో అనుభవం, వాయిస్ యాప్ సేవల్లో విఐ మార్కెట్ లీడర్‌గా ఉందన్నారు. గత కొన్నేళ్లుగా ఈ క్లస్టర్‌లో నెట్‌వర్క్ విస్తరణ, మెరుగుదల కోసం రూ.4,122 కోట్ల పెట్టుబడులు పెట్టామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో 5జి సేవలను ప్రారంభించనున్నామన్నారు. ఇటీవల దక్కించుకున్న 250మెగాహెడ్జ్ స్పెక్ట్రంతో పైలట్ ప్రాజెక్టు ప్రయోగాలు జరుగుతున్నాయన్నారు. ఇటీవల అందుబాటులోకి తెచ్చిన విఐ హీరో రీచర్జ్ ప్లాన్ విజయవంతం అయ్యిందని.. 50–60 శాతం మంది ఖాతాదారులు దీన్ని వినియోగించుకుంటున్నారన్నారు.

స్వయంకృషి పారిశ్రామికవేత్తల్లో దమానీ టాప్

- టాప్ 200 ఔత్సాహికవేత్తల జాబితా వెల్లడి
- ఐడీఎఫ్‌సీ ఫస్ట్, హురున్ ఇండియా రిపోర్ట్



హైదరాబాద్ : భారత్‌లో స్వయంకృషితో ఎదిగిన అగ్రశ్రేణీ పారిశ్రామికవేత్తల్లో డిమార్ట్ అధినేత రాధాకృష్ణ దమానీ టాప్‌లో ఉన్నారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రయివేటు బ్యాంకింగ్, హురున్ ఇండియా తన టాప్ 200 స్వయంకృషి వ్యాపారవేత్తల రెండవ ఎడిషన్ జాబితాను బుధవారం వెల్లడించింది. 2000 ఏడాది తర్వాత పారిశ్రామికవేత్తలను ఇందులో పరిగణనలోకి తీసుకుంది. దమానీ 44 శాతం వృద్ధితో రూ.3.4 లక్షల కోట్ల సంపదను కలిగి ఉన్నారు. అగ్రశ్రేణీ స్వయంకృషి వ్యాపారుల్లో రెండో స్థానంలో దీపిందర్ గోయల్ (జొమాటో), మూడో స్థానంలో శ్రీహర్ష మజెటీ, నందన్ రెడ్డి (స్విగ్గీ), నాలుగవ స్థానంలో దీప్ కల్రా, రాజేష్ మంగోవ్ (మేక్‌మైట్రిప్), ఐదో స్థానంలో అబయ్ సోయి (మాక్స్ హెల్స్‌కేర్ ఇన్స్‌ట్యూట్) ఉన్నారు. తర్వాత స్థానాల్లో వరుసగా పాలసీ బజార్‌కు చెందిన యాశిష్ దహియా, అలోక్ బన్సల్, డ్రీమ్11కు చెందిన భవిత్ శేత్, హర్ష జైన్, జెరోదా అధిపతి నితిన్ కామత్, నిఖిల్ కామత్, రాజోర్‌పేకు చెందిన హర్షిల్ మథూర్, శశాంక్ కుమార్, నైకాకు చెందిన పాల్గుని నాయర్ టాప్ 10 స్థానాల్లో నిలిచారు.

ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్‌కు కేబీఎల్ పంపులు

హైదరాబాద్ : రాష్ట్రంలోని ఉదయ సముద్రం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు సహకారాన్ని అందించనున్నట్లు కిర్లోస్కర్ బ్రదర్స్ లిమిటెడ్ (కేబీఎల్) తెలిపింది. ఫ్లూయిడ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్‌లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న తమ సంస్థ రెండు వర్టికల్ ఫ్రాన్సిస్ టర్బైన్ పంప్ సెట్‌లను అమర్చినట్టు వెల్లడించింది. ఇది దేశంలోనే అతిపెద్ద స్వదేశీ రూపకల్పన, తయారు చేయబడిన పంపు సెట్‌లని పేర్కొంది. ప్రతి ఒక్కటి 16 మెగావాట్ మోటారుతో పని చేస్తాయని పేర్కొంది. సెకన్‌కు 13,000 లీటర్ల నీటి సరఫరా సామర్థ్యం కలిగి ఉన్నాయని పేర్కొంది.

డీఆర్‌డీఓ సంస్థతో వికాస్ లైఫ్‌కేర్ ఒప్పందం

హైదరాబాద్ : బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్స్ తయారీ కోసం రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)కు చెందిన అడ్వాన్స్‌డ్ సిస్టమ్ లాబరేటరీ (ఎఎస్ఎల్)తో ఒప్పందం కుదుర్చుకున్నట్టు వికాస్ లైఫ్‌కేర్ లిమిటెడ్ (విఎల్ఎల్) తెలిపింది. పర్యావరణహిత ప్యాకేజింగ్ సొల్యూషన్స్‌కు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో బయోడిగ్రేడబుల్ బ్యాగ్‌ల గ్రాన్యూల్స్‌ను తయారు చేసి ఇవ్వనున్నట్లు తెలిపింది. ఇందుకోసం హైదరాబాద్‌లోని డీఆర్‌డీఓతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు పేర్కొంది. ఒక్కసారి వాడిపారేసే పాలిథిన్ బ్యాగ్స్‌కు తమ ఉత్పత్తులు ప్రత్యామ్నాయని పేర్కొంది.

శ్రీసిటీలో ఇసుజు లక్ష వాహనల తయారీ

నవ తెలంగాణ- హైదరాబాద్ : రాష్ట్రంలోని శ్రీసిటీ యూనిట్ నుంచి లక్ష వాహనాలను తయారు చేసి సరఫరా చేసినట్లు ఇసుజు మోటార్స్ ఇండియా ప్రకటించింది. ఇసుజు డి-మ్యాక్స్ వి-క్రాస్ యూనిట్ల తయారీలో కీలక మైలురాయిని సాధించినట్టు వెల్లడించింది. గత రెండు సంవత్సరాలలో కంపెనీ తన వాహన ఉత్పత్తిని విజయవంతంగా రెట్టింపు చేసినట్టు తెలిపింది. ఇది దేశములోని ఆటోమోటివ్ మార్కెట్‌లో పెరుగుతున్న తన ఉనికిని ప్రతిబింబిస్తుందని పేర్కొంది. ఒక లక్ష వాహనాల మైలురాయి సాధించడం అనేది తన మన్నిక, విశ్వసనీయతకు నిదర్శనమని తెలిపింది. 2016లో ఇక్కడ కార్యాకలాపాలను ప్రారంభించినట్టు ఇసుజు మోటార్ ఇండియా ఎండీ, ప్రెసిడెంట్ రాజేష్ మిట్టల్ పేర్కొన్నారు.

మూడు బిల్లులకు మండలి ఆమోదం

- ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేలా క్రీడా వర్సిటీ ఉండాలి
- మహిళా వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడమే సాయుధ పోరాటానికి గుర్తింపు : నర్సిరెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు బిల్లులను శాసనమండలి ఆమోదించింది. తెలంగాణ యువ భారత వ్యాయామ విద్య, క్రీడా విశ్వవిద్యాలయం బిల్లు, విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు–2024, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లులను శాసనమండలి మంగళవారం ఆమోదం తెలిపింది. తెలంగాణ యువ భారత వ్యాయామ విద్య, క్రీడా విశ్వవిద్యాలయం బిల్లును మంత్రి కొండా సురేఖ ప్రవేశపెట్టారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యులు కోటిరెడ్డి, తాతా మధు, రవీందర్‌రావు మాట్లాడుతూ చాన్సలర్‌గా ముఖ్యమంత్రి ఉండడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ ఈ బిల్లును సమర్థిస్తున్నానని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను తయారు చేసే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని వివరించారు. దేశంలో ఇలాంటి వర్సిటీలను నెలకొల్పాల్సిన అవసరముందనీ, రాష్ట్రంలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఒలింపిక్స్‌లో హాకీలో ఏదో ఒక పతకం వచ్చే పరిస్థితి ఉండేదని చెప్పారు. క్రీడా విశ్వవిద్యాలయం ద్వారా ఒలింపిక్స్‌లో పతకాలను సాధించేలా క్రీడాకారులను తీర్చిదిద్దాలని కోరారు. కాంగ్రెస్ సభ్యులు జీవన్‌రెడ్డి, బల్మూరి వెంకట్ మాట్లాడుతూ ఈ బిల్లును సమర్థించారు. మండలి డిప్యూటీ ఛైర్మెన్ బండ ప్రకాశ్ మాట్లాడుతూ క్రీడా విధానాన్ని తేవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలని కోరారు. జిల్లాకో ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ సభ్యుడు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి క్రీడల పట్ల మక్కువ ఉందన్నారు. ప్రతి పాఠశాలకూ ఆటస్థలం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. స్పోర్ట్స్ కరికులమ్ ఉండాలన్నారు. ప్రజాప్రతినిధులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. పాఠశాలల్లో స్పోర్ట్స్ పీరియెడ్ తప్పనిసరిగా ఉండాలని మండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూచించారు. మంత్రి కొండా సురేఖ సమాధానమిస్తూ పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహిస్తామని చెప్పారు. త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడం, నిధులు కేటాయించడం కోసమే క్రీడా వర్సిటీ చాన్సలర్‌గా ముఖ్యమంత్రి ఉండాలన్న ప్రతిపాదన చేశామని వివరించారు. సమీకృత గురుకులాల్లో క్రీడలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. పిల్లలు చదువుకే పరిమితం కావొద్దనీ, క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ బిల్లు ఆమోదం పొందినట్టు మండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

ఈ బిల్లు పెట్టడం నా అదృష్టం : దామోదర రాజనర్సింహా



తెలంగాణ విశ్వవిద్యాలయాల చట్టసవరణ బిల్లును ప్రవేశపెట్టడం తన అదృష్టమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. త్యాగాలు, పోరాటాలు, సిద్ధాంతాలు, ధైర్యం, స్థైర్యం, ప్రశ్నించేతత్వం తనకు స్ఫూర్తినిచ్చాయని చెప్పారు. చాకలి ఐలమ్మ భూపోరాటం చేశారనీ, ఫ్యూడలిజంపై తిరుగుబాటు చేశారనీ, హక్కుల కోసం ఉద్యమించారని అన్నారు. ఆలోచనను పెంచిన చరిత్ర పోరాటానిదని చెప్పారు. కంప్యూటర్ యుగంలో అసమానతలున్నాయని వివరించారు. 75 ఏండ్ల కింద దొరలు, జమీందార్లకు వ్యతిరేకంగా పోరాటం చేయడం సామాన్యమైన విషయం కాదన్నారు. పివి నరసింహారావు, కొత్తపల్లి జయశంకర్, కాళోజీ వంటి స్ఫూర్తిప్రదాతలని అన్నారు. వ్యవస్థ శాశ్వతమనీ, వ్యక్తులు కాదని చెప్పారు. ఈ బిల్లును ఆహ్వానిస్తున్నానని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి చెప్పారు. సాయుధ పోరాటంలో అనేక మంది యోధులున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వపరంగా చాకలి ఐలమ్మ పేరును మహిళా విశ్వవిద్యాలయానికి పెట్టడం సాయుధ పోరాటానికి గుర్తింపు అని అన్నారు. ఆ పోరాటం వల్లే ప్రశ్నించేతత్వం, హక్కుల కోసం నికరంగా నిలబడే భావన ప్రజల్లో వచ్చింద న్నారు. చాకలి అంటే కులం కాదనీ, ఆమె ఇంటి పేరని వివరిం చారు. బీఆర్ఎస్ సభ్యులు వాణీదేవి మాట్లా డుతూ చాకలి ఐలమ్మ స్ఫూర్తిదాయ కమని అన్నారు. సామాన్యులు కూడా గొంతు విప్పా చ్చని సాయుధ పోరాటం నుంచి వచ్చింద న్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేయాల్సిన పనిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని గోరెటి వెంకన్న చెప్పారు. కోదండరామ్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ పేరు పెట్టడం మహిళా శక్తికి నిదర్శ నమని అన్నారు. మహిళా విశ్వవిద్యాలయం లో మౌలిక వసతులను మెరుగుపర్చా లనీ, హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలనీ, అద నపు నిధులను కేటాయించాలనీ, పరిశోధనల ను అభివృద్ధి చేయాలని సూచించారు. తెలం గాణ జీఎస్టీ సవరణ బిల్లును మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రవేశపెట్టారు. తెలంగాణ విశ్వవి ద్యాలయాల చట్ట సవరణ బిల్లు, తెలం గాణ జీఎస్టీ సవరణ బిల్లులు ఆమోదం పొంది నట్టు మండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పారు.

హరిత హోటళ్లలో మద్యానికి అనుమతి

- నీరా కూడా అందుబాటులో ఉంచుతాం
- పర్యాటక ఆస్తులను ప్రయివేటుపరం చేయబోం : మండలిలో మంత్రి జూపల్లి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో పర్యాటక సంస్థకు చెందిన హరిత హోటళ్లలో మద్యానికి అనుమతి ఇస్తామని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారు. మంగళవారం శాసనమండలిలో 'తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక విధానం'అనే అంశంపై స్వల్పకాలిక చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరా కూడా అందుబాటులో ఉంచుతామని అన్నారు. రాష్ట్రంలో 30 హరిత హోటళ్లు మూతపడ్డాయని చెప్పారు. పర్యాటక ఆస్తులను ప్రయివేటుపరం చేయబోమనీ, భూములను విక్రయించబోమనీ, ఆదాయాన్ని పెంచే మార్గాలను అన్వేషిస్తామని వివరించారు. విదేశీ, స్వదేశీ పర్యాటకులను ఆకర్షిస్తామని చెప్పారు. పర్యాటకరంగం నుంచి రాష్ట్ర జీడీపీకి పది శాతం నిధులను సమకూరుస్తామని అన్నారు. వచ్చే ఐదేండ్లలో రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తామనీ, మూడు లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని వివరించారు. దేశంలో పర్యాటక రంగంలో టాప్ ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ ఉండేలా అభివృద్ధి చేస్తామన్నారు. ఐకానిక్ ప్రాజెక్టులు 66 ఏండ్లకే లీజు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ ఆస్తుల ద్వారా ఆదాయం సమకూరుస్తామని అన్నారు. నిరర్థక ఆస్తులుగా మిగలొద్దని చెప్పారు. తెలంగాణను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. అమరజ్యోతి స్మారక చిహ్నం వద్ద అమరవీరుల పేర్లను రాయాలని ప్రభుత్వం భావిస్తున్నదని వివరించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఉద్యోగులకు కనీస వేతనాలివ్వాలి : నర్సిరెడ్డి

పర్యాటక విధానంలో పెట్టుబడిదారులకే లాభం చేకూర్చేలా కాకుండా ఉద్యోగులకు కనీస వేతనాలు అమలయ్యేలా చూడాలని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి చెప్పారు. రాష్ట్రానికి పర్యాటక విధానం ఎంతో అవసరమన్నారు. రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తామనీ, మూడు లక్షల మందికి ఉద్యోగాలను కల్పిస్తామన్నారనీ, అది అమలైతే సంతోషమని అన్నారు. పెట్టుబడిదారుల వద్ద సంపద పోగుబడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యాటకుల సంఖ్య పెరగాలని కోరారు. నిరర్థక ఆస్తులుగా మిగలొద్దని సూచించారు.

పర్యాటకరంగం ప్రయివేటుపరం : మధుసూదనాచారి

పర్యాటక రంగాన్ని ప్రయివేటుపరం చేసే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి విమర్శించారు. 2014 నుంచి పర్యాటక విధానం లేదంటున్నారనీ, తెలంగాణ రాక ముందు ఉందా?అని ప్రశ్నించారు. ఎదుటివారి బురదజల్లి పబ్బం గడుపుకోవాలని ఈ ప్రభుత్వం చూస్తున్నదని అన్నారు. బీఆర్ఎస్ సభ్యులు దేశపతి శ్రీనివాస్, శేరి సుభాష్‌రెడ్డి, తాతా మధు, కోటిరెడ్డి మాట్లాడుతూ ఐదేండ్ల పర్యాటక విధానాన్ని రూపొందించి పర్యాటక సంస్థ ఆస్తులను 66 ఏండ్ల వరకు లీజుకివ్వడం ఏంటని ప్రశ్నించారు. ఇది ఆదాయం సమకూర్చుకోవడం కాదనీ, భూదందా అవుతుందన్నారు. తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మను తీసేశారనీ, పర్యాటక విధానంలో దాన్ని ప్రస్తావించారని గుర్తు చేశారు. రాబోయే వందేండ్లకు ఉపయోగపడేలా పర్యాటక విధానాన్ని రూపొందించాలని సూచించారు. కోదండరామ్ మాట్లాడుతూ తెలంగాణలో మొదటి పర్యాటక విధానాన్ని ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమని అన్నారు. ఆదాయం సమకూర్చుకోవడమే లక్ష్యం కాకుండా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేయాలని సూచించారు. నిపుణుల కమిటీని వేసి డీపీఆర్‌లను తయారు చేయాలని కోరారు. స్థానిక వంటకాలు, గృహోపకరణాలు, స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా ఉండాలన్నారు. కాంగ్రెస్ సభ్యులు జీవన్‌రెడ్డి, బల్మూరి వెంకట్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యాటక కారిడార్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. పర్యాటక కేంద్రాల వద్ద తెలంగాణ తల్లి విగ్రహాలను పెట్టాలని కోరారు. అనంతరం సభను గురువారం ఉదయం పది గంటలకు వాయిదా వేస్తున్నట్టు మండలి డిప్యూటీ ఛైర్మెన్ బండ ప్రకాశ్ ప్రకటించారు.



ప్రభుత్వ వ్యవహారం ఆశ్చర్యకరం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ వ్యవహారంపై ఆశ్చర్యం వేస్తోందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. మధ్యాహ్నం అసెంబ్లీ సభ వాయిదా పడిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్‌కి ఓటేసినందుకు ప్రజలు బాధ పడుతున్నారన్నారు. పరిపాలన చేసే వారే రాజ్ భవన్ ముట్టడికి వెళ్తారా..? సీఎం రాజ్‌భవన్ ముట్టడికి పోతే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అసెంబ్లీ మీటింగ్ సమావేశ సమయాల్లో ముట్టడిలా..? అని, సమావేశాలను తప్పించుకోవడం కోసమే రాజ్‌భవన్ ముట్టడి చేపట్టారని విమర్శించారు. రాజ్‌భవన్ ముట్టడిపై పునరాలోచించాలన్నారు.

సీఎం రాజ్‌భవన్ ముట్టడి..రాజ్యాంగ విరుద్ధం కాదా..? : ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి రాజ్‌భవన్ ముట్టడి చేయడం రాజ్యాంగ విరుద్ధం కాదా..? అని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. ఇలాంటి కార్యక్రమాలకు కాంగ్రెస్ పిలుపునిస్తే ఆ పార్టీ అధ్యక్షులు లీడ్ చేయాలి కానీ, రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి ముఖ్యమంత్రి ఇలా చేయడం ఏంటని ప్రశ్నించారు. అదానీ నుంచి రూ.వంద కోట్లు డొనేషన్ తీసుకోవడం, ఎంఓయూ కుదుర్చుకున్న ఒప్పందం ఏమైందని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ మెప్పు కోసమే రూ.వంద కోట్లు మళ్లీ అదానీకి తిరిగి ఇచ్చేశారన్నారు. రాహుల్ గాంధీకీ రేవంత్‌రెడ్డికి మధ్య దూరం పెరగడంతో ముఖ్యమంత్రి పదవిని కాపాడుకోవడానికే ఈ ధర్నా చేస్తున్నారన్నారు. అసలు నిర్ణయాలు తీసుకునే క్యాబినెట్ ఉందా..? అని నిలదీశారు. మోడీని ఏదో విధంగా విమర్శించడానికి, బీజేపీని బద్నాం చేయడానికే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. దేశ ప్రయోజనాలకు భంగం కలిగించేలా కాంగ్రెస్ చర్యలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మే స్థితిలో లేరన్నారు. అదానీ నుంచి రూ.వంద కోట్లు ఎందుకు తీసుకున్నారు..? ఎందుకు మళ్లీ తిరిగి ఇచ్చారో..? సమాధానం చెప్పాలన్నారు.

రేవంత్‌రెడ్డివి సర్కస్ ఫీట్లు : ఎమ్మెల్యే హరీశ్‌రావు

రేవంత్‌రెడ్డి సర్కస్ ఫీట్లు చూసి ఊసరవెల్లి సిగ్గుపడుతుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ చేస్తున్నారని ఆరోపించారు. రాజ్‌భవన్ ముట్టడిలో అదానీ గురించి రేవంత్ రెడ్డి మాట్లాడలేదని, కేసీఆర్ గురించి మాట్లాడుతున్నారని అన్నారు. తాము రేవంత్ రెడ్డి, అదానీ ఫొటోతో అసెంబ్లీకి వస్తే అడ్డుకున్నారన్నారు. అదానీతో రూ.12 వేల కోట్ల ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. అదానీపై రేవంత్ రెడ్డి పోరాటం నిజమైతే ఒప్పందాలు ఎందుకు రద్దు చేసుకోవడం లేదని ప్రశ్నించారు. రూ.వంద కోట్లు వాపస్ ఇచ్చినట్టు రూ.12,400 కోట్ల ఒప్పందాలు కూడా రద్దు చేసుకోవాలన్నారు. రామన్నపేటలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి అదానీకి ఏజెంట్ లా పని చేస్తున్నారన్నారు. అదానీకి రెడ్ కార్పెట్ వేసి తెలంగాణ పరువును, రాహుల్ గాంధీ పరువును రేవంత్ రెడ్డి మంట కలిపారని విమర్శించారు. నేడు అసెంబ్లీలో అదానీ, రేవంత్ రెడ్డి సంబంధంపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. చట్టం అందరికీ సమానమైతే కాంగ్రెస్ నేతలపై సీపీ సీవీ ఆనంద్ కేసులు పెట్టాలన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. గత ఆరు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలనీ, ఆ సంఘం నాయకులతో చర్చలు జరపాలని కోరారు. కేజీబీవీ, సీఆర్టీలకు, సమగ్రశిక్ష ఉద్యోగులకు, గురుకుల సీఆర్టీలకు, సింగరేణిలో పనిచేసే సీఆర్టీలకు మినిమం టైం స్కేలు వర్తింపజేయాలని సూచించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటుగా 010 పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పాలిట మహమ్మారిగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను అమలు చేసి ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని తెలిపారు. 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరికీ సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి న్యాయం చేయాలని పేర్కొన్నారు. గురుకుల పాఠశాలల సమయాన్ని తొమ్మిది గంటలకు మార్చాలని కోరారు. గిరిజన సంక్షేమ శాఖలో కూడా పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. ఈ అంశాల పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

రష్యా బలగాల అదుపులో మాస్కో బాంబు పేలుడు అనుమానితుడు

- ఘటన నుంచి బయటపడిన డ్రైవర్



మాస్కో : సీనియర్ సైనిక జనరల్ సహా ఇద్దరు మృతికి కారణమైన మాస్కో బాంబు పేలుడుకు సంబంధించి అనుమానితుడిని తమ అదుపులోకి తీసుకున్నట్లు రష్యన్ ఇంటెలిజెన్స్ సంస్థ ఎఫ్ఎస్‌బి బుధవారం తెలిపింది. ఆ అనుమానితుడు ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ సర్వీసెస్ రిక్రూట్ చేసుకున్న ఉజ్బెక్ పౌరుడని పేర్కొంది. ఆ వ్యక్తి పేరును ఎఫ్ఎస్‌బి వెల్లడించలేదు. ఉక్రెయిన్ తనను నియమించిందని ఆ వ్యక్తే చెప్పాడని, 30ఏళ్ల లోపు వయసు వుందని తెలిపింది.

ఉక్రెయిన్‌లో మాస్కో మిలటరీ ఆపరేషన్ సందర్భంగా చేపట్టిన చర్యలపై బ్రిటన్, కెనడాలతో సహా పలు దేశాల నుండి రష్యా సైనిక జనరల్ కిరిలొవ్ ఆంక్షలు ఎదుర్కొంటున్నారు. నిషేధిత రసాయన ఆయుధాలతో యుద్ధం చేస్తున్నారంటూ సోమవారం ఉక్రెయిన్ ఆయనపై క్రిమినల్ దర్యాప్తు చేపట్టగా, మంగళవారం బాంబు దాడిలో చనిపోయారు. ఈ దాడిలో కిరిలొవ్ ప్రయాణిస్తున్న కారు బాగా దెబ్బతినగా, డ్రైవర్ గాయాలతో బతికి బయటపడ్డాడు. తన నివాసం నుండి కిరిలొవ్ బయటకు రాగానే రిమోట్ పరికరంతో పేలుడు పదార్థాలను పేల్చివేసినట్లు భావిస్తున్నారు. పేలుడుకు 1.5 మీటర్ల దూరంలోనే వున్న కిరిలోవ్ ఆయన సహాయకుడు చనిపోయారు. ఆ సమయంలో డ్రైవర్ తన అధికార వాహనంలో వున్నారు. ఆ పేలుడు ధాటికి డ్రైవర్ కంగారు పడ్డాడు. పదునైన ముక్కలు ముఖంపై లోతుగా గుచ్చుకుపోవడంతో డ్రైవర్ ముఖం గుర్తు పట్టడానికి వీల్లేకుండా పోయింది. ఉక్రెయిన్ స్పెషల్ సర్వీసెస్ ఈ దాడికి పాల్పడ్డాయని రష్యా దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

ఎస్సీలపై నేరాలను నివారించడంలో రాష్ట్రాలు విఫలం

- పార్లమెంటరీ ప్యానెల్
- సంక్షేమ పథకాల అమలులోనూ అదే తీరని విమర్శ



న్యూఢిల్లీ : ఎస్సీలపై నేరాలను నివారించడంలోనూ, అట్రాసిటీ కేసులను పరిష్కరించడంలోనూ అనేక రాష్ట్రాలు విఫలం చెందుతున్నాయని పార్లమెంటరీ ప్యానెల్ ఆందోళన వ్యక్తం చేసింది. సామాజిక న్యాయం, సాధికారతపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ బుధవారం లోక్‌సభలో తన తుది నివేదికను సమర్పించింది. ఎస్సీలపై నేరాలను నివారించడానికి పౌర హక్కుల పరిరక్షణ చట్టం 1955, అట్రాసిటీస్ చట్టం 1989ను అమలు చేయడానికి అవసరమైన యంత్రాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకోవాలని కమిటీ సిఫార్సు చేసింది. కేంద్ర స్థాయిలో నిధులు కొరత లేకున్నా, అనేక రాష్ట్రాల్లో అందుబాటులు ఉన్న నిధులను కూడా ఉపయోగించుకోవడం లేదని, లేదా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవడం లేదని కమిటీ విమర్శించింది. అలాగే ఎస్సీలకు వివిధ సంక్షేమ పథకాల అమలులో కూడా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని నివేదిక ప్రస్తావించింది. ముఖ్యంగా ఎస్సీలకు పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకం, మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ కోసం నేషనల్ యాక్షన్ ప్లాన్ వంటి కార్యక్రమాల కోసం నిధులను కేటాయించలేదని విమర్శించింది. అసంపూర్తి డాక్యుమెంటేషన్, ఆధార్ సీడింగ్‌లో లోపాలు సంక్షేమ పథకాలకు అడ్డంకులుగా ఉన్నాయని తెలిపింది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్, ఒడిశా వంటి రాష్ట్రాలు నిధుల వినియోగం, పథకం లక్ష్యాలను సాధించడంలో వెనుకబడి ఉన్నాయని తెలిపింది. అలాగే సంక్షేమ కార్యక్రమాల గురించి అవగాహన, ప్రచారాన్ని మెరుగుపరచాల్సిన అవసరాన్ని నివేదిక ప్రముఖంగా పేర్కొంది. తగిన ప్రచారం లేకపోవడంతో అనేక మంది అర్హులైన వారికీ కూడా సంక్షేమ పథకాల గురించి తెలియదని తెలిపింది. ఉచిత కోచింగ్, ఫెలోషిప్ ప్రోగ్రామ్ వంటి పథకాల పరిధిని విస్తరించాలని పిలుపునిచ్చింది. అనేక సమస్యలు ఉన్నా.. మెరుగైన ప్రణాళిక, జవాబుదారీతనం, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సన్నిహిత సహకారంతో 2024–25 బడ్జెట్‌లో ఎస్సీల సంక్షేమ పథకాల కోసం కేటాయించిన రూ. 13,000 కోట్లను సమర్థవంతంగా ఉపయోగించుకోవచ్చని కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది.

రోజుకు రూ.9.25 లక్షలు

- విమానాయానికి మధ్యప్రదేశ్ సీఎం, మంత్రుల ఖర్చు

భోపాల్ : మధ్య ప్రదేశ్‌లో కొలువుతీరిన బీజేపీ కొత్త ప్రభుత్వం ఏడాది కూడా పూర్తికాకుండానే.. కేవలం విమాన ప్రయాణాల కోసం రూ. 32.85 కోట్లును ఖర్చు చేసింది. అంటే రోజుకు రూ. 9.25 లక్షలను వ్యయం చేసింది. గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది నవంబర్ వరకూ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, ఇతర మంత్రులు, సీనియర్ అధికారులు ప్రభుత్వ, ప్రయివేటు విమానాలను ఉపయోగించి 666 ప్రయాణాలు చేశారు. ఈ అంశంపై ప్రభుతాన్ని ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రతాప్ గ్రెవాల్ అసెంబ్లీలో ఈ విమాన ఖర్చుల గురించి ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన 666 ప్రయాణాల్లో 428 అద్దె విమానాలు, మరో 238 ప్రయాణాలు ప్రభుత్వ విమానాలు, హెలికాప్టర్లలో చేసినవి ఎమ్మెల్యే తెలిపారు. 428 అద్దె విమాన ప్రయాణాల్లో 90 శాతం ప్రయాణాలను ముఖ్యమంత్రే చేశారని చెప్పారు. అద్దె విమానాల విషయాన్ని ప్రభుత్వ అధికారులు కూడా ధ్రువీకరించారు. ప్రభుత్వ విమానాలు అందుబాటులో లేకపోవడంతో అద్దెకి విమానాలను తీసుకోవాల్సి వచ్చిందని వివరణ ఇచ్చారు. అద్దె విమానాలను తగ్గించడానికి కొత్తగా 3500 జెట్‌ను కొనుగోలు చేయనున్నామని, 2026లో డెలవరీ అయ్యే దీనిని ఖరీదు రూ. 234 కోట్లు అని చెప్పారు. అంటే దాదాపు రెండేండ్ల తరువాత మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి ఈ విమానం అందుబాటులోకి రానుంది.